

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 331

మంగళవారం 13-8-2024

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | VIJAYAWADA | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



పారిస్‌లో ఘనంగా ముగిసిన విశ్వ క్రీడలు. భావి ఒలింపిక్స్‌కు 2028లో ఆతిథ్యమివ్వనున్న లాస్ ఏంజెలిస్ నగరం.

12లో

ప్రైవేట్ మంత్రం.. మారని చంద్రం!

కొత్త వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో నిర్వహించాలని సీఎం చంద్రబాబు నిర్ణయం 10లో

- పీపీపీ విధానంలో కళాశాల, బోధనాస్పత్రిపై ప్రైవేట్ వ్యక్తులదే అజమాయిషీ.. వారు నిర్ణయించిన మేరకే వైద్య విద్య ఫీజులు.. పేదల వైద్యానికీ చార్జీల వసూలు
- ప్రతిపక్షంలో ఉండగా సెల్ఫ్ ఫైనాన్స్ విధానాన్ని తప్పుబట్టిన టీడీపీ
- అధికారంలోకి వస్తే వంద రోజుల్లో దాన్ని రద్దు చేసి తీరుతామని హామీ
- ఇప్పుడు గద్దెనెక్కాక మాట మార్చి ఏకంగా ప్రైవేట్ వారికి ధారాదత్తం

నాడు ఇలా ప్రచారం చేశారు.. వీళ్లను ఇప్పుడు ఏం చేయాలి..?

■ నిరుపేదల కలలకు దగా

తెలుగుదేశం పార్టీ అధికారిక 'ఎక్స్' ఖాతాలో..


Post
Telugu De... @JaiTDP Follow
ఎంబీబీఎస్ పట్టా అందుకుని వైద్యవృత్తి చేద్దామని కలలుగనే నిరుపేద విద్యార్థులను నిలువునా దగా చేసింది జగన్ సర్కారు. ఐదు మెడికల్ కాలేజీల్లో ఉన్న 750 ఎంబీబీఎస్ సీట్లలో కన్వీనర్ కోటా కాకుండా అదనంగా రెండు కేటగిరీలు పెట్టి 318 సీట్లకు రూ.12 లక్షలు, రూ.20 లక్షలు ఫీజులు పెట్టారు

ఎంబీబీఎస్ చేద్దామనుకునే నిరుపేద విద్యార్థులను జగన్ ప్రభుత్వం దగా చేసిందంటూ టీడీపీ విమర్శలు

■ జగన్ నడిపిస్తున్నది మాయాబజార్

లోకేశ్ ట్వీట్..


Post
Lokesh N... @naralokesh Follow
జగన్ నడిపిస్తున్నది ప్రభుత్వం కాదు, మాయా బజార్. సర్కారు వైద్యకళాశాలలో ఏడాదికి 15 వేలు ఉండే ఎంబీబీఎస్ ఫీజుని 20 లక్షలు చేసి దోచుకుంటున్నాడు.
#KamsaMamaJagan
#YuvaGalamPadayatra
Translate post

ఎంబీబీఎస్ ఫీజును జగన్ దోచుకుంటున్నారంటూ నాడు ఎక్స్‌లో లోకేశ్ పోస్ట్

■ సీట్లు అమ్ముకోవాలనుకోవడం దారుణం

వారాహి యాత్రలో పవన్‌కళ్యాణ్


ఇంతకంటే చీకటి

రాష్ట్రానికి కేంద్రం కేటాయించిన సీట్లను కూడా జగన్ అమ్ముకుంటున్నారంటూ నాడు పవన్ వ్యాఖ్యలు

టీడీపీ అధికార కరపత్రం ఈనాడులో..


వైద్యవిద్యనూ అమ్మేశారు!


వైద్య విద్య వ్యాపారానికి..
నయా పెత్తందారు జగన్
కొత్త కళాశాలల్లో 50% సీట్లు కోటీశ్వరులకే

పీపీపీ విధానంలోనే ఆస్పత్రులు

- నియోజకవర్గ స్థాయిలో ఏర్పాటు
- 2014–19 మధ్య చేపట్టిన కార్యక్రమాల పునరుద్ధరణ
- వైద్య, ఆరోగ్య శాఖపై సమీక్షలో సీఎం చంద్రబాబు వెల్లడి

10లో




ఈ సర్దుబాటు మాకొద్దు

2లో

ఐఐటీ మద్రాస్ టాప్

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్(ఎన్ఐఆర్ఎఫ్)–2024 ర్యాంకింగ్స్ విడుదలయ్యాయి. ఓవరాల్‌తోపాటు ఇంజినీరింగ్ కేటగిరీలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) మద్రాస్ వరుసగా ఆరోసారి టాప్ ర్యాంక్‌లో నిలిచింది. ఉత్తమ యూనివర్సిటీగా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్(ఐఐఎస్‌సీ) బెంగళూరు వరుసగా 9వసారి మొదటి స్థానం సంపాదించుకుంది.

6లో



రాష్ట్రానికి ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకులు

ఓవరాల్‌లో ఆంధ్ర, కేఎల్‌యూ, ఏఎన్‌యూ ఘనత


5లో

కొట్టుకుపోయిన గేటు స్థానంలో అత్యవసర గేటు

- ఏపీ, కర్ణాటక అధికారులు, నిపుణుల సూచనతో తుంగభద్ర బోర్డు నిర్ణయం
- 20 అడుగుల ఎత్తు, 60 అడుగుల వెడల్పుతో గేటు తయారీ పనులు కాంట్రాక్టర్లకు అప్పగింత
- 5 భాగాలుగా.. ఒక ఎలిమెంట్‌పై మరో ఎలిమెంట్ ద్వారా అమరిక

13లో





క్లుప్తంగా...

నేడు, రేపు ఉమ్మడి విశాఖ జిల్లా ప్రజా ప్రతినిధులతో వైఎస్ జగన్ సమావేశం

సాక్షి, అమరావతి : ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళ, బుధవారాల్లో ఆ జిల్లాకు చెందిన పార్టీ ప్రజా ప్రతినిధులతో సమావేశం కానున్నారు. ఇప్పటికే ఆ జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు చెందిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులతో సమావేశాలు నిర్వహించారు. మిగిలిన నియోజకవర్గాల ప్రజాప్రతినిధులతో నేడు, రేపు భేటీ కానున్నారు. ఈ కారణం వల్ల ఇతర నాయకులు, సందర్శకులు వైఎస్ జగన్‌ను కలిసే అవకాశం ఉండదని ఆ పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించింది.

'నమో డ్రోన్' కోసం ఇంప్లిమెంటేషన్ కమిటీ

సాక్షి, అమరావతి: నమో డ్రోన్ దీదీ స్కీమ్ అమలు కోసం రాష్ట్ర స్థాయి ఇంప్లిమెంటేషన్ కమిటీని నియమిస్తూ వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ బి.రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ స్కీమ్ ద్వారా స్వయం సహాయక సంఘాల(ఎస్‌హెచ్‌జీ) సభ్యులకు శిక్షణ ఇచ్చి డ్రోన్స్ అందించనున్నారు. ఈ ప్రాజెక్టు అమలు కోసం వ్యవసాయ శాఖ డైరెక్టర్, గ్రామీణాభివృద్ధి, సహకార శాఖ కమిషనర్లు, నాబార్డు సీజీఎం, కోరమాండల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ స్టేట్ మేనేజర్, కేంద్ర పొగాకు పరిశోధనా సంస్థ(రాజమండ్రి) డైరెక్టర్లు ఈ కమిటీకి ప్రాతినిధ్యం వహిస్తారని ఉత్తర్వులో పేర్కొన్నారు.

మావోయిస్టు సంస్థలపై మరో ఏడాది నిషేధం

సాక్షి, అమరావతి: మావోయిస్టు పార్టీతో సహా దాని అనుబంధ సంస్థలపై మరో ఏడాది పాటు నిషేధం పొడిగిస్తూ రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ (రాజకీయ) కార్యదర్శి సురేశ్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 17వ తేదీతో గతంలో విధించిన నిషేధం గడువు ముగుస్తుండటంతో వచ్చే ఏడాది ఆగస్టు 17వ తేదీ వరకు నిషేధం పొడిగించారు.

3 నెలల పాటు భూములపై విచారణ

మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడి




ఆలయం వెలుపల మంత్రులు అనగాని, గొట్టిపాటి

తిరుమల: ఈ నెల 16వ తేదీ నుంచి 45 రోజుల పాటు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. సోమవారం ఉదయం వీఐపీ విరామ సమయంలో మంత్రులు సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్ తమ కుటుంబ సభ్యులతో కలసి శ్రీవారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం వెలుపల మంత్రి అనగాని మీడియాతో మాట్లాడుతూ..గత ప్రభుత్వంలో భూములన్నీ అన్యాక్రాంతం అయ్యాయని ఆరోపించారు. రెవెన్యూ సదస్సుల్లో తమకు జరిగిన అన్యాయాన్ని ప్రజలు తెలియజేయవచ్చన్నారు. గత పాలకులు యాక్ట్‌లను దుర్వినియోగం చేసి వారికి గిట్టని వారి భూములను సైతం నిషేధిత జాబితాలో చేర్చారని ఆరోపించారు. 3 నెలల పాటు భూములపై విచారణ కొనసాగిస్తామన్నారు. మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ.. గడిచిన ఐదేళ్లలో ఒక మెగావాట్ విద్యుత్ ఉత్పత్తి కూడా జరగలేదన్నారు. 24 గంటల పాటు పరిశ్రమలకు, ప్రజలకు, రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా ఇచ్చేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు.

20 వేల పోలీసు పోస్టుల భర్తీ

హోం శాఖ మంత్రి అనిత



మాట్లాడుతున్న హోం మంత్రి అనిత

కొవ్వూరు: రాష్ట్రవ్యాప్తంగా 20 వేల పోలీసు పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత ప్రకటించారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 16 సబ్ జైళ్లు ఉన్నాయని, సదుపాయాలకు సంబంధించి ప్రతిపాదనలు తీసుకుని సమీక్షిస్తామన్నారు. పోలీసులు వీక్లీ ఆఫ్‌ల అమలు విషయం ప్రస్తావించగా.. పోలీసులు ఎక్కడా వీక్లీ ఆఫ్‌ల గురించి ఆలోచించే పరిస్థితుల్లో లేరని అన్నారు. పోలీసులతో గత ప్రభుత్వం మాదిరిగా వెట్టిచాకిరీ చేయించుకునే పరిస్థితుల్లో ఈ ప్రభుత్వం లేదని స్పష్టం చేశారు. మహిళా పోలీసు స్టేషన్లలో కచ్చితంగా మహిళలే ఎస్‌ఐలు, సీఐలు ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఏలూరు, విజయవాడ, రాజమహేంద్రవరంలో బ్లేడు బ్యాచ్‌ల సమస్య ఎక్కువగా ఉందన్నారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, కొవ్వూరు మాజీ ఎమ్మెల్యేలు బూరుగుపల్లి శేషారావు, టీవీ రామారావు పాల్గొన్నారు.

స్వచ్ఛ గాలి కేరాఫ్ ఏపీ


రాష్ట్రంలో 13 పట్టణాల్లో వాతావరణ కాలుష్యం తగ్గించడంపై నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం (ఎన్‌సీఏపీ) కింద చేపట్టిన కార్యక్రమం సత్ఫలితాలను అందిస్తోంది. దేశవ్యాప్తంగా 131 పట్టణాలు, 10 లక్షలకు పైగా జనాభా ఉన్న నగరాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో వాయుకాలుష్యం తగ్గించే విధంగా 2019లో ఈ కార్యక్రమాన్ని కేంద్రం ప్రారంభించింది. 2025-26 నాటికి వాతావరణ కాలుష్యాన్ని ఆయా ప్రాంతాల్లో తగ్గించడం ద్వారా ప్రజలకు స్వచ్ఛమైన గాలిని అందించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. 2023-24లో నమోదైన వాతావరణ కాలుష్యం డేటా ప్రకారం..దేశవ్యాప్తంగా 131 పట్టణాల్లో అత్యధిక కాలుష్యం నమోదవుతుండగా... అందులో ఏపీ నుంచి 13 ప్రాంతాలు ఉన్నాయి. దేశవ్యాప్తంగా చూస్తే అత్యధికంగా ఢిల్లీ 208 పీఎం10తో తొలి స్థానంలో నిలిచింది. దేశస్థాయిలో విశాఖ 30వ స్థానంలో, కడప 128వ స్థానంలో నిలిచాయి. కాలుష్యం పెరుగుదలలో పీఎం10 (వాతావరణంలో పీల్చుకునే స్థాయిలో ఉండే 10 మైక్రోమీటర్ల వ్యాసం కలిగిన ముతక కణాలు) స్థాయి 120 పాయింట్లతో ఏపీలో విశాఖ తొలి స్థానంలో నిలిచింది. ఆ తర్వాత స్థానాల్లో రాజమహేంద్రవరం, విజయనగరం, ఏలూరు నిలిచాయి. 42 పీఎం10 స్థాయితో ఏపీలో కడప చివరి స్థానంలో నిలిచింది.

- సాక్షి, అమరావతి



రాష్ట్రంలో సత్ఫలితాలిస్తున్న కాలుష్య నివారణ చర్యలు

- పొల్యూషన్ తగ్గించేందుకు 2019లో దేశవ్యాప్తంగా 131 పట్టణాలు ఎంపిక చేసిన కేంద్రం
- అందులో 13 ఆంధ్రప్రదేశ్ నుంచే
- కాలుష్య నివారణకు ప్రత్యేక చర్యలు
- విజయవాడ సహా ప్రధాన పట్టణాల్లో గణనీయంగా తగ్గుతున్న కాలుష్యం



విజయవాడలో తగ్గుముఖం

ఈ పథకం అమలు తర్వాత రాష్ట్రంలోని ప్రధాన పట్టణాల్లో కాలుష్యం తగ్గుముఖం పట్టినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఎన్‌సీఏపీ చర్యలతో విజయవాడ, కడప, కర్నూలు, నెల్లూరు వంటి పట్టణాల్లో కాలుష్యం తగ్గుముఖం పట్టింది. 2022-23లో విజయవాడలో పీఎం10 స్థాయి 90 పాయింట్లుగా ఉంటే అది 2023-24కు 61 పాయింట్లకు చేరింది. ఇదే సమయంలో కడపలో 57 నుంచి 42కు, నెల్లూరులో 56 నుంచి 52కు, కర్నూలులో 64 నుంచి 56కు తగ్గినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అయితే విశాఖలో వాతావరణ కాలుష్యం పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఇక్కడ 2022-23లో పీఎం10 స్థాయి 116 పాయింట్లుగా ఉండగా అది 2023-24 నాటికి 120 పాయింట్లకు పెరిగింది. రాజమహేంద్రవరంలో 68 నుంచి 76, గుంటూరులో 60 నుంచి 61 పాయింట్లకు పెరిగింది. జనాభా పెరుగుదల, పారిశ్రామిక పురోగతి ఎక్కువ అవడం, స్థానికంగా వాతావరణ మార్పులు చోటుచేసుకోవడం తదితర కారణాల వల్ల ఈ ప్రాంతాల్లో కాలుష్యం పెరుగుతున్నట్లు తెలిపింది.

ఏపీలో ఇప్పటివరకు రూ.109.78 కోట్ల వినియోగం

వాతావరణంలో పీఎం10, పీఎం 2.5 స్థాయిలను ప్రస్తుతమున్న స్థాయి నుంచి 2025-26కి కనీసం 40% తగ్గించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం 131 పట్టణాలకు రూ.19,614 కోట్లను కేటాయించింది. 10 లక్షల కంటే అధిక జనాభా కలిగిన నగరాల్లో ఈ మొత్తాన్ని 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు విడుదల చేస్తుండగా.. మిగిలిన పట్టణాలకు స్థానిక సంస్థల ద్వారా విడుదల చేస్తోంది. ఈ మొత్తంలో ఇప్పటివరకు రూ.11,211.13 కోట్లను ఖర్చు చేసింది. ఎన్‌సీఏపీ కింద ఏపీ నుంచి ఎంపికైన 13 పట్టణాలకు ఇప్పటివరకు రూ.361.09 కోట్లు విడుదల చేయగా అందులో రూ.109.78 కోట్లను ఖర్చు పెట్టారు. వాతావారణ కాలుష్యానికి కారణమైన రహదారులపై దుమ్ము, వ్యర్థాలను తగలపెట్టడం, వాహన, పారిశ్రామిక కాలుష్యం, నిర్మాణ రంగ వ్యర్థాలు వంటి వాటిని గుర్తించి వాటిని నియంత్రించడంపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నాయి.

ఈ సర్దుబాటు మాకొద్దు

కౌన్సెలింగ్ ప్రక్రియను బహిష్కరించిన ఉపాధ్యాయ సంఘాలు



చిత్తూరు జిల్లా నగరిలో ఉపాధ్యాయుల సర్దుబాటును వ్యతిరేకిస్తున్న ఫ్యాప్టో నాయకులు



గుంటూరు జిల్లా ప్రత్తిపాడులో ఎంఈవోలకు డిమాండ్లతో కూడిన లేఖలు అందజేస్తున్న ఫ్యాప్టో నేతలు

సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, జెడ్పీ, మండల పరిషత్, మున్సిపల్ పాఠశాలల్లో విద్యా బోధనకు తగిన సంఖ్యలో ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తూ పాఠశాల విద్యా శాఖ చేపట్టిన 'పని సర్దుబాటు' ప్రక్రియ గందరగోళంగా మారింది. విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తి ఆధారంగా అవసరమైన పాఠశాలలకు 'పని సర్దుబాటు' కింద బదిలీపై పంపేందుకు మండలాల వారీగా ఎంఈవో కార్యాలయాల్లో సోమవారం విడుదల చేసిన జాబితాలపై ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు మండిపడ్డారు. సీనియార్టీని తుంగలో తొక్కి, విధుల్లో చేరిన తేదీకి బదులుగా.. పుట్టిన తేదీ ఆధారంగా సీనియార్టీని పరిగణనలోకి తీసుకుని తయారు చేసిన జాబితాలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రాధాన్యత పాయింట్ల కేటాయింపుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయ సంఘాలతో వర్చువల్ సమావేశం నిర్వహించి, తమ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని బదిలీలు చేపడతామన్న ప్రభుత్వం, విద్యాశాఖ.. మాట తప్పి, తాము అనుకున్న రీతిలోనే కౌన్సెలింగ్ చేపట్టడంతో ఉపాధ్యాయ సంఘాలు మొత్తం ప్రక్రియను బహిష్కరించాయి. దీంతో సోమవారం నుంచి జరగాల్సిన సర్దుబాటు బదిలీ ప్రక్రియను మూడు రోజుల పాటు వాయిదా వేశారు. ఉపాధ్యాయ సంఘాలతో మరోసారి చర్చలు జరిపిన తర్వాత ప్రక్రియ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆది నుంచి ఉపాధ్యాయులు జీవో నంబర్ 117ను రద్దు చేసి, జీవో నంబర్ 53 ప్రకారం సర్దుబాటు చేయాలని, లేదంటే మిగులు ఉపాధ్యాయులు అధికంగా ఉంటారని ప్రధానంగా ప్రభుత్వానికి చెబుతున్నారు. టీచర్, విద్యార్థుల నిష్పత్తి 1:20 ఉండేలా చూడాలని కోరుతున్నారు. కానీ, వారి డిమాండ్లను, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా విద్యాశాఖ తమ అభిప్రాయాలను ఉపాధ్యాయులపై రుద్దే ప్రయత్నం చేసింది. ఈ నెల 9వ తేదీ ఇచ్చిన మార్గదర్శకాలపై ఉపాధ్యాయ సంఘాలు అభ్యంతరం తెలపగా, రెండు రోజులు గడువునిచ్చిన విద్యా శాఖ.. 'కేడర్ సీనియారిటీ' అంశాన్ని ఒక్కదాన్నే పరిగణనలోకి తీసుకుని, మిగిలిన పాత నిబంధనలతో ఆదివారం మరోసారి మార్గదర్శకాలు విడుదల చేసింది. సోమవారం నుంచి బుధవారం నాటికి సర్దుబాటు పూర్తి చేయాలని జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. అయితే, తమను గుర్తించకుండా జరిగే ప్రక్రియలో తాము పాల్గొనబోమని ఉపాధ్యాయ సంఘాలు నిరసనకు దిగాయి. 12 ఉపాధ్యాయ సంఘాలతో కూడిన ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో), పీఆర్టీయూ వంటి కీలక సంఘాలు సర్దుబాటు ప్రక్రియను బహిష్కరించాయి.

పని సర్దుబాటు ప్రక్రియను బహిష్కరిస్తున్నాం: ఫ్యాప్టో

ఉపాధ్యాయుల పని సర్దుబాటుపై విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయ సంఘాలతో నిర్వహించిన వర్చువల్ సమావేశంలో కొన్ని అభ్యంతరాలను తెలిపినా పరిగణనలోకి తీసుకోలేదని, తమ సూచనలను పట్టించుకోకుండా చేస్తున్న పని సర్దుబాటును బహిష్కరిస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ప్రకటించింది. సోమవారం విజయవాడలో నిర్వహించిన సమావేశంలో దీనిపై ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు తీర్మానం చేసినట్టు పేర్కొంది. ఏకపక్షంగా పని సర్దుబాటు ప్రక్రియ జరపాలని విద్యా శాఖ ఆదేశాలు జారీ చేయడాన్ని ఖండిస్తున్నట్టు సమాఖ్య చైర్మన్ సాయి శ్రీనివాస్, కార్యదర్శి ఎస్.చిరంజీవి ఇతర కార్యవర్గ సభ్యులు సోమవారం ప్రకటించారు. ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం నిర్వహించి అసంబద్ధతలను తొలగించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. తమ నిర్ణయానికి ఫ్యాప్టో సంఘాలతోపాటు పీఆర్టీయూ, ఆర్‌యూపీపీ, ఎస్ఎల్ఏ, ఏపీ పీఈటీ, ఎస్సీ (పీడీ) తదితర సంఘాలు మద్దతిస్తున్నట్టు తెలిపారు. జీవో నంబర్ 53 ప్రకారం సర్దుబాటు చేపట్టాలని, ప్రక్రియలో సీనియర్లకు విల్లింగ్ అవకాశం కల్పించాలన్నారు. సీనియార్టీని లెక్కించినప్పుడు ప్యానల్ నంబర్ లేదా ర్యాంకును పరిగణనలోకి తీసుకోవాలని, పని సర్దుబాటు ప్రక్రియ మండల, డివిజన్ స్థాయి వరకే పరిమితం చేయాలన్నారు. ఉపాధ్యాయుల సొంత మేనేజ్‌మెంట్ స్కూళ్లలో గల ఖాళీల్లో భర్తీ చేసిన తర్వాతే ఇతర మేనేజ్‌మెంట్లలో నియమించాలన్నారు. 70 శాతం పైబడి వైకల్యం గల ఉపాధ్యాయులను, వచ్చే ఏప్రిల్ లోపు పదవీ విరమణ చేసే వారిని సర్దుబాటు నుంచి మినహాయించాలని కోరారు. వారి పోస్టులు అదనంగా ఉండాలన్నారు. ప్రైమరీ స్కూల్స్‌లో హెచ్ఎం పోస్టులను విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా కొనసాగించాలని, 6-10 తరగతులకు 10 సెక్షన్లు దాటితే రెండో హిందీ, పీఎస్ పోస్టులను కేటాయించాలన్నారు. వీటితో పాటు మొత్తం 17 డిమాండ్లను ప్రభుత్వం ముందుంచారు. తమ డిమాండ్లకు ప్రాధాన్యం ఇవ్వనందున పని సర్దుబాటు ప్రక్రియను బహిష్కరిస్తున్నట్టు ప్రభుత్వానికి తెలియజేశారు.

నల్ల బ్యాడ్జీలతో 'ఆపస్' నిరసన

ప్రభుత్వ వైఖరిపై ఏపీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో సోమవారం భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. సర్దుబాటు పేరుతో చేసే బలవంతపు బదిలీలను బహిష్కరిస్తామని, క్షేత్ర స్థాయిలో సమస్యలు తెలుసుకోకుండా ప్రభుత్వం ఏకపక్షంగా ముందుకెళితే ఊరుకోమని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలాజీ, ప్రధాన కార్యదర్శి జీవీ సత్యనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయ సంఘాలతో భౌతిక సమావేశం ఏర్పాటు చేసి, క్షేత్ర స్థాయి అభిప్రాయాలు తీసుకోవాలని, తొలుత పదోన్నతులు ఇచ్చి, తర్వాత సర్దుబాటు చేపట్టాలని డిమాండ్ చేశారు.

నిలుపుదల చేయాలి: ఎన్‌టీఏ

అసంబద్ధంగా జరుగుతున్న ఉపాధ్యాయ సర్దుబాటును నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ వ్యతిరేకిస్తోందని యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కరణం హరికృష్ణ, మాగంటి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు.లోపభూయిష్ట సర్దుబాటు ప్రక్రియతో విద్యా వ్యవస్థను గందరగోళానికి గురిచేశారన్నారు. దాదాపు 15 వేల మంది ఉపాధ్యాయులను మిగులుగా తేల్చడమంటే విద్యా వ్యవస్థలోని డొల్లతనాన్ని బయటపెట్టడమేనన్నారు. నియంతృత్వ విధానాలతో ప్రభుత్వ విద్యా రంగం తీవ్రంగా నష్టపోతుందని చెప్పారు. వెంటనే పని సర్దుబాటు ప్రక్రియను నిలిపివేసి, అన్ని ఉపాధ్యాయ సంఘాలతో సమన్వయ సమావేశాన్ని ఏర్పాటు చేసి మెరుగైన నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తిని సవరించాలి

ఉపాధ్యాయ సర్దుబాటులో ఉపాధ్యాయ- విద్యార్థి నిష్పత్తి సవరించకుంటే ప్రతి జిల్లాలోనూ 500 నుంచి 1,000 మంది వరకు ఉపాధ్యాయులు మిగులుగా ఉంటారని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ప్రక్రియలో రాష్ట్రంలో దాదాపు 20 వేల మంది ఎస్‌జీటీలు మిగులుగా ఉంటారని, ఇక మెగా డీఎస్సీ ఎలా ఇస్తారని సంఘం నాయకులు మన్నం శ్రీనివాస్, శ్రీరామిశెట్టి వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఉన్నత పాఠశాలల్లో అతి తక్కువ మంది ఉపాధ్యాయులతో మెరుగైన విద్య ఎలా సాధ్యం అవుతుందన్నారు. పని సర్దుబాటు అవసరమైన పాఠశాలలు 7 నుంచి 8 శాతతే ఉంటాయని, అదే మండలంలోని మిగులు ఉపాధ్యాయులతో స్థానికంగా సర్దుబాటు చేసుకుంటే అసంతృప్తి లేకుండా పాఠశాలలు నడుస్తాయన్నారు. అసంబద్ధంగా జరుగుతున్న ఉపాధ్యాయ సర్దుబాటును ఫోరమ్ ఆఫ్ రిజిస్టర్ టీచర్స్ ఆర్గనైజేషన్ (ఫోర్టో) వ్యతిరేకిస్తోందని చైర్మన్ కరణం హరికృష్ణ, కార్యదర్శి అంకాల కొండయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం చేస్తున్న ఉపాధ్యాయ సర్దుబాట్లకు శాస్త్రీయత లేదన్నారు. అసంబద్ధ నిర్ణయాలతో ముందుకెళ్తే ఉద్యమించక తప్పదని వారు హెచ్చరించారు. ఈ నెల 9న ఉపాధ్యాయ సంఘాలతో జరిగిన వెబెక్స్ సమావేశంలో సూచించిన అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా సర్దుబాటు ప్రక్రియ చేపట్టడం సరికాదని షెడ్యూల్ ట్రైబ్స్ టీచర్స్ ఫెడరేషన్ ఓ ప్రకటనలో పేర్కొంది.

ఇలాంటి ఉదాహరణలు కోకొల్లలు

- ఉమ్మడి గుంటూరు జిల్లాలో క్షేత్ర స్థాయిలో 600 మంది ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాల్సి ఉందని ప్రాథమికంగా గుర్తించినప్పటికీ, ప్రభుత్వ అసంబద్ధ విధానాలతో దాదాపు 1,200 మంది ఉపాధ్యాయులకు స్థాన చలనం కలగనుందని సంఘాల నాయకులు చెబుతున్నారు.
- ఒకే డీఎస్సీ ద్వారా నియామకం పొందిన ఉపాధ్యాయులను విధుల్లో చేరిన తేదీ, కేడర్ ఆధారంగా సీనియర్, జూనియర్‌గా పరిగణించాల్సి ఉండగా.. వయస్సు ఆధారంగా సీనియార్టీని లెక్కించడం ఉపాధ్యాయుల ఆగ్రహానికి కారణమైంది.
- చిత్తూరు జిల్లా నగరి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 600 మంది విద్యార్థులకు ఒకే హిందీ టీచర్, ఎం.కొత్తూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 260 మందికి నాలుగు సబ్జెక్టులకు ఒకే సోషల్ టీచర్‌ను కేటాయించారు. ఇలా చాలా పాఠశాలల్లో జరిగింది.

ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో పోటీపై టీడీపీ కొత్త ఎత్తులు

- విశాఖ జిల్లాలో వైఎస్సార్‌సీపీదే బలం
- ప్రజాప్రతినిధులను కొనాలని కూటమి ప్రయత్నం
- ఫలించని కుట్రలు.. కూటమి వైపు రాని ప్రజాప్రతినిధులు
- ఓటమి భయంతో ఇప్పటికీ అభ్యర్థిని ఖరారు చేయని కూటమి

సాక్షి, అమరావతి: విశాఖపట్నం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో పోటీపై టీడీపీ, జనసేన, బీజేపీ ఇంకా తర్జనభర్జన పడుతున్నాయి. ఎలాగైనా ఈ స్థానాన్ని కైవసం చేసుకోవాలని ప్రణాళికలు రచించినా అందుకు అనువైన పరిస్థితులు లేకపోవడంతో ఇంకా ఒక నిర్ణయానికి రాలేకపోయాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలో వైఎస్సార్‌సీపీకి స్పష్టమైన ఆధిక్యం ఉండడంతో ఆ పార్టీ నుంచి భారీగా ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లను కూటమి వైపు తిప్పుకొనేందుకు కుట్రలు పన్నారు. భారీగా డబ్బు ఇవ్వజూపారు. అయినా కూటమి వైపు రావడానికి ప్రజాప్రతినిధులు ససేమిరా అన్నారు. ఈ పరిస్థితుల్లో పోటీకి పెడితే ఓడిపోవడం ఖాయమనే అంచనాకు కూటమి నేతలు వచ్చారు. సీఎం చంద్రబాబు రెండుసార్లు విశాఖ జిల్లా ఎమ్మెల్యేలతో జరిపిన చర్చల్లో గెలవడానికి సరిపడా ప్రజాప్రతినిధులు లేరని తేలింది. సరిపడినంతమందిని కూటమి వైపు తెచ్చేనే అభ్యర్థిని ప్రకటిస్తానని చంద్రబాబు చెప్పినట్లు తెలిసింది. మొదట్లో అనకాపల్లికి చెందిన మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణను పోటీకి దింపాలని భావించారు. అయితే వైఎస్సార్‌సీపీ తరఫున మాజీ మంత్రి, సీనియర్ నేత బొత్స సత్యనారాయణ పోటీకి దిగడం, మెజారిటీ ప్రతినిధులు వైఎస్సార్‌సీపీ వైపే ఉండడంతో పీలా గోవిందు చేతులెత్తేశారు. దీంతో గత ఎన్నికల్లో అనకాపల్లి ఎంపీ సీటు ఆశించిన వ్యాపారవేత్త బైరా దిలీప్ పేరును పరిశీలిస్తున్నారు. ఆయన అయితే భారీగా డబ్బు ఖర్చు పెట్టి వైఎస్సార్‌సీపీ స్థానిక ప్రజాప్రతినిధులను కొనుగోలు చేస్తారని టీడీపీ సీనియర్లు భావిస్తున్నట్లు సమాచారం. కానీ, ప్రస్తుత పరిస్థితుల్లో అది కూడా సాధ్యమయ్యేలా కనిపించకపోవడంతో ఇప్పటికీ నిర్ణయం తీసుకోలేదు. నామినేషన్లు దాఖలుకు గడువు ముగిసే లోగా అవకాశాలు మెరుగుపడితే దిలీప్‌ను పోటీకి దింపాలని చూస్తున్నారు. లేనిపక్షంలో పోటీకి దూరంగా ఉండడమే మేలని చంద్రబాబు భావిస్తున్నట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి.

బలం లేకున్నా టీడీపీ ఎందుకు పోటీ చేస్తోంది?

- ఎవరో బిజినెస్‌మేన్‌ను పోటీ చేయిస్తారంట
- రాజకీయాలంటే వ్యాపారమా?
- వైఎస్సార్‌సీపీ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్స
- నామినేషన్ దాఖలు



మాట్లాడుతున్న బొత్స, చిత్రంలో పార్టీ నేతలు

మహారాణిపేట(విశాఖ దక్షిణ): ఎన్నికల్లో పోటీ పెట్టడం అంటే టీడీపీ దుశ్చర్యకు పాల్పడినట్టుగా భావించాలని వైఎస్సార్‌సీపీ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. విశాఖ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆయన నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి 580కి పైగా ఓట్ల బలం ఉందన్నారు. వైఎస్సార్‌సీపీకి స్పష్టమైన మెజార్టీ ఉన్నా.. ఎవరో బిజినెస్‌మేన్‌ను తెచ్చి టీడీపీ పోటీ చేయిస్తుందని ప్రచారం జరుగుతోందని, రాజకీయాలంటే ఆ పార్టీకి వ్యాపారంలా ఉందని ధ్వజమెత్తారు. ఉత్తరాంధ్ర ప్రజలకు ఏం సందేశం ఇస్తున్నారని ప్రశ్నించారు. 300 ఓట్లకు పైగా తేడా ఉన్న సమయంలోనూ పోటీకి దిగడాన్ని ఎలా చూడాలని బొత్స ప్రశ్నించారు. కూటమి గెలుస్తుందని చెప్పేవారు ఈ నెల 14 తర్వాత మాట్లాడాలన్నారు. కార్యక్రమంలో అరకు ఎంపీ తనుజారాణి, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, మాజీ మంత్రులు బూడి ముత్యాలనాయుడు, గుడివాడ అమర్‌నాథ్, సమన్వయకర్తలు వాసుపల్లి గణేష్ కుమార్, కేకే రాజు, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ, విజయనగరం జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకి పూర్తి బలం : సుబ్బారెడ్డి



స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమకు పూర్తి స్థాయి బలం ఉందని.. అయినా టీడీపీ ఎందుకు పోటీ చేస్తుందో అర్థం కావడం లేదని వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి అన్నారు. విశాఖ విమానాశ్రయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.

రెండు నెలలుగా జీతాల్లేవ్!

- ఒకటో తేదీనే జీతాలు ఇస్తున్నామని ప్రభుత్వం ప్రగల్భాలు
- రెండు నెలలుగా జీతాల్లేక అల్లాడుతున్న గురుకులాల ఉద్యోగులు
- అప్పులు చేస్తూ అవస్థలుపడుతున్న కాంట్రాక్ట్, పార్ట్ టైం టీచర్స్

సాక్షి, అమరావతి: ఉద్యోగులకు ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తున్నామంటూ ప్రగల్భాలు పలుకుతున్న కూటమి ప్రభుత్వం... రాష్ట్రంలో గురుకుల విద్యాలయాల్లో పనిచేసే కాంట్రాక్ట్, పార్ట్‌టైం టీచర్లకు మాత్రం రెండు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ పరిధిలో 196 గురుకుల పాఠశాలలు ఉన్నాయి. వాటి పరిధిలో 700 మంది కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్స్ (సీఆర్టీ), 1700 పార్ట్‌టైం టీచర్స్ పనిచేస్తున్నారు. వీరితోపాటుగా రెగ్యులర్ టీచర్స్, వంట మనుషులు, సెక్యూరిటీ సిబ్బంది, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బంది సుమారు 7,000 మంది వరకు పని చేస్తున్నారు. వీరందరికీ జూన్, జూలై నెల జీతాలు ఇప్పటి వరకు రాలేదు. జూన్ 13న స్కూల్ తెరిచి రెండు నెలలు గడిచినా వీరికి వేతనాలు అందక నానా అవస్థలు పడుతున్నారు. తమకు జీతాల బిల్లులు పెట్టాల్సిన గురుకులాల సంస్థ మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము పని చేస్తూ కూడా అప్పులు చేసి కుటుంబాలను పోషించుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. గట్టిగా అడిగితే ఉద్యోగం తీసేస్తారనే భయంతో ఎవరూ నోరెత్తడం లేదు. మరోవైపు క్షేత్రస్థాయిలో గురుకులాల్లో పనిచేసే వారి పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. కనీసం ఎందుకు జీతాలు రాలేదని అడిగినా సమాధానం చెప్పేవారు లేరని 196 గురుకులాల్లో పని చేసే సిబ్బంది ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

మైనార్టీలపై టీడీపీ వర్గీయుల దాడి

- అమరావతి గ్రామంలో సోమవారం రాత్రి ఘటన
- నలుగురికి తీవ్ర గాయాలు



గాయపడ్డ షేక్ బుజ్జి, షేక్ సద్దాం, నేలపాటి బాజీ, షేక్ కరీముల్లా

అమరావతి/పెదకూరపాడు: టీడీపీకి చెందిన మైనార్టీ వర్గీయులపై అదే పార్టీకి చెందిన మరో వర్గం దాడులకు పాల్పడటంతో అమరావతి గ్రామం ఉద్రిక్తంగా మారింది. ఈ దాడిలో ఆరుగురు గాయపడగా.. నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, ఆయన సతీమణి లావణ్య సోమవారం అమరావతిలోని అమరలింగేశ్వరస్వామిని దర్శించుకుని కృష్ణమ్మకు పూజలు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నేత ఒకరు గ్రామంలోని దుర్గా విలాస్ హోటల్లో అల్పాహారం ఏర్పాటు చేశారు. హోటల్ యజమాని పులిపాటి ప్రసాద్ టీడీపీలో చేరలేదని, అక్కడ అల్పాహారం ఎందుకు ఏర్పాటు చేస్తారని మరో వర్గం ప్రశ్నించడంతో గొడవ మొదలైంది. టీడీపీ నేత శౌరయ్య, ఓ పత్రిక విలేకరిపై మాజీ జెడ్పీటీసీ సభ్యుడి కుమారుడు జానీ దురుసుగా ప్రవర్తించడంతో గొడవ పెద్దదైంది. రెండు వర్గాలు బాహాబాహీకి దిగాయి. ఎమ్మెల్యే దంపతులు అక్కడి నుంచి వెళ్లిపోవడంతో శౌరయ్య వర్గీయులు ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న తమపై ఎలా దాడి చేస్తారంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. పోలీసులు ఇరువర్గాలకు సర్దిచెప్పి అక్కడి నుంచి పంపేశారు. శౌరయ్య గ్రామమైన లింగాపురం నుంచి సుమారు 50 మంది రాత్రి 7 గంటల సమయంలో కర్రలు, రాడ్లతో అమరావతికి వచ్చారు. మసీదు సెంటర్‌లో జానీ వర్గీయులైన మైనార్టీ యువకులపై దాడికి దిగారు. ఈ దాడిలో నేలపాటి బాజీ, షేక్ బుజ్జి, షేక్ సద్దాం, షేక్ కరీముల్లాకు తీవ్ర గాయాలయ్యాయి. యాసిన్, ఖాజావలీలూ గాయపడ్డారు. పోలీసులు అక్కడకు చేరుకొని లింగాపురానికి చెందిన వారిని వెనక్కి పంపేశారు. గాయపడ్డవారిని గుంటూరు ఆస్పత్రికి తరలించారు. జిల్లా ఏఎస్పీ రాఘవేంద్ర, సత్తెనపల్లి డీఎస్పీ గురునాథబాబు పరిస్థితిని సమీక్షించారు.

క్లుప్తంగా...

మంత్రి పయ్యావుల ఇలాకాలో పేకాట

11 మంది అరెస్టు.. రూ.5.71 లక్షలు స్వాధీనం


జూదరుల నుంచి స్వాధీనం చేసుకున్న బైక్‌లు

ఉరవకొండ: అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గంలోని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సొంత పంచాయతీ కొకుంట్ల పరిధిలోని మైలారంపల్లి గ్రామ సమీపంలో పేకాట స్థావరంపై స్పెషల్ పార్టీ పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. 11 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.5.71 లక్షలు, 10 ద్విచక్రవాహనాలు, 11 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మైలారంపల్లి సమీపంలోని కొర్రకోడు డ్యాం (పీఏబీఆర్) వెనుక భాగంలో భారీగా పేకాట నడుస్తున్నట్లు జిల్లా ఎస్పీ మురళీకృష్ణకు సమాచారం అందింది. దీంతో ఆయన స్పెషల్ పార్టీ పోలీసులను రంగంలోకి దింపారు. టీడీపీ నేతల కనుసన్నల్లోనే ఈ స్థావరం నడుస్తున్నట్లు సమాచారం.

సీఎం బాబుతో ప్రపంచ బ్యాంక్ ప్రతినిధుల భేటీ

అమరావతి నిర్మాణంపై చర్చ


ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులతో సీఎం

సాక్షి, అమరావతి: ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు సీఎం చంద్రబాబుతో భేటీ అయ్యారు. అమరావతి నిర్మాణంపై సీఎం ఈ బృందంతో చర్చించారు. వరల్డ్ బ్యాంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సీనియర్ స్పెషలిస్ట్ రఘు కేశవన్, లీడ్ ట్రాన్స్‌పోర్ట్ స్పెషలిస్ట్ గెరాల్డ్ పాల్ ఆలీవియర్, సీనియర్ అర్బన్ స్పెషలిస్ట్ కింగ్ యువ్ షెన్, సౌత్ ఏషియా అర్బన్ ప్రాక్టీస్ మేనేజర్ అబేదాలిరజాక్ ఎఫ్.ఖలీల్‌తో కూడిన ఈ బృందం శనివారం విజయవాడ వచ్చింది. రెండు రోజులపాటు అమరావతిలో పర్యటించింది. తొలుత సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో అధికారులతో సమావేశమైంది. సీఆర్డీఏ, అమరావతి ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితిని అధికారులు ఈ బృందానికి వివరించారు. శనివారం మధ్యాహ్నం అమరావతిలో నిర్మాణంలో ఉన్న భవనాలను, ఆదివారం రాజధానిలోని రోడ్లను, కొండవీటి వాగు ఎత్తిపోతల పంప్ హౌస్ పనులను పరిశీలించారు. విట్, ఎస్ఆర్ఎం, ఎయిమ్స్‌ను పరిశీలించారు. సోమవారం పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, సీఆర్డీఏ కమిషనర్ కాటంనేని భాస్కర్‌తో కలిసి సీఎంతో సమావేశమయ్యారు. ప్రపంచస్థాయి రాజధానిగా అమరావతి నిర్మాణంలో ఎలా ముందుకెళ్తామో సీఎం వివరించారు.

మాక్ పోలింగ్ కాదు.. ఓట్ల లెక్కింపు నిర్వహించాలి

కలెక్టర్‌కు వినతిపత్రమిచ్చిన వైఎస్సార్‌సీపీ నాయకులు


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న క్రాంతికుమార్

ఒంగోలు అర్బన్: ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలో మే 13న పోలింగ్‌కు సంబంధించి ఈవీఎంల్లో అవకతవకలు జరిగాయనే ఫిర్యాదుపై ఈవీఎంల మాక్ పోలింగ్ కాకుండా నిర్దేశించిన 12 పోలింగ్ కేంద్రాలకు ఓట్లను లెక్కించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ నేత దామరాజు క్రాంతికుమార్ కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈవీఎంల్లో అవకతవకలు జరిగాయని ఒంగోలు అసెంబ్లీ అభ్యర్థి బాలినేని శ్రీనివాసరెడ్డి ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఆ మేరకు తగిన రుసుము కూడా చెల్లించారని వివరించారు. పోలింగ్ రోజు డమ్మీ సింబల్స్‌తో మాక్ పోలింగ్ నిర్వహించారని అయితే ఇప్పుడు కూడా మాక్ పోలింగ్ నిర్వహించడం వలన ఉపయోగం ఉండదన్నారు. సందేహం ఉన్న ఈవీఎంలను పరిశీలించి వీవీ ప్యాట్‌లలోని ఓట్లను లెక్కించి సరిచూడాలన్నారు. అప్పుడు మాత్రమే ఈవీఎంలపై పూర్తి స్పష్టత వస్తుందని మాక్ పోలింగ్ కాకుండా ఓట్లు వేసిన ఈవీఎంల ఓట్లను వీవీప్యాట్ స్లిప్‌లతో సరిచూడాలని కోరారు.

'నామినేటెడ్'లో బీజేపీకి ప్రాధాన్యమివ్వండి!

చంద్రబాబుతో పురందేశ్వరి, మధుకర్ జీ భేటీ

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబుతో బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, బీజేపీ సంఘటనా ప్రధాన్ ఎస్.మధుకర్ జీ సోమవారం భేటీ అయ్యారు. త్వరలో నామినేటెడ్ పోస్టులు భర్తీ చేయాలని చంద్రబాబు భావిస్తున్న తరుణంలో ఆయనతో బీజేపీ నేతలు భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో దాదాపు 45 నిమిషాలపాటు జరిగిన ఈ సమావేశంలో ప్రధానంగా నామినేటెడ్ పోస్టుల భర్తీ అంశంపై చర్చించారు. కూటమి ప్రభుత్వంలో భాగస్వామి అయిన బీజేపీకి నామినేటెడ్ పోస్టుల్లో తగిన ప్రాధాన్యమివ్వాలని వారిద్దరూ చంద్రబాబును కోరినట్లు సమాచారం. ఈ మేరకు బీజేపీ ప్రతిపాదనలను సమర్పించినట్లు తెలుస్తోంది.



వడి తగ్గింది.. 'వల'వచ్చింది!

శ్రీశైలం డ్యాం నుంచి నీటి విడుదల తగ్గగానే మత్స్యకారులు తమ పుట్టీలలో చేపల వేటకు బయలు దేరారు. సుమారు 250 పైగా పుట్టీలలో ఒకరికొకరు పోటీ పడుతూ డ్యాం దిగువన వలలు వేశారు. సహజంగా ప్రవాహంలో చిన్న చేపలు కొట్టుకుపోతుంటాయి. 10 కేజీల నుంచి పైబడిన చేపలు ప్లంజ్‌పూల్ ప్రాంతంలో నిలకడగా తిరుగుతుంటాయి. వాటి కోసమే ఈ చేపల వేట పోటీ. ఒక్కో మత్స్యకారుడి వలకు ఇలాంటి సమయంలో 500 కేజీలకు పైగానే చేపలు చిక్కుతాయి.

- శ్రీశైలం ప్రాజెక్ట్

మువ్వన్నెలు మురవగా...



ఆజాదీ కా అమృత్ మహోత్సవాన్ని పురస్కరించుకుని హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా సోమవారం వైఎస్సార్ జిల్లా పులివెందుల పట్టణంలో భారీ మువ్వన్నెల జెండాతో ర్యాలీ నిర్వహించారు. హిందూ జేఏసీ చైర్మన్ వంగల శశిభూషణ్‌రెడ్డి ఆధ్వర్యంలో 600 అడుగుల జాతీయ జెండాతో నిర్వహించిన ఈ ర్యాలీలో ఐదు వేల మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు.

- పులివెందుల టౌన్


నిందలతో సరి.. అయినా నిధులివ్వరు మరి

కొత్త నిధులిచ్చినా, ఏపీకి మాత్రం..

గ్రామీణ స్థానిక సంస్థల నిధులు రూ.998 కోట్లు విడుదల చేయని సర్కారు

- ఎన్నికల నోటిఫికేషన్ అనంతరం 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల
- కోడ్ కారణంతో అప్పట్లో ఆయా ఖాతాల్లో జమకు బ్రేక్
- ఇప్పుడు కొత్త ప్రభుత్వం రెండు నెలలుగా తీవ్ర జాప్యం
- దీంతో ఈ ఏడాది రావల్సిన నిధులూ విడుదల చేయని కేంద్రం
- గత ప్రభుత్వం పంచాయతీ నిధులు మళ్లించిందంటూ గగ్గోలు పెట్టిన చంద్రబాబు, పవన్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలతో పాటు మండల, జిల్లా పరిషత్‌ల కోసమని కేంద్రం మొన్న ఎన్నికల ముందు విడుదల చేసిన రూ.998 కోట్ల 15వ ఆర్థిక సంఘం నిధులను టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి ప్రభుత్వం రెండున్నర నెలలుగా వాటి ఖాతాల్లో జమచేయకుండా జాప్యం చేస్తోంది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రెండో విడత నిధులను ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన తర్వాత కేంద్రం విడుదల చేసింది. వీటిని 70 : 15 : 15 నిష్పత్తిన రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీలు–మండల–జిల్లా పరిషత్‌లకు బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమచేయాల్సి ఉంది. అప్పట్లో ఎన్నికల కోడ్ ఉందని అనుకున్నా.. ఎన్నికల ప్రక్రియ ముగిసి కోడ్ ఎత్తివేసిన తర్వాత కూడా కొత్తగా ఏర్పడిన చంద్రబాబు ప్రభుత్వం ఇప్పటివరకూ వాటి ఊసెత్తడంలేదు. కానీ, గత ఐదేళ్లలో ఈ నిధులను అప్పటి ప్రభుత్వం మళ్లించిందంటూ ప్రస్తుత ప్రభుత్వ పెద్దలు అప్పట్లో నానా యాగీ చేశారు. ఇప్పుడు తమ బాధ్యతగా విడుదల చేయాల్సిన వాటి గురించి మాత్రం కిక్కురుమనడం లేదు. ఇటీవల కాలంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్యం క్షీణించి డయేరియా ప్రబలడంతో పలువురు మృతిచెందారు. ఈ నేపథ్యంలో.. పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా కొనసాగుతున్న పవన్‌కళ్యాణ్ గ్రామాల్లో పారిశుధ్య పనుల నిమిత్తం బ్లీచింగ్ కొనడానికి కూడా డబ్బుల్లేవంటూ విమర్శలు చేస్తున్న ఆయన.. కేంద్రం ఎప్పుడో విడుదల చేసిన నిధులపై మాత్రం మాట్లాడడంలేదు.



ఇదిలా ఉంటే.. కేంద్రం ఇప్పటికే విడుదల చేసిన రూ.998 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం ఇంకా జమచేయకపోవడంతో కొత్త చిక్కొచ్చి పడింది. 15వ ఆర్థిక సంఘం సిఫార్సు మేరకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలోని గ్రామీణ స్థానిక సంస్థలకు రూ.2,152 కోట్లు విడుదల చేయాల్సి ఉంది. ఇప్పటికే మొదటి విడత కింద కొన్ని రాష్ట్రాలకు విడుదల చేసిన కేంద్రం మన రాష్ట్రానికి మాత్రం ఇవ్వలేదు. ఎందుకంటే.. గతంలో విడుదల చేసిన నిధులను విడుదల చేస్తేనేగానీ కొత్తగా కేంద్ర ఆర్థిక శాఖకు పంచాయతీరాజ్ శాఖ సిఫార్సు చేయదు. ఈ నేపథ్యంలో.. రూ.998 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం ఆయా స్థానిక సంస్థలకు చెల్లిస్తేనే ప్రస్తుత ఆర్థిక ఏడాది తొలి విడత నిధులు వచ్చే అవకాశముందని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

కేడబ్ల్యూడీటీ-2లో కౌంటర్ దాఖలు చేసిన ప్రభుత్వం

సాక్షి, అమరావతి: కృష్ణా జలాలపై తెలంగాణ ప్రభుత్వ స్టేట్‌మెంట్‌పై రాష్ట్ర ప్రభుత్వం సోమవారం కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ (కేడబ్ల్యూడీటీ)–2లో కౌంటర్ దాఖలు చేసింది. కృష్ణా జలాల పంపిణీపై ఈనెల 28, 29న కేడబ్ల్యూడీటీ–2 విచారణ చేపట్టనుంది. ఏపీ పునర్విభజన చట్టం సెక్షన్–89 ప్రకారం రెండు రాష్ట్రాలకు జలాల పంపిణీపై విచారణ చేస్తున్న కేడబ్ల్యూడీటీ–2కు గతేడాది జూలై 7న కేంద్ర జల్ శక్తి శాఖ కొత్త విధి విధానాలు జారీ చేసింది. దీన్ని సవాల్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్పట్లో సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసింది. కొత్త విధి విధానాల ప్రకారం మే 15న కేడబ్ల్యూడీటీ–2 నిర్వహించిన విచారణలో రెండు రాష్ట్రాలూ అభిప్రాయాలను వెల్లడించగా, 4 వారాల్లోగా అఫిడవిట్లు దాఖలు చేయాలని ఆదేశించింది. తెలంగాణ ప్రభుత్వం జూన్‌లో అఫిడవిట్ దాఖలు చేసింది. ఏపీలో కొత్త ప్రభుత్వం వచ్చిందని, కౌంటర్ దాఖలుకు 4 వారాల సమయం ఇవ్వాలని కోరుతూ జూన్ 28న కేడబ్ల్యూడీటీ–2కు ఏపీ అంతర్రాష్ట్ర జలవనరుల విభాగం సీఈ లేఖ రాశారు. దీనిపై జూలై 15న విచారణ చేపట్టిన కేడబ్ల్యూడీటీ–2... ఏపీ ప్రభుత్వానికి 4 వారాల సమయం ఇచ్చింది. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర సీఈ కౌంటర్ దాఖలు చేశారు.

పేదలపై టీడీపీ కూటమి ప్రభుత్వం కక్ష

- అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్లు ఆపాలనడం దుర్మార్గం
- వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జూపూడి ధ్వజం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పేదలపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపులకు దిగిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జూపూడి ప్రభాకరరావు విమర్శించారు. 20 ఏళ్ల పూర్తయిన అసైన్డ్ భూములపై లబ్ధిదారులైన పేదలకు పూర్తి హక్కులు కల్పిస్తూ గత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే, ఇప్పుడు ఆ అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్లు ఆపాలంటూ ఆదేశాలివ్వడం అత్యంత దుర్మార్గమని మండిపడ్డారు. సోమవారం హైదరాబాద్‌లోని సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. అసలైన లబ్ధిదారుల పేరుపై మాత్రమే రిజిస్టర్ చేసి వారికి మాత్రమే అమ్ముకునే అవకాశం వైఎస్ జగన్ హయాంలో ఇచ్చారని, ఇప్పుడు ప్రభుత్వ నిర్ణయం వల్ల లక్షలాది రైతుల పరిస్థితి గందరగోళంగా మారిందని చెప్పారు. ఆ అసైన్డ్ భూములపై ఇప్పటికే అధికార పార్టీ నాయకులు కన్నేశారని, పలు చోట్ల వారు పేదలను బెదిరించి భూములు స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ హయాంలో పలు రకాల భూములను నిషేధిత జాబితాల నుంచి తొలగించి, భూములపై హక్కులు కల్పించడం ద్వారా రైతులకు మేలు చేస్తే, చంద్రబాబు ఇప్పుడు వారిని ఇబ్బంది పెడుతున్నారని విమర్శించారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ఒక్క సెంటు భూమి కూడా రైతులకు ఇవ్వలేదని, కానీ గత ప్రభుత్వం కొత్తగా 42,307 మంది రైతులకు 46,463 ఎకరాల అసైన్డ్ భూములు పంపిణీ చేసిందని తెలిపారు. మేనిఫెస్టో హామీలను అమలు చేయలేక, ప్రజల దృష్టి మళ్లించేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని చెప్పారు.

ఎస్ఎస్ఎల్‌వీ డీ3 ప్రయోగం 16వ తేదీకి వాయిదా



సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి ఈ నెల 15న ఉదయం 9.17 గంటలకు ప్రయోగించ తలపెట్టిన స్మాల్ శాటిలైట్ లాంచింగ్ వెహికల్ (ఎస్ఎస్ఎల్‌వీ డీ3) ప్రయోగాన్ని వాయిదా వేసినట్టు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) సోమవారం రాత్రి ప్రకటించింది. ఈ ప్రయోగాన్ని ఈనెల 16వ తేదీ ఉదయం 9.17 గంటలకు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు పేర్కొంది. ఆగస్టు 15న స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలతోపాటు, జాతీయ సైన్స్ దినోత్సవ కార్యక్రమాలు ఉన్నందున ఈ ప్రయోగాన్ని ఒకరోజుపాటు వాయిదా వేసినట్టు వెల్లడించింది.

నేడు డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ రాక

జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ మంగళవారం హాజరవుతున్నారు. షార్‌లోని ఎంఆర్ కురూప్ ఆడిటోరియంలో జరిగే జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న అనంతరం ఆయన షార్‌ను సందర్శిస్తారని అధికార వర్గాలు తెలిపాయి.

'ఏపీ ఎస్పీఎఫ్' బెల్ట్, క్యాప్‌పై లోగో మార్పు

ఆవిష్కరించిన ఏపీఎస్పీఎఫ్ డైరెక్టర్ జనరల్ సి.ఎం.త్రివిక్రమవర్మ


యూనిఫాం బెల్ట్, క్యాప్ లోగో ఆవిష్కరిస్తున్న త్రివిక్రమవర్మ

విజయవాడ స్పోర్ట్స్: ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రక్షణ దళం(ఏపీ ఎస్పీఎఫ్) కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్ల యూనిఫాం ప్యాటర్న్ మార్పులో భాగంగా.. యూనిఫాం బెల్ట్, క్యాప్‌పై నూతనంగా రూపొందించిన లోగోను సంస్థ డైరెక్టర్ జనరల్ సి.ఎం. త్రివిక్రమవర్మ సోమవారం విజయవాడలోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఎస్పీఎఫ్ సిబ్బంది యూనిఫాం ప్యాటర్న్‌లో మార్పులు చేయాలని గతంలో తాను ప్రభుత్వానికి నివేదిక ఇచ్చానని, దీనిపై స్పందించిన సర్కారు యూనిఫాం లోగోను మార్పు చేస్తూ ఈ నెల 8న ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. నూతనంగా రూపొందిన లోగోలతో వచ్చిన క్యాప్, బెల్ట్‌లను ఈ సందర్భంగా సిబ్బందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐజీ బి.వి.రామిరెడ్డి, విజయవాడ జోన్ కమాండెంట్ ఎ.శంకరరావు, అసిస్టెంట్ కమాండెంట్ పి.వి.ఎస్.ఎన్.మల్లికార్జునరావు పాల్గొన్నారు.

పన్నుల్లో రాష్ట్రాల వాటా పెంచాలి

- దక్షిణాది రాష్ట్రాల నిపుణుల విజ్ఞప్తి
- విశాఖలో 16వ ఆర్థిక సంఘం సమావేశం
- 2025 అక్టోబర్ 31 నాటికి 16వ ఆర్థిక సంఘం నివేదిక ఇస్తామన్న చైర్మన్

విశాఖ సిటీ: కేంద్ర పన్నుల్లో రాష్ట్రాల వాటాను పెంచాలని దక్షిణాది రాష్ట్రాల పబ్లిక్ ఫైనాన్స్ నిపుణులు విజ్ఞప్తి చేశారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) ఆధ్వర్యంలో సోమవారం ఇక్కడ దక్షిణాది రాష్ట్రాల పబ్లిక్ ఫైనాన్స్ నిపుణులతో 16వ ఆర్థిక సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా కమిషన్ చైర్మన్ డాక్టర్ అరవింద్ పనగారియా హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన 15 మంది నిపుణులు పాల్గొన్నారు. ఉదయం 11 నుంచి సాయంత్రం వరకు జరిగిన ఈ కీలక సమావేశంలో కేంద్ర పన్నుల వికేంద్రీకరణలో దక్షిణాది రాష్ట్రాలకు న్యాయమైన వాటాపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక సంస్థలతోపాటు వివిధ వాటాదారుల సూచనలు, అభిప్రాయాలను కమిషన్ సభ్యులు తెలుసుకున్నారు. వీటన్నింటినీ క్రోడీకరించి 2025 అక్టోబర్ 31 నాటికి 16వ ఆర్థిక సంఘం సిఫార్సుల నివేదికను రూపొందించనున్నట్లు అరవింద్ పనగారియా చెప్పారు. 2026 ఏప్రిల్ 1 నుంచి మరో ఐదేళ్లకు తుది సిఫార్సులు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఇందులో కేంద్ర, రాష్ట్రాల నికర పన్నుల వాటా, రాష్ట్రాలకు కేటాయించాల్సిన గ్రాంట్స్–ఇన్–ఎయిడ్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ యాక్ట్ కింద అభివృద్ధి, దక్షిణాది రాష్ట్రాల్లోని పంచాయతీలు, మున్సిపాలిటీలకు వనరులు సమకూర్చే అంశాలపై చర్చించారు. కమిషన్ సభ్యులు అజేయ్ నారాయణ్, అన్నీ జార్జ్ మాథ్యూ, డాక్టర్ నిరంజన్, డాక్టర్ సౌమ్యకాంతి ఘోష్ తదితరులు పాల్గొన్నారు.

20న గోదావరి బోర్డు సమావేశం



సాక్షి, అమరావతి: గోదావరి నదీ యాజమాన్య బోర్డు(జీఆర్ఎంబీ) సర్వ సభ్య సమావేశాన్ని ఈ నెల 20వ తేదీన నిర్వహించాలని బోర్డు చైర్మన్ ముఖేష్‌కుమార్ సిన్హా నిర్ణయించారు. ఈ సమావేశాన్ని మంగళవారం నిర్వహించాల్సి ఉంది. అయితే రాష్ట్ర జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ విజ్ఞప్తి మేరకు దీన్ని 20కి వాయిదా వేశారు. ఈ మేరకు రెండు రాష్ట్రాల జలవనరుల శాఖ ఉన్నతాధికారులకు జీఆర్ఎంబీ చైర్మన్ ముఖేష్‌కుమార్ సిన్హా సోమవారం లేఖ రాశారు. హైదరాబాద్‌లోని బోర్డు కార్యాలయంలో ఈ సమావేశాన్ని నిర్వహించనున్నారు.

వాహనదారులకు డిజిటల్ సర్టిఫికెట్లు ఎందుకిస్తున్నారు?

పూర్తి వివరాలతో కౌంటర్ వేయండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: వాహనదారులకు డ్రైవింగ్ లైసెన్సులు, వాహన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను భౌతిక రూపంలో కాకుండా డిజిటల్ రూపంలో ఎందుకు ఇస్తున్నారో వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 21కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య ధర్మాసనం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో డ్రైవింగ్ లైసెన్సులను, వాహనాల రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను భౌతిక రూపంలో కాకుండా డిజిటల్ రూపంలో ఇస్తున్నారని, ఇది చట్ట విరుద్ధమంటూ పంజాబ్‌కు చెందిన స్వచ్ఛంద సంస్థ రాహత్ ది సేఫ్ కమ్యూనిటీ ఫౌండేషన్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేసింది. ఈ వ్యాజ్యంపై ఇటీవల సీజే నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, నిర్దేశిత ఫీజులు చెల్లిస్తున్నప్పటికీ ప్రభుత్వం మాత్రం వాహనదారులకు డిజిటల్ సర్టిఫికెట్లను జారీ చేస్తోందన్నారు.



పిన్నెల్లి వ్యాజ్యాలను ఎవరు విచారించాలో నిర్ణయం వెలువరిస్తా

స్పష్టం చేసిన జస్టిస్ కృపాసాగర్

తదుపరి విచారణ 14కు వాయిదా


సాక్షి, అమరావతి: రెంటచింతల, కారంపూడి పోలీసులు నమోదు చేసిన కేసుల్లో తనకు బెయిల్ మంజూరు చేయాలంటూ మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టు తదుపరి విచారణను ఈ నెల 14కి వాయిదా వేసింది. ఈ వ్యాజ్యాలను రోస్టర్ ప్రకారం తాను విచారించాలా? లేక గతంలో విచారించిన న్యాయమూర్తే (జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు) విచారించాలా? అన్న అంశంపై ఆ రోజున నిర్ణయం వెలువరిస్తానని న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. తనకు గురజాల కోర్టు బెయిల్ నిరాకరించిన నేపథ్యంలో బెయిల్ కోసం పిన్నెల్లి హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఈ వ్యాజ్యాలు సోమవారం జస్టిస్ కృపాసాగర్ ముందు విచారణకు రాగా, ఈ కేసులో పోలీసుల తరఫున హాజరవుతున్న స్పెషల్ కౌన్సిల్ ఎస్.అశ్వనీ కుమార్ స్పందిస్తూ, పిన్నెల్లిపై నమోదైన కేసులను గతంలో జస్టిస్ మల్లికార్జునరావు విచారించారని, అందువల్ల ఈ తాజా బెయిల్ పిటిషన్లను ఆయనే విచారించాల్సి ఉంటుందన్నారు. ఈ సమయంలో పిన్నెల్లి తరఫున సీనియర్ న్యాయవాది ఓ.మనోహర్‌రెడ్డి జోక్యం చేసుకుంటూ, వాస్తవానికి ఈ వ్యాజ్యాలు ఈ కోర్టు (జస్టిస్ కృపాసాగర్) ముందుకు రోస్టర్ ప్రకారమే వచ్చాయన్నారు. ఈ వ్యాజ్యాలను మీరే విచారించాల్సి ఉంటుందన్నారు. తమ తమ వాదనలను సమర్థించుకుంటూ ఇరువురు న్యాయవాదులు కొన్ని తీర్పులను న్యాయమూర్తి ముందుంచారు. వాటిని పరిశీలించిన న్యాయమూర్తి జస్టిస్ కృపాసాగర్, ఈ వ్యాజ్యాలపై ఎవరు విచారించాలన్న దానిని లోతుగా పరిశీలన చేసి నిర్ణయం వెలువరిస్తానని స్పష్టం చేశారు.

అరకు ఎంపీ తనుజా రాణి ఎన్నికను రద్దు చేయండి

హైకోర్టులో బీజేపీ అభ్యర్థి కొత్తపల్లి గీత ఎన్నికల పిటిషన్

సాక్షి, అమరావతి: అరకు వైఎస్సార్‌సీపీ ఎంపీ గుమ్మా తనూజా రాణి ఎన్నికను సవాలు చేస్తూ బీజేపీ అభ్యర్థి కొత్తపల్లి గీత హైకోర్టును ఆశ్రయించారు. తనూజా రాణి ఎన్నికల అఫిడవిట్‌లో వాస్తవాలను పొందుపరచలేదని, ఓట్ల లెక్కింపు కూడా సక్రమంగా జరగలేదని, అందువల్ల ఆమె ఎన్నికను రద్దు చేసి అరకు స్థానంలో ఓట్ల పరంగా రెండో స్థానంలో నిలిచిన తనను ఎన్నికయినట్లు ప్రకటించాలంటూ గీత ఇటీవల హైకోర్టులో ఎన్నికల పిటిషన్ (ఈపీ) దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై సోమవారం విచారణ జరిపిన హైకోర్టు, ఇందులో ప్రతివాదులుగా ఉన్న తనూజా రాణితో పాటు ఆ ఎన్నికల్లో పోటీ చేసిన పదిమంది అభ్యర్థులను, లోక్‌సభ సెక్రటరీ జనరల్, అరకు పార్లమెంట్ రిటర్నింగ్ అధికారులకు నోటీసులు జారీ చేసింది. ప్రతివాదులందరికీ వ్యక్తిగతంగా నోటీసులు అందచేసేందుకు సైతం పిటిషనర్‌కు న్యాయస్థానం వెసులుబాటునిచ్చింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ ఊటుకూరు శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి విచారణను వచ్చే నెలకు వాయిదా వేశారు.

శ్రీవారి క్షేత్రం.. వేడుకలకు సిద్ధం


స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చిన వెంకన్న క్షేత్రంలో ఈనెల 17 నుంచి వరుసగా వేడుకలు జరుగనున్నాయి. ఏడాది పొడవున ఆలయంలో తెలిసీ, తెలియక జరిగిన తప్పుల ప్రాయశ్చిత్తం నిమిత్తం ఈనెల 17 నుంచి 20 వరకు పవిత్రోత్సవాలను నిర్వహించనున్నట్టు ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు. 17న అంకురార్పణ, 18న పవిత్రాధివాసం, 19న పవిత్రావరోహణ, 20న మహా పూర్ణాహుతి వేడుకలను నిర్వహిస్తారు. ఆయా రోజుల్లో సుప్రభాత సేవ మినహా మిగిలిన సేవలను రద్దు చేస్తున్నట్టు చెప్పారు. అలాగే ఈనెల 27న శ్రీకృష్ణ జయంతిని పురస్కరించుకుని ఆలయంలో నిత్యార్జిత కల్యాణాలు, ఆర్జిత సేవలను రద్దు చేస్తున్నామని, 28న సాయంత్రం క్షేత్రంలో ఉట్ల పండగ, స్వామివారి గ్రామోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. ఈనెల 30న ఆఖరి శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని ఆలయ అనివేటి మండపంలో ఉదయం 9.30 గంటల నుంచి సామూహిక వరలక్ష్మీ వ్రతాలను ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.



యవ్వనంలో కంటే ముదిమిలో వివేకం ఎక్కువ ;
ముదిమిలో కంటే యవ్వనంలో అందం ఎక్కువగా ఉన్నట్టుగానే.
– యోషిదా కెంకో

సాక్షి

మంగళవారం, 13 ఆగస్టు 2024

చేయాల్సింది చాలావుంది!

ప్యారిస్ వేసవి విశ్వక్రీడా సంరంభం ముగిసింది. దాదాపు 850 పతకాలు విజేతలను వరించిన ఈ 2024 ఒలింపిక్స్‌లో 10 ప్రపంచ రికార్డులు, 32 ఒలింపిక్ రికార్డులతో సహా మొత్తం 42 రికార్డులు బద్దలయ్యాయి. మరి, భారత్ సాధించినదేమిటి అన్నప్పుడే ఆశ నిరాశలు దోబూచులాడతాయి. 117 మంది అథ్లెట్లతో, 16 క్రీడాంశాల్లో పోటీపడుతూ భారత ఒలింపిక్ బృందం ఎన్నో ఆశలతో విశ్వ వేదికపై అడుగుపెట్టింది. ఈసారి రెండంకెల్లో పతకాలు సాధిస్తామనే ఆకాంక్షను బలంగా వెలిబుచ్చింది. తీరా ఒలింపిక్స్ ముగిసేవేళకు అరడజను పతకాలతోనే (5 కాంస్యం, 1 రజతం) తృప్తి పడాల్సి వచ్చింది. గడచిన 2020 టోక్యో ఒలింపిక్స్‌లో సాధించిన 7 పతకాల అత్యుత్తమ ప్రదర్శనతో పోలిస్తే... ఇది ఒకటి తక్కువే. ఈ సంరంభంలో మొత్తం 84 దేశాలు పాల్గొంటే, ప్రపంచంలో అత్యధికంగా 145 కోట్ల జనాభా గల మన దేశం పతకాల పట్టికలో 71వ స్థానంలో నిలిచింది. మన పతకాలు, జనాభా నిష్పత్తి చూస్తే, ప్రతి 25 కోట్ల మందికి ఒక్క పతకం వచ్చిందన్న మాట. 'ఖేలో ఇండియా' పేరిట కోట్లు ఖర్చుచేస్తున్నామంటున్న పాలకులు ఆత్మశోధనకు దిగాల్సిన అంశమిది.

ఫ్రాన్స్‌లో రాజకీయ సంక్షోభం, పొంచివున్న దాడుల పట్ల భద్రతా సిబ్బంది భయం, ఫ్రెంచ్ ప్రజానీకంలో పెద్దగా ఉత్సాహం లేకపోవడం... వీటన్నిటి మధ్య ప్యారిస్ ఒలింపిక్స్ సరిగ్గా జరుగుతాయో జరగవో అని అందరూ అనుమానపడ్డారు. అన్నిటినీ అధిగమించి ఈ విశ్వ క్రీడోత్సవం విజయవంతంగా ముగిసింది. పైగా, అస్తుబిస్తుగా ఉన్న ఫ్రెంచ్ ఆర్థిక వ్యవస్థకు ఇప్పుడు అత్యావసరమైన కొత్త ఉత్సాహమూ నింపింది. క్రితంసారి కోవిడ్ మూలంగా టోక్యోలో ప్రేక్షకులు లేకుండానే పోటీలు నిర్వహించిన నేపథ్యంలో ఈసారి స్పాన్సర్లు, బ్రాడ్‌కాస్టర్ల నుంచి అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీకి ఒత్తిడి ఉంది. నిర్వాహకులు మొత్తం ప్యారిస్‌ను ఓపెన్–ఎయిర్ ఒలింపిక్ క్రీడాంగణంగా మార్చేసి, అందరూ ఆహ్వానితులే అనడంతో ఊహించని రీతిలో ఇది దిగ్విజయమైంది.

పోటీల్లో పాల్గొన్న ఒకరిద్దరు క్రీడాకారుల జెండర్ అంశం, భారత రెజ్లర్ వినేశ్ ఫోగట్ అనర్హత వ్యవహారం లాంటివి మినహా ఈ ప్యారిస్ ఒలింపిక్స్ అతిగా వివాదాస్పదం కాలేదనే చెప్పాలి. ఉక్రెయిన్, గాజా లాంటి భౌగోళిక రాజకీయ అంశాలు, అలాగే అమెరికాలో ఎన్నికల వేడి, బ్రిటన్‌లో అల్లర్లు, బంగ్లాదేశ్‌లో సంక్షోభం లాంటివి పతాక శీర్షికలను ఆక్రమించేసరికి ఒలింపిక్స్ వివాదాలు వెనుకపట్టు పట్టాయనీ ఒప్పుకోక తప్పదు. ప్యారిస్ వేసవి ఒలింపిక్స్‌కు తెర పడింది కానీ, ఈ ఆగస్టు 28 నుంచి అక్కడే పారా ఒలింపిక్స్–2024 జరగనుంది. తదుపరి 2028 వేసవి ఒలింపిక్స్‌కు లాస్ ఏంజెల్స్ సిద్ధమవుతోంది. కేవలం రెండే పతకాలు సాధించిన 2016 నాటి రియో ఒలింపిక్స్‌తో పోలిస్తే, భారత్ మెరుగైన మాట నిజమే. అథ్లెటిక్స్, వెయిట్ లిఫ్టింగ్, మహిళా బ్యాడ్మింటన్‌లో వెనుకబడినా టేబుల్ టెన్నిస్, షూటింగ్‌లలో కాస్త ముందంజ వేశామన్నదీ కాదనలేం.

ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించి, ఆ ఘనత సాధించిన తొలి భారతీయ షూటర్‌గా 22 ఏళ్ళ మనూ భాకర్ చరిత్ర సృష్టించారు. గోల్‌కీపర్ శ్రీజేశ్ సహా హాకీ బృందమంతా సర్వశక్తులూ ఒడ్డి, వరుసగా రెండో ఒలింపిక్స్‌లోనూ పతకం సాధించింది. ఇక ఈ ఒలింపిక్స్‌లో ఊరించి చేజారిన పతకాలూ చాలా ఉన్నాయి. భారత మల్లయోధురాలు వినేశ్ ఫోగట్ సంచలన విజయాలు నమోదు చేసినా, వంద గ్రాముల అధిక బరువు రూపంలో దురదృష్టం వెన్నాడకపోతే స్వర్ణం, లేదంటే కనీసం రజతం మన ఖాతాలో ఉండేవి. షట్లర్ లక్ష్యసేన్, అలాగే 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ షూటర్ అర్జున్ బబుతా సహా కనీసం 6 సందర్భాల్లో మనవాళ్ళు ఆఖరి క్షణంలో నాలుగో స్థానానికి పరిమితమయ్యారు. లేదంటే పతకాల పట్టికలో మన దేశం మరింత ఎగబాకేదే. పతకాలు, విజయాల మాటెలా ఉన్నా, మన మార్కెటింగ్ విపణికి కొన్ని కొత్త ముఖాలు దొరికాయి. గాయాల నుంచి ఫీనిక్స్ పక్షిలా లేచిన నీరజ్ చోప్రా, పీవీ సింధుల మొదలు నిలకడగా ఏళ్ళ తరబడి ఆడిన శ్రీజేశ్, రెండు పతకాల విజేత మనూ భాకర్, బ్యాడ్మింటన్ క్రేజ్ లక్ష్యసేన్ దాకా పలువురు బ్రాండ్లకు ప్రీతిపాత్రులయ్యారు.

కానీ ఇది సరిపోతుందా? ఆర్చరీ, బాక్సింగ్ సహా పలు అంశాల్లో నిరాశాజనక ప్రదర్శన మాటేమిటి? మిశ్రమ భావోద్వేగాలు రేగుతున్నది అందుకే. ఇప్పటికైనా మన ప్రాధాన్యాలను సరి చేసుకోవాలి. అత్యధిక జనాభా గల దేశంగా ప్రతిభకు కొదవ లేదు. ప్రతిభావంతుల్ని గుర్తించి, ప్రోత్సహించి, సరైన రీతిలో తీర్చిదిద్దడమే కరవు. మనకొచ్చిన 6 పతకాల్లో 4 దేశ విస్తీర్ణంలో 1.4 శాతమే ఉండే హర్యానా సంపాదించి పెట్టినవే. అంటే, మొత్తం పతకాల్లో హర్యానా ఒక్కదాని వాటా 66 శాతం. మరి, మిగతా దేశం సంగతి ఏమిటి? అక్కడి పరిస్థితులేమిటి? ప్రపంచంలోని అగ్రశ్రేణి ఆర్థిక వ్యవస్థ మనదని జబ్బలు చరుచుకుంటున్న పాలకులు ఇవాళ్టికీ క్రీడలకు సరైన రీతిలో వస తులు, వనరులు ఇవ్వట్లేదు. పేరొచ్చాక సాయం చేస్తే సరిపోదు. క్షేత్రస్థాయిలో ఆటగాళ్ళకు నారు పోసి, నీరు పెట్టాలి.

మన క్రీడా సంఘాలు, ప్రాధికార సంస్థలు రాజకీయ నేతల గుప్పెట్లో ఇరుక్కుపోవడం పెను విషాదం. పతకాలకై పోరాడాల్సిన ఆటగాళ్ళు లైంగిక వేధింపులు సహా అనేక సమస్యలపై రోడ్డెక్కి పోరాడాల్సిన పరిస్థితిని కల్పించడం మన ప్రభుత్వాల తప్పు కాదా? క్రీడా సంస్కృతిని పెంచి పోషించడానికి బదులు రాజకీయాల క్రీనీడలో ఆటను భ్రష్టు పట్టిస్తే, పతకాలు వచ్చేదెట్లా? అంతర్జాతీయ స్థాయిలో విజయానికి దూరదృష్టి, సరైన వ్యూహం, నిరంతరం పెట్టుబడి, స్పష్టమైన క్రీడా విధానం రాష్ట్ర స్థాయి నుంచే కీలకం. ఆ దిశగా ఆలోచించాలే తప్ప దాహమేసినప్పుడు బావి తవ్వితే కష్టం. అందుకే, 1900 తర్వాత నూటపాతికేళ్ళలో ఒలింపిక్స్‌లో ఇది మన రెండో అత్యుత్తమ ప్రదర్శన. ఇకనైనా అపూర్వ క్రీడాదేశంగా మనం అవతరించాలంటే, పాలకులు చేయాల్సింది చాలా ఉంది.

సిద్ధాంతానికీ, అధికారానికీ స్పర్థ?

అభిప్రాయం



టంకశాల అశోక్

ఏ సంస్థకైనా, పార్టీకైనా స్థాపించినపుడు కొన్ని సిద్ధాంతాలు ఉంటాయి. అధికారానికి వచ్చినట్లయితే ఆ సిద్ధాంతానికి భిన్నమైన లక్ష్యాలు ఏర్పడతాయి. అది క్రమంగా ఒక వైరుధ్యంగా మారుతుంది. అధికార పరిష్వంగంలోకి వెళ్లినవారు ఎంత నిష్ఠాగరిష్ఠులైనా, దాని ఆకర్షణలకు లొంగకుండా ఉండటం చాలా అరుదు. వారికి తమ లక్ష్యాల సాధనకు సిద్ధాంతం ఒక పెద్ద ఆటంకంగా తోస్తుంది. అపుడు దానిని అనివార్యంగా ధిక్కరిస్తారు. ప్రస్తుతం ఆరెస్సెస్, మోదీ మధ్య జరుగుతున్నది అదే. స్వాతంత్ర్యానంతరం గాంధీ ఆదర్శాల దారి ఏమిటో, కాంగ్రెస్‌వాదుల అధికార పోకడలు ఏ విధంగా ఉన్నాయో చూసిందే. మార్క్సిజానికి త్రికరణ శుద్ధిగా కట్టుబడినామనే కమ్యూనిస్ట్ పార్టీలలో సైతం ఈ వైరుధ్యాలు చోటు చేసుకున్నాయి.

ఆరెస్సెస్ సైద్ధాంతికతకూ, బీజేపీ అధికార కాంక్షకూ మధ్య ఒక స్పర్థ ఏర్పడుతున్నట్లు స్పష్టంగా కనిపిస్తున్నది. ఈ సూచనలు గతంలోనూ ఉండేవిగానీ, ఇటీవలి ఎన్నికల తర్వాత అందుకు స్పష్టత ఏర్పడుతున్నది. ఎన్నికలలో బీజేపీ అంతిమంగా అధికారానికి వచ్చినా అనుకోని విధంగా కొన్ని ఎదురుదెబ్బలు తిన్నది. ఆ వెంటనే ఆరెస్సెస్ సర్ సంఘ్‌చాలక్ మోహన్ భాగవత్... ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై, బీజేపీపై విమర్శలు చేశారు. ఆరెస్సెస్ అధికార పత్రిక 'ఆర్గనైజర్' కూడా మరికొన్ని విమర్శలతో ఒక వ్యాసాన్ని ప్రచురించింది. ఇదంతా జూన్ ప్రథమార్ధంలో జరిగిన విషయం. ఆ విధమైన విమర్శలు బీజేపీ ప్రత్యర్థుల నుంచి వచ్చి ఉంటే అందులో విశేషం లేదు. కానీ ఆ పని చేసింది బీజేపీ మాతృ సంస్థ కావటం, ఆ విమర్శలు కూడా బహిరంగంగా చేయటం సంచలనాన్ని సృష్టించింది. అటువంటి ఎదురు దెబ్బలు, సంచలనాత్మక విమర్శల దృష్ట్యా మోదీ తీరు, బీజేపీ పద్ధతులు కొంతైనా మారగలవని అనేకులు అభిప్రాయపడ్డారు. కానీ, ఆ జూన్ ప్రథమార్ధం నుంచి ఇప్పటికి గడిచిన రెండు మాసాల కాలంలో మనకు ఎటువంటి మార్పులు కనిపించటం లేదు. ఇందుకు రెండు తాజా ఉదాహరణలలో ఒకటి, లవ్ జిహాద్ కేసులలో జీవిత ఖైదు విధించే చట్టం చేయగలమన్న అస్సాం బీజేపీ ముఖ్యమంత్రి ప్రకటన కాగా, రెండవది మోదీ ప్రభుత్వం వక్ఫ్ ఆస్తుల బిల్లును ప్రతిపాదించటం.

ఈ వివరాలలోకి వెళ్లే ముందు ఒక విషయం చెప్పుకోవాలి. ఆరెస్సెస్ ఒక సైద్ధాంతిక సంస్థ. ఆ సిద్ధాంతంతో ఎవరైనా ఏకీభవించకపోవచ్చుగాక. కానీ వారికి తమ సిద్ధాంతాలు ఉన్నాయి. సంస్థ వయస్సు వందేళ్లు. దాని నాయకత్వాన ఇతర ప్రధాన సంస్థలు, ఉప సంస్థలు కలసి కొన్ని డజన్లు ఉన్నాయి. అన్నింటిని కలిపి సంఘ్ పరివార్ అంటున్నారు. వీటిలో భారతీయ జనసంఘ్ (1951) మొదటి రాజకీయ పార్టీ. తర్వాత అది బీజేపీ (1980)గా రూపాంతరం చెందింది. ఆరెస్సెస్ సిద్ధాంతం 1951 వరకు కూడా హిందూ రాజ్య స్థాపన కోసం సాంస్కృతిక రంగంలో, మతపరంగా కృషి చేయటం తప్ప రాజకీయాలలోకి అసలు ప్రవేశించరాదన్నది! తర్వాత కొన్ని పరిస్థితులలో మొదట జనసంఘ్, తర్వాత బీజేపీ ఏర్పాటుకు సమ్మతించినా, ఆ పార్టీలు పూర్తిగా ఆరెస్సెస్ నిర్దేశాలకు లోబడి పనిచేస్తూ పోయాయి. బీజేపీ అధికారానికి వచ్చిన రాష్ట్రాలలోగానీ, వాజ్‌పేయి నాయకత్వాన కేంద్ర ప్రభుత్వాన్ని ఏర్పరచినపుడుగానీ, ముఖ్యమైన పరిపాలనా విధానాలకు కూడా ఆరెస్సెస్‌తో చర్చలు జరుగుతుండేవి. అపుడపుడు భిన్నాభిప్రాయాలు తలెత్తినా చర్చల ద్వారా ఏకాభిప్రాయానికి వచ్చేవారు. ఆరెస్సెస్‌ను బీజేపీ నాయకత్వం ధిక్కరించటం జరిగేది కాదు. మోదీ నాయకత్వాన అది మొదటిసారిగా జరుగుతుండటమన్నది గమనించవలసిన విశేషం. మోదీ ధిక్కార ధోరణి వాస్తవానికి ఆయన గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉండిన (2001–14) కాలంలోనే మొదలై ఇప్పటికీ కొనసాగుతున్నది. జూన్ ప్రథమార్ధం నాటి భాగవత్, ఆర్గనైజర్‌ల బహిరంగ విమర్శలను ఆయన లెక్క చేయక వ్యవహరించటం ఇందుకు కొనసాగింపు మాత్రమే.



ఇప్పుడు అసలు చర్చలోకి వెళదాము. ఏ సంస్థకైనా, లేక పార్టీకైనా వాటిని స్థాపించినపుడు కొన్ని సిద్ధాంతాలు ఉంటాయి. తర్వాత అవి అధికారానికి వచ్చినట్లయితే ఆ సిద్ధాంతానికి భిన్నమైన లక్ష్యాలు ఏర్పడతాయి. పూర్తి భిన్నం కాకున్నా పరిస్థితులను బట్టి వేర్వేరు స్థాయిలలో ఏర్పడుతాయి. అటువంటపుడు ఆ సిద్ధాంతాలకు, అధికార లక్ష్యాలకు మధ్యగల భిన్నత్వం క్రమంగా ఒక వైరుధ్యంగా మారుతుంది. లక్ష్యాల స్వభావాన్ని బట్టి, ఆ వ్యక్తుల స్వభావాన్ని బట్టి వైరుధ్య తీవ్రత ఉంటుంది. మరికొద్ది ఉదాహరణలను కూడా చెప్పుకొని ఆరెస్సెస్, బీజేపీల విషయానికి మళ్లీ వద్దాము.

కాంగ్రెస్ పార్టీ 1885లో ఏర్పడింది. ఆ పార్టీ 1923లో చీలి కాంగ్రెస్ స్వరాజ్ పార్టీ ఆవిర్భవించింది. ఎన్నికలలో పాల్గొనేందుకు కాంగ్రెస్ వ్యతిరేకం కాగా, పాల్గొనాలన్నది స్వరాజిస్టుల వాదన. అప్పటినుంచి 1947లో స్వాతంత్ర్యం లభించే వరకు, దేశ విభజన విషయంలో సైతం పార్టీలో పలువురు ప్రముఖులు గాంధీజీని వ్యతిరేకిస్తూ పోయారు. బ్రిటిష్ వారి హయాంలోనే ప్రభుత్వాలలోనూ చేరారు. ఆ వివరాలలోకి ఇక్కడ వెళ్లలేముగానీ, గుర్తించవలసింది సిద్ధాంతానికీ, అధికార కాంక్షలకూ మధ్య వైరుధ్యాలు ఏర్పడటం. ఇక స్వాతంత్ర్యానంతరం కాంగ్రెస్ సిద్ధాంతాలు, గాంధీ ఆదర్శాల దారి ఏమిటో, కాంగ్రెస్‌వాదుల అధికార పోకడలు ఏ విధంగా ఉన్నాయో చూస్తున్నదే. చివరకు మార్క్సిజానికి త్రికరణ శుద్ధిగా కట్టుబడినామనే కమ్యూనిస్ట్ పార్టీలలో సైతం ఈ వైరుధ్యాలు చోటు చేసుకున్నాయి. వారు స్వయంగా అధికారాలు నెరపిన దేశాలలోనూ, భారతదేశంలోని రాష్ట్రాలనూ చూసినపుడు ఇది స్పష్టంగా తెలుస్తుంది. వారి అధికార పతనాలకు గల ప్రధాన కారణాలలో ఇది కూడా ఒకటి. అధికారం నిజంగానే ప్రజల మేలు కోసం పరిమితమయితే ఈ పరిస్థితి తలెత్తదు.

కానీ విషాదకరమైన వాస్తవం ఏమంటే, అధికార పరిష్వంగంలోకి వెళ్లినవారు ఎంత నిష్ఠాగరిష్ఠులైనా, దాని ఆకర్షణలకు లొంగకుండా ఉండటం చాలా అరుదు. వారికి తమ లక్ష్యాల సాధనకు సిద్ధాంతం ఒక పెద్ద ఆటంకంగా తోస్తుంది. అపుడు దానిని అనివార్యంగా ధిక్కరిస్తారు. ప్రస్తుతం ఆరెస్సెస్, మోదీల మధ్య జరుగుతున్నది అదే.

ఇటువంటి పరిస్థితులలో సర్వసాధారణంగా జరిగే క్రమం ఒకటున్నది. ఒక సైద్ధాంతిక సంస్థకు అనుబంధంగా ఉండే కొందరు ఒక రాజకీయ పార్టీని నెలకొల్పడమంటే అధికార సాధన కోసం మాత్రమే. అటువంటపుడు ఒకవైపు తమ సిద్ధాంతంతో సంబంధం ఉన్నవారిని, లేనివారిని కూడా వీలైనంత విస్తృతంగా పార్టీలో చేర్చుకోవలసి ఉంటుంది. వారి ప్రయోజనాల కోసం కూడా పని చేయవలసి ఉంటుంది. మరొకవైపు ఆ క్రమంలో తాము అనేక అధికార ప్రయోజనాల ఆకర్షణకు లోనవుతారు. ఈ రెండింటి ప్రభావం వారిని తమ సైద్ధాంతికతకు దూరం చేస్తుంది. సిద్ధాంతాలు గుర్తు చేసేవారిని ధిక్కరించేట్లు చేస్తుంది. కాంగ్రెస్, సోషలిస్టులు, కుల పార్టీలు, ప్రాంతీయ పార్టీల వంటివే కాదు... కమ్యూనిస్టులు, మతవాద పార్టీల వంటి నిష్ఠాగరిష్ఠత గల సైద్ధాంతిక, కేడర్ పునాది పార్టీలకు సైతం ఈ మాట వర్తిస్తుంది. అది మనం ప్రత్యక్షంగా చూస్తున్నదే. మరొక మాటలో చెప్పాలంటే ఇవన్నీ సైద్ధాంతిక పతనాలు. సిద్ధాంతానికీ, అధికారానికీ మధ్య స్పర్థ. మనం చూసినంతవరకు ఇందులో అధికారానిదే పైచేయి అవుతూ వస్తున్నది. అధికారానికి వచ్చినవారు భరించలేకుండా తయారై, ప్రజల తీవ్ర ఆగ్రహాలకు గురై, వారి చేత పరాభవం పొంది, తిరిగి ప్రజలు సిద్ధాంతాల వైపు మళ్లితే తప్ప, పరిస్థితులు ఈ విధంగానే ఉంటాయి.

అయితే ఆరెస్సెస్‌కు సంబంధించిన అభిప్రాయాలు కొన్ని ఉన్నాయి. పార్టీ ఏర్పాటును 1951 వరకు వ్యతిరేకించిన వారు జనసంఘ్ స్థాపనకు, తర్వాత బీజేపీ అవతరణకు ఎందువల్ల సమ్మతించినట్లు? రాజకీయ శక్తిగా మారి అధికారం కూడా సాధించినట్లయితే దానిని ఉపయోగించుకుని హిందూ రాష్ట్ర స్థాపన లక్ష్యాన్ని ముందుకు తీసుకు పోవచ్చునన్నది ఆలోచన. యథాతథంగా అది మంచి వ్యూహమే కావచ్చు. కానీ పైన చెప్పుకున్నట్లు, రాజకీయ శక్తులు, వారి ప్రయోజనాల వలలో చిక్కుకుని అది దారి తప్పింది. ఆరెస్సెస్ నాయకత్వం స్వయంగా బలహీన పడుతుండటంతో రాజకీయ నాయకత్వం బలం పెరిగింది. ఇంతేకాదు, సాక్షాత్తూ సంఘ్ పరివార్‌లోని కొన్ని వర్గాలు కూడా అధికార ఆకర్షణలకు లోబడటం మొదలైందనే మాటలు కొంత కాలంగా వినవస్తున్నాయి. ఇటువంటి పరిణామాల మధ్య జరిగేదేమిటి? మోదీ, బీజేపీల అధికార ఆయుధానికి పదను పెరుగుతుంది. ఆరెస్సెస్ సైద్ధాంతిక నిష్ఠ క్రమంగా మొద్దుబారుతుంది. ఈ స్పర్థలో మొగ్గ ఎవరిదో కనిపిస్తున్నదే.

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

జయించినవాడు!



ఇరాన్‌లోని అయతొల్లా ప్రభుత్వాన్ని ఎదిరించినందుకు ఒక తండ్రి (మాజిద్ కొవసిఫర్)ని ఉరి తీస్తుండగా, అతడి చిన్నారి కూతురు చూస్తోంది(ఫొటో షేర్ చేశారు). అనితర సాధ్యం అనేట్టుగా ఆ ధైర్యవంతుడు ఆ పాపకు చిరునవ్వుతో గుడ్ బై చెప్పాడు.

– ఇంతియాజ్ మహమూద్, థింకర్

ఇవి చాలవా?



'డబ్బు సంతోషాన్ని కొనలేదు' అని చాలా మందిమి చెబుతుంటాం. కానీ డబ్బు ఆహారాన్ని కొనగలదు. డబ్బు దుస్తులు కొనగలదు. డబ్బు ఇంటిని కొనగలదు. డబ్బు వైద్యాన్ని కొనగలదు. డబ్బు స్కూలు ఫీజులు చెల్లించగలదు. ప్రపంచంలో చాలామందికి ఈ ప్రాథమిక అవసరాలు తీరడమే సంతోషం అని గుర్తించాలి.

– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

చెడ్డ నైపుణ్యం



ఇండియా కంటే ముందే అమెరికా తన మేలుకొలుపువాదాన్ని వదులుకుంటుంది. అమెరికా నుంచి చెడ్డ అలవాట్లను దిగుమతి చేసుకొని, వాటిని మరింత భారీగా పెంచే నైపుణ్యం ఇండియాకు ఉంది. ఉదాహరణకు, ఫాస్ట్ ఫుడ్స్, లేట్ నైట్ ఆఫీసులు, గ్లాస్ బిల్డింగులు, మెటీరియలిజం, డ్రగ్స్, ఒంటరితనం, ఇంకా ఎన్నో!

– రాహుల్ రాజ్, ఆంట్రప్రెన్యూర్

మారిపోయిందా?



ఒకప్పటి సోవియట్‌లా మారిపోయిన బ్రిటన్‌కు ప్రయాణాలు చేయడం మానుకుంటున్నవారు ఎవరైనా ఉంటే చేతులు ఎత్తండి!

– పీటర్ స్వీడన్, జర్నలిస్ట్

అసలు విజేత



ఒలింపిక్స్‌లో నిజమైన విజేత నెదర్లాండ్స్. జాబితాలో వాళ్లు ఆరో స్థానంలో ఉన్నారు. వాళ్ల జనాభా కేవలం 1.7 కోట్లు, ఢిల్లీ జనాభాలో సగం. అంటే సుమారుగా ఐదు లక్షల మందికి ఒక పతకం.

– ధ్రువ్ రాఠీ, యూట్యూబర్

ఇన్ బాక్స్

మన్యం విప్లవ వీరుడు

బ్రిటిష్ నిరంకుశ పాలనలో గిరిజనులు అనుభవిస్తున్న దయనీయ స్థితిని తొలగించి, వారి జీవితాలలో వికాస అభ్యుదయాలు కలిగించడానికి అల్లూరి సీతారామరాజు మన్యంలో గొప్ప విప్లవం నడిపారు. దీనిలో పాల్గొన్న అల్లూరి అనుచరులలో గంటన్న దొర, మల్లుదొరల తరువాత చెప్పుకోవలసిన వీరుడు బోనంగి పండు పడాల్.

నేటి అల్లూరి సీతారామరాజు జిల్లా, చింతపల్లి మండలం గొందిపాకలులో 1890 ఆగస్టు 13న పడాల్ జన్మించారు. 22 ఏళ్ల వయస్సులో అదే గ్రామానికి చెందిన లింగాయమ్మతో వివాహమైంది. అప్పటికే బ్రిటిష్ పాలకుల దురాగతాలు పెచ్చు మీరిపోయాయి. దీంతో అల్లూరి సీతారామరాజుతో కలిసి సాయుధ పోరాటంలో భాగంగా పోలీస్ స్టేషన్లపై దాడుల్లో పాల్గొన్నారు. ప్రధానంగా 1922 సెప్టెంబరులో కృష్ణాదేవిపేట వద్ద బ్రిటిష్ సైనికాధికారులు హైటర్, క్లవర్ట్‌లను అంతమొందించిన దాడిలో ఆయన ప్రధాన భూమిక పోషించారు. దీంతో పోలీసుల హిట్‌లిస్ట్‌లో చేరడంతో, అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. అల్లూరి సీతారామరాజు మరణం అనంతరం బ్రిటిష్ ప్రభుత్వం పడాల్ వివరాలు, ఆచూకి తెలిపిన వారికి వంద రూపాయలు బహుమానం ప్రకటించింది. ఒక రోజు తన స్వగ్రామం వెళ్ళారు పడాల్. అప్పటికే బ్రిటిష్ ప్రభుత్వం ఆయన కుటుంబ సభ్యులను చిత్రహింసలకు గురిచేస్తూ ఉంది. దీంతో పడాల్ సోదరి (అక్క) రామయమ్మ భోజనానికి ఇంటికి పిలిచి బ్రిటిష్ పోలీసులకు సమాచారం ఇచ్చింది. పోలీసులు 1924 జూన్‌లో అరెస్టు చేశారు. విశాఖపట్నం సెషన్స్ కోర్టు 1925 మే 11న మరణ శిక్ష విధించింది. ఈ శిక్షను మళ్లీ యావజ్జీవ కారాగార శిక్షగా మార్చింది. రాజమండ్రి, కన్నూరు, తిరుచురాపల్లి, పాయంకోట, మద్రాస్ జైళ్లలో ఉంచి... తర్వాత 1926లో అండమాన్‌లో ప్రవాస శిక్షకు పంపించారు. నాటి నుంచి దేశానికి స్వాతంత్ర్యం వచ్చే వరకు శిక్షను అనుభవించారు. జైలు నుంచి విడుదలైన పడాల్ అండమాన్‌లోనే స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. విడుదలైన వెంటనే తహసీల్దార్ ద్వారా గొందిపాకలులో ఉన్న భార్య లింగాయమ్మను అండమాన్ రప్పించుకునేందుకు ప్రయత్నించినప్పటికీ ఆమె నిరాకరించింది. దీంతో అండమాన్‌లో పార్వతి అనే మహిళను వివాహం చేసుకున్నారు. కుటుంబ సభ్యులు 2012 ఫిబ్రవరి 29న గొందిపాకలులో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఏటా ఆ గ్రామస్థులు పండు పడాల్ జయంతిని ఆగస్టు 13న ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇటువంటి ఎందరో అమర వీరుల త్యాగ ఫలితమే ఇవ్వాళ మనం అనుభవిస్తున్న స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు!



బోనంగి పండు పడాల్

– ఎన్. సీతారామయ్య, పాడేరు

(నేడు స్వాతంత్ర్యోద్యమ వీరుడు బోనంగి పండు పడాల్ జయంతి)

కాలం చెక్కిలిపై చెరగని కన్నీటి చారిక!

సందర్భం



డా॥ గోపరాజు నారాయణరావు


శతాబ్దాల బానిస గతానికి స్వతంత్రం అంతం పలికింది. భారత భవితవ్యానికి మాత్రం దేశ విభజన సవాళ్లు విసిరింది. స్వాతంత్ర్యం కొరకు పోరాడిన వారు అంటూ చిరకాలంగా కొన్ని కుటుంబాలనే భారతీయులు ఆరాధించారు. విభజన విషాదంలో అకారణంగా కన్ను మూసి, అందరినీ పోగొట్టుకుని, స్వాతంత్ర్యోద్యమ సంబరాలు ఎరుగని వారినీ ఇప్పుడు తలుచుకోవాలని అనుకుంటున్నాం. దేశ విభజన విషాదాల సంస్మరణ దినం (ఆగస్టు 14) అందుకు అవకాశం ఇస్తున్నది.

స్వాతంత్ర్య సమరంలోని చాలా ఘట్టాలు చరిత్ర పుటలకు చేరినట్టే, విభజన విషాదమూ మరుగున ఉండిపోయింది. కేవలం తేదీలు, కారణాలు, ఫలితాల దృష్టి నుంచి సాగే చరిత్ర రచన కంటే, చరిత్రకు ఛాయ వంటి సృజనాత్మక సాహిత్యమే విభజన విషాదాన్ని గుర్తు చేసే బాధ్యతను ఎక్కువగా స్వీకరించింది. ప్రథమ రాష్ట్రపతి డాక్టర్ బాబూ రాజేంద్ర ప్రసాద్ మొదలు నిన్న మొన్నటి జస్వంత్ సింగ్ వరకూ తమ పుస్తకాలలో చరిత్రగా విభజన గాథను విశ్లేషించారు. నవల, కవిత, కథ, నాటక ప్రక్రియలు విభజన విషాదాన్ని ఆవిష్కరించిన తీరూ స్మరణీయమే. భీష్మ సహానీ 'తమస్' (అంధకారం) విభజన కాలాన్ని చర్చించిన నవలా సాహిత్యంలో మకుటాయమానమైనదనిపిస్తుంది. విభజనకు కారణం మతమా? మత రాజకీయమా అన్నది చర్చించారాయన. చల్లారుతున్న మతోద్రిక్తతలు పంది కళేబరం మసీదు మెట్ల మీద కనిపించడం వల్ల తిరిగి భగ్గుమనడం ఇందులో ఇతివృత్తం. ఇంతకీ నాథూ అనే తోళ్ల కార్మికుడికి, పారిశుద్ధ్య కార్మికుడికి మాయమాటలు చెప్పి మురాద్ అలీ అనే వ్యాపారి చేయించిన పని ఇది. భారత జాతీయ కాంగ్రెస్ నాయకుల గిల్లికజ్జాలు, పోలీసు ఉన్నతాధికారిగా ఉన్న ఆంగ్లేయుడు దేశం వీడుతున్న క్షణంలోనూ ప్రదర్శించిన 'విభజించి పాలించు' బుద్ధినీ కూడా ఇందులో పరిచయం చేశారాయన. చివరికి శాంతియాత్రకు మురాద్ అలీ ముందు ఉండడం పెద్ద మలుపు. ఈ నవలను డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ తెనిగించారు. మహిళల మీద విభజన చేసిన దాడిని చాలామంది వర్ణించారు. అమృతా ప్రీతమ్ నవల 'పింజర్' (అస్థిపంజరం) వాటిలో ప్రత్యేకమైనది. పెళ్లి నిశ్చయమైన పూరో అనే హిందూ యువతిని రషీద్ అనే ముస్లిం యువకుడు అపహరించడం ఇందులో కీలకం.



ఆమె తప్పించుకు వచ్చినా తల్లిదండ్రులు స్వీకరించ డానికి నిరాకరిస్తారు. మతం మారి రషీద్‌నే ఆమె పెళ్లి చేసుకుంటుంది. చివరికి ఆమె అవసరమే పుట్టింటివారికి వస్తుంది.

స్వాతంత్ర్యోద్యమం, దాని ఫల



దేశ విభజన నాటి ఒక దయనీయ దృశ్యం



శ్రుతి వేర్వేరేనని గుర్తించాలన్నట్టు విభజన గాథలను వివరించేందుకు రైలు ప్రయాణాలను పలువురు తమ ఇతివృత్తాలకు నేపథ్యంగా స్వీకరించారనిపిస్తుంది. వాటిలో ప్రముఖమైనది 'ట్రెయిన్ టు పాకిస్తాన్'. కుష్వంత్ సింగ్ ఈ నవలను జుగ్గు (సిక్కు), నూరాన్ (ముస్లిం)ల ప్రేమ వ్యవహారంతో ముడిపెట్టి అల్లారు. ముస్లిం శరణార్థులతో పాకిస్తాన్ వెళుతున్న రైలును కొందరు హిందువులు, సిక్కులు తగలబెడితే అందులో నుంచి నూరాన్‌ను జుగ్గు రక్షిస్తాడు.

భారత్ నుంచి ముస్లింల శవాలతో, వక్షోజాలు నరికిన మహిళల శరీరాలతో పాకిస్తాన్‌కు రైలు రావడం బప్సి సిద్వా నవల 'ఐస్‌క్యాండీ మ్యాన్'లో మలుపు. గుల్జార్ రాసిన 'రావి నదికి ఆవల' కథ విభజనతో భారత ఉపఖండం ఆత్మను కోల్పోయిన వైనం ఉంది. ఇది కూడా రైలు ప్రయాణం నేపథ్యంగానే సాగుతుంది. ఆయనదే 'భయం' (కావూఫ్) కథలో యాసిన్ అనే ముస్లిం యువకుడు లోకల్ ట్రైన్‌లో పొందిన వింత అనుభవం దిగ్భ్రాంతి కలిగిస్తుంది. ఒక స్టేషన్‌లో మరో యువకుడు ఎక్కాడు. అతడు హిందువులా కనిపించాడు. అతడితో తనకు ప్రాణహాని తప్పదని రైలు భయాందర్ వంతెన మీదకు వచ్చాక గుమ్మం దగ్గర ఆదమరచి ఉన్న ఆగంతకుడిని యాసిన్ బయటకు నెట్టేశాడు. మరుక్షణం ఒక ఆక్రందన 'అల్లా' అంటూ! భీష్మ సహానీ రాసిన 'రైలు అమృత్‌సర్ చేరింది' కథ కూడా పట్టాల మీద నడిచిన అనుభవమే. పాకిస్తాన్ నుంచి భారత్ వస్తున్న ఒక హిందూ శరణార్థిని (బాబు) ముస్లింలు ఏడిపిస్తారు. వాళ్లు మధ్యలో దిగిపోతారు. ఇతడు మాత్రం రైలు భారత్‌లో ప్రవేశించాక అంతదాకా అణచి ఉంచుకున్న కోపాన్ని ఇక్కడ రైలు ఎక్కడానికి ప్రయత్నిస్తున్న ముస్లిం మీద చూపిస్తాడు. అంతకు ముందే దాచి పెట్టిన ఇనప రాడ్‌తో తల బద్దలు కొడతాడు. పెషావర్–బొంబాయి మధ్యలో జరిగిన హిందూ ముస్లిం హింసాకాండ దృశ్యాలను కిషన్ చందర్ తన కథ 'పెషావర్ ఎక్స్‌ప్రెస్' కథలో అక్షరబద్ధం చేశారు. ఆ దారిలో రైలు ఆగిన ప్రతి స్టేషన్ రక్తపాతంతోనే కనిపిస్తుంది. ఒక చోట స్త్రీలను నగ్నంగా ఊరేగించడం కూడా కనిపిస్తుంది. గతంలోని కక్షలను వెలికి తీసి మరీ పరస్పరం దాడులకు దిగారు. పింజర్‌లో పూరోను రషీద్ ఎత్తుకుపోవడానికి కారణం, రెండు మూడు తరాల క్రితం ఆ ముస్లిం కటుంబం నుంచి ఒక మహిళను రుణం గొడవలో పూరో తాతలు ఎవరో అపహరించారు.

ముస్లిం లీగ్ వైఖరి కారణంగానే విభజన జరిగిందన్నది నిజం. కానీ ఆ పరిణామాన్ని జీర్ణించుకోలేకపోయినవారు అన్ని వర్గాలలోను ఉన్నారు. సాదత్ హసన్ మంటో రాసిన 'టోబా టేక్‌సింగ్' కథకు ఇతివృత్తం ఇదే. రెండు మతాల వారిని రెండు దేశాలు పంచుకున్నట్టే మతిస్థిమితం లేనివారిని కూడా పంచుకుంటారు. కానీ లాహోర్ పిచ్చాసుపత్రిలో ఉన్న టోబా టేక్‌సింగ్‌ను భారత్‌కు అప్పగిస్తున్నప్పుడు అతడు వాఘా సరిహద్దులో సగం పాక్ వైపు, సగం భారత్ వైపు తన దేహం ఉండేలా పడి మరణిస్తాడు.

విభజన నిర్ణయం తరువాత సరిహద్దు రేఖ గీయడానికి వచ్చినవాడు సెరిల్ రాడ్‌క్లిఫ్. కేవలం ఐదువారాలలో అతడు ఆ పని ముగించాడు. కానీ రేఖ మీద నెత్తుటి తడి ఏడు దశాబ్దాలైనా ఆరలేదు. ఆ పరిణామం ఎంతటి పాశవికతకు దారి ఇచ్చిందో అమెరికా కవి డబ్ల్యూ హెచ్ ఎడెన్ 'పార్టిషన్' పేరుతో రాసిన తన కవితలో నిక్షిప్తం చేశాడు. 'డ్రాయింగ్ ది లైన్' పేరుతో రాడ్‌క్లిఫ్ చర్యనే నాటకంగా మలిచాడు బ్రిటిష్ రచయిత హోవార్డ్ బెంటన్. దీనిని 2013లోనే ప్రదర్శించారు.

భారత విభజన ప్రపంచ చరిత్రలోనే విషాదకరమైనదిగా చెప్పడం సత్యదూరం కాదు. విభజన మూల్యం 20 లక్షల ప్రాణాలు. కోటీ నలభై లక్షలు లేదా కోటీ ఎనభై లక్షల మంది నిరాశ్రయులయ్యారు. ఇది ఇప్పటికి దొరికిన లెక్క. ఇందులో స్త్రీల దుఃఖం మరీ ఘోరమైనది. ఊర్వశీ బుటాలియా విభజన వేళ స్త్రీ పడిన వేదనను, క్షోభను, గుండె కోతను అన్వేషించారు. చాలాకాలం వరకు 75 వేల మంది మహిళలు విభజనకు బాధితులని అనుకున్నారు. కానీ లక్షమంది స్త్రీలను బలి చేశారని, 'ది అదర్ సైడ్ ఆఫ్ సైలెన్స్' పుస్తకంలో రాశారు. ఇన్ని కోట్ల మంది బాధితులలో ప్రతి ఒక్కరికీ ఒక విషాద గాథ ఉంది. ప్రతి కన్నీటి బొట్టుకు ఒక కథ ఉంది. నెలల తరబడి సాగిన ఈ హత్యాకాండలో చలికీ, వానకీ, ఎండకీ, మతోన్మాదానికీ, ఆకలికీ సరిహద్దుల వెంట రాలిపోయిన ప్రతి ప్రాణం ఒక నవలకు ఇతివృత్తం కాగలిగినదే. ఉన్మాదుల నుంచి రక్షణ కోసం గురుద్వారా వెనుక బావులలో పిల్లలతో సహా దూకేసిన వందలాది మంది మహిళల గుండె ఆక్రోశాన్ని, చావును సమీపంగా చూసిన పసి ఆక్రందనలను ఇప్పుడైనా గమనించాలి. అందుకే ఆ గ్రంథాల వెల్లువ. మానవతను అతి హీనంగా ఛిద్రం చేస్తూ కాలం కల్పించే దుస్సంఘటనల్లో దేశ విభజన కూడా ఒకటి!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

(రేపు దేశ విభజన విషాదాల సంస్మరణ దినం)

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, **తిథి:** శు.నవమి తె.5.51 వరకు (తెల్లవారితే బుధవారం), తదుపరి దశమి, **నక్షత్రం:** విశాఖ ఉ.7.31 వరకు, తదుపరి అనూరాధ, **వర్జ్యం:** ఉ.11.46 నుండి 1.26 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.17 నుండి 9.05 వరకు, తదుపరి రా.10.58 నుండి 11.46 వరకు, **అమృతఘడియలు:** రా.9.54 నుండి 11.56 వరకు ; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 5.45, **సూర్యాస్తమయం:** 6.24.

రాష్ట్రానికి ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకులు

ఓవరాల్‌లో ఆంధ్ర, కేఎల్‌యూ, ఏఎన్‌యూ ఘనత

- ఎస్వీ వర్సిటీ, ఐఐటీ తిరుపతి, ఐఐఎం విశాఖ, ఎన్జీ రంగా అగ్రి వర్సిటీల ఉత్తమ ప్రదర్శన
- కేఎల్, విజ్ఞాన్, క్రియా, గీతం తదితర సంస్థలకూ వివిధ విభాగాల్లో మెరుగుపడ్డ స్కోరు
- ఐదు కేటగిరీల్లో ఏయూకు ర్యాంకులు
- ఓవరాల్‌లో 41వ ర్యాంకుతో పాటు స్టేట్ పబ్లిక్ వర్సిటీల విభాగంలో 7వ స్థానం
- నేషనల్ ఇనిస్టిట్యూషనల్ ర్యాంకులను ప్రకటించిన కేంద్రం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని 31 ఉన్నత విద్యా సంస్థలు జాతీయ స్థాయిలో సత్తా చాటాయి. ఉన్నత సదుపాయాలు, ఇతర వనరులతో అత్యుత్తమ ప్రమాణాలు సాధించే సంస్థలకు కేంద్ర ప్రభుత్వం అందించే నేషనల్ ఇనిస్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్‌ఎఫ్)–2024లో ఉత్తమ ర్యాంకులను సాధించాయి. ఆయా విభాగాల్లో గరిష్ఠంగా 100 సంస్థలకు వాటి ప్రమాణాలు అనుసరించి ర్యాంకులకు ఎంపిక చేసింది. పది అంశాల ప్రాతిపదికగా కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా విద్యా సంస్థలకు ఎన్ఐఆర్‌ఎఫ్ ర్యాంకులిస్తోంది. అలాగే, అన్ని విభాగాల్లో స్వయం సమృద్ధి సాధించిన సంస్థలకు ఓవరాల్ కేటగిరీలో ర్యాంకులు ఇచ్చింది.

గతేడాది కంటే పెరిగిన ర్యాంకులు..

రాష్ట్రంలోని ఉన్నత విద్యా సంస్థలు ఎన్ఐఆర్‌ఎఫ్ ర్యాంకుల్లో గణనీయమైన పురోగతిని సాధించాయి. గతేడాది 25 సంస్థలకు ర్యాంకులు దక్కితే.. ఈ ఏడాది ఆ సంఖ్య 31 సంస్థలకు పెరిగింది. ఓవరాల్ ర్యాంకుల్లో ఈ ఏడాది మూడు సంస్థలు చోటు దక్కించుకున్నాయి.

➤ కేఎల్‌యూ 55.47 స్కోరుతో 40వ ర్యాంకు, ఆంధ్ర వర్సిటీ 54.97 స్కోరుతో 41వ ర్యాంకు, 47.43 స్కోరుతో ఏఎన్‌యూకి 97వ ర్యాంకు వచ్చింది. తిరుపతి ఎస్వీ యూనివర్సిటీకి 87వ ర్యాంకు దక్కింది.

➤ వర్సిటీల విభాగంలో ఐదు సంస్థలు.. కేఎల్‌యూ, ఆంధ్ర వర్సిటీ, ఏఎన్‌యూ, విజ్ఞాన్, శ్రీవెంకటేశ్వర వర్సిటీలు ర్యాంకులు పొందాయి.

➤ ఇంజనీరింగ్ కాలేజీ విభాగంలోనూ కేఎల్‌యూ, ఐఐటీ తిరుపతి, ఏఎన్‌యూ, విజ్ఞాన్ వర్సిటీలకు, మేనేజ్‌మెంట్ విభాగంలో ఐఐఎం–విశాఖపట్నం, కేఎల్‌యూ, క్రియా వర్సిటీ–శ్రీసిటీ సంస్థలు ర్యాంకులను కైవసం చేసుకున్నాయి.

➤ ఫార్మసీ విభాగంలో గతేడాది తొమ్మిది సంస్థలకు ర్యాంకులు వస్తే ఈ ఏడాది ఆరు సంస్థలకు పరిమితమయ్యాయి. ఈ విభాగంలో ఎస్వీ వర్సిటీకి 60వ ర్యాంకు వచ్చింది. ఏయూ 34వ ర్యాంకు సాధించింది.

➤ ఇక ఈ ఏడాది కొత్తగా బీఆర్ అంబేడ్కర్ కాలేజ్ ఆఫ్ లా, గీతం, దామోదర సంజీవయ్య జాతీయ లా వర్సిటీకి జాతీయ ర్యాంకులొచ్చాయి.

➤ ఆర్కిటెక్చర్–ప్లానింగ్ విభాగంలో స్పా విజయవాడ, గీతం సంస్థలకు, అగ్రికల్చర్ విభాగంలో ఎన్జీ రంగా, శ్రీ వేంకటేశ్వర (ఎస్వీ) వెటర్నరీ వర్సిటీలకు ర్యాంకులు పొందాయి. ఎస్వీ వెటర్నరీ వర్సిటీ 33వ ర్యాంకు సాధించింది.

ఏయూకు ఐదు విభాగాల్లో ర్యాంకులు..



- ఎన్ఐఆర్‌ఎఫ్ ర్యాంకుల్లో విశాఖలోని ఆంధ్ర వర్సిటీకి ఐదు విభాగాల్లో ఉత్తమ ర్యాంకులు దక్కాయి.
- ఓవరాల్ విభాగంలో 41వ స్థానంలో నిలిచి మెరుగైన ప్రదర్శన కనబర్చింది.
- దీంతోపాటు కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది కొత్తగా చేర్చిన స్టేట్ పబ్లిక్ వర్సిటీల్లో విభాగంలోనూ జాతీయ స్థాయిలో 65.96 స్కోరుతో 7వ ర్యాంకు పొందింది.
- వర్సిటీ కేటగిరీలో 43వ ర్యాంకు, ఇంజనీరింగ్ కేటగిరీలో 90వ ర్యాంకు, ఫార్మసీ విభాగంలో 34వ ర్యాంకులు వచ్చాయి.
- న్యాయ కళాశాల 16వ ర్యాంకు సొంతం చేసుకుంది.
- ఇక స్టేట్ పబ్లిక్ వర్సిటీ విభాగంలో ఏయూతో పాటు ఏఎన్‌యూకు 20వ ర్యాంకు, శ్రీవెంకటేశ్వర వర్సిటీకి 39వ ర్యాంకు దక్కాయి. 51–100 మధ్య ర్యాంకుల్లో ఆచార్య ఎన్జీరంగా, జేఎన్‌టీయూ–అనంతపురం, శ్రీపద్మావతి వర్సిటీ, యోగి వేమన వర్సిటీలు నిలిచాయి.

ఎన్ఐఆర్‌ఎఫ్‌లో ‘విజ్ఞాన్’కు 72వ ర్యాంకు



చేబ్రోలు: కేంద్ర మానవవనరుల అభివృద్ధిశాఖ సోమవారం విడుదల చేసిన 2024 సంవత్సరం ఉన్నతస్థాయి విద్యాసంస్థల నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్‌ఎఫ్)లో విజ్ఞాన్ యూనివర్సిటీకి జాతీయస్థాయిలో 72వ ర్యాంకు లభించిందని వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ చెప్పారు. అదే విధంగా ఇంజినీరింగ్ విభాగంలో కూడా 91వ ర్యాంకు లభించినట్లు తెలిపారు. విజ్ఞాన్ యూనివర్సిటీకి ఎన్ఐఆర్‌ఎఫ్ ర్యాంకు లభించడం వలన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రైవేట్ ఏజెన్సీల నుంచి గ్రాంట్లు అందుతాయని చెప్పారు. విజ్ఞాన్ యూనివర్సిటీ ఈ ర్యాంకును సాధించడానికి ఫ్యాకల్టీ, రీసెర్చ్ స్కాలర్స్, స్టూడెంట్స్ ముఖ్య కారణమని పేర్కొన్నారు. ఎన్ఐఆర్‌ఎఫ్‌లో ఉత్తమ ర్యాంకు సాధించడానికి కృషిచేసిన ఐక్యూఏసీ టీంను చైర్మన్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవ రాయలు ప్రత్యేకంగా అభినందించారు.

క్లుప్తంగా...

గుండెపోటుతో ఆర్మీ జవాన్ మృతి



భార్య, కుమార్తెతో నవీన్‌కుమార్ (ఫైల్)

బైరెడ్డిపల్లె: చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లె మండలంలోని గొల్లచీమనపల్లెకు చెందిన రాజన్న కుమారుడు కే.నవీన్‌కుమార్ (32) గుండెపోటుతో ఆదివారం మృతి చెందాడు. చౌడేపల్లె మండలం పుదిపట్ల సచివాలయ పరిధిలోని మిట్టూరుకి చెందిన లావణ్యతో నవీన్‌కుమార్‌కు వివాహం జరిగింది. వీరికి రెండేళ్ల కుమార్తె ఉంది. నవీన్‌కుమార్ ఢిల్లీలోని ఆర్మీలో జవాన్‌గా విధులు నిర్వహిస్తూ నెల క్రితం స్వగ్రామానికి సెలవుపై వచ్చి ఈ నెల 10న తిరుగు ప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో బెంగుళూరు నుంచి ఢిల్లీకి రైలులో ప్రయాణిస్తుండగా గుండెపోటు వచ్చింది. దీంతో రైలులో ప్రథమ చికిత్స చేశారు. అనంతరం కొద్దిసేపటికి ఆయన మృతి చెందాడు. మృతదేహం మంగళవారం స్వగ్రామానికి వచ్చే అవకాశం ఉందని కుటుంబసభ్యులు తెలిపారు.

18న తిరుమలలో కల్యాణోత్సవం రద్దు

తిరుమల: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఈ నెల 18వ తేదీన శ్రీవారి కల్యాణోత్సవాన్ని టీటీడీ రద్దు చేసింది. ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు ఆలయంలో పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయంలోని సంపంగి ప్రాకారంలో వైదిక కార్యక్రమాలు 17వ తేదీ రాత్రి వరకు జరగనున్నాయి. ఈ కారణంగా 18వ తేదీ కళ్యాణోత్సవాన్ని టీటీడీ రద్దు చేసింది.

హథీరాంజీ మఠం ఇన్‌చార్జ్ ఏవోగా రామారావు



తిరుపతి కల్చరల్: తిరుపతిలోని హథీరాంజీ మఠం ఇన్‌చార్జ్ ఏవోగా కేఎస్ రామారావు బాధ్యతలు స్వీకరించారు. హథీరాంజీ మఠం ఫిట్ పర్సన్‌గా పనిచేస్తున్న డిప్యూటీ కలెక్టర్ రమేష్ నాయుడు మాతృశాఖకు బదిలీ అయ్యారు. దీంతో ప్రస్తుతం విజయవాడ కనకదుర్గమ్మ ఆలయ ఈవోగా కొనసాగుతున్న రామారావుకు హథీరాంజీ మఠం ఇన్‌చార్జ్ ఏవోగా అదనపు బాధ్యతలను ప్రభుత్వం కేటాయించింది. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ మఠం ఆధ్వర్యంలోని షాపుల అద్దె బకాయిల వసూలుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

రైలు కింద పడి ఎంసీఏ విద్యార్థి ఆత్మహత్య



పవన్ కళ్యాణ్ (ఫైల్)

రాజంపేట: అన్నమయ్య జిల్లా రాజంపేటలోని ఏఐటీఎస్ అనుబంధ సంస్థ అన్నమాచార్య పీజీ కాలేజ్ ఆఫ్ కంప్యూటర్ స్టడీస్‌లో ఎంసీఏ రెండో సంవత్సరం చదువుతోన్న వైఎస్సార్ జిల్లా కలసపాడు మండలం చింతలపల్లెకు చెందిన దాసరి పవన్‌కళ్యాణ్ (22) సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం తెల్లవారుజామున హస్తవరం రైల్వేస్టేషన్ పరిధిలో ఓ రైలు కింద పడి బలవన్మరణం చెందాడు. జీఆర్‌పీ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని రాజంపేట ప్రాంతీయ వైద్యశాలకు పోస్టుమార్టానికి తరలించారు. అనంతరం మృతదేహాన్ని సంబంధీకులకు అప్పగించారు. విద్యార్థి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. విద్యాపరంగా ఎలాంటి రిమార్క్స్ లేవని కళాశాల నిర్వాహకులు చెబుతున్నారు. బెట్టింగ్ వ్యవహారంలో ఏమైనా అంశాలు ప్రభావితం చేశాయా అనే కోణంలో రేణిగుంట జీఆర్‌పీ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, పవన్ కళ్యాణ్ తండ్రి డి.శ్రీనువాసులు గతంలోనే మృతి చెందారు. పవన్‌కు తల్లి డి.రమాదేవి, సోదరుడు ఉన్నారు.



కార్మికుల బతుకు బరువు

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో వందేళ్ల చరిత్ర కలిగిన మైకా గనులు, క్వారీలు ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మూసి వేసింది. సైదాపురం మండలంలో అన్ని అనుమతులు ఉన్న 10 మైకా గనులు, 30 క్వారీలను కూడా ఆపేసింది. ఫలితంగా 61 రోజులుగా ఈ గనులు, క్వారీలపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడిన 30 వేల మందికి పైగా కార్మికులు పనులు లేక పస్తులు ఉండాల్సిన దుస్థితి వచ్చింది. దీంతో ఇన్నాళ్లూ ఎదురు చూసిన కార్మికులు ఆందోళనబాట పట్టారు. సోమవారం సైదాపురం తహసీల్దార్ కార్యాలయం వద్దకు పెద్ద సంఖ్యలో కార్మికులు తరలివచ్చి నిరసన తెలిపారు.

– సైదాపురం (శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా)



పల్లెల్లో ప్రశాంతత కరువు

అధికార కూటమి నేతల అరాచకాలకు అడ్డూ, అదుపు లేకుండాపోయింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన రెండు నెలల్లోనే ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు.. అంగన్‌వాడీ వర్కర్లు.. వెలుగు సిబ్బందిని మార్చేస్తున్నారు. ఏళ్ల తరబడి పని చేస్తున్నవారి పొట్ట కొడుతున్నారు. ప్రశాంతంగా ఉండే పల్లెల్లో 24 గంటలు మద్యం తాగి దౌర్జన్యాలు, దాడులకు పాల్పడుతున్నారు. ప్రశ్నించినవారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారు... అంటూ తిరుపతి జిల్లా వాకాడు మండల వైఎస్సార్‌సీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార కూటమి నేతల అరాచకాలపై సోమవారం వాకాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ నేతలు నిరసన తెలిపారు. – వాకాడు (తిరుపతి జిల్లా)



పాడి రైతు గుండె చెరువు

ప్రైవేట్ డెయిరీలకు పాలు పోస్తే లీటరుకు రూ.20 నుంచి రూ.25 వరకు మాత్రమే ఇస్తున్నారు. అమూల్ అయితే రూ.30 నుంచి రూ.32 వరకు ఇస్తుంది. లాభసాటిగా ఉన్న అమూల్ డెయిరీ ఈ నెల 21 నుంచి పాల సేకరణను నిలిపివేస్తామని ప్రకటించింది. దీంతో మాకు తీవ్ర నష్టం కలుగుతుంది. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని మాకు న్యాయం చేయాలి... అని కోరుతూ పాడి రైతులు సోమవారం తిరుపతి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు.

– తిరుపతి అర్బన్

21మంది హాస్టల్ విద్యార్థులకు అస్వస్థత

- ఓ ఫంక్షన్‌లో మిగిలిన అన్నం ఆదివారం రాత్రి వడ్డింపు
- ఉదయానికల్లా విద్యార్థులకు వాంతులు, విరేచనాలు
- తిరుపతి రుయాలో చికిత్స



రేణిగుంట పీహెచ్‌సీలో అస్వస్థతకు గురైన హాస్టల్ విద్యార్థులు

రేణిగుంట (తిరుపతి జిల్లా): రేణిగుంట బీసీ బాలుర వసతి గృహంలో పాచిపోయిన ఆహారం తిని 21మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వసతి గృహం సమీపంలో ఆదివారం ఓ ఇంటి గృహప్రవేశం జరిగింది. అక్కడ మిగిలిన ఆహారం సాయంత్రం హాస్టల్‌కు అందజేశారు. రాత్రి హాస్టల్‌లో ఉన్న 47 మంది విద్యార్థులకు ఆ ఆహారం వడ్డించారు. సోమవారం ఉదయానికి 14 మంది విద్యార్థులకు వాంతులు, విరేచనాలు అయ్యాయి. వెంటనే రేణిగుంటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు. విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఘటనపై సీరియస్ అయ్యారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ శ్రీహరి, డీపీవో సుశీలాదేవి, జెడ్పీ డిప్యూటీ సీఈవో ఆదిశేషారెడ్డి, జిల్లా బీసీ సంక్షేమాధికారి ఎస్.చంద్రశేఖర్ రేణిగుంటకు చేరుకుని విద్యార్థులను పరామర్శించారు. డీఎంహెచ్‌వో రేణిగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేరుకుని చికిత్స పొందుతున్న విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని మండల వైద్యాధికారి డాక్టర్ ఛత్రప్రకాష్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న 14మంది విద్యార్థులను మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. అనంతరం బీసీ హాస్టల్‌కు చేరుకుని ఘటనపై విద్యార్థులను ఆరా తీశారు. హాస్టల్ ప్రాంగణంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి వాంతులు, విరేచనాలు అవుతున్న మరో ఏడుగురు విద్యార్థులను గుర్తించి వారికి ప్రథమ చికిత్స అందించి 108 వాహనంలో తిరుపతి రుయాకు తరలించారు. కాగా అధికారుల విచారణలో ఆదివారం వార్డెన్ చైతన్య హాస్టల్‌కు రాలేదని తేలింది.

రేషన్ ఇస్తుండగా టీడీపీ నేత దాడి

- తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లిన వైనం
- బాధితుడు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నరేష్‌యాదవ్

పాకాల (తిరుపతి జిల్లా): పాకాల మండలంలోని పదిపుట్లబైలు పంచాయతీ పెరుమాళ్లగుడిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు నరేష్‌యాదవ్‌పై టీడీపీ నేత సుబ్రమణ్యం చేసిన దాడి తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. నరేష్‌యాదవ్ సోమవారం ఇంటి వద్దకే రేషన్ వాహనాన్ని నడుపుతూ రేషన్ బియ్యాన్ని సరఫరా చేస్తున్నాడు. గుండ్లగుట్టపల్లి గ్రామంలో రేషన్ బియ్యం పంపిణీ చేస్తుండగా అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు సుబ్రమణ్యం తన రేషన్ బియ్యాన్ని తన ఇంటి వద్ద ఇచ్చి వెళ్లాలని సెల్‌ఫోన్‌లో హుకుం జారీ చేశాడు. అలా ఇవ్వడం కుదరదని, మీరు వేలిముద్రలు వేస్తేనే రేషన్ ఇవ్వడం కుదురుతుందని నరేష్‌యాదవ్ సమాధానం ఇచ్చాడు. ఆగ్రహించిన సుబ్రమణ్యం నరేష్ యాదవ్‌పై పెద్ద కర్రతో దాడికి దిగాడు. ఈ దాడిలో నరేష్‌యాదవ్ తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. దీంతోదాడిలో ఉపయోగించిన కర్రను అక్కడే వదలి టీడీపీ నేత పరారయ్యాడు. అనంతరం స్థానికులు గాయపడిన బాధితుడిని పి.కొత్తకోట సీహెచ్‌సీకి తరలించి వైద్య సేవలు అందించారు. స్పృహలోకి వచ్చిన బాధితుడు స్థానిక పోలీసులకు ఫోన్ ద్వారా సమాచారం అందజేశారు.

శ్రీకాళహస్తిలో ‘పచ్చ’ముఠా అరాచకాలు

వైఎస్సార్‌సీపీ నేతపై కత్తితో దాడి, పరిస్థితి విషమం



గాయపడిన నాగేంద్ర

శ్రీకాళహస్తి (తిరుపతి జిల్లా): గంగజాతర సందర్భంగా పట్టణంలోని టీడీపీకి చెందిన శివారెడ్డి అనే కార్యకర్త, మరికొందరు ఆదివారం రాత్రి వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగేంద్రపై కత్తితో దాడిచేశారు. మాతమ్మ కొలుపు సందర్భంగా టీడీపీ కార్యకర్తలు కొందరు మద్యం సేవించి శివారెడ్డితో కలిసి తెట్టు ప్రాంతంలో నానా రభస చేస్తుండడంతో స్థానికులు అడ్డుకున్నారు. దీంతో వారు ‘మా ఇష్టం మేమేమైనా చేస్తాం’.. అంటూ వాగ్వాదానికి దిగి ఒకరినొకరు తోసుకున్నారు. దీంతో.. శివారెడ్డి, మరికొందరు కలిసి వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగేంద్ర భుజంపై కత్తితో పొడిచాడు. అడ్డుపడిన సాయికృష్ణ అనే వ్యక్తి తలపైనా పొడిచారు. నాగేంద్ర భుజంపై కత్తి నాలుగు అంగుళాలు దిగి శరీరంలో ఇరుక్కుపోయింది. ఈ దాడితో అక్కడ ఉద్రిక్తత ఏర్పడింది. పోలీసులు వచ్చేసరికి శివారెడ్డి అతని అనుచరులు పారిపోయారు. నిజానికి.. శివారెడ్డి నెలక్రితం ఓ స్క్రాప్ షాపు యజమానిని రూ.లక్ష ఇవ్వాలని బెదిరించి గొడవ చేశాడు. అ సమయంలో డీఎస్పీ డ్రైవర్‌పై దాడిచేసిన ఘటనలో శివారెడ్డిపై కేసు నమోదైంది. అయినా టీడీపీ నేతలు అతనికి మద్దతుగా నిలుస్తుండడంతో విమర్శలు వస్తున్నాయి. దీనిపై రెండో పట్టణ సీఐ రారాజును వివరణ కోరగా.. శివారెడ్డిపై కేసు నమోదు చేశామని.. అతనిపై గతంలో ఓ కేసు కూడా ఉందని తెలిపారు.

స్వస్థలాలకు విద్యార్థుల మృతదేహాలు

తిరువళ్లూరులో పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగింత



ఆలయంలో చివరగా తీసుకున్న సెల్ఫీ

పళ్లిపట్టు (తమిళనాడు): తమిళనాడు రాష్ట్రం తిరుత్తణి సమీపంలో జరిగిన ప్రమాదంలో మరణించిన తెలుగు విద్యార్థుల మృతదేహాలను పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు ఆస్పత్రి అధికారులు అప్పగించారు. అనంతరం స్వస్థలాలకు తరలించారు. ఆదివారం రాత్రి తమిళనాడులోని తిరుత్తణి సమీపంలో కారు, లారీ ఢీకొన్న ప్రమాదంలో తిరుపతి జిల్లాకు చెందిన యుకేష్ (21), చేతన్ (24), కర్నూలు జిల్లాకు చెందిన రామ్‌మోహన్‌రెడ్డి (21), వైఎస్సార్ జిల్లాకు చెందిన నితీష్(21), పశ్చిమ గోదావరికు చెందిన నితీష్‌వర్మ (21) మృతి చెందారు. నెల్లూరు జిల్లాకు చెందిన విష్ణువర్ధన్ (21), ప్రకాశం జిల్లాకు చెందిన చైతన్యకుమార్ గాయపడ్డారు. వీరిద్దరూ చెన్నైలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

తమ బిడ్డల మరణ సమాచారంతో ఆదివారం ఉదయాన్నే తల్లిదండ్రులు, బంధువులు తిరువళ్లూరు ఆస్పత్రికి చేరుకున్నారు. బిడ్డల మృతదేహాలను చూస్తామని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు వేడుకొన్నా ఆస్పత్రి సిబ్బంది అనుమతించ లేదు. చివరకు ఈ ప్రమాదంపై కనకమ్మసత్రం సీఐ రాజ్‌గోపాల్‌కు గాయపడ్డ చైతన్య కుమార్ తరపున ఫిర్యాదు లేఖ అందజేశారు. ఆ తర్వాతే కేసు నమోదు చేసిన పోలీసులు ఐదుగురి మృతదేహాలకు పోస్టుమార్టానికి అనుమతించారు. మధ్యాహ్నం 12 గంటల తర్వాత పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాలను సాయంత్రం 5 గంటలకు కుటుంబ సభ్యులకు అప్పగించారు. కొందరి ముఖాలు ఛిద్రమై ఉండటం, మరికొందరి అవయవాలు వేరు కావడంతో వారి పుట్టు మచ్చలు, ఇతర చిహ్నాల ఆధారంగా గుర్తించారు. మృతదేహాలను తరలించేందుకు తిరువళ్లూరు ఆస్పత్రి సిబ్బంది రుసుము తీసుకొని ఒక వాహనాన్ని మాత్రం కేటాయించారు. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ అధికారులెవ్వరూ స్పందించకపోవడంతో మృత దేహాల తరలింపునకు తల్లిదండ్రులు తీవ్ర అవస్థలు పడాల్సి వచ్చింది. చివరకు సొంత ఖర్చులతో ప్రైవేటు అద్దె వాహనాలలో మృతదేహాలను స్వస్థలాలకు తరలించారు.

కూలిన పాఠశాల పైకప్పు సీలింగ్

- 9 మంది విద్యార్థినులకు గాయాలు
- నంద్యాల పట్టణంలో ఘటన



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

నంద్యాల (న్యూటౌన్): నంద్యాల పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలోని పైకప్పునకు పీఓపీ (ప్లాస్టర్ ఆఫ్ పారీస్)తో వేసిన సీలింగ్ కూలి విద్యార్థులకు గాయాలైన ఘటన సోమవారం చోటు చేసుకుంది. పాఠశాల తరగతి గదుల పైకప్పు రేకులతో వేసి గోడ అంచు వెంట ఇటుకలతో సీలింగ్ నిర్మించారు. అయితే మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో రేకులపై నిర్మించిన ఇటుకల గోడలు పెచ్చులూడి సీలింగ్ కూలిపోవడంతో ప్రమాదం సంభవించింది. 7వ తరగతి గదిలో ఘటన జరగడంతో విద్యార్థులు భయాందోళనతో పరుగులు తీశారు. ఘటనలో 9మంది విద్యార్థినులు గాయపడ్డారు. విషయం తెలుసుకున్న యాజమాన్యం హుటాహుటిన మూడో అంతస్తుకు చేరుకుని గాయపడిన విద్యార్థినులను చికిత్స నిమిత్తం సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకుని కన్నీటి పర్యంతమయ్యారు. డీఈఓ సుధాకర్‌రెడ్డి పాఠశాలకు చేరుకున్నారు. డీఈఓ మాట్లాడుతూ పాఠశాల యాజమాన్యం కనీస రక్షణ చర్యలు తీసుకోలేదని, అందువల్ల గుర్తింపును రద్దు చేస్తామన్నారు. తహసీల్దార్ ప్రియదర్శిని పాఠశాలను సందర్శించారు. కలెక్టర్‌కు నివేదిక పంపుతామని ఆమె చెప్పారు.

నేడు పీఎం గతిశక్తిపై తిరువనంతపురంలో సౌత్‌జోన్ వర్క్‌షాప్

- హాజరుకానున్న ఐదు రాష్ట్రాల కలెక్టర్లు
- ఏరియా డెవలప్‌మెంట్ ప్లాన్ రూపకల్పన

కడప సెవెన్‌రోడ్స్: ప్రధాన మంత్రి గతిశక్తి పథకంపై మంగళవారం కేరళ రాజధాని తిరువనంతపురంలో జోనల్ సౌత్ జోన్ వర్క్‌షాప్ జరగనుంది. ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాలకు చెందిన 14 జిల్లాల కలెక్టర్లు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొంటున్నారు. డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీస్ అండ్ ఇంటర్నల్ ట్రేడ్(డీపీఐఐటీ), కేంద్ర వాణిజ్య పరిశ్రమల మంత్రిత్వ శాఖ సంయుక్తంగా వర్క్‌షాప్ నిర్వహిస్తోంది. కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి పి.రాజీవ్‌తో పాటు వివిధ శాఖలకు చెందిన కేంద్ర, రాష్ట్ర ఉన్నతాధికారులు వర్క్‌షాప్‌లో పాల్గొంటున్నారు. ఈ సమావేశంలో ఏరియా డెవలప్‌మెంట్ ప్లాన్ రూపొందించనున్నారు. పరిశ్రమలు, నేషనల్ హైవేలు, రైల్వే, వాటర్ వేస్, టెలికాం, పాఠశాల విద్య, గిరిజన సంక్షేమం తదితర అంశాలపై ప్రణాళికలు రూపొందించనున్నారు. ఆకాంక్షిత జిల్లాలలో వైఎస్సార్ జిల్లా కూడా ఉన్నందున కలెక్టర్ శివశంకర్ సోమవారం బయలుదేరి వెళ్లారు. ఆయన తిరిగి వచ్చాక జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో సమావేశమై వర్క్‌షాప్‌లో రూపొందించిన ప్లాన్‌పై చర్చించనున్నట్లు తెలుస్తోంది.

ప్రైవేట్ స్కూల్ బస్ బోల్తా పడి విద్యార్థిని మృతి

మరో ఇద్దరు విద్యార్థులకు స్వల్పగాయాలు



అదుపు తప్పి బోల్తా పడ్డ స్కూల్ బస్సు



భవిష్య (ఫైల్)

సాక్షి, అమరావతి/ఓబులవారిపల్లె: అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె మండలం చిన్న ఓరంపాడు అయ్యలరాజుపల్లెలోని ఓ ప్రైవేట్ స్కూల్ బస్ అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న డివైడర్‌లను ఢీ కొని వంకలోకి బోల్తా పడింది. సోమవారం ఉదయం జరిగిన ఈ ప్రమాదంలో మండల కేంద్రానికి చెందిన వీరంరెడ్డి మధుసూధన్ రెడ్డి, అరుణ దంపతుల కుమార్తె రెండో తరగతి చదువుతున్న భవిష్య (7) మృతి చెందింది. మరో ఇద్దరు విద్యార్థులకు స్వల్పగాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు..శ్రీవాణి హైస్కూల్ పాఠశాల బస్సు ప్రతి రోజు రెండు, మూడు ట్రిప్పులు మండలంలోని గ్రామీణ ప్రాంతాల నుంచి పాఠశాలకు విద్యార్థులను తరలిస్తుంది. ప్రతి రోజుమాదిరిగానే మండల కేంద్రం నుంచి రెండో ట్రిప్పులో 15 మంది విద్యార్థులను తీసుకొని డ్రైవర్ ఈశ్వరయ్య బయలుదేరాడు. బస్సు వేగంగా వెళుతుండగా పాములేరు వంక దాటగానే స్టీరింగ్ పనిచేయకపోవడంతో అదుపు తప్పింది. పక్కనే ఉన్న 3 డివైడర్ సిమెంట్ దిమ్మెలను ఢీకొని వంకలోకి పడి బోల్తా కొట్టింది. పక్కనే ఉన్న దళితవాడకు చెందిన యువకులు ప్రమాదస్థలికి చేరుకొని విద్యార్థులను బయటికి తీశారు. డ్రైవర్ ఈశ్వరయ్య స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, చుట్టుపక్కల గ్రామస్తులు అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. జేసీబీ సహాయంతో వ్యాన్‌ను తొలగించి మృతదేహన్ని వెలికితీశారు. కాగా, 2 రోజుల క్రితం ఇదే బస్సు జీవీపురం గ్రామంలో బ్రేకులు ఫెయిల్ అవడంతో స్కూటరిస్టులను ఢీకొంది. డ్రైవర్‌ను మందలించి బస్సును మరమ్మతు చేసుకోమని చెప్పి స్కూటరిస్టులు వదిలేశారు. అన్నమయ్య జిల్లా విద్యాధికారి శివప్రకాష్‌రెడ్డి, రాజంపేట డీఎస్పీ రామచంద్రగౌడ్, తహశీల్దార్ పీర్‌మున్ని, ఎంవీఐ వినోద్ సిబ్బంది ఘటనాస్థలిని పరిశీలించారు. శివప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ ఘటనపై విచారించి స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

స్కూల్ బస్ బోల్తాపడిన ఘటనలో భవిష్య అనే చిన్నారి మృతి చెందడంపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌పై రవాణాశాఖ అధికారులు డ్రైవ్ నిర్వహించాలని, సామర్థ్యం లేని స్కూల్ బస్సులు నడుపుతున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు.

జలశక్తి అభియాన్, జలజీవన్‌మిషన్ పనులు భేష్

కేంద్రం ఆర్థిక మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి సాల్మన్ ఆరోక్యరాజ్ బృందం



చిరుమామిళ్లలో సమ్మర్ స్టోరేజ్ వాటర్ గురించి కేంద్ర బృందానికి వివరిస్తున్న అధికారులు

యడ్లపాడు/నాదెండ్ల: జలశక్తి అభియాన్..జలజీవన్ మిషన్ పథకాల ద్వారా రాష్ట్రంలో నిర్వహించిన పనుల్ని పరిశీలించేందుకు వచ్చిన కేంద్ర అధికారుల బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. సోమవారం పల్నాడు జిల్లా చిలకలూరిపేట నియోజకవర్గంలోని రెండు మండలాల్లో పర్యటించింది. కేంద్రం ఆర్థిక మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి సాల్మన్ ఆరోక్యరాజ్, కేంద్ర భూగర్భ జలవనరుల శాఖ ఉన్నతాధికారి మాధవ్ జిల్లాస్థాయి అధికారులతో కలిసి యడ్లపాడు మండల చెంఘీజ్‌ఖాన్‌పేట, కొండవీడు, కొత్తపాలెం, నాదెండ్ల మండలంలోని ఆదర్శ గ్రామం చిరుమామిళ్ల గ్రామాల్ని సందర్శించారు. ముందుగా చెంఘీజ్‌ఖాన్‌పేట గ్రామ సచివాలయానికి చేరుకుని రూఫ్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్, ఓవర్‌హెడ్ ట్యాంక్ వద్ద ఏర్పాటు చేసిన ఇంకుడుగుంతను పరిశీలించారు. సచివాలయం ప్రాంగణంలో మొక్కలు నాటారు. కొండవీడు, కొత్తపాలెం గ్రామాల్లో 100శాతం సబ్సిడీ నిధులతో చేస్తున్న ఉద్యాన పంటల్ని పరిశీలించారు. పలు అంశాలపై స్థానిక రైతులతో ముచ్చటించారు. అనంతరం లింగారావుపాలెం–చిరుమామిళ్ల గ్రామాల మధ్య ఉన్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు (మంచి నీటి చెరువు) వద్దకు చేరుకున్నారు. జలజీవన్ మిషన్ ద్వారా చేపట్టిన పనులపై ఆరా తీశారు. ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల వద్ద మొక్కలు నాటారు. అనంతరం చిరుమామిళ్ల గ్రామ సచివాలయంలో గ్రామస్తులు, నీటి, పారిశుధ్య కమిటీలతో సమావేశం ఏర్పాటు చేశారు. డ్వామా పీడీ జి.జోసఫ్, జలజీవన్ మిషన్ జిల్లా అధికారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్, భూగర్భజల వనరుల శాఖ డీడీ శర్మ, జిల్లా వ్యవసాయ అధికారి ఐ మురళీ, ఉద్యానశాఖ డీడీ వి రమణారెడ్డి, మైక్రో ఇరిగేషన్ ఆంజనేయులు, సర్పంచ్ సింగారెడ్డి లక్ష్మి, తదితరులు ఉన్నారు.

మధ్యప్రాచ్యంలో అలజడి...

రంగంలోకి యూఎస్ జలాంతర్గామి యుద్ధనౌక తరలింపు వేగవంతం

వాషింగ్టన్: మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు నానాటికీ పెరుగుతున్న నేపథ్యంలో అక్కడ బలగాల మోహరింపును అమెరికా మరింతగా పెంచుతోంది. యూఎస్ఎస్ అబ్రహం లింకన్ యుద్ధ నౌక తాజాగా మధ్యధరా సముద్ర జలాల్లోకి ప్రవేశించింది. దాంతోపాటు ఓ గైడెడ్ మిసైల్ సామర్థ్యంతో కూడిన జలాంతర్గామి యూఎస్ఎస్ జార్జియాను కూడా అగ్రరాజ్యం హుటాహుటిన మధ్యప్రాచ్యానికి పంపిస్తోంది. హమాస్, హెజ్బొల్లా అగ్ర నేతలను ఇజ్రాయెల్ ఇటీవల వరసబెట్టి మట్టుపెట్టడంతో ఇరాన్‌తో ఉద్రిక్తతలు తారస్థాయికి చేరడం తెలిసిందే. ఇజ్రాయెల్‌పై పూర్తిస్థాయి యుద్ధానికి ఇరాన్ సుప్రీం నేత అయతొల్లా అలీ ఖమేనీ ఆదేశాలు కూడా జారీ చేశారు. దాంతో ఇజ్రాయెల్‌ను రక్షించేందుకు మిత్రదేశమైన అమెరికా అన్ని చర్యలూ తీసుకుంటోంది. ఇరు దేశాలూ ఇరాన్ ప్రతి చర్య మీదా నిశితంగా కన్నేసి ఉంచాయి. ఉద్రిక్తతల నేపథ్యంలో పలు దేశాలు ఇరాన్, ఇజ్రాయెల్‌కు విమాన సేవలను తాత్కాలికంగా నిలిపేస్తున్నాయి. ఇజ్రాయెల్‌తో శాంతి చర్చలకు సిద్ధమేనంటూ హమాస్ ఆదివారం మరోసారి సంకేతాలిచ్చింది. ముందుగా పూర్తి యుద్ధ విరామానికి ఇజ్రాయెల్ ఒప్పుకోవాలంటూ షరతు విధించింది.

ఆలయం వద్ద తొక్కిసలాట

ఆరుగురు మహిళలు సహా ఏడుగురు మృతి

జెహనాబాద్: బిహార్ రాష్ట్రం జెహనాబాద్ జిల్లాలో ఘోర విషాదం జరిగింది. బరాబర్ పహాడీ ప్రాంతంలో ఉన్న బాబా సిద్ధేశ్వర్ నాథ్ ఆలయం వద్ద చోటుచేసుకున్న తొక్కిసలాటలో ఆరుగురు మహిళలు సహా ఏడుగురు మృతి చెందారు. మరో 16 మందికి గాయాలయ్యాయి. భక్తుల రద్దీ తీవ్రంగా ఉండటంతో ఆదివారం రాత్రి 11.30 గంటల సమయంలో ఘటన చోటుచేసుకున్నట్లు అధికారులు తెలిపారు. భక్తుల మధ్య తలెత్తిన వాగ్వాదం తొక్కిసలాటకు దారితీసిందని భావిస్తున్నామన్నారు. అక్కడే ఉన్న పోలీసులు పరిస్థితిని వెంటనే అదుపు చేశారన్నారు. పూల వ్యాపారులు, భక్తుల మధ్య వివాదమే ఘటనకు కారణమని స్థానికులు అంటున్నారు. క్షతగాత్రుల్లో 10 మంది ప్రథమ చికిత్స అనంతరం డిశ్చార్జి కాగా, మరో ఆరుగురు ఆస్పత్రుల్లోనే చికిత్స పొందుతున్నారని అధికారులు తెలిపారు. మృతుల కుటుంబాలకు తక్షణమే రూ.20 వేలు, పరిహారంగా మరో రూ.4 లక్షలు, క్షతగాత్రులకు రూ50 వేలు చొప్పున అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించింది.



ప్రారంభ వేడుకల సందర్భంగా వర్షం...
తర్వాత వారంపాటు దంచి కొట్టిన ఎండలు...
వారం పాటేమో ఆహ్లాదకర వాతావరణం...
ముగింపు రోజు మరోసారి ఠారెత్తించిన ఎండలు...

భావి ఒలింపిక్స్‌కు వడదెబ్బ!

ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఎండలు

2050 నాటికి చాలా నగరాలకు ఒలింపిక్స్ నిర్వహణ కలే!

ఇదీ పారిస్ ఒలింపిక్స్‌తో వాతావరణం ఆటాడుకున్న తీరు. నాలుగేళ్లకోసారి జరిగే ఒలింపిక్ క్రీడా వేడుకల నిర్వహణను దేశాలన్నీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తాయి. కానీ 2050 నాటికి చాలా దేశాలకు ఒలింపిక్స్ నిర్వహణ కలగానే మిగలనుంది. ఆయా దేశాల్లో ఎండలు ఇప్పటికే ఠారెత్తిస్తుండటం, 2050కల్లా ప్రమాదకర స్థాయిని దాటేలా ఉండటమే ఇందుకు కారణం. ఒలింపిక్స్ జరిగేదే ప్రధానంగా వేసవిలోనే. కనుక ఉష్ణోగ్రతలు 27.8 డిగ్రీల సెల్సియస్ దాటితే వాటి నిర్వహణను రద్దు చేయాలన్నది అంతర్జాతీయ క్రీడా నిపుణుల సిఫార్సు. ఆ లెక్కన గతంలో ఒలింపిక్ వేడుకలను విజయవంతంగా నిర్వహించిన అట్లాంటా (అమెరికా), బీజింగ్ (చైనా), ఏథెన్స్ (గ్రీస్), టోక్యో (జపాన్) వంటి పలు నగరాలకు ఇంకెప్పటికీ ఆ అవకాశం దక్కబోదు. ఆ నగరాల్లో వేసవిలో ఎండలు మండిపోవడం పరిపాటిగా మారింది. అంతేకాదు, వచ్చే (2028) ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వబోయే అమెరికాలోని లాస్ ఏంజెలెస్ ఎండలపరంగా చూసుకుంటే ఏ మేరకు సురక్షితమన్న ఆందోళన ఇప్పట్నుంచే మొదలైంది. ఆదివారం అక్కడ ఉష్ణోగ్రతలు ఏకంగా 34 డిగ్రీలు దాటేయడమే ఇందుకు కారణం! పారిస్‌లో ఒలింపిక్స్ ముగింపు వేడుకల సందర్భంగా ఆదివారం ఏకంగా 35 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి! వాతావరణ మార్పులు ప్రపంచాన్ని ఎంతగా అతలాకుతలం చేస్తున్నాయో, రోజురోజుకూ ప్రమాదం అంచులకు నెడుతున్నాయో చెప్పేందుకు ఈ పరిణామం మరో తార్కాణమని పర్యావరణ నిపుణులు అంటున్నారు. ప్రపంచంలోని ప్రధాన నగరాల్లో చాలావరకు 2050 నాటికి ఒలింపిక్స్ నిర్వహించేందుకు అనువైన పరిస్థితులు ఉండబోవని ప్రఖ్యాత క్లైమేట్ సైన్స్, అనలిటిక్స్ స్వచ్ఛంద సంస్థ 'కార్బన్‌ప్లాన్' హెచ్చరించింది. వాటిలో ఉష్ణోగ్రతలు భరించలేనంతగా పెరిగిపోతాయని పేర్కొంది. వాతావరణ మార్పుల ధోరణి ఆధారంగా రూపొందించిన గణాంకాలతో విడుదల చేసిన తాజా నివేదికలో సంస్థ ఈ మేరకు పేర్కొంది.

ఇలా కొలుస్తారు...

సమస్యలకు దారితీసే స్థాయి ఎండ వేడిమిని వెట్ బల్బ్ గ్లోబ్ టెంపరేచర్‌గా పిలుస్తారు. వేడి, తేమ, గాలి వేగం, సూర్యుని కోణం, మేఘావరణం వంటి పలు అంశాల ప్రాతిపదికన దీన్ని నిర్ణయిస్తారు. ఆ లెక్కన ఒలింపిక్స్ నిర్వహణకు సురక్షితమైన ఉష్ణోగ్రత పరిధి 27.8 డిగ్రీ సెల్సియస్‌గా నిర్ణయించారు. ఎండలు అంతకు మించితే పోటీల వాయిదా, అవసరమైతే రద్దు తప్పనిసరని అంతర్జాతీయ క్రీడా నిపుణులు చెబుతారు.

వచ్చే ఒలింపిక్స్ సంగతి ఏమిటీ?

2028 ఒలింపిక్స్‌కు వేదిక అమెరికాలోని లాస్ ఏంజెలెస్. అక్కడ పసిఫిక్ గాలుల కారణంగా వాతావరణం సాధారణంగా ఆహ్లాదకరంగా ఉంటుంది. కనుక పెద్దగా సమస్య ఉండదని భావించారు. కానీ ఒక ట్రెండేళ్లుగా లాస్ ఏంజెలెస్‌లో ఎండలు గట్టిగానే ప్రతాపం చూపుతున్నాయి. తాజాగా ఆదివారం 34 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఈ స్థాయి ఉష్ణోగ్రతలు అక్కడ క్రమంగా పరిపాటిగా మారుతుండటం ఒలింపిక్ కమిటీని ఇప్పటినుంచే ఆందోళనపరుస్తోంది. 2032 ఒలింపిక్స్‌కు ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్ వేదిక కానుంది. వేసవిలో అక్కడ కూడా ఎండలు ఠారెత్తిస్తాయి. కానీ ఒలింపిక్స్ నిర్వహించే జూలై చివరి నాటికి శీతాకాలమే ఉంటుంది. కనుక పెద్దగా సమస్య ఉండబోదని భావిస్తున్నారు.

మనకు కష్టమే!

2036 ఒలింపిక్స్ వేదిక ఎంపిక మాత్రం నిర్వాహకులకు పెద్ద పరీక్షగానే మారనుంది. అందుకు బిడ్స్ వేసిన ఆరు దేశాల్లో భారత్ కూడా ఉండటం విశేషం. అహ్మదాబాద్‌లో ఈ విశ్వ క్రీడా సంరంభాన్ని నిర్వహించాలని కేంద్రం పట్టుదలగా ఉంది. ఇండొనేసియా నూతనంగా నిర్మిస్తున్న ప్రతిష్ఠాత్మక రాజధాని నుసంతర, దోహా (ఖతర్), ఇస్తాంబుల్ (తుర్కియే), వార్సా (పోలండ్), శాంటియాగో (చిలీ) కూడా బరిలో ఉన్నాయి. కానీ ఉష్ణోగ్రతల కోణంలో చూస్తే అహ్మదాబాద్, నుసంతర, దోహాల్లో ఒలింపిక్స్ నిర్వహణ అస్సలు సాధ్యపడకపోవచ్చు. ఇది అంతిమంగా వార్సా, శాంటియాగోలకు అడ్వాంటేజ్‌గా మారొచ్చు. వాటి తర్వాత ఇస్తాంబుల్ కూడా ఉష్ణోగ్రత పరంగా కాస్త అనువుగానే ఉండనుంది. నవంబర్, డిసెంబర్ మాసాల్లో అనుమతించే పక్షంలో అహ్మదాబాద్‌కు చాన్సుంటుంది.


ఎన్నో సమస్యలు...

ఎండలు సురక్షితమైన ఉష్ణోగ్రత పరిధిని దాటితే ఒలింపిక్స్ నిర్వహణకు ఎదురయ్యే సమస్యలు అన్నీ ఇన్నీ కావు...

- ప్రఖ్యాత అథ్లెట్లు చాలా మంది ప్రధానంగా చలి దేశాల నుంచే వస్తారు. ఈ స్థాయి ఎండలను వాళ్లు అస్సలు తట్టుకోలేరు
- దాంతో క్రీడాకారులు ఎండకు సొమ్మసిల్లిపోవడం, వడదెబ్బ బారిన పడటం వంటి సమస్యలు పొంచి ఉంటాయి
- ఇవి వారిలో తీవ్ర అనారోగ్యానికి, కొన్ని సందర్భాల్లో మరణానికి కూడా దారితీసే ప్రమాదం ఉంటుంది.
- 2020 టోక్యో ఒలింపిక్స్‌లో ప్రతి 100 మంది అథ్లెట్లలో ఒకరు ఎండలకు తాళలేక కళ్లు తేలేశారు!
- దాంతో మారథాన్, వాకింగ్ వంటి ఈవెంట్లను పర్వతప్రాంత నగరమైన సపోరోకు మార్చినా లాభం లేకపోయింది. ఆరుగురు వాకర్లు, రన్నర్లు వడదెబ్బ బారిన పడ్డారు.

గతంలో ఒలింపిక్స్ వేదికలుగా నిలిచి, భారీ ఉష్ణోగ్రతల కారణంగా మరెప్పుడూ అవకాశం దక్కబోదని భావిస్తున్న నగరాలు

సెయింట్ లూయిస్	టోక్యో
బీజింగ్	అట్లాంటా
రియో డిజనిరో	సియోల్
ఏథెన్స్	బార్సెలోనా
రోమ్	సిడ్నీ



ముద్దొచ్చే మర చేప

ఇదేమిటో తెలుసా? రోబోచేప. పేరు ఈవ్. సిలికాన్ తోకను విలాసంగా ఊపుకుంటూ స్విట్జర్లాండ్‌లో జ్యూరిచ్ సరస్సులోని అతి శీతల జలాల్లో ఇలా విలాసంగా విహరిస్తోంది. దీన్ని రూపొందించేందుకు జ్యూరిచ్ ఈటీహెచ్ ఇంజనీరింగ్ విద్యార్థులకు ఏకంగా రెండేళ్లు పట్టిందట! ఇతర చేపలు, సముద్ర జీవాలు బెదిరిపోకుండా ఉండాలని దీన్ని అచ్చం చేపలా కన్పించేలా డిజైన్ చేశారు. సోనార్ టెక్నాలజీ సాయంతో అడ్డొచ్చే వాటన్నింటినీ సునాయాసంగా తప్పించుకుంటూ సాగిపోగలదీ మర చేప. ఇంతకూ దీని పనేమిటంటారా? నీటి లోపలి పరిస్థితులను కెమెరా కంటితో ఒడిసిపట్టడం. సముద్ర జీవుల డీఎన్ఏను ('ఇ-డీఎన్ఏ'గా పిలుస్తారు) సేకరించడం. ''సముద్రం లోతుల గురించి, అక్కడి జీవుల గురించీ మనకు తెలిసింది నిజానికి చాలా తక్కువ. ఆ జీవులన్నీ నిరంతరం 'ఇ-డీఎన్ఏ'ను జలాల్లోకి విడుదల చేస్తుంటాయి. దాన్ని సేకరించి ల్యాబుల్లో పరీక్షిస్తే వాటి గురించి మనకిప్పటి దాకా తెలియని విశేషాలెన్నో వెలుగులోకి వస్తాయి'' అని అధ్యయన బృందం చెబుతోంది. ఈ రోబో చేపలు మున్ముందు సముద్రాల అధ్యయనం రూపురేఖలనే మార్చగలవని భావిస్తున్నారు.

సాక్షి, నేషనల్ డెస్క్

తుపాకుల వీడియో తీగ లాగితే... ఫ్యాక్టరీయే బయటపడింది!



ఈ ఫొటోలో కన్పిస్తున్న మహిళ ఏం చేస్తోందో తెలుసా? పిస్టళ్లను చక్కగా నలుగు పెట్టి మరీ కడుగుతోంది! సబ్బు వేసి బాగా తోమాలంటూ నేపథ్యంలో ఒక వ్యక్తి సూచనలిస్తున్నాడు. ఇందుకు సంబంధించిన వీడియో తెగ వైరలైంది. దాంతో మధ్యప్రదేశ్ పోలీసులు అప్రమత్తమై తీగ లాగితే ఏకంగా అక్రమ తుపాకుల ఫ్యాక్టరీయే వెలుగులోకి వచ్చింది. ఈ వీడియోలోను గణేశ్‌పుర అనే ఊళ్లో తీసినట్టు సైబర్ క్రైం పోలీసులు తేల్చారు. అక్కడికి చేరుకుని ఆరా తీస్తుండటంతో ఆయుధాల తయారీదారు శక్తి కపూర్ అలియాస్ చోటూ, అతడి తండ్రి బిహారీలాల్ అలెర్టయ్యారు. తుపాకులు, విడిభాగాలు, ఇతర సామగ్రిని గోనెసంచీలో వేసుకుని బైక్ మీద ఉడాయించారు. విధి వక్రించి వీరిని వెదుకుతున్న పోలీసు వ్యాన్‌కే ఎదురుపడ్డారు! దాన్ని తప్పించబోయి బైక్ కిందపడటంతో దొరికిపోయారు. గోనె సంచీలో చూడగా ఓ డబుల్ బ్యారెల్ గన్, రెండు పిస్టళ్లు, తుపాకుల తయారీ సామగ్రి కనిపించాయి. వీడియోలో విన్పించిన గొంతు చోటూదని, తుపాకులు శుభ్రం చేస్తూ కన్పించింది అతడి భార్య అని గుర్తించారు. ఈ యవ్వారం ఎప్పట్నుంచి సాగుతోంది, తుపాకుల తయారీకి సామగ్రి ఎక్కడి నుంచి తెస్తున్నారు, ఫ్యాక్టరీని ఎప్పటి నుంచి నడుపుతున్నారు వంటివన్నీ వారి నుంచి పోలీసులు ఆరా తీస్తున్నారు.

\- భోపాల్

శిక్షపడేదాకా నిరసన బాటే!

రోడ్లపైకి వైద్యులు, వైద్య సిబ్బంది

- కుటుంబానికి న్యాయం, వైద్యులకు భద్రత కావాలి
- దేశవ్యాప్తంగా వెల్లువెత్తిన ఆందోళనలు, ర్యాలీలు

కోల్‌కతా: పశ్చిమబెంగాల్లో వైద్యురాలిపై అత్యాచారం, హత్యను నిరసిస్తూ దేశవ్యాప్తంగా వైద్యులు, వైద్య సిబ్బంది నిరవధిక సమ్మెకు దిగారు. ''విచారణ సత్వరమే పూర్తై దోషులకు కఠిన శిక్ష పడాలి. బాధితురాలి కుటుంబానికి పూర్తి న్యాయం జరగాలి. అప్పటిదాకా అన్ని రకాల వైద్య సేవలనూ నిలిపేస్తున్నాం'' అని ప్రకటించారు. కోల్‌కతాతో పాటు ఢిల్లీ, ముంబై, చండీగఢ్, లఖ్‌నవూ తదితర అన్ని నగరాల్లోనూ సిబ్బంది రోడ్లపైకొచ్చారు. వైద్య సిబ్బందికి పూర్తి భద్రత కల్పించాలంటూ డిమాండ్ చేశారు. ఎయిమ్స్ వంటి ప్రఖ్యాత వైద్య సంస్థల సిబ్బంది కూడా ఆందోళనల్లో పాలుపంచుకున్నారు.

రంగంలోకి మహిళా కమిషన్

కోల్‌తాలోని ఆర్జీ కర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో కాన్ఫరెన్స్ హాల్లోనే ఓ వైద్యురాలిపై సంజయ్‌రాయ్ అనే పౌర వలంటీర్ గురువారం దారుణంగా అత్యాచారానికి, హత్యకు పాల్పడటం తెలిసిందే. ఈ దారుణం శుక్రవారం వెలుగు చూసింది. దీనిపై బెంగాల్లో మొదలైన నిరసనలు, ఆందోళనలు అన్నిచోట్లకు పాకాయి. దాంతో నాలుగు రోజులుగా దేశమంతా అట్టుడుకుతోంది. బెంగాల్లోనైతే వైద్య సేవలు పూర్తిగా పడకేశాయి. ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ డాక్టర్స్ ఆఫ్ ఇండియా (ఫోర్డా) తదితర సంఘాలు సమ్మెకు పూర్తి మద్దతు ప్రకటించాయి. కేసు దర్యాప్తుకు జాతీయ మహిళా కమిషన్ కూడా కోల్‌కతా చేరుకుంది. పోలీసు ఉన్నతాధికారులతో భేటీ అయింది. కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించాలంటూ కలకత్తా హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలయ్యాయి. వీటిపై మంగళవారం విచారణ జరగనుంది. కోల్‌కతాలో మెడికల్ కాలేజీ నుంచి జరిగిన భారీ ర్యాలీలో ప్రముఖ నటీనటులు రిద్ధీ సేన్, సురాంగనా బంధోపాధ్యాయ, కౌశిక్ సేన్, చైతీ ఘోషాల్ తదితరులు పాల్గొన్నారు. వైద్యులకు మద్దతుగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు.

వారంలో ఛేదించకుంటే సీబీఐకి: మమత

వైద్యురాలి కేసును ఆదివారంలోగా ఛేదించాలని బెంగాల్ పోలీసులను ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆదేశించారు. ''ఈ దారుణం వెనక ఆస్పత్రి లోపలి వ్యక్తుల హస్తం కూడా ఉందని వైద్యురాలి కుటుంబం అనుమానిస్తోంది. వారెవరో కనిపెట్టి ఆదివారం లోపు అందరినీ అరెస్టు చేయాలి. లేని పక్షంలో కేసును సీబీఐకి అప్పగిస్తా'' అని ప్రకటించారు. సోమవారం బాధితురాలి కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. నిజానికి పలు కేసుల దర్యాప్తులో సీబీఐ చేసిందేమీ పెద్దగా లేదంటూ పెదవి విరిచారు. అయినా అవసరమైతే ఈ కేసును దానికి అప్పగిస్తామన్నారు. తీవ్రత దృష్ట్యా ఈ కేసు విచారణను ఫాస్ట్ ట్రాక్ కోర్టుకు అప్పగించాలని అభిప్రాయపడ్డారు. మమత డెడ్‌లైన్ నేపథ్యంలో కోల్‌కతా పోలీస్ కమిషనర్ వినీత్ గోయల్ మీడియాతో మాట్లాడారు. నాలుగైదు రోజుల్లో దోషులందరినీ పట్టుకుంటామన్నారు. ఈ దారుణం గురించి తలచుకుంటేనే గుండె తరుక్కుపోతోందని కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ అన్నారు. బాధితురాలి కుటుంబానికి సత్వర న్యాయం జరిగేలా చూడాలని తృణమూల్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.





కోల్‌కతాలోని ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ ఆస్పత్రి వద్ద నిరసనకు దిగిన వైద్యులు, ప్రజలు

నన్ను ఉరి తీసుకోండి: నిందితుడు

దారుణానికి పాల్పడ్డ సంజయ్ రాయ్‌లో పశ్చాత్తాపమే లేదని పోలీసులంటున్నారు. విచారణలో నేరం అంగీకరించడమే గాక, 'కావాలంటే ఉరి తీసుకొ'మ్మని అన్నట్టు తెలుస్తోంది. రాయ్ ఆసుపత్రి ఉద్యోగి కాదు. కోల్‌కతా పోలీసు శాఖలో పౌర వలంటీర్‌గా ఆస్పత్రిలోని పోలీస్ ఔట్ పోస్టులో పని చేస్తున్నాడు. అడ్మిషన్ కోసం రోగుల నుంచి డబ్బు వసూలు చేసేవాడు. కోల్‌కతా పోలీస్ (కేపీ) అని రాసున్న టీ షర్ట్‌తో తిరుగుతున్నాడు. అతని బైక్‌కు కూడా కేపీ ట్యాగ్ ఉంది. రాయ్ మొబైల్ ఫోన్ నిండా అశ్లీల దృశ్యాలే ఉన్నట్టు తెలిసింది.



ప్రిన్సిపాల్ రాజీనామా..

వైద్యురాలి హత్యపై దేశవ్యాప్తంగా నిరసనలు, ఆందోళనల నేపథ్యంలో ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సందీప్ ఘోష్ సోమవారం రాజీనామా చేశారు. తనపై వస్తున్న విమర్శలను, అవమానాన్ని భరించలేకున్నారు. ''బాధితురాలినే నిందితురాలిగా చిత్రిస్తూ నేను వ్యాఖ్యలు చేశానడం అబద్ధం. ఆమె నా కూతురి వంటిది. నేనూ ఓ తండ్రినే'' అన్నారు.



యూజీసీ-నెట్ రద్దులో జోక్యానికి సుప్రీం నో



న్యూఢిల్లీ: యూజీసీ- నెట్ పరీక్షను రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంలో జోక్యం చేసుకునేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. యూజీసీ- నెట్‌ను రద్దును సవాల్ చేస్తూ అభ్యర్థులు దాఖలు చేసిన పిటిషన్‌ను తిరస్కరించింది. ఈ దశలో జోక్యం చేసుకుంటే గందరగోళం తలెత్తుతుందని పేర్కొంది. 'ఈనెల 21న ప్రభుత్వం యూజీసీ-నెట్‌ను తిరిగి నిర్వహిస్తోంది. పరీక్షార్థులు దాదాపు తొమ్మిది లక్షల మంది నిశ్చయంగా ఉన్నారు. వారికిప్పుడు ఒకరకమైన స్పష్టత ఉంది. ఈ దశలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకుంటే.. తీవ్ర ప్రభావం ఉంటుంది. అంతటా గందరగోళం నెలకొంటుంది' అని చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం పేర్కొంది.

మైనారిటీల్ని కాపాడండి



బంగ్లా ప్రభుత్వాన్ని కోరిన ప్రియాంక

న్యూఢిల్లీ: బంగ్లాదేశ్‌లోని మైనారిటీలపై దాడులు కొనసాగుతుండటంపై కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ ఆందోళన వెలిబుచ్చారు. హిందువులు, క్రైస్తవులు, బౌద్ధులకు రక్షణ కల్పించాలని అక్కడి మధ్యంతర ప్రభుత్వాన్ని ఆమె కోరారు. మతం, కులం, భాష ఆధారంగా పౌరుల పట్ల వివక్ష చూపడం, దాడులకు పాల్పడటం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని సోమవారం ప్రియాంక 'ఎక్స్'లో పేర్కొన్నారు.

పూజా ఖేడ్కర్‌కు ఊరట



తక్షణ కస్టడీ అవసరం లేదన్న ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ: మాజీ ట్రైనీ ఐఏఎస్ అధికారిణి పూజా ఖేడ్కర్‌కు ఊరట లభించింది. ఆగస్టు 21 వరకు అరెస్టు చేయకుండా ఢిల్లీ హైకోర్టు సోమవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తక్షణ కస్టడీ అవసరం లేదని స్పష్టం చేసింది. ప్రస్తుతం జరుగుతున్న విచారణకు సహకరించాలని ఖేడ్కర్‌ను కోర్టు ఆదేశించింది. ఈ కేసులో యూపీఎస్సీని భాగస్వామిని చేస్తూ, ఆమె మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై స్పందన కోరుతూ కమిషన్, ఢిల్లీ పోలీసులకు నోటీసులు జారీ చేసింది. ఖేడ్కర్‌ను తక్షణమే కస్టడీలోకి తీసుకోవాల్సిన అవసరమేంటని జస్టిస్ సుబ్రమణ్యం ప్రసాద్ ఢిల్లీ పోలీసులను ప్రశ్నించారు.



1947 ఆగస్టు 15న చెన్నై సెంట్ జార్జి కోటపై ఎగరేసిన మువ్వన్నెల జెండా ఇది. నాడు రెపరెపలాడిన జెండాల్లో ఇప్పటికీ భద్రంగా ఉన్నది ఇదొక్కటే. సెంట్ జార్జి కోటలోని ఫోర్ట్ మ్యూజియంలో ఈ జాతీయ పతాకం చూపరులకు కనువిందు చేస్తోంది.

అదానీపై దర్యాప్తు సీబీఐకి: కాంగ్రెస్

న్యూఢిల్లీ: అదానీ గ్రూపు షేర్ల అవకతవకలపై దర్యాప్తును సెబీ నుంచి సీబీఐకి లేదా సిట్‌కు అప్పగించాలని కాంగ్రెస్ సోమవారం సుప్రీంకోర్టును కోరింది. లేదంటే దేశవ్యాప్త ఆందోళనకు దిగుతామని హెచ్చరించింది. ''హిండెన్‌బర్గ్ రీసెర్చ్ తాజా ఆరోపణల నేపథ్యంలో సెబీ చైర్‌పర్సన్ మాధవి బుచ్ రాజీనామా చేయాలి. 'మోదానీ (మోదీ + అదానీ) మెగా కుంభకోణం'పై విచారణకు సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) వేయాలి'' అని పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ డిమాండ్ చేశారు. ''అదానీపై దర్యాప్తును రెండు నెలల్లో ముగించాలని సుప్రీంకోర్టు 2023 మార్చి 3న ఆదేశాలు ఇచ్చింది. కానీ 18 నెలలు గడిచినా కొలిక్కి రాలేదు'' అన్నారు.

తోసిపుచ్చిన బీజేపీ: హిండెన్‌బర్గ్ ఆరోపణలపై జేపీసీ డిమాండ్‌ను బీజేపీ తోసిపుచ్చింది. దేశ ఆర్థిక వ్యవస్థను బలహీనం చేసి, పెట్టుబడుల వాతావరణాన్ని చెడగొట్టడమే కాంగ్రెస్ ఉద్దేశమని మండిపడింది.

2036 కల్లా పెరగనున్న లింగ నిష్పత్తి

ప్రతి వెయ్యి మంది పురుషులకు 952 మంది మహిళలు

న్యూఢిల్లీ: భారత్‌లో లింగ నిష్పత్తి 2036 సంవత్సరాలికల్లా కొద్దిగా మెరుగుపడనుంది. ప్రతి వెయ్యి మంది పురుషులకు 952 మంది మహిళలు ఉంటారని గణాంక, ప్రణాళిక అమలు శాఖ సోమవారం విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. 2011లో మన దేశంలో లింగ నిష్పత్తి 1000: 943గా ఉంది. లింగ సమానత్వం దిశగా సానుకూల ధోరణిని ఇది సూచిస్తోందని నివేదిక పేర్కొంది. 2036 కల్లా భారత జనాభా 152.2 కోట్లకు చేరుకుంటుందని తెలిపింది. అదే సమయంలో జనాభాలో మహిళల శాతం స్వల్పంగా పెరిగి 48.8 శాతానికి చేరుకుంటుందని వివరించింది. 2011లో భారత జనాభాలో మహిళ శాతం 48.5 మాత్రమే కావడం గమనార్హం. 2011తో పోలిస్తే 2036లో పదిహేనేళ్ల లోపు వయసున్న వారి సంఖ్య తగ్గుతుందని, జననాలు తగ్గుముఖం పట్టడమే దీనికి కారణమని పేర్కొంది. మరోవైపు ఇదేకాలంలో 60 ఏళ్లు పైబడిన వృద్ధుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని తెలిపింది.

ఐఐటీ మద్రాస్ టాప్


- బెస్ట్ యూనివర్సిటీగా బెంగళూరు ఐఐఎస్సీ
- ఎన్ఐఆర్ఎఫ్-2024 ర్యాంకుల వెల్లడి



ధర్మేంద్ర ప్రధాన్

న్యూఢిల్లీ: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్(ఎన్ఐఆర్ఎఫ్)-2024 ర్యాంకింగ్స్ విడుదలయ్యాయి. ఓవరాల్‌తో పాటు ఇంజినీరింగ్ కేటగిరీలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) మద్రాస్ వరుసగా ఆరోసారి టాప్ ర్యాంక్‌లో నిలిచింది. ఐఐటీ హైదరాబాద్‌కు 8వ ర్యాంకు దక్కింది. ఉత్తమ యూనివర్సిటీగా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్(ఐఐఎస్సీ) బెంగళూరు వరుసగా 9వసారి మొదటి స్థానం సంపాదించుకుంది. అదేవిధంగా, ఓవరాల్ కేటగిరీలో ఐఐఎస్సీ బెంగళూరు, ఐఐటీ బాంబే, ఐఐటీ ఢిల్లీ వరుసగా రెండు, మూడు, నాలుగు ర్యాంకులు సాధించాయి. నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రెడిటేషన్(ఎన్‌బీఏ) రూపొందించిన ఈ ర్యాంకింగ్స్‌ను కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సోమవారం విడుదల చేశారు. ఓవరాల్ టాప్-10 జాబితాలో 8 ఐఐటీలతోపాటు ఢిల్లీ ఎయిమ్స్, ఢిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ చోటుసంపాదించాయి. యూనివర్సిటీల కేటగిరీలో టాప్-3లో బెంగళూరు ఐఐఎస్సీ, ఢిల్లీలోని జేఎన్‌యూ, జామియా మిలియా ఇస్లామియాలున్నాయి. ఇన్నోవేషన్ విభాగంలో ఐఐటీ బాంబే, ఐఐటీ మద్రాస్ తర్వాత ఐఐటీ హైదరాబాద్ మూడో స్థానంలో నిలిచింది. రాష్ట్ర ప్రభుత్వ వర్సిటీల్లో హైదరాబాద్‌లోని ఉస్మానియాకు ఆరు, విశాఖపట్టణంలోని ఆంధ్రా వర్సిటీకి ఏడో ర్యాంకు దక్కాయి. ఫార్మసీ విభాగంలో... నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఎన్ఐపీఈఆర్)హైదరాబాద్ ఈ ఏడాది రెండో స్థానానికి పడిపోయింది. ఈసారి మొదటి స్థానాన్ని జామియా హందర్డ్ దక్కించుకోగా బిట్స్ పిలానీ మూడో ర్యాంకు సాధించింది. లా యూనివర్సిటీల్లో నల్సార్ హైదరాబాద్‌కు మూడో ర్యాంకు దక్కింది.

ఐఎస్ఐ మాజీ చీఫ్ అరెస్టు



ఇస్లామాబాద్: ఇంటర్ సర్వీసెస్ ఇంటలిజెన్స్ (ఐఎస్ఐ) మాజీ చీఫ్ ఫయాజ్ హమీద్‌ను హౌసింగ్ కుంభకోణంలో పాకిస్తాన్ సైన్యం సోమవారం అరెస్టు చేసింది. ఆయనపై కోర్టు మార్షల్‌ను ప్రారంభించింది. 'సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఆయనపై ఆర్మీ విచారణ జరిపింది. అనంతర పాక్ ఆర్మీ చట్టం ప్రకారం క్రమశిక్షణ చర్యలకు శ్రీకారం చుట్టాం' అని పాక్ సైన్యం ప్రజాసంబంధాల విభాగం ఒక ప్రకటనలో తెలిపింది.

వెయ్యి చ.కి.మీ కస్క్ మా ఆధీనంలో: జెలెన్‌స్కీ



కీవ్: రష్యాలోని కస్క్ ప్రాంతంలో వెయ్యి చదరపు కిలోమీటర్ల భూభాగాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ సోమవారం ప్రకటించారు. కొద్దిరోజుల కిందట ఉక్రెయిన్ అనూహ్యంగా కస్క్‌పై దాడికి దిగి ఆ ప్రాంతంలోకి చొచ్చుకెళ్లింది. యుద్ధభూమిలో కస్క్ ప్రాంతంలో తమ పరిస్థితిని సైన్యాధిపతి జనరల్ అలెగ్జాండర్ సిర్‌స్కీతో కలిసి ఆయన సోమవారం టెలిగ్రామ్‌లో షేర్ చేశారు.

సాక్షి 24|7
కర్ణాటక
KARNATAKA
మంగళవారం : 13 : ఆగస్టు : 2024

అకృత్యంపై కన్నెర్ర



కోల్‌కతాలో ప్రభుత్వ ఆస్పత్రిలో మహిళా వైద్యురాలిపై హత్యాచారాన్ని ఖండిస్తూ సోమవారం బెంగళూరు నిమ్హాన్స్‌లో మెడికోల నిరసన

న్యూస్‌రీల్

మలెనాడులో తగ్గిన వర్షాలు



శివమొగ్గ వద్ద తుంగా నది

శివమొగ్గ: శివమొగ్గ జిల్లాతో పాటు మలెనాడులో వర్షాలు చాలా వరకు తగ్గుముఖం పట్టాయి. ఇప్పటివరకు కుండపోత వానలకు పొంగిపొర్లిన తుంగా, భద్రా నదులు, జలాశయాలు, చెరువులూ, నీటికుంటలు మళ్లీ స్తబ్ధంగా మారాయి. జలాశయల్లో సైతం నీటి మట్టాలు మామూలు స్థితికి వచ్చాయి. సోమవారం అధికారులు తెలిపిన వివరాల ప్రకారం గత 24 గంటల్లో శివమొగ్గ జిల్లాలో పశ్చిమ కనుమల్లో ఓ మోస్తరుగా వర్షం పడింది. ప్రతి రోజు 200 నుంచి 300 మి.మీ వరకు కురిసిన వర్షం ఇప్పుడు సగటున 4 మి.మీ.లకు పడిపోయింది. జలాశయాల పరిధిలో వర్షాలు పూర్తిగా తగ్గడంతో లింగనమక్కి, తుంగభద్రా జలాశయాల్లోకి వచ్చే నీరు కూడా క్షీణించింది.

కరెంటు షాక్‌కు చిరుత బలి



మండ్య: మండ్య జిల్లాలోని కేఆర్ పేటె తాలూకాలోని కసబా హోబ్లిలో ఉన్న బండిహొళె గ్రామంలో ఓ పొలంలో ఆదివారం రాత్రి చిరుత పులి కరెంటు షాక్ తగిలి చనిపోయింది. అడవిలో నుంచి ఆహారం వెతుక్కుంటూ వచ్చిన చిరుత పొలంలో ఉన్న చెట్టుపైకి ఎక్కుతున్న సమయంలో కరెంటు వైర్లు తగిలాయి. దీంతో చిరుత షాక్ కొట్టి కిందపడి మరణించింది. సోమవారం పొలానికి వెళ్లిన రైతు చూసి అటవీ సిబ్బంది సమాచారమిచ్చాడు. వారు చిరుత కళేబరాన్ని తీసుకెళ్లారు.

కొండచరియల ప్రాంతాల్లో తనిఖీలు

- కేంద్ర బృందం రాక



యశవంతపుర: భారీ వానలతో కుంగిన మట్టి చరియల పరిశీలనకు కేంద్ర జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అధికారులు సోమవారం చిక్కమగళూరు జిల్లాలో పర్యటించారు. శాస్త్రవేత్త సెంథిల్‌కుమార్ నేతృత్వంలో మూడు రోజుల పాటు చిక్కమగళూరు, కొప్ప, శృంగేరి తాలూకాలలో మట్టి చరియలు విరిగిన ప్రాంతాలలో పర్యటించి వివరాలను సేకరించారు. భారీ వానలు కారణంగా మట్టి చరియలు విరిగి ప్రాంతాలకు వారిని స్థానిక అధికారులు తీసుకెళ్లారు. ముళ్లయ్యనగిరి, కవికల్ గండితో పాటు బాబాబుడన్‌గిరి రోడ్డులోని ఐదు చోట్ల పరిశీలించారు. కొప్ప, శృంగేరిలోనూ పర్యటిస్తారు. 2019లో చిక్కమగళూరు జిల్లా మూడిగెరె, శృంగేరి, కళస, కొప్పలతో పాటు అనేక చోట్ల భారీవానలతో మట్టి చరియలు విరిగిపడ్డాయి.

వరుస దుర్ఘటనలతో

ఉత్తర కన్నడ జిల్లా శిరూరు వద్ద హైవేలో కొండచరియలు పడి 11 మంది మరణించారు. అలాగే కేరళ వయనాడులో ఆకస్మికంగా కొండలు జారిపడి వందలాది మంది సజీవ సమాధి కావడం తెలిసిందే. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ముందు జాగ్రత్తగా సర్వే కోసం అధికారులు పంపింది. రాష్ట్రవ్యాప్తంగా మట్టి చరియలు విరిగి ప్రాంతాలను పరిశీలించి 15 రోజుల్లో నివేదిక ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించినట్లు తెలిసింది.

సమావేశమా.. సత్రమా?

- అధికారులపై హోంమంత్రి గుర్రు



తుమకూరు: హోంమంత్రి, ఇతర మంత్రులు సమావేశం నిర్వహిస్తే అధికారులు కొందరు ఆలస్యంగా వచ్చారు. సోమవారం తుమకూరు జడ్పీలో కేడీపీ సమావేశం జరిగింది. హోంమంత్రి పరమేశ్వర్, మంత్రి రాజన్న, ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఎస్పీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమావేశం జరుగుతుండగా అధికారులు లేటుగా రాసాగారు. దీంతో హోంమంత్రికి చిర్రెత్తుకొచ్చింది. మీరు ఇష్టం వచ్చినట్లు రావడానికి, పోవడానికి ఇది గోపాలప్ప సత్రమా? అని మండిపడ్డారు. సమావేశం ఉందని ముందే తెలుసు కదా అని ప్రశ్నించారు. ఇంతలో మరో అధికారి రావడంతో.. ఏమి అన్నగారు, ఇప్పుడా రావడం అని ప్రశ్నించారు.



సోమవారం ఉదయం మారేనహళ్లి– బన్నేరుఘట్ట మార్గంలో స్కూటరిస్టు అవస్థలు



అదే మార్గంలో అండర్‌పాస్ వద్ద వాహనదారుల తిప్పలు



ఆర్‌టీ నగరలో రోడ్డుకు అడ్డుగా వాలిపోయిన చెట్టు

జడివానకు నగరం వణుకు

- సిలికాన్ సిటీలో అర్ధరాత్రి కుంభవృష్టి
- రోడ్లు, కూడళ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయం
- చెట్లు కూలి 7 మందికి గాయాలు
- అంతటా ట్రాఫిక్ సమస్య



గొడుగులు సాయంతో పాఠశాలకు వెళుతున్న విద్యార్థులు



కంటోన్మెంట్ అండర్‌పాస్‌లో వాననీటిలో వాహనాలు

బనశంకరి: ఉరుములేని పిడుగులా సిలికాన్ సిటీలో ఆదివారం అర్ధరాత్రి కుంభవృష్టి భారీ బీభత్సం సృష్టించింది. కనీసం వాతావరణశాఖ హెచ్చరిక కూడా లేని సమయంలో కుండపోత వర్షం ముంచెత్తడంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో కరెంటు పోయి, ఇళ్లలోకి నీరుచేరడంతో ప్రజలు నిద్రలేని రాత్రి గడిపారు. ఆదివారం అర్ధరాత్రి 2 గంటలకు ప్రారంభమైన వర్షం సోమవారం తెల్లవారుజామువరకు కురిసింది. నగరంలో చాలా రోడ్లు చెరువులను తలపించగా కేఆర్ మార్కెట్ నిండా నీరు చేరింది. పూల బస్తాలు నీటిలో కొట్టుకుపోయాయి. వ్యాపారులు లబోదిబోమన్నారు.

చెరువుల్లా రోడ్లు

నగరంలో అనేక రోడ్లు జలమయంగా మారాయి. అండర్‌పాస్‌లలో మోకాలు లోతు నీరు, బురద నిలిచింది. వాహనదారులు సతమతమయ్యారు. నీరు చేరి వాహనాలు మొరాయించడంతో తోసుకుంటూ వెళ్లారు. చిక్కపేటే మెట్రోస్టేషన్ ముందు భాగంలోని రోడ్డు మునిగిపోయింది. ఓకళిపురం అండర్‌పాస్‌లోకి నీరు చేరి ఖాళీ అంబులెన్స్ చిక్కుకుంది. జయదేవ అండర్‌పాస్‌లో నీరు నిలిచిపోవడంతో ఫైర్ సిబ్బంది నీటిని తొలగించారు. బన్నేరుఘట్టలో రహదారులు జలమయం అయ్యాయి. సోమవారం ఉదయం చాలావరకు అండర్‌పాస్‌లు, రోడ్లు జలమయం కావడంతో ప్రజలు తమ వాహనాలను వదిలిపెట్టి కాలినడకన కార్యాలయాలకు వెళ్లారు.

ఇళ్లలోకి వాన నీరు

అమృతహళ్లి మునిశ్యామప్ప లేఔట్‌లో వందలాది ఇళ్లలోకి వర్షం నీరు చొరబడటంతో అక్కడ నివాసులు రాత్రంతా జాగరణ చేశారు. ఇళ్లలోకి నీరు వచ్చి ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషిన్లు వంటి వస్తువులు పనికిరాకుండా పోయాయి. పులకేశినగరలో 30కి పైగా ఇళ్లలోకి వర్షం నీరు చొరబడింది. ఎప్పుడూ ఇదే సమస్య అని, పట్టించుకునే నాథుడే లేడని ప్రజలు వాపోయారు.

అపార్టుమెంట్లు జలమయం

మారతహళ్లి వద్ద అపార్టుమెంటు జలదిగ్బంధంలో చిక్కుకుంది. సెల్లార్ మొత్తం నిండిపోవడంతో నివాసులు బయటికి రాలేకపోయారు. యలహంకలో రమణశ్రీ కాలిఫోర్నియా గార్డెన్ అపార్టుమెంటు జలయమం అయ్యింది. నార్త్‌వుడ్ విల్లాలోకి రాజకాలువ నీరు చేరింది.

మ్యాన్‌హోల్‌లో పడిన కార్లు

రోడ్లు వాననీటితో నిండడంతో ఎక్కడ గుంత ఉందో కనిపించక సిల్క్‌బోర్డు జంక్షన్ వద్ద రెండు కార్లు రోడ్డుపక్కన మ్యాన్‌హోల్‌లోకి పడిపోయాయి. మ్యాన్ హోల్ గత కొద్దిరోజులుగా ఓపెన్‌లో ఉంది. వాననీటిలో దారి కనబడకపోవడంతో ఇద్దరు కారు డ్రైవర్లు మ్యాన్‌హోల్‌పై నడపడంతో కార్లు చిక్కుకున్నాయి. స్థానికులు వారిని కాపాడారు. సిల్క్ బోర్డు జంక్షన్ సమీపంలో రోడ్లపైన చేపలు రాగా, మహిళలు వాటిని పట్టుకున్నారు.

చెట్లు కూలి 7 మందికి గాయాలు

వర్ష ప్రభావంతో హలసూరు మారుతిసేవానగరలో సోమవారం ఉదయం భారీ చెట్టుకొమ్మ విరిగిపడటంతో పాఠశాలకు వెళుతున్న నలుగురు విద్యార్థులు, మరో ముగ్గురు పెద్దలు గాయపడ్డారు. స్థానికులు వారిని ఆసుపత్రికి తరలించారు. మాణిక్యవేలు అనే వ్యక్తికి ఎదపై తగలడంతో పరిస్థితి విషమంగా ఉంది. సుబ్బయనపాళ్య నివాసి విశాలాక్షి అనే మహిళ కాలు విరిగిపోయినట్లు వైద్యురాలు డా.త్రిజా తెలిపారు. కుమారకృప వెస్ట్ సమీపంలో సుబ్రమణ్య దేవస్థానం వద్ద కారుపై చెట్టు విరిగిపడటంతో కారు ధ్వంసమైంది. సదాశివనగరలో పెద్ద చెట్టు కూకటి వేళ్లతో కూలిపోయింది. నగరవ్యాప్తంగా పలుప్రాంతాల్లో చెట్లు కూలిపోయాయి.

ఎటుచూసినా ట్రాఫిక్ జామ్

మెజస్టిక్, రాజాజీనగర, మల్లేశ్వరం, యశవంతపుర, శాంతినగర, విధానసౌధ, శివాజీనగర, కార్పొరేషన్ సర్కిల్, టౌన్‌హాల్, జయనగరతో పాటు చాలా ప్రాంతాల్లో రోడ్లు జలమయంగా మారాయి. సిల్క్‌బోర్డు జంక్షన్‌రోడ్డులో కిలో మీటరు వరకు ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. హోసూరు రోడ్డు స్తంభించింది. వర్తూరు బళగెరె మెయిన్‌రోడ్డు చెరువులా కనబడింది. దేవనహళ్లి అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్లే హెబ్బాళ ఫ్లై ఓవర్ పూర్తిగా ట్రాఫిక్‌తో నిండింది. గంటలకొద్దీ వాహనదారులు ఇరుక్కుపోయారు. కాగా ఈ నెల 17 తేదీ వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

అక్టోబరు 3 నుంచి మైసూరు దసరా

- 12వ తేదీన జంబూసవారీ ఉత్సవం
- సీఎం సిద్దరామయ్య వెల్లడి



గతేడాది మైసూరు దసరా జంబూసవారీ (ఫైల్)

బనశంకరి: ప్రపంచ ప్రఖ్యాత మైసూరు దసరా మహోత్సవాలకు ముహూర్తం కుదిరింది. అక్టోబరు 3వ తేదీ నుంచి 12 తేదీ వరకు దసరా నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తామని సీఎం సిద్దరామయ్య తెలిపారు. సోమవారం విధానసౌధలో అధికారులతో మైసూరు దసరా ఉత్సవాల గురించి ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. తరువాత విలేకరులతో సీఎం మాట్లాడారు. అక్టోబరు 3 తేదీన మైసూరు దసరా ఉత్సవాలు ప్రారంభించి 12వ తేదీన జంబూసవారి నిర్వహిస్తామని తెలిపారు. ఉత్సవాల విశిష్ట అతిథి ఎవరనేది మూడునాలుగు రోజుల్లో తానే ప్రకటిస్తానని తెలిపారు.

ఈసారి ఆర్భాటంగా

ఈసారి దసరా ఆడంబరంగా, అర్థవంతంగా నిర్వహించాలని తీర్మానించామని సీఎం తెలిపారు. బాగా వర్షాలు పడడంతో రైతులు కూడా ఆనందంగా ఉన్నారన్నారు. ఉత్సవాల మొదటి రోజు నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు ఆరంభమవుతాయి. దీపాలంకరణ, కుస్తీ, యువ సంభ్రమ, యువ దసరా, ఆటల పోటీలు ఉంటాయని, ఎగ్జిబిషన్‌ను పకడ్బందీగా జరిపిస్తామని చెప్పారు. దసరా ముగిసిన 11 రోజుల పాటు నగరమంతటా భారీఎత్తున దీపాలంకరణ ఉంటుందని చెప్పారు. పర్యాటకులకు అన్ని వసతులూ కల్పిస్తామన్నారు. డిప్యూటీ సీఎం డీకే.శివకుమార్, మంత్రులు కేజే.జార్జ్, హెచ్‌కే.పాటిల్, మహదేవప్ప తదితరులు పాల్గొన్నారు.

మానవ– గజ సంఘర్షణకు అడ్డుకట్ట

- 10 ఏళ్లలో 2,500 ఘటనలు
- గజ సదస్సులో సీఎం సిద్దు



సదస్సును ఆరంభిస్తున్న సీఎం తదితరులు

శివాజీనగర: అధికమైన మనిషి– ఏనుగుల సంఘర్షణను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం అధిక దృష్టి సారించిందని, రాష్ట్రంలో 9 ఏనుగుల టాస్క్‌ఫోర్స్‌లను నియమించినట్లు సీఎం సిద్దరామయ్య తెలిపారు. సోమవారం బెంగళూరు జీకేవీకేలో ప్రపంచ ఏనుగుల దినోత్సవాన్ని ఆచరించారు. మనిషి–ఏనుగుల సంఘర్షణ నిర్వహణ సదస్సును ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ టాస్క్‌ఫోర్స్‌లు ఒక సంవత్సరంలో 1200కు పైగా గజ– మానవ సంఘర్షణను అడ్డుకుని ఏనుగులను సురక్షిత స్థానాలకు పంపించినట్లు చెప్పారు. ప్రజలు, రైతుల సమస్యలకు తక్షణమే స్పందిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో గత 10 సంవత్సరాల్లో మనిషి–ఏనుగుల సంఘర్షణలు 2,500కు పైగా జరిగాయి. 350 మందికి పైగా మనుషులు చనిపోయారు, గణనీయంగా పంట నష్టం కూడా జరిగింది, వీటన్నిటిని అరికట్టేందుకు ఏనుగుల టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఏనుగులతో స్నేహపూర్వకంగా మెలగడంపై సదస్సులో చర్చించారు. అటవీ శాఖ మంత్రి ఈశ్వర ఖండ్రె, పలు రాష్ట్రాల అటవీ మంత్రులతో అధికారులు పాల్గొన్నారు.

చాముండేశ్వరి ఆలయం మా ఆస్తి

- ప్రాధికార ఏర్పాటు సరికాదు
- రాజవంశీకురాలు ప్రమోదాదేవి



మైసూరు: మైసూరు నగరంలో ఉన్న చాముండి బెట్టపై చాముండేశ్వరి దేవాలయం మాకు చెందిన ఆస్తి, ఆ దేవాలయాన్ని మా మహారాజులు నిర్మించారు. కాబట్టి చాముండేశ్వరి నియోజకవర్గం అభివృద్ధి ప్రాధికార ఏర్పాటు చేయడానికి తాము అవకాశం ఇవ్వబోమని మైసూరు రాజ వంశీకురాలు ప్రమోదాదేవి ఒడెయార్ అన్నారు. సోమవారం సాయంత్రం ఆమె మైసూరు ప్యాలెస్‌లో మీడియాతో మాట్లాడారు. చాముండి కొండ పైన వెలసిన శ్రీచాముండేశ్వరి అమ్మవారు, అక్కడ ఉన్న దేవాలయం మొత్తం కూడా మా ఆస్తి. మైసూరు సంస్థానం ప్రవేట్ ఆస్తి లిస్టులో ఉంది. కొండపైన ఉన్న ప్యాలెస్, నంది, చాముండేశ్వరి, మహాబలేశ్వర దేవాలయం, దేవి చెరువు, చుట్టుపక్కల ప్రాంతాలు మొత్తం తమవని 2001లో దేవాదాయ శాఖ హైకోర్టుకు వెళ్లింది, ఈ కేసు కోర్టులో ఉన్న సమయంలో ప్రభుత్వం ఇప్పుడు చాముండేశ్వరి ప్రాధికార ఏర్పాటు చేస్తామని చెప్పడం సరికాదని అన్నారు. 1950లో ఆలయం తమ ఆస్తుల జాబితాలో ఉందని, తాము కాపాడుకుంటామని చెప్పారు. ప్రమోదా దేవి ప్రకటనతో ఆమె – రాష్ట్ర ప్రభుత్వం మధ్య విభేదాలు తీవ్రమయ్యే అవకాశాలున్నాయి.

కూటమి నేతలపై ఫిర్యాదు

మైసూరు: కేంద్ర మంత్రి హెచ్.డి.కుమారస్వామి, డిప్యూటీ సీఎం డి.కే.శివకుమార్‌ను రాజకీయంగా ముగించడానికి కుట్రలు చేస్తున్నారని నగర కాంగ్రెస్ సమితి నాయకులు మైసూరు లక్ష్మీపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మైసూరులో బీజేపీ, జేడీఎస్ బహిరంగ సభలో కుమారస్వామి మాట్లాడుతూ సీఎం, డీసీఎంల మీద తీవ్ర ఆరోపణలు చేశారన్నారు. డీకే బెంగళూరులో మ్యాన్‌హోల్ మూతలను దొంగతనం చేశారని, వాటిని తీసుకెళ్లి గుజరీలో అమ్ముకున్నాడని, అశ్లీల సినిమాలను ప్రదర్శించేవారని ఆరోపించడం తగదన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ టి.శ్రీనివాస్ తదితరులు ఫిర్యాదు చేశారు.

ఫ్లెక్సీలపై కొత్త రూల్స్

శివాజీనగర: బెంగళూరులో పాదచారి మార్గాలలో, రద్దీ ప్రదేశాల్లో అక్రమంగా ప్రకటనల బోర్డులను ఏర్పాటు చేయకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వం, బీబీఎంపీ, పోలీస్ శాఖకు హైకోర్టు సోమవారం ఆదేశించింది. నగరంలో అనధికారిక ఫ్లెక్సీలపై వచ్చిన వార్తలను సుమోటోగా స్వీకరించి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కే.వీ.అరవింద్ ధర్మాసనం విచారించింది. ఫ్లెక్స్, బ్యానర్‌లపై పాలికె నిఘా పెట్టాలి, ఉల్లంఘనలు కనిపిస్తే చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ న్యాయవాది ప్రతిమ స్పందిస్తూ అక్రమ ఫ్లెక్స్, బ్యానర్‌ల నియంత్రణకు కొత్త నిబంధనలను రూపొందించినట్లు తెలిపారు. త్వరలోనే ఉత్తర్వులను విడుదల చేస్తుందని చెప్పారు.

మిస్టరీగా టెక్కీ అదృశ్యం



అదృశ్యమైన టెక్కీ విపిన్ గుప్తా (ఫైల్)



బైక్‌పై టూర్‌కి వెళ్లాడని అనుమానాలు

- ఎక్స్‌లో భార్య ఫిర్యాదు

యశవంతపుర: ఇంటి నుంచి వెళ్లిన టెక్కీ మళ్లీ ఇంటికి రాలేదు. ఈ సంఘటన బెంగళూరులో జరిగింది. మాన్యతా టెక్‌పార్క్‌లోని ఒక సంస్థలో పని చేస్తున్న విపిన్ గుప్తా (37) ఈ ఆగస్ట్ 4న మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తరువాత జాడ లేడని అతని భార్య పోస్ట్ చేసి సాయం కోసం పోలీసులను వేడుకున్నారు.

వెళ్లగానే డబ్బు డ్రా

వివరాలు.. విపిన్‌గుప్తా భార్య, పిల్లలతో కలిసి మూడేళ్ల నుంచి కొడిగేహళ్లి టాటానగరలో నివాసం ఉంటున్నాడు. ఇంటి నుంచి బైకులో వెళ్లిపోయాడు, కొంత సేపటికి అతని అకౌంట్ నుంచి రూ.1.80 లక్షలు డ్రా అయింది. తరువాత మొబైల్‌ఫోన్ స్విచాఫ్ వచ్చింది. ఆగస్ట్ 6న ఆమె భర్త కనిపించడం లేదని స్థానిక కొడిగేహళ్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. డబ్బుల కోసం ఎవరైనా అపహరించి ఉండవచ్చని భార్య అనుమానం వ్యక్తం చేసింది. కానీ ఎలాంటి ఫలితం లేకపోయింది. దీంతో ఎక్స్ ద్వారా పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది, ఈ నేపథ్యంలో గాలింపు చేపట్టారు. విపిన్ గుప్తా వెళ్లిన దారిలో సీసీ కెమెరాలను పరిశీలించారు. నగర పోలీసులు రాష్ట్రంలోని ప్రముఖ పర్యటక కేంద్రాల పోలీసులకు సమాచారం ఇచ్చారు. విపిన్‌గుప్తాకు బైకు రైడింగ్ అంటే ఇష్టమని, బైక్‌లో దేశంలో పర్యటించే అలవాటు ఉన్నందున అలా టూర్‌కి వెళ్లి ఉండొచ్చని అనుమానాలు ఉన్నాయి.

తాత్కాలిక గేటు పనులు షురూ



డ్యాం సమీపంలో తాత్కాలిక గేటు తయారీ పనులు



సాక్షి, బళ్లారి: హొసపేటె టీబీ డ్యాంలో కొట్టుకుపోయిన 19వ క్రస్ట్ గేటు స్థానంలో తాత్కాలిక (ఎమర్జెన్సీ) క్రస్ట్ గేటు ఏర్పాటు చేయాలని నిపుణులు, అధికారులు ఖరారు చేశారు. సోమవారం నుంచి డ్యాం చెంత పనులు చకచకా సాగుతున్నాయి. కొప్పళ ఇన్‌ఛార్జి మంత్రి శివరాజ్ తంగడగి, కొప్పళ ఎంపీ రాజశేఖర్ హిట్నాల్ తాత్కాలిక గేటు తయారీ పనులను పరిశీలన చేశారు. ఐదు పెద్ద ఇనుప బాక్స్‌ల తరహాలో గేటును రూపొందిస్తున్నారు. 20 అడుగుల ఎత్తు, 60 అడుగుల వెడల్పుతో ఐదు ఇనుప పీస్‌లను గేటుగా జోడించే పనులు జరుగుతున్నాయి.

డ్యామ్ గేట్లపై అధికారుల అలసత్వం

రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు ఈ డ్యామ్ నిర్వహణను చూసుకుంటున్నాయి. దీంతో పాటు కేంద్ర ప్రభుత్వం కూడా జోక్యం ఉంటుంది. కాలువల ఆధునీకరణకు, డ్యాం నిర్వహణ పేరిట ప్రతి సంవత్సరం వందల కోట్ల నిధులను ఖర్చు చేస్తారు. కానీ ఎంతో ముఖ్యమైన గేట్ల పరిస్థితిని ఎవరూ పట్టించుకోకపోవడంతో ఈ దుర్గతి ఏర్పడిందని విమర్శలున్నాయి. ఫలితంగా ఈ ఏడాది డ్యాం కింద పంటల పరిస్థితి అయోమయంలో పడింది. రైతులు ఎవరూ కలిసినా ఇదే మాట్లాడుకుంటున్నారు.

డ్యాంల భద్రతపై కమిటీ: డీసీఎం

బనశంకరి: తుంగభద్ర జలాశయం గేట్ తెగిపోయిన నేపథ్యంలో రాష్ట్రంలోని జలాశయాల సురక్షత చర్యల పరిశీలన కోసం నిపుణులతో కమిటీ ఏర్పాటు చేస్తామని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తెలిపారు. బెంగళూరులో విలేకరులతో మాట్లాడుతూ టీబీ డ్యాంలో 50–60 టీఎంసీల నీటిని డ్యామ్‌లో నిల్వ చేసి రైతులకు ఒకపంటకు నీరు అందిస్తామని చెప్పారు. డ్యాంలోని అత్యధిక నీటిని కర్ణాటక వినియోగించుకుంటుందని, దీంతో జవాబుదారీ మనదే, గేట్‌ను మరమ్మత్తు చేయిస్తామని తెలిపారు.

క్లుప్తంగా

3 వేల కేపీఎస్ పాఠశాలలు ఏర్పాటు చేస్తాం



మాట్లాడుతున్న మంత్రి మధుబంగారప్ప

తుమకూరు : మూడేళ్లలో రాష్ట్రంలో సుమారు 3 వేలకు పైగా కేపీఎస్ పాఠసాలలు ఏర్పాటు చేస్తామని పాఠశాలల విద్యాశాఖమంత్రి మధు బంగారప్ప తెలిపారు. తుమకూరు జరిగిన విద్యాశాఖ సమీక్షక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అన్ని వర్గాల పిల్లలకు నాణ్యతతో కూడిన విద్యను అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. అందులో భాగంగా ఈ ఏడాదిలో సుమారు 500 కేపీఎస్ పాఠశాలలను ప్రారంభించామన్నారు.

చెత్త లారీ ఢీకొని వృద్ధురాలి మృతి

యశవంతపుర: కుమార్తె యోగక్షేమాలను కనుగొని తిరిగి స్వంతూరుకు పయనమైన వృద్ధురాలిని బీబీఎంపీ చెత్తలారీ బలితీసుకుంది. కుమార్తె చూస్తుండగానే ఈ ఘోరం జరిగింది. ఈ ఘటన సోమవారం కుమారస్వామి లేఔట్ ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. ఏపీలోని చిత్తూరుకు చెందిన అదిలక్ష్మమ్మ(69) కుమార్తె జంబూసవారి దిన్నెలో నివాసం ఉంటోంది. అదిలక్ష్మమ్మ కొద్ది రోజుల క్రితం కుమార్తె ఇంటికి వచ్చింది. సోమవారం ఉదయం చిత్తూరు వెళ్లేందుకు కూతురుతో కలిసి రోడ్డు దాటుతుండగా బీబీఎంపీ చెత్త లారీ ఢీకొంది. ఘటనలో ఆదిలక్ష్మమ్మ ఘటన స్థలంలోనే మృతి చెందింది. కుమారస్వామిలేఔట్ పోలీసులు లారీ డ్రైవర్‌ను అరెస్ట్ చేశారు.

రేషన్ బియ్యం పట్టివేత

హోసూరు: క్రిష్ణగిరి ఆహారభద్రతా శాఖాధికారి పెరియస్వామి నేతృత్వంలో అధికార్లు ఆదివారం సాయంత్రం హోసూరు జూజువాడి ప్రాంతంలో వాహన తనిఖీలు నిర్వహించారు. బెంగళూరు ఆనేకల్ ప్రాంతానికి చెందిన మనోహర్(44), మరొకరి నుంచి 100 కేజీల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వారిని మరింత విచారణ జరిపి మొత్తం 5 టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనపరుచుకొన్నారు. నిందితులను సిఫ్‌కాట్ పోలీసులకు అప్పగించారు.

పాదయాత్రపై పార్టీ నిర్ణయం తీసుకుంటుంది

శివాజీనగర: బీజేపీలో అసంతృప్తి నాయకులు కూడల సంగమ నుంచి బళ్లారి వరకు పాదయాత్ర చేపట్టేందుకు ఇప్పటి వరకు పార్టీ అధికారిక అనుమతి ఇవ్వలేదని విధానపరిషత్ ప్రతిపక్ష నేత ఛలవాది నారాయణస్వామి అన్నారు. సోమవారం ఆయన బెంగళూరులో విలేకరులతో మాట్లాడారు. ముడా పాదయాత్రను యత్నాళ్ వ్యతిరేకించలేదన్నారు. విజయేంద్ర పార్టీ రాష్ట్ర అధ్యక్షుడని, అధ్యక్షుడిని కాదని ఎవ్వరు ఏమి చేయలేరన్నారు. పాదయాత్రపై పార్టీనే నిర్ణయం తీసుకుంటుందన్నారు. సీఎం సిద్దరామయ్యకు గౌరవముంటే తక్షణమే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

సరైన పరిహారం ఇవ్వాలి

రాయచూరు రూరల్: బెళగావి-రాయచూరు భారత మాల పథకంలో భాగంగా భూములు కోల్పోయిన రైతులకు సరైన పరిహారం ఇవ్వాలని రైతు పోరాట సమితి సంచాలకులు శరణప్ప డిమాండ్ చేశారు. మార్కెట్ ధర కంటే ప్రాధికార అధికారులు తక్కువ ధరలకు భూములను బలవంతంగా స్వాధీనం చేసుకున్నారని ఆరోపించారు. ఈ విషయంలో కలెక్టర్, ఎమ్మెల్యే, ఎంపీలు జోక్యం చేసుకుని బాధిత రైతులకు న్యాయం చేయాలని కోరారు.

వీరభద్రదేవర వేడుకలకు ప్రధానిని ఆహ్వానిస్తాం

హుబ్లీ: ఈసారి భాద్రపద మాసం తొలి మంగళవారం ఢిల్లీలో ఆచరించే జాతీయ స్థాయి శ్రీ వీరభద్రదేవర జయంతి వేడుకల ప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీని ఆహ్వానిస్తామని కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి తెలిపారు. నగరంలో మంత్రి నివాసానికి వచ్చిన బెళగావి, ఉక్కేరి శ్రీ గురుశాంతేశ్వర మఠం చంద్రశేఖర శివాచార్య స్వామి, బాగొజి కొప్ప హిరేమఠం శివలింగ మురుగరాజేంద్ర శివాచార్య స్వామిల ద్వారా బెంగళూరు వీరశైవ లింగాయత్ సంఘం వేదిక జాతీయ అధ్యక్షుడు ప్రదీప్ కంకనవాడి ఆహ్వానపత్రాన్ని స్వీకరించాక ఆయన ఈ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జోషిని స్వామీజీలు ఆశీర్వదించారు.

మద్యం, గంజాయి అడ్డుకట్టపై అవగాహన



అవగాహన కలిగిస్తున్న పోలీసులు

శ్రీనివాసపురం: గ్రామీణ ప్రాంతాలలో అక్రమంగా మద్యం, గంజాయి విక్రయాలు యథేచ్ఛగా జరుగుతున్నట్లు సమాచారం అందడంతో ఆబ్కారి పోలీస్ సూపరిన్‌టెండ్ శ్రీశైల్ నేతృత్వంలో పోలీసులు భీరగానహళ్లి గ్రామానికి వెళ్లి గ్రామస్తులకు అవగాహన కలిగించారు. నకిలీ మద్యం సేవించడం వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. అక్రమ మద్యం విక్రయం, కొనుగోలు చేస్తే తీసుకునే చట్ట పరమైన చర్యలపై తెలిపారు. అక్రమ మద్యం విక్రయాలను అడ్డుకోవడంలో పోలీసులకు సహకరించాలన్నారు అధికారులు ఎంఆర్ సుమ, బిఎస్ రోహిత్, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

ముమ్మాటికి నిర్లక్ష్యమే

- టీబీ డ్యామ్‌ను పరిశీలించిన బీజేపీ నేతలు బొమ్మై, విజయేంద్ర, అశోక్



మీడియాతో మాట్లాడుతున్న బసవరాజ్ బొమ్మై, చిత్రంలో విజయేంద్ర, అశోక్



డ్యామ్ నుంచి వెళ్లిపోతున్న నీరు

హొసపేటి: కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు తాగు, సాగునీరు అందించే తుంగభద్ర గేట్ కొట్టుకుపోవడంతో రిజర్వాయర్‌ను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై.విజయేంద్ర, మాజీ సీఎం బసవరాజ్ బొమ్మై, ప్రతిపక్ష నాయకుడు ఆర్ అశోక్ సోమవారం సందర్శించి, తెగిపోయిన 19వ క్రస్ట్‌గేట్‌ను పరిశీలించారు. గేట్ చైన్ లింక్ ఊడిన విషయంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాజీ మంత్రి బసవరాజ్ బొమ్మై విలేకరులతో మాట్లాడుతూ... 19 గేట్ చైన్ లింక్ తెగి క్రస్ట్ గేట్ ఊడి పోవడంతో పెద్ద ఎత్తున నీరు వృథాగా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. అదే విధంగా తుంగభద్ర మండలి అధికారులు నిర్లక్ష్యమని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ గేట్ కొట్టుకుపోవడంపై అధికారులు, ప్రభుత్వం తప్పు ఏమీ లేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ ఘటనకు పూర్తి బాధ్యత ప్రభుత్వానిదన్నారు. దాదాపు 60 టీఎంసీలు నీరు వృథాగా పోతోందన్నారు. ఆయకట్టు కింద 12.50 లక్షల ఎకరాలలో రైతులకు ఇక నీరు లభించడం కష్టమన్నారు. ఆయకట్టు రైతులకు ఎకరాకు రూ. 50 వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా దొడ్డగౌడ పాటిల్, ఎమ్మెల్సీ హేమలతా నాయక్, మాజీ మంత్రులు హాలప్ప ఆచార్, ఆనంద్ సింగ్, మాజీ ఎమ్మెల్యే పారణమునవళ్లి, కాడా మాజీ అధ్యక్షుడు తిప్పేరుద్రస్వామి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి శరణు తూచికెరె, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నవీన్ గులగన్నవర్, జేడీఎస్ కోర్ కమిటీ సభ్యుడు సీవీ చంద్రశేఖర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్.బసవరాజ కావతార్ తదితరులు పాల్గొన్నారు.

హెక్టార్‌కు రూ. 50 వేల పరిహారం ఇవ్వాలి : బీవై విజయేంద్ర

టీబీ డ్యామ్ గేట్ ఊడిపోవడం లక్షల క్యూసెక్కుల నీరు వృథాగా పోవడానికి రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యమని కారణమని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బీవై విజయేంద్ర తెలిపారు. సోమవారం ఆయన డ్యామ్‌ను సందర్శించి విలేకరులతో మాట్లాడారు. తుంగభద్ర జలాశయం జీవనాడి అని, మూడు రాష్ట్రల రైతులకు సాగునీరు అందుతోందన్నారు. ఈసారి వరుణుడి దయతో రిజర్వాయర్ నిండటంతో రైతుల్లో ఆనందం ఉన్న తరుణంలో ఇలా జరగడం ప్రభుత్వ నిర్లక్ష్యమేనన్నారు. డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ డ్యామ్‌ను సందర్శించి గేట్ ఊడిపోవడం అధికారులు, ప్రభుత్వ బాధ్యత కాదని చెప్పడం సమంజసం కాదన్నారు. అయితే దీనికి బాధ్యులు ఎవరని విజయేంద్ర ప్రశ్నించారు. హెక్టార్‌కు రూ. 50 వేల పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తామన్నారు. నిపుణులు ఇచ్చిన నివేదికను ఎందుకు పరిగణంలోకి తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రైతుల కష్టాలపై స్పందించడం ప్రభుత్వ కర్తవ్యమన్నారు. కానీ ఈ ప్రభుత్వం రైతులపై నిర్లక్ష్యం చూపుతోందని ఆరోపించారు. డ్యాం కింద రెండవ పంటకు సాగు జలాలు అందుతాయా? లేదా అనేది ప్రశ్నార్థకమన్నారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష నాయకుడు ఆర్.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వర్షం నీరు సజావుగా ముందుకెళ్లాలి

- అధికారులను ఆదేశించిన డిప్యూటీ సీఎం డీకే శివకుమార్
- ముంపు ప్రాంతాల్లో పర్యటన



రాజకాలువను పరిశీలిస్తున్న డీకే.శివకుమార్

బనశంకరి: బెంగళూరు నగరంలో కుంభవృష్టితో అతలాకుతలమైన ప్రాంతాల్లో డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ సోమవారం పర్యటించారు. హెబ్బాల సమీపంలోని యోగేశ్వరనగర, నాగవార జంక్షన్, హెచ్‌బీఆర్ లేఔట్ 5వ బ్లాక్, సిల్క్‌బోర్డు, జయదేవజంక్షన్ తదితర ముంపు ప్రాంతాల్లో అధికారులతో కలిసి పర్యటించారు.యోగేశ్వరనగర పైవంతెన వద్ద నీరు ముందుకు వెళ్లకుండా అడ్డుగా ఉన్న కట్టడాల వ్యర్థాలను డీకే శివకుమార్ పరిశీలించారు. తక్షణం వాటిని తొలగించాలని అధికారులను ఆదేశించారు. సిల్క్‌బోర్డు జంక్షన్ వద్ద రాజకాలువలో పూడిక తొలగించకపోవడాన్ని గమనించారు. బీఎంఆర్‌సీఎల్ పనులు చేపడుతున్న ప్రాంతాల్లో వ్యర్థాలు రాజకాలువలో ఉంటే తక్షణం తొలగించాలని ఆదేశించారు. భారీ వర్షంతో అర అడుగు మేర గుంతలు ఏర్పడ్డాయని వీటిని తక్షణం పూడ్చివేయాలని సూచించారు. ఎక్కడెక్కడ గుంతలు పడ్డాయో ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తే తక్షణం మరమ్మతులు చేపడుతామన్నారు. రాజకాలువలకు రక్షణగోడల నిర్మాణం చేస్తామని తెలిపారు. అనేకచోట్ల ఫుట్‌పాత్‌లపై కట్టడ నిర్మాణ వ్యర్థాలు పడేశారని, ఇకపై పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షం నీరు ముందుకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. మారుతి సేవానగరలో చెట్టు కొమ్మ విరిగి గాయపడి బాణసవాడి ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను డిప్యూటీ సీఎం పరామర్శించారు. వైద్య ఖర్చులను బీబీఎంపీ భరిస్తుందని తెలిపారు. బెంగళూరు నగర వ్యాప్తంగా ఎండిన చెట్టుకొమ్మలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని పాత్రికేయులు అడిగిన ప్రశ్నకు డీకే శివకుమార్ సమాధానం ఇచ్చారు.

బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ లేదు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మరిస్వామి

కోలారు: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిలువరించి వారికి రక్షణగా నిలబడాలని, అదే విధంగా హిందూ ఆలయాలను పునర్ నిర్మించాలని గృహ రక్షక దళ నివృత్త కమాండర్ మరిస్వామి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని పాత్రికేయుల భవనంలో విశ్వ హిందూ పరిషత్, హిందూ హితరోణా వేదిక ఆధ్వర్యంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బంగ్లాదేశ్‌లో మొదటి నుంచి హిందువులపై దాడులు జరుగుతున్నాయని, అక్కడి ప్రభుత్వం హిందువులకు తగిన రక్షణ కల్పించడంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందన్నారు,. దేశ విభజన సమయంలో 38 శాతం మంది ఉన్న హిందువులు నేడు కేవలం 8 శాతం మాత్రమే ఉన్నారన్నారు. అదే విధంగా జీహాదీలు భారతదేశంలోకి కూడా చొరబడే అవకాశం ఉందని, దీన్ని తీవ్రంగా పరిగణించాలన్నారు. విలేకరుల సమావేశంలో వివిధ సంఘటనల కార్యకర్తలు హారోహళ్లి వెంకటేష్, ఎంపి నారాయణస్వామి, వెంకటాచలపతి, వాసు, చంద్రకుమార్, తిమ్మరాయప్ప పాల్గొన్నారు.



సందర్శకుల రద్దీ

ఫ్లవర్ షోలో సందడి

బనశంకరి: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా లాల్‌బాగ్‌లో ఏర్పాటుచేసిన 216వ ఫల పుష్ప ప్రదర్శన సందర్శకులతో సందడిగా మారింది. ప్రదర్శన ఐదో రోజు సోమవారం కూడా రద్దీ కనబడింది. గ్లాస్‌హౌస్‌లో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ థీమ్, పార్లమెంటు పుష్ప ఆకృతులు ఆకట్టుకుంటున్నాయి. ఆదివారం 68 వేలమంది సందర్శించగా టికెట్ల ద్వారా రూ.42.32 లక్షల నగదు వసూలైంది. సోమవారం కూడా సందర్శకులు తరలివచ్చి పుష్ప అందాలను వీక్షిస్తూ ఫోటోలు సెల్ఫీలు తీసుకున్నారు.



పూల నెమలి

అడవుల విధ్వంసం పర్యావరణానికి ప్రమాదం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కెజీఎఫ్: మానవుడు తన స్వార్థం కోసం చెట్లను నరికివేస్తుండడంతో పర్యావరణంలో విపరీత మార్పులు వచ్చి ప్రకృతి విపత్తులు సంభవిస్తున్నాయని ఎమ్మెల్యే రూపా శశిధర్ తెలిపారు. సోమవారం నగర సమీపంలోని తాలూకా పంచాయతీ సభాంగణంలో జిల్లా పంచాయతీ, కేజీఎఫ్ తాలూకా పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామ పంచాయతీ సభ్యులు, పంచాయతీ అభివృద్ధి వాతావరణ మార్పు, వాతావరణ క్రియలలో గ్రామ పంచాయతీల పాత్రపై అనే అంశంపై నిర్వహించిన సమాలోచనా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మన చుట్టు పక్కల పరిసరాలను జాగ్రత్తగా కాపాడుకోవాల్సి ఉంది. పరిసర సంరక్షణలో గ్రామ పంచాయతీలకు మహత్తరమైన పాత్ర ఉందన్నారు. గ్రామాలలో అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణ కోసం కోట్ల రూపాయలను ఖర్చు చేసే అధికారాన్ని పంచాయతీలకు ప్రభుత్వం ఇచ్చింది. దీనిని గ్రామ పంచాయతీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గాంధీ కన్న కలలు నెరవేడ్చడానికి పంచాయతీలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నివృత్త అంబుడ్స్‌మెన్ శ్రీరామయ్య, గ్రామ వికాస సంస్థ అధికారి ఎంవిఎస్ రావ్, పారాండహళ్లి గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు వైవాణి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఐపీడీ సాలప్ప నివేదిక అమలుకు డిమాండ్

శివాజీనగర: బీబీఎంపీ పారిశుద్య కార్మికుల సంక్షేమం కోసం ఐపీడీ సాలప్ప నివేదికను అమలు పరుస్తామని ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని బీబీఎంపీ పౌర కార్మికులు, డ్రైవర్ల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు వెంకటరమణ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిందిన బెంగళూరు నగరాన్ని శుభ్రంగా ఉంచుతున్న పారిశుద్య కార్మికుల సంక్షేమంపై ప్రభుత్వానికి, అధికారులకు చిత్తశుద్ధి లేదన్నారు. అందువల్లనే ఐపీడీ సాలప్ప నివేదిక అమలుకు నోచుకోలేదన్నారు. పౌర కార్మికుల సంఘాలతో ఈ నెల 14న శివానంద సర్కిల్ వద్ద ఉన్న గాంధీభవన్ బాపూ సభామందిరంలో చర్చాగోష్ఠి నిర్వహించి తగు నిర్ణయం తీసుకుంటామన్నారు. కార్మికులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యధ్యక్షుడు సూర్యచంద్ర, మంజణ్ణ, ప్రధానకార్యదర్శులు ఓబులేశు,, త్యాగరాజు, హెబ్బారు సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

హక్కు పత్రాల కోసం వినతి

కెజీఎఫ్: రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో ఉన్న ఎన్‌జి హుల్కూరు గ్రామ పంచాయతీకి చెందిన పంతనహళ్లి గ్రామంలో ప్రభుత్వ గోమాళం భూమిని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కొంతమంది తమదే అంటు గుడిసెలు వేసుకున్నారని, ఇదేమిటని ప్రశ్నిస్తే భూమి తమకే మంజూరైందని చెబుతున్నారని గ్రామస్తులు ఎమ్మెల్యేకు విన్నవించారు. తాము 15 సంవత్సరాలుగా తాము ఇక్కడే నివాసంటున్నా తాలూకా యంత్రాంగం తమకు హక్కు పత్రాలను ఇవ్వలేదని ఆరోపించారు. తాలూకా యంత్రాంగంపై ఒత్తిడి తీసుకు వచ్చి తమకు హక్కు పత్రాలను ఇప్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తాను తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేపడతామని హెచ్చరించారు. వినతిపత్రం స్వీకరించిన ఎమ్మెల్యే రూపా శశిధర్ మాట్లాడుతూ... తహసీల్దార్‌తో చర్చించి రెండు రోజులలోగా హక్కు పత్రాలు అందేలా చేస్తామని హామీ ఇచ్చారు. వినతిపత్రం సమర్పించిన వారిలో జైభీం శ్రీనివాస్, రాజేష్, పంతనహళ్లి గ్రామస్తులు ఉన్నారు.

కార్మిక నాయకుడు శ్యామణ్ణకు సన్మానం



శ్యామణ్ణ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

కోలారు: కట్టడ కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని ఈ నెల 5న ఛలో ముఖ్యమంత్రి ఇంటి ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కృషి చేసిన కట్టడ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్యామణ్ణరెడ్డిని జిల్లా కట్టడ కార్మికుల సంఘం పదాధికారులు సోమవారం నగరంలోని కట్టడ కార్మికుల సంఘం కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా కట్టడ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హొన్నేనహళ్లి యల్లప్ప మాట్లాడుతూ కట్టడ కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లడంలో శ్యామణ్ణరెడ్డి ఎంతో శ్రమించారన్నారు. ఈయన కృషి వల్లనే ప్రభుత్వం దిగివచ్చి కట్టడ కార్మిక సంఘం సభ్యులతో చర్చలకు సిద్ధమైందన్నారు. ఈ సందర్భంగా కట్టడ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి మురళీధర్, మాలా చలపతి తదితరులు పాల్గొన్నారు.



బెంగళూరులో రాత్రి భారీ వర్షం, ఉదయం ప్రజా సంఘాల ధర్నాల వల్ల శేషాద్రి రోడ్డులో స్తంభించిన వాహన సంచారం

చైన్ స్నాచర్ల అరెస్టు



పోలీసులు అరెస్టు చేసిన నిందితులు

కోలారు: ఇద్దరి చైన్ స్నాచర్లను అరెస్ట్ చేసిన పోలీసులు వారి వద్ద నుంచి రూ. 3.7 లక్షల విలువైన బంగారు చైన్‌లను స్వాధీనం చేసుకున్నారు. బెంగళూరు రూరల్ జిల్లా దేవనహళ్లి తాలూకా చెన్నరాయపట్టణ గ్రామానికి చెందిన అరుణ్‌కుమార్, తమిళనాడు కృష్ణగిరి జిల్లా సూలగిరి తాలూకా సిబిం గ్రామానికి చెందిన దిలీప్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరు నగర సమీపంలోని గాజుల దిన్నె, ఛత్రకోడిహళ్లి గ్రామం, నగరంలోని సెయింట్ ఆన్స్ పాఠశాల ముందు చైన్ స్నాచింగ్‌లకు పాల్పడ్డారు.

వాహనానికి శ్రద్ధాంజలి ఘటించేశారు !



మండ్యలో వినియోగంలో లేని శ్రద్ధాంజలి వాహనం

మండ్య: పార్థివదేహాలను గౌరవంగా ఆస్పత్రి నుంచి రుద్రభూమికి తరలించేందుకు ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ శ్రద్ధాంజలి వాహనాల పేరుతో ఏర్పాటు చేసిన వాహనాల నిర్వహణ అధ్వానంగా మారింది. మరమ్మతులు చేయించేందుకు, డ్రైవర్లకు వేతనాలు ఇచ్చేందుకు డబ్బు లేక వాహనాలను పక్కన పెట్టేశారు. దీంతో పేద కుటుంబాలవారు ఆస్పత్రిలో మృతి చెందితే భౌతికకాయాలను శ్మశానానికి తీసుకెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి వాహనాలను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

యడ్డి కేసుపై సర్కారు దృష్టి

శివాజీనగర: బీజేపీ మాజీ సీఎం యడియూరప్పపై ఉన్న పోక్సో కేసుకు మళ్లీ ప్రాణం వచ్చింది. సీఎం సిద్దరామయ్యకు వ్యతిరేకంగా బీజేపీ పోరాటం తీవ్రం చేయగా, కాంగ్రెస్ సర్కారు యడియూరప్పపై దృష్టి సారించింది. ఈ కేసు విచారణను తీవ్రతరం చేసింది. యడ్డి అరెస్ట్‌పై ఉన్న హైకోర్టు స్టే ఎత్తివేతకు కసరత్తు జరుపుతోంది. స్టే ఎత్తివేయించి అరెస్టు చేయాలని భావిస్తోంది. సిద్దరామయ్య వ్యతిరేకంగా గవర్నర్ ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇస్తే, యడ్డిపై చర్యలను తీవ్రం చేయాలని యోచిస్తోంది.

స్వాతంత్య్ర సమర యోధులకు అరుదైన గౌరవం

మైసూరు : స్వాతంత్ర్య సమరయోధులకు అరుదైన గౌరవం దక్కింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా యంత్రాంగం ముగ్గురు స్వాతంత్ర్య సమర యోధులను ఇంటికి వెళ్లి సన్మానించింది. మైసూరులోని బోగాదిలో ఉన్న వై.సి.రేవణ్ణ, సరస్వతిపురలో ఉన్న ఎం.సోమశేఖరయ్య, కేఆర్ మోహల్లాలో ఉంటున్న గోపాల అయ్యంగార్‌ను తహసీల్దార్ మహేష్‌కుమార్ ఘనంగా సన్మానించారు.

భారీ వాహనాల పార్కింగ్‌తో అవస్థలు

- పాఠశాలకు రావడానికి విద్యార్థులు నానా తంటాలు



కళాశాల ముందు నిలిపిన భారీ వాహనం

మాలూరు: తాలూకాలోని లక్కూరు గ్రామంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందే భారీ వాహనాలను నిలుపుతుండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లక్కూరు గ్రామ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సంబంధించిన కళాశాల, ఉన్నత పాఠశాలలో 300 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. గ్రామంలోని సీనియర్ సిటిజన్‌లు, మహిళలు, వృద్ధులు ఈ కళాశాల ప్రాంగణంలోనే వాయు విహారం చేస్తారు. అయితే కళాశాల ముందే టిప్పర్ లారీలు, జేసీబీలు, ట్రాక్టర్లు నిలుపుతుండడంతో వీరు కళాశాల ప్రాంగణంలోకి వెళ్లడానికి నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కళాశాల సిబ్బంది వాహనాలను నిలపకూడదని చెప్పినా వారు పట్టించుకోవడం లేదు. భారీ వాహనాలతో రహదారి గుంతలమయంగా మారింది.

రెండు ఇళ్లలో చోరీ

రాయచూరు రూరల్: రాయచూరు నగరంలో రెండు ఇళ్లలో చోరీ జరిగింది. ఆదివారం రాత్రి సుచిత్ర కాలనీ, శ్రీకృష్ణ దేవరాయ కాలనీ, ఆశీర్వాద్ కాలనీలలో దొంగలు పడ్డారు. ఓ ఇంటిలో రెండు తులాల బంగారు నగలు, రూ. 25 వేల నగదు, మరో ఇంటిలో నాలుగు తులాల బంగారు, రూ. 50 వేల నగదు దోచుకున్నారు. అదే విధంగా జాతీయ రహదారి కార్యాలయంలో కూడా దొంగలు పడ్డారు. నేతాజీ నగర పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

దేవదుర్గ సీఐ సస్పెండ్

రాయచూరు రూరల్: రాయచూరు జిల్లా దేవదుర్గ సీఐ అశోక్‌ను సస్పెండ్ చేస్తూ బళ్లారి ఐజీపీ ఆదేశాలు జారీ చేశారు. దేవదుర్గలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతున్నా చర్యలు తీసుకోలేదనే ఆరోపణలపై సీఐని సస్పెండ్ చేశారు.

క్లుప్తంగా

సీబీఐతో దర్యాప్తు చేయించాలి



ఆందోళన చేస్తున్న కర్ణాటక సేన పడే నాయకులు

మైసూరు: మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార(మూడా) అక్రమాల కేసును సీబీఐకి అప్పగించాలని కర్ణాటక సేన పడె నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మైసూరులోని పాత కలెక్టరేట్ రోడ్డులో ఆందోళన నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నాయకులు మాట్లాడుతూ ముడా అక్రమాల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని, వాటికి వెలికి తీయాలంటే సీబీఐతోనే సాధ్యమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కేసును సీబీఐకి అప్పగించి చిత్తశుద్ధి చాటు కోవాలని డిమాండ్ చేశారు.

పెట్టుబడులు పెట్టించి వంచన

దొడ్డబళ్లాపురం: వాట్సాప్‌లో లింక్ పంపిన కేటుగాళ్లు ఏకంగా రూ.12.70 లక్షలు కొల్లగొట్టారు. ఈ ఘటన రామనగరలో చోటుచేసుకుంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఆన్‌లైన్ సర్వీస్ లింక్ పేరున ఒక అధ్యాపకుడి ఫోన్ వాట్సాప్‌కు లింక్ వచ్చింది. ఓపెన్ చేయగానే బ్లాక్ ట్రేడింగ్‌లో మంచి లాభాలు ఉన్నాయని, పెట్టుబడి పెట్టాలని పేర్కొన్న సందేశం ఉంది. దీంతో లెక్చరర్ వారు పంపించిన ఫాం నింపి బ్యాంక్ వివరాలు నమోదు చేశారు. అనంతరం జులై 4 నుంచి 6వ తేదీ వరకూ మొత్తం పలు బ్యాంక్ ఖాతాలకు రూ.12.70 లక్షలు బదిలీ చేశాడు. ఎంత ఎక్కువ పెట్టుబడి పెడితే అత లాభం వస్తుందని కేటుగాళ్లు ఆశ చూపారు. తరువాత కమిషన్, వడ్డీ, అసలు నగదు కూడా తిరిగి ఇవ్వకపోవడంతో మోస పోయానని తెలుసుకున్న బాధితుడు రామనగర సీఈఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

హిందువులపై దాడులను అరికట్టాలి



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఆందోళనకారులు

మైసూరు: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఎమ్మెల్యే టి.ఎస్.శ్రీవత్స ఆధ్వర్యంలో కార్యకర్తలు మైసూరు పాలికె కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. బంగ్లాదేశ్‌లో జరుగుతున్న అల్లర్లలో భారతీయులు బలవుతున్నారన్నారు. దుండగులు హిందువులను లక్ష్యంగా చేసుకొని హతమార్చుతున్నారన్నారు. హిందువులకు రక్షణ కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

గౌరిబిదనూరు: పొగాకు పదార్థాలు ఆరోగ్యానికి చేటని, వాటికి దూరంగా ఉండాలని తొండేబావి వీఆర్‌డబ్ల్యూ రవిచంద్రారెడ్డి అన్నారు. బెళచిక్కనహళ్లి అప్పర్ ప్రైమరీ పాఠశాలలో సోమవారం ఆయన మత్తు పదార్థాలు, వాటి వినియోగంతో తలెత్తే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాలకు వందమీటర్ల పరిధిలో బీడీ, సిగరెట్లు విక్రయించడం నేరమని తెలిపారు. యువత దేశాభివృద్ధిలో ప్రధాన పాత్రధారులని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

నాట్లు వేస్తుండగా పిడుగుపాటు



చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

దొడ్డబళ్లాపురం: పిడుగుపాటుకు 15మంది గాయపడ్డ సంఘటన హాసన్ తాలూకా బేలూరు తాలూకా కోరలగద్దె గ్రామంలో చోటుచేసుకుంది. కేబీ చంద్రు అనే రైతుకు చెందిన పొలంలో 25 మంది కూలీలు వరి నాట్లు వేస్తుండగా సమీపంలోనే పిడుగు పడింది. దీంతో 15 మంది స్పృహ తప్పిపడిపోయారు. వారిని సకలేశపురలోని క్రాఫర్డ్ ఆస్పత్రికి తరలించారు. వీరిలో కొందరి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో హాసన్ హిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

టికెట్ ఇవ్వకపోతే ఇండిపెండెంట్‌గా పోటీ

దొడ్డబళ్లాపురం: చెన్నపట్టణ ఉప ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించకపోతే ఇండిపెండెంట్‌గా బరిలో ఉంటానని బీజేపీ ఎమ్మెల్సీ సీపీ యోగేశ్వర్ తెలిపారు. సోమవారం ఆయన ఢిల్లీకి వెళ్లే ముందు మీడియాతో మాట్లాడారు. ఇండిపెండెంట్‌గా గెలిచి ఎన్‌డీఏకి మద్దతు ఇస్తానన్నారు. చెన్నపట్టణ తాలూకా ప్రజలు ఈసారి తనను ఆశీర్వదిస్తారనే నమ్మకం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరే ఆలోచన లేదన్నారు. తనకూ కుమారస్వామికి భిన్నాభిప్రాయాలు లేవన్నారు. తమ ఇద్దరి మధ్య చీలిక తీసుకురావాలని డీకే శివకుమార్ ప్రయత్నిస్తున్నారని, అందుకే ఆధారరహిత వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. కుమారస్వామి తనకు మద్దతు ఇస్తారనే నమ్మకం ఉందన్నారు.

బెంగళూరు.. కేరాఫ్ గుంతల రోడ్లు

- వర్షాల రాకతో మరింత అధ్వాన్నం
- వాహనదారులకు తీవ్ర వెతలు
- బీబీఎంపీ వాగ్దానాలు వట్టిమాటే
- ప్రమాదాలు నిత్యకృత్యం



నగరవ్యాప్తంగా ఇటువంటి గుంతలు కనిపిస్తాయి



ఇటీవల బెంగళూరు శాంతినగర వద్ద డివైడర్‌ను ఢీకొన్న మినీ లారీ

సాక్షి, బెంగళూరు: దేశంలో కాస్మోపాలిటన్ నగరాల్లో ముఖ్యమైనది, దేశ ఐటీ రంగానికి గుండెకాయ వంటి బెంగళూరులో రోడ్ల పరిస్థితి అంత సజావుగా లేదు. విపరీతమైన ట్రాఫిక్ సమస్య ఉంటోంది. కిలోమీటరు ప్రయాణానికి గంట పడుతుంది. ఇది చాలదన్నట్లు ఎగుడుదిగుడు, గుంతల రోడ్లు ప్రజల సహనానికి పరీక్షగా మారాయి. దీంతో చిన్నా చితకా ప్రమాదాలు కూడా పెరిగాయి. నిర్వహణ లోపం, పనుల్లో నాణ్యత లోపం కారణంగా బెంగళూరులోని చాలా వరకు రోడ్లు గుంతల మయం అయ్యాయి. ఇటీవల కురుస్తున్న వర్షాల ధాటికి ఈ రోడ్లు మరింత అధ్వాన్నంగా మారాయి. అధిక రద్దీ, ఇరుకు రోడ్ల వల్ల పెద్ద వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి.

తారు లేచిపోయింది

స్మార్ట్ సిటీ బ్రాండ్ బెంగళూరు పేర్లకు ఈ గుంతల రోడ్లు మాయని మచ్చగా మారుతున్నాయి. బెంగళూరులో కొన్ని నెలల క్రితమే కోట్లాది రూపాయాలు ఖర్చు చేసి రోడ్లపై గుంతలను పూడ్చేందుకు తారును బీబీఎంపీ అధికారులు వేశారు. అయితే వర్షాల వల్ల ఆ తార్ మొత్తం పక్కకు వెళ్లిపోయింది. దీంతో మళ్లీ రోడ్లన్నీ గుంతలుగా మారాయి. ఈ వర్షాల వల్ల నాణ్యత లేని పనులు తేటతెల్లమయ్యాయి. ఈ గుంతల రోడ్లలో ప్రయాణిస్తూ ప్రయాణికులు ఇబ్బందులు గురవుతున్నారు. ఎంతో మంది రోడ్డుప్రమాదాలకు గురై తీవ్రంగా గాయపడుతున్నారు. వీఐపీలు నివసించే ప్రాంతాల్లో వైట్ టాపింగ్ ద్వారా రోడ్లను బాగు చేశారనే ఆరోపణలున్నాయి. అనేక ప్రాంతాలకు వైట్ టాపింగ్ భాగ్యం దక్కనేలేదు.

గుంతలతో యాక్సిడెంట్లు

కొన్ని రోడ్లలో పెద్ద పెద్ద గుంతలు తయారై వాన నీరు వాటిలో చేరుతోంది. దీని వల్ల ద్విచక్ర వాహనదారులు తెలియక ఆ గుంతల మీద నుంచి వెళ్లినప్పుడు పట్టు తప్పి పడిపోవడం మామూలైంది. శక్తికేంద్రం విధానసౌధ చుట్టుపక్కల రోడ్లు కూడా ఇలాంటి దీన పరిస్థితికి మినహాయింపు కాదు. వర్షం వచ్చిందంటే చాలు రోడ్లలోని గుంతల్లో వర్షపు నీరుచేరుకుని వాహనదారులకు ఇక్కట్లు తెచ్చి పెడుతోంది. రోడ్ల మరమ్మత్తులు, అభివృద్ధి కోసం బీబీఎంపీ ప్రతి ఏటా కోట్లాది రూపాయలను ఖర్చు చేస్తోంది . అయినప్పటికీ గుంతలు లేని రోడ్లు చూస్తామంటే కనీసం ఒక కిలోమీటర్ రోడ్డు కూడా కనిపించదు.

ఇక్కడ మరీ అధికం

ఔటర్ రింగ్ రోడ్డు, హోసకెరెహళ్లి ప్రధాన రహదారి, మైసూరు రోడ్డు, మైసూరు బ్యాంకు సర్కిల్, టౌన్‌హాల్ రోడ్డు, ఎం. కృష్ణప్ప రోడ్డు, ఓటీసీ రోడ్డు, సీసీబీ కార్యాలయం ఎదురుగా ఉన్న రోడ్లు ఎక్కువగా గుంతలు పడి ఉన్నాయి. వర్షాల వల్ల రోజురోజుకి ఈ గోతులు మరింత పెరుగుతున్నాయే తప్ప తగ్గడం లేదు. ఈ గుంతలను పూడ్చాల్సిందిగా మంత్రులు బీబీఎంపీ కమిషనర్ ఇతర అధికారులకు ఆదేశాలు ఇచ్చినప్పటికీ అవి కార్యరూపం దాల్చడం లేదు. గుంతలను పూడ్చాలని ప్రభుత్వం, బీబీఎంపీ గడువు ప్రకటించడం ప్రతి ఏటా జరిగే తంతుగా మారిపోయింది. యాప్‌లు, హెల్ప్‌లైన్ల ద్వారా సమాచారం ఇస్తే పూడ్చివేస్తామని ప్రతి ఏటా బీబీఎంపీ కమిషనర్ ప్రకటిస్తారు. కానీ ప్రతి వీధిలో గుంతలే ఉన్నట్లు నగర నివాసుల సంఘాలు ఆరోపించాయి.

మహదేవపురలో..

భారీ సంఖ్యలో ఐటీ కంపెనీలు ఉండే మహదేవపుర నియోజకవర్గంలో కూడా పరిస్థితి మరింత దయనీంగా ఉంది. అక్కడి రోడ్లు పూర్తిగా పాడయ్యాయి. బీబీఎంపీ జోన్ల పైకి మహదేవపుర జోన్ నుంచి అత్యధిక ఆదాయం లభిస్తోంది. ఈ నేపథ్యంలో ఇక్కడి మౌలిక వసతులు కల్పించడంలో మాత్రం అధికారులు నిర్లక్ష్యం చూపిస్తున్నారు. ఒళగెరె టీ జంక్షన్ వద్ద రోడ్డు నిండా గుంతలు ఉన్నాయి. పాణత్తూరు ఎస్ క్రాస్, రైల్వే అండర్‌పాస్ వద్ద రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. ఇక్కడి గుంతల రోడ్లు కారణంగా పదేపదే ట్రాఫిక్‌జామ్ అవుతోంది. నాణ్యమైన రోడ్లను చూడడం నగరవాసికి ఎప్పటికి సాధ్యమవుతుందో మరి.



ఓ రహదారిలో తారు పనులు



సంపిగె రోడ్డులో వైట్ టాపింగ్ పనులు



ఐఐఎస్‌సీ సీవీ రామన్ రోడ్డులో మరమ్మతులు

క్యాంటర్, టెంపో ఢీ.. ముగ్గురి మృతి



తునాతునకలైన క్యాంటర్ వాహనం

దొడ్డబళ్లాపురం: క్యాంటర్, టెంపో ఢీకొని ముగ్గురు మృతిచెందగా 6మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన నెలమంగల తాలూకా 48వ జాతీయ రహదారి మార్గంలోని కులువనహళ్లి గేట్ వద్ద చోటుచేసుకుంది. ఆదివారం సాయంత్రం పొద్దు పోయాక 407 టెంపోలో 10మంది కట్టడ కార్మికులు పని ముగించుకుని ఇళ్లకు బయల్దేరారు. ఆ సమయంలో ఎదురుగా క్యాంటర్ వాహనం వచ్చింది. పరస్పరం ఢీకొనడంతో క్యాంటర్ వాహనం తునాతునకలైంది. అందులో ప్రయాణిస్తున్న ఉత్తర కర్ణాటక జిల్లా యాదగిరి తాలూకాకు చెందిన హుసేనప్ప, శంకరప్ప, నెలమంగల తాలూకా ఎలెక్యాతనహళ్లి నివాసి శివన్న మృతి చెందారు. టెంపోలో ఉన్న కూలీల్లో ఆరుమందికి గాయలాలయ్యాయి. క్షతగాత్రులను నెలమంగల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

విద్యాభ్యాసానికి సెల్‌ఫోన్లు ఆటంకం



ప్రసంగిస్తున్న అశోక్‌కుమార్

గౌరిబిదనూరు, విద్యార్థులు సెల్ ఫోన్ల మోజులో పడకుండా చదువుపై దృష్టి పెట్టాలని వాల్మీకి నాయక సంఘం నాయకుడు అశోక్ కుమార్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత కోట పాఠశాల ఆవరణలో గౌరీ కన్నడ కళా సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు అందజేసి మాట్లాడారు. బాలికలను ప్రోత్సహించే దిశలో కన్నడ కళా సంఘం సేవలు అభినందనీయమన్నారు. ఆ సంఘం నాయకుడు రవీంద్రనాథ్, మున్సిపల్ మాజీ అధ్యక్షుడు ఆలంపల్లి వేణుగోపాల్, గోవిందరాజు, పద్మావతమ్మ, గీత,కృష్ణకుమారి,లక్ష్మీ రమేశ్, రమామణి, నరసమ్మ పాల్గొన్నారు.

బోర్ లారీ డ్రైవర్ హత్య

యశవంతపుర: బోర్‌వెల్ డ్రైవర్ హత్యకు గురైన ఘటన పరప్పన అగ్రహార పోలీసుస్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి జరిగింది. తమిళనాడులోని తిరుచ్చికి చెందిన సురేశ్(47) లారీ డ్రైవర్‌తో పాటు బోర్ అపరేటర్‌గా పని చేస్తున్నాడు. శనివారం పరప్పన అగ్రహర ఎసీఎస్ లేఔట్‌లో బోర్ తవ్వడానికి వెళ్లాడు. మధ్యప్రదేశ్‌కు చెందిన ఐదు మంది కూలీలతో కలిసి బోరు డ్రిల్ చేశారు. ఆదివారం రాత్రి 10:30 గంటలకు పనులు ముగిశాయి. అక్కడే చికెన్ తెచ్చి వంట చేశారు. కూర సరిగా చేయలేదని సురేశ్.. బాబు అనే కూలీని నిందించాడు. అందరూ భోజనం చేసి నిద్రపోయారు. అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఇనుపరాడుతో సురేశ్ తలపై బాదాడు. దీంతో సురేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటన జరిగిన తర్వాత బాబు అనే కార్మికుడు అక్కడి నుంచి పరారయ్యాడు. దీంతో అతనే హత్య చేశాడా అనే కోణంలో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

రోడ్డెక్కిన ఉపాధ్యాయులు

శివాజీనగర: డిమాండ్ల పరిష్కారానికి రాష్ట్ర ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు రోడ్డెక్కారు. తమ సంఘం ఆధ్వర్యంలో బెంగళూరులోని ఫ్రీడం పార్కులో సోమవారం ధర్నా నిర్వహించారు. ఆందోళనకారులు మాట్లాడుతూ వివిధ నిబంధనలతో పదోన్నతుల్లో లక్షా 20వేల మంది ఉపాధ్యాయులకు అన్యాయం జరిగిందన్నారు. వారందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. 2016కి ముందుగా నియామకమైన ఉపాధ్యాయులను ఎన్‌సీటీ నిబంధనల మేరకు డిగ్రీ విద్యార్హత ఉన్నవారికి సీనియార్టీ ఆధారంగా జీపీటీ ఉపాధ్యాయులుగా గుర్తించాలన్నారు.

ప్రాణం తీసిన అతివేగం

యశవంతపుర: అతివేగంతో వెళ్తూ బైకిస్టు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ఘటన బెంగళూరు జ్ఞానభారతి పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. తుమకూరుకు చెందిన విశ్వనాథ్(34) టైలర్‌గా పనిచేస్తున్నాడు. ఇతను సుంకదకట్టలో నివాసం ఉంటున్నాడు. ఆదివారం రాత్రి 11:30 గంటలకు కెంగేరి నుంచి సుంకదకట్టకు బైకుపై వెళ్తుండగా 80 అడుగుల రోడ్డు మంగనహళ్లి క్రాస్ వద్ద అతివేగం వల్ల అదుపు తప్పి కిందపడ్డాడు. హెల్మెట్ లేని కారణంగా తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. జ్ఞానభారతి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

భారీగా జరిమానాలు

యశవంతపుర: ట్రాఫిక్ ఉల్లంఘనులపై బెంగళూరు నగర ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపించారు. ఆగస్టు 10, 11 తేదీల్లో ప్రత్యేక డ్రైవ్ చేపట్టి సిగ్నల్ జంప్, రాంగ్ పార్కింగ్, ఫుట్‌పాత్‌పై పార్కింగ్, బైక్‌పై ట్రిబుల్ రైడింగ్ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్, నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్టు ధరించకపోవడంపై 1300 మందిపై కేసులు నమోదు చేసి రూ.6.74 లక్షల జరిమానా వసూలు చేశారు.

బస్సు ఢీకొని బైకిస్టు మృతి

మైసూరు: కేఎస్ ఆర్టీసీ బస్సు ఢీకొని బైకిస్టు మృతి చెందిన ఘటన మైసూరు నగరంలో చోటు చేసుకుంది. మైసూరులోని క్యాతమారనహళ్లికి చెందిన సి.శివకుమార్(59) రైల్వేలో పనిచేస్తున్నాడు. ఇతను బైక్‌పై వెళ్తుండగా నగరంలోని దేవరాజు అరసు రోడ్డులో పాత కలెక్టరేట్ రోడ్డులో వేగంగా వచ్చిన కేఎస్ ఆర్టీసీ బస్సు ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శివకుమార్‌ను ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చ చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దేవరాజ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఉద్యోగ మేళా నిరుద్యోగులకు వరం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శివశంకరరెడ్డి

గౌరిబిదనూరు: ఉద్యోగ మేళాలు నిరుద్యోగుల పాలిట వరాలని మాజీ ఎమ్మెల్యే శివశంకరరెడ్డి అన్నారు. సమానతా సౌధలో ఆదివారం ఏర్పాటు చేసిన జాబ్ మేళాను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. వృత్తిలో కౌశల్యాన్ని అలవరచుకుంటే ఉద్యోగాలు లభిస్తాయన్నారు. అనంతరం టెన్త్, పీయూసీ, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా అభ్యర్థులు 400 మంది మేళాకు హాజరు కాగా 200 మందికిపైగా దేవనహళ్లిలోని ఎయిర్ ఇండియా స్యాట్స్ సర్వీసెస్ సంస్థ ఎంపిక చేసుకుంది. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు మరళూరు ప్రకాశరెడ్డి, జిల్లాకాంగ్రెస్ అధ్యక్షుడు కేశవరెడ్డి, ఎయిర్ ఇండియా అధికారులు తమ్మయ్య, జయరామిరెడ్డి, హర్షవర్ధనరెడ్డి, గిరీశ్‌రెడ్డి, రేవంత్ పాల్గొన్నారు.

కబ్జాకు గురైన స్థలం స్వాధీనం



ప్రహరీని జేసీబీతో కూల్చివేయిస్తున్న దృశ్యం



స్వాధీనం చేసుకున్న స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మైసూరు: కబ్జాకు గురైన సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన స్థలాన్ని ఆ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మైసూరు తాలూకా కసబా హోబ్లి మండకళ్లి గ్రామంలో సర్వే నంబర్ 250లో ఉన్న ప్రభుత్వ బంజరు ఒకటిన్నర ఎకరం భూమిని కొంత మంది కబ్జా చేసి ప్రహరీ నిర్మించారు. దీనిపై ఫిర్యాదులు అందడంతో సాంఘిక సంక్షేమ శాఖ స్పందించింది. సోమవారం జేసీబీలను తీసుకెళ్లి ప్రహరీని కూల్చివేయించి స్థలాన్ని స్వాధీనం చేసుకొని ప్రభుత్వానికి అప్పగించారు.

హోసూరు వార్తలు..

మత్తు సేవనంతో పతనమే



ప్రభుత్వ కళాశాలలో జాగృతి

హోసూరు: మాదక ద్రవ్యాల నియంత్రణపై మత్తిగిరి పోలీసులు సోమవారం ఉదయం ప్రభుత్వ కళాశాల విద్యార్థులచే చైతన్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్‌ఐ ప్రకాష్ అధ్యక్షతన ప్రభుత్వ కళాశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ మత్తిగిరి బస్టాండులో ముగిసింది. విద్యార్థులు చైతన్య కార్యక్రమంలో పాల్గొని ప్లకార్డులు ధరించి మాదక ద్రవ్యాల వినియోగం వల్ల ఎదురైయ్యే సమస్యలపై స్థానిక ప్రజలకు వివరించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ గుట్కా, పాన్‌మసాలా, పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల అనేక రోగాలకు గురికావడంతో పాటు సమాజంలో గౌరవాన్ని కోల్పోతారని, ఆర్థికంగా నష్టపోయి వీధి నపడతారని తెలిపారు.

అలరించే వస్త్ర ప్రదర్శన



చీరలను పరిశీలిస్తున్న కలెక్టర్

హోసూరు: జిల్లా కేంద్రం క్రిష్ణగిరి కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కోఆప్‌టెక్స్ దుస్తుల ప్రదర్శనను సోమవారం జిల్లా కలెక్టర్ శరయు ప్రారంభించారు. చేనేతను ప్రోత్సహించడానికి 1905న కోఆప్‌టెక్స్ దుస్తుల తయారీని ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు చేనేత దుస్తులకు ప్రత్యేక ఆకర్షణగా ఉన్నాయని చెప్పారు. కాగా ఈ వస్త్ర ప్రదర్శనలో పలు రాష్ట్రాల ప్రత్యేక వస్త్రాలు విక్రయాలకు ఉంచారు.

తెగిపోయిన రోడ్డు

- గ్రామస్తుల ధర్నా



రోడ్డు గుంతను దాటుతున్న బాలలు

కెలమంగలం: ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు మట్టి రోడ్డు కొట్టుకెళ్లడంతో ఇరుగ్రామాల మధ్య రాకపోకలు స్తంభించాయి. క్రిష్ణగిరి జిల్లా వ్యాప్తంగా ఆదివారం రాత్రి భారీ వర్షాలు కురిశాయి. ఈ వర్షాలకు డెంకణీకోట తాలూకా సందనపల్లి పంచాయతీ కురుబట్టి గ్రామానికెళ్లే రోడ్డు కొట్టుకెళ్లడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులెదుర్కొన్నారు. కురుబట్టి గ్రామ ప్రజలకు బయటకు రావడానికి వీలు లేకుండా పోయింది. విద్యార్థులు, వ్యాపారులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామస్తులు ఉదయమే ధర్నా చేశారు. ఇన్‌స్పెక్టర్ తవమణి, బీడీవో సతీష్‌బాబు, పోలీసులు, రెవెన్యూ అధికార్లు ఘటనా స్థలానికి చేరుకొని రోడ్డు మరమ్మత్తులు చేస్తామని నచ్చజెప్పారు.

వేర్వేరుచోట్ల ముగ్గురి ఆత్మహత్య

హోసూరు: క్రిష్ణగిరి, హోసూరు ప్రాంతాల్లో వేర్వేరు కారణాలతో మహిళతో పాటు ముగ్గురు ఆత్మహత్య చేసుకొన్నారు. జిల్లా కేంద్రం క్రిష్ణగిరికి చెందిన కార్తీక్ భార్య నందిని (29). భార్యాభర్తలు తరచూ గొడవపడేవారు. ఆదివారం రాత్రి పోట్లాట జరగడంతో విరక్తి చెందిన నందిని ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొంది.

అప్పుల బాధతో...

క్రిష్ణగిరి సమీపంలోని పూజారిపట్టి గ్రామానికి చెందిన వెంకటాచలం (45) చిల్లర అంగడి నడిపేవాడు. చుట్టుపక్కల కొంత మంది వద్ద అప్పుచేశాడు. అప్పులు కట్టాలని వారు ఒత్తిడి చేయగా, తీర్చే మార్గం లేక ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు.

ఉద్యోగం దొరకలేదని

త్రిపుర రాష్ట్రానికి చెందిన రెక్కిందాస్(21). హోసూరు పారిశ్రామికవాడ జూజువాడి ప్రాంతంలో నివాసముంటూ ప్రైవేట్ కంపెనీలో కార్మికునిగా పనిచేస్తూ వచ్చాడు. గత కొద్ది రోజుల క్రితం కంపెనీ మూతపడడంతో ఇతర పరిశ్రమల్లో ఉద్యోగం దొరకక విరక్తి చెంది ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. ఈ ఘటనలపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు.

బస్ ఢీకొని బైకిస్టు మృతి

కెలమంగలం: ద్విచక్రవాహనాన్ని కర్ణాటక ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో బెంగళూరు వాసి మరణించిన ఘటన డెంకణీకోట వద్ద జరిగింది. వివరాల మేరకు బెంగళూరు శివాజీనగర్ ప్రాంతానికి చెందిన మహమ్మద్ ఆరిఫ్ (27), మిత్రుడు అయాస్‌ఖాన్ (18) కలిసి ఆదివారం డెంకణీకోటలోని యారబ్ దర్గాకు వెళ్లారు. పూజలు ముగించుకొని తిరిగి వెళుతుండగా డెంకణీకోట ఆర్టీసీ డిపో సమీపంలో కర్ణాటక ఆర్టీసీ బస్సు వారిని ఢీకొనింది. తీవ్ర గాయాలేర్పడిన మహమ్మద్ ఆరిఫ్ ఘటనా స్థలంలోనే మృతి చెందగా అయాస్‌ఖాన్ తీవ్ర గాయాల పాలయ్యాడు. పోలీసులు గాయపడిన వ్యక్తిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు.

టిప్పర్ ఢీకొని ప్రైవేటు ఉద్యోగి..

హోసూరు: ద్విచక్రవాహనాన్ని టిప్పర్ లారీ ఢీకొని ప్రైవేటు ఉద్యోగి మరణించిన ఘటన హడ్కో పరిధిలో జరిగింది. వివరాల మేరకు తెంగాసి జిల్లా ఆలంకుళం గ్రామానికి చెందిన ఇళవరసన్ (32). సూళగిరిలో నివాసముంటూ హోసూరులో ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం హోసూరు– బెంగళూరు హైవేలో వెళుతుండగా టిప్పర్ లారీ ఢీకొనింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలేర్పడిన ఇళవరసన్ ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. హడ్కో పోలీసులు కేసు నమోదు చేశారు.

రౌడీషీటర్‌పై పోలీసు కాల్పులు



గాయపడిన కానిస్టేబుల్ శ్రీకాంత్



బుల్లెట్ గాయాలతో రౌడీషీటర్ భవిత్

శివమొగ్గ : రౌడీషీటర్‌పై పోలీసులు కాల్పులు జరిపి అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన సోమవారం శివమొగ్గ నగరంలో చోటు చేసుకుంది. భవిత్(26) అనే రౌడీషీటర్‌పై పలు కేసులున్నాయి. కొన్ని రోజులుగా పోలీసుల కళ్లుగప్పి సంచరిస్తున్నాడు. ఇతను సోమవారం జయనర పోలీస్‌స్టేషన్ పరిధిలో సంచరిస్తున్నట్లు సమాచారంతో వినోభనగర ఎస్‌ఐ సునిల్ ఆధ్వర్యంలో పోలీసులు వెళ్లారు. పోలీసుల రాకను పసిగట్టిన భవిత్ తప్పించుకునేందుకు యత్నించాడు. అంతేగాకుండా శ్రీకాంత్ అనే కానిస్టేబుల్‌పై దాడికి యత్నించాడు. దీంతో ఎస్‌ఐ తన రివల్వార్‌తో గాలిలోకి కాల్పులు జరిపాడు. అయినా రౌడీషీటర్ లెక్క చేయలేదు. దీంతో కాలికి గురిపెట్టి షూట్ చేశాడు. కుప్పకూలిన భవిత్‌ను ఆస్పత్రికి తరలించారు.

వ్యక్తిని వెంటాడి హత్య చేసిన దుండగులు



సమీర్(ఫైల్)

యశవంతపుర: టార్గెట్ ఇల్యాస్ హత్య కేసులో ప్రధాన నిందితుడు, ఉళ్లాల కడప్పులకు చెందిన సమీర్(35) హత్యకు గురయ్యాడు. ఈ ఘటన మంగళూరు ఉళ్లాల పోలీసుస్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి జరిగింది. రాత్రి 10 గంటల సమయంలో సమీర్ తన తల్లితో కలిసి కల్లాపులో భోజనం కోసం రెస్టారెంట్‌కు వెళ్లాడు. దుండగులు వీరిని కారులో వెంబడించారు. సమీర్ కారు దిగుతుండగానే దుండగులు తల్వార్లతో దాడిచేశారు. ప్రాణాలు దక్కించుకునేందుకు సమీర్ అక్కడినుంచి పరుగులు తీశాడు. అయితే దుండగులు 500 మీటర్ల దూరం వెంటాడి వీకే ఫర్నిచర్ వెనుక భాగంలో తల్వార్‌తో దాడి చేసి హత్య చేశారు. 2018లో జరిగిన రౌడీషీటర్ టార్గెట్ ఇల్యాస్ కేసులో సమీర్ ప్రధాన నిందితుడని పోలీసులు తెలిపారు. ఇటీవల జైలు నుంచి సమీర్ విడుదలై వచ్చాడని తెలిపారు. టార్గెట్ ఇల్యాస్ హత్యకు ప్రతీకారంగానే సమీర్ హత్య జరిగి ఉంటుందని అనుమానిస్తున్నారు. ఉళ్లాల పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

ఒకేసారి 17 కళాశాలలు ఓ చరిత్ర

2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో రాగానే ఒకేసారి 17 కళాశాలలు నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. వీటిలో విజయనగరం, ఏలూరు, రాజమహేంద్రవరం, మచిలీపట్నం, నంద్యాల వైద్య కళాశాలలను గతేడాది ప్రారంభించి ఒకే ఏడాది అదనంగా 750 ఎంబీబీఎస్ సీట్లలో అడ్మిషన్లు కల్పించారు. 1923లో రాష్ట్రంలో మొదటిసారిగా ఆంధ్రా మెడికల్ కాలేజీ ఏర్పాటైంది. అప్పటి నుంచి 2019 వరకు ప్రభుత్వ రంగంలో కేవలం 11 కళాశాలలు మాత్రమే ఉన్నాయి. ఈ క్రమంలో ఒకే ఏడాది ఐదు ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రారంభించి వైద్య విద్యలో సరికొత్త రికార్డును వైఎస్ జగన్ నెలకొల్పారు. ఈ విద్యా సంవత్సరం (2024-25)లో మార్కాపురం, మదనపల్లె, పాడేరు, పులివెందుల, ఆదోని కళాశాలలను ప్రారంభించాల్సి ఉండగా కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఇంకా సందిగ్ధత కొనసాగుతోంది. మిగిలిన ఏడు వైద్య కళాశాలలను వచ్చే 2025-26 విద్యా సంవత్సరంలో ప్రారంభించాలని ప్రణాళిక రూపొందించగా ఈలోగా పీపీపీ విధానాన్ని ప్రభుత్వం తెరమీదకు తెచ్చింది.











ప్రైవేట్ మంత్రం మారని చంద్రం!

కొత్త వైద్య కళాశాలలను పీపీపీలో నిర్వహించాలని సీఎం నిర్ణయం

పీపీపీ విధానంలో కళాశాల, బోధనాస్పత్రిపై ప్రైవేట్ వ్యక్తులదే ఆజమాయిషీ

- వారు నిర్ణయించినవే వైద్య విద్య ఫీజులు.. పేదల వైద్యానికి చార్జీల వసూలు
- ప్రతిపక్షంలో ఉండగా సెల్ఫ్‌ఫైనాన్స్ విధానాన్ని తప్పుబట్టిన టీడీపీ
- వంద రోజుల్లో రద్దు చేసి తీరుతామంటూ హామీలు
- అధికారంలోకి వచ్చాక ఏకంగా కళాశాలలనే ప్రైవేట్‌కు కట్టబెడుతున్న దుస్థితి
- ప్రజలకు ఉచితంగా చేరువలో సూపర్ స్పెషాలిటీ వైద్యం.. మన విద్యార్థులకు మన గడ్డపైనే వైద్య విద్య.. ఇదీ వైఎస్ జగన్ లక్ష్యం

చంద్రబాబు ప్రభుత్వం అంటేనే అన్నింటా వసూళ్లకు మారుపేరు. ఎవరికైనా సరే.. ఏదైనా సరే.. ఉచితంగా ఇవ్వడం అనేది ఆయన డిక్షనరీలోనే లేదు. గతంలో యూజర్ చార్జీల బాదుడుతో పేదలను పీల్చి పిప్పి చేసిన ఆయన, ఇప్పుడు అంతకు మించి అంటూ అన్నింటా 'ప్రైవేట్' పాట పాడుతున్నారు. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో ఓ ప్రభుత్వ మెడికల్ కళాశాల ఉంటే ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలు అందడంతో పాటు విద్యార్థులకు అదనంగా ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి వస్తాయన్న గత ప్రభుత్వ మంచి ఉద్దేశాన్ని ప్రస్తుత చంద్రబాబు ప్రభుత్వం నీరుగారుస్తోంది. కొత్త మెడికల్ కాలేజీలను పీపీపీ పద్ధతిలో నిర్వహిస్తామని సెలవిచ్చింది. దీంతో ఆ కాలేజీల్లో కన్వీనర్ కోటా సీట్ల ఫీజు ఆకాశాన్నంటడం ఖాయం. కష్టపడి కన్వీనర్ సీటు తెచ్చుకోగలిగిన పేద పిల్లలు అంత ఫీజు కట్టలేక వైద్య విద్యకు దూరం కావాల్సిన దుస్థితి. కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిపోయిందన్న చందంగా పరిస్థితి మారిపోయింది.

సాక్షి, అమరావతి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నెలకొల్పిన కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలలను గుజరాత్ తరహాలో ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) విధానంలో నిర్వహించాలని సీఎం చంద్రబాబు నిర్ణయించడంపై సర్వత్రా తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. రాష్ట్రంలో అన్ని ప్రాంతాల ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను చేరువ చేయడంతో పాటు పేద, మధ్య తరగతి వర్గాల వైద్య విద్య కలను సాకారం చేయాలనే ఉన్నత ఆశయంతో చరిత్రలో తొలిసారిగా ప్రభుత్వ రంగంలో ఏకంగా 17 కొత్త వైద్య కళాశాలల నిర్మాణానికి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. వాటిని ఇప్పుడు పీపీపీ పేరిట ప్రైవేట్ వ్యక్తుల కబంధ హస్తాల్లో పెట్టి పేద, మధ్య తరగతి ప్రజల వైద్యం, విద్యార్థుల విద్య కలలను కాలరాసేందుకు కూటమి సర్కారు సిద్ధమైంది.



ప్రభుత్వమే భూమిని కేటాయిస్తుంది. ఆ భూమిలో ప్రైవేట్ వ్యక్తులు కళాశాల, బోధనాస్పత్రిని నిర్మిస్తారు. కొన్నేళ్ల పాటు వారి ఆధ్వర్యంలోనే ఆస్పత్రి, కళాశాల నడుస్తుంది. బ్రౌన్ ఫీల్డ్ విధానంలో అప్పటికే నడుస్తున్న 300 పడకల ఆస్పత్రిని బోధనాస్పత్రిగా అభివృద్ధి చేసి, ఇచ్చిన భూమిలో కళాశాలను ప్రైవేట్ వారు నిర్మిస్తారు. ఈ రెండు విధానాల్లో కళాశాలల్లో ఫీజులపై నియంత్రణ లేదు. 2023–24 విద్యా సంవత్సరం ఫీజులను ఒకసారి గమనిస్తే ఆ విషయం స్పష్టం అవుతుంది. అక్కడ ప్రభుత్వ పరిధిలో నడిచే కళాశాలల్లో కన్వీనర్ కోటా (ప్రభుత్వ కోటా) సీట్లకు రూ.25 వేలు ఫీజు ఉంది. అదే పీపీపీ కళాశాలల్లో కన్వీనర్ కోటాకు రూ.5.50 లక్షలు, రూ.6.65 లక్షలు వరకూ ఉన్నాయి. యాజమాన్య (బీ కేటగిరి) కోటాకు రూ.17 లక్షల నుంచి రూ.18 లక్షల వరకూ ఫీజులున్నాయి. ప్రస్తుతం మన రాష్ట్రంలో గత ఏడాది ప్రారంభించిన ఐదు కొత్త వైద్య కళాశాలల్లో కన్వీనర్ కోటాకు కేవలం రూ.15 వేలు మాత్రమే ఫీజు ఉంది. ఇక గ్రీన్ ఫీల్డ్‌లో కళాశాలలకు అనుబంధంగా ఉండే ప్రభుత్వ బోధనాస్పత్రుల్లో వైద్య సేవలకు ప్రజలు డబ్బు చెల్లించాల్సి ఉంటుంది. ఈ తరహా విధానాన్ని రాష్ట్రంలో ప్రవేశపెట్టి పేదల ప్రయోజనాలకు తూట్లు పొడిచేందుకు కూటమి సర్కారు నడుం బిగించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పేదల ప్రయోజనాలే లక్ష్యంగా

పేదల ఆరోగ్య ప్రయోజనాలే లక్ష్యంగా వైఎస్ జగన్ ప్రభుత్వం ఏకంగా రూ.8 వేల కోట్లకు పైగా వ్యయంతో 17 కొత్త వైద్య కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఏఎస్ఆర్, పార్వతీపురం మన్యం లాంటి గిరిజన ప్రాంతాలు, పల్నాడు, అన్నమయ్య, సత్యసాయి లాంటి వెనుకబడిన జిల్లాలల్లో ఈ కళాశాలలకు అనుబంధంగా ఉండే బోధనాస్పత్రుల ద్వారా ఆ ప్రాంత ప్రజలకు చేరువలో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుతాయి. పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం వెల్దుర్తి లాంటి మారుమూల గ్రామాల ప్రజలు సూపర్ స్పెషాలిటీ వైద్యం కోసం 150 కి.మీ ప్రయాణించి గుంటూరు వెళ్లాల్సి వస్తోంది. అదే పిడుగురాళ్లలో సూపర్ స్పెషాలిటీ బోధనాస్పత్రి ఏర్పాటుతో పల్నాడు ప్రజలకు చేరువలో వైద్య చికిత్సలు లభిస్తాయి. ఇలా ప్రతి కొత్త జిల్లాలో ఒక బోధనాస్పత్రిని అందుబాటులోకి వచ్చి సూపర్ స్పెషాలిటీ వైద్యం కోసం ప్రజలకు వ్యయప్రయాసలు లేకుండా చేయాలని వైఎస్ జగన్ భావించారు. ఇప్పటి వరకూ ఆయా ప్రాంతాల్లో ప్రభుత్వ ఆధ్వర్యంలో సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రులు లేకపోవడంతో ప్రైవేట్ వ్యక్తులు అరకొర వసతులతో నడిపే ఆస్పత్రుల్లో చేసిందే వైద్యం అనే పరిస్థితులున్నాయి. ప్రభుత్వ బోధనాస్పత్రులు అందుబాటులోకి వస్తే ప్రజలకు ఏ చీకూ చింతా లేకుండా పూర్తి ఉచితంగా గుండె, కిడ్నీ, కాలేయం సంబంధిత, క్యాన్సర్ లాంటి పెద్ద జబ్బులకు చికిత్సలు లభిస్తాయి. అంతేకాకుండా 17 కొత్త కళాశాలల ద్వారా 2,550 ఎంబీబీఎస్ సీట్లు అదనంగా సమకూర్చి మన విద్యార్థులు వైద్య విద్య కోసం రష్యా, ఉక్రెయిన్ లాంటి దేశాలు, ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా చేయాలని వైఎస్ జగన్ యోచించారు. మన విద్యార్థులకు తాముంటున్న ప్రాంతాల్లో తల్లిదండ్రుల కళ్లెదుటే వైద్య విద్యను అభ్యసించే అవకాశాలు కల్పించాలనుకున్నారు. ప్రపంచాన్ని గడగడలాడించిన కోవిడ్, లాక్‌డౌన్ లాంటి ప్రతికూల పరిస్థితులను అధిగమించి కొత్త వైద్య కళాశాలల విషయంలో గత ప్రభుత్వం అడుగులు వేసింది. వైద్య కళాశాలల నిర్మాణానికి నిధుల సమీకరణతో పాటు వైద్య రంగాన్ని అభివృద్ధి చేయడానికి ఏపీ మెడికల్, ఎడ్యుకేషన్ రీసెర్చ్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశారు. తద్వారా కళాశాలల నిర్మాణ భారాన్ని ప్రభుత్వమే భరించి లాభాపేక్ష లేకుండా వాటిని నిర్వహించాలనేది వైఎస్ జగన్ విధానం.

జగన్ మోడల్ ఇలా..

- పేదలకు చేరువలో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు
- మెడికల్ సీట్లు మన రాష్ట్రంలోనే ఉంటాయి... ఫీజులు తక్కువ
- పోటీతత్వం పెరిగి ప్రైవేట్‌లో కూడా రేట్లు తగ్గుతాయి.
- ప్రభుత్వమే కాలేజీలను నిర్మించి నిర్వహిస్తుంది.
- మెరుగైన నిర్వహణకు కొన్ని సీట్లు మాత్రమే సెల్ఫ్ ఫైనాన్స్ విధానంలో ఉంటాయి.
- అవి కాలేజీ అభివృద్ధికే ఉపయోగిస్తారు.
- ప్రపంచ స్థాయి ప్రమాణాలతో మెడికల్ కాలేజీలను నిర్వహిస్తారు.



గుజరాత్ మోడల్ ఇదీ..

- భూమి, ఆస్పత్రిని ప్రభుత్వమే సమకూరుస్తుంది.
- మెడికల్ కాలేజీని మాత్రమే కడతారు
- మొదటి ఏడాదే ఆదాయం రూ.50 కోట్లతో మొదలవుతుంది.
- ఏటా ఫీజులు పెంచుకుంటూ వెళ్లి 30 ఏళ్ల తరువాత వదిలించుకుని వెళ్లిపోతారు.

నిజమైన అమ్మకం అంటే ఇదే!

గతేడాది మెరుగైన నిర్వహణ కోసం ఐదు కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సెల్ఫ్‌ఫైనాన్స్ విధానాన్ని ప్రవేశపెట్టినప్పుడు గత ప్రభుత్వంపై నారా లోకేశ్ తీవ్ర విమర్శలు చేశారు. వీరికి వంతపాడే ఈనాడు 'వైద్య విద్యనూ అమ్మేశారు' 'వైద్య విద్య వ్యాపారానికి నయా పెత్తందారు జగన్' అంటూ కట్టుకథలు రాసుకొచ్చింది. అధికారంలోకి వచ్చాక సెల్ఫ్ ఫైనాన్స్ విధానాన్ని రద్దు చేస్తామన్న హామీని కూటమి ప్రభుత్వం గాలికి వదిలేసింది. అంతేకాకుండా కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించి విద్యార్థులపై ఫీజుల భారాన్ని మోపడానికి రంగం సిద్ధం చేసింది. తద్వారా ప్రభుత్వ పెద్దల బినామీల జేబులు నింపేందుకు బాటలు పరిచారు.

పీపీపీతో వైద్యానికి తూట్లు

ఇక సీఎం చంద్రబాబు చెబుతున్న గుజరాత్ పీపీపీ విధానాన్ని పరిశీలిస్తే.. గ్రీన్ ఫీల్డ్ (కొత్తగా బోధనాస్పత్రి, కళాశాలను నెలకొల్పడం), బ్రౌన్ ఫీల్డ్ (అప్పటికే ఉన్న ప్రభుత్వ ఆస్పత్రిని బోధనాస్పత్రిగా అభివృద్ధి చేసి కొత్త వైద్య కళాశాలను నెలకొల్పడం) ఇలా రెండు విధాలుగా పీపీపీ విధానాన్ని అవలంబిస్తున్నారు. గ్రీన్ ఫీల్డ్ విధానంలో కళాశాల, ఆస్పత్రి నెలకొల్పడానికి ఎంతో చౌకగా

2014-19 బాబు పాలనలో..

20 లక్షలకు పైనే జనాభా ఉన్న ఉమ్మడి విజయనగరం జిల్లాలో గతంలో ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఒక్కటీ లేదు. మెరుగైన వైద్యం కోసం విశాఖ వెళ్లాల్సిందే. జిల్లాకు ఒక ప్రభుత్వ వైద్య కళాశాల మంజూరు చేయాలని 2014-19 మధ్య నాటి టీడీపీ ప్రభుత్వాన్ని అసెంబ్లీలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధి కోరగా.. 'రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదు. ప్రభుత్వ వైద్య కళాశాలను ఏర్పాటు చేయలేం. అందుకు రూ.350 కోట్లు కావాలి. నిర్వహణకు ఏటా రూ.30 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ వైద్య కళాశాల సాధ్యం కాదు. ప్రైవేట్ వైద్య కళాశాలకైతే అనుమతి ఇస్తాం' అని నాటి రాష్ట్ర ప్రభుత్వం చెప్పింది.

2019-24 వైఎస్ జగన్ హయాంలో..

"ప్రతి పార్లమెంట్ నియోజకవర్గానికి ఒక ప్రభుత్వ వైద్య కళాశాలను ఏర్పాటు చేస్తాం. పేద ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను చేరువ చేస్తాం' అని 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో 17 కొత్త వైద్య కళాశాలల ఏర్పాటుకు వైఎస్ జగన్ శ్రీకారం చుట్టారు. విజయనగరం జిల్లాకు రూ.500 కోట్లతో ప్రభుత్వ వైద్య కళాశాలను మంజూరు చేశారు. శరవేగంగా నిర్మాణం చేపట్టి 2023-24 విద్యా సంవత్సరంలో 150 ఎంబీబీఎస్ సీట్లతో వైద్య కళాశాలను ప్రారంభించారు. ఇప్పుడు బోధనాస్పత్రిలో రూపాయి ఖర్చు లేకుండా ప్రజలకు స్పెషాలిటీ వైద్య సేవలు అందుతున్నాయి.


నేడు మళ్లీ బాబు రాకతో..


కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టబోతున్నారు. దీంతో ప్రస్తుతం ప్రభుత్వ ఆధీనంలో ఉన్న కళాశాల, బోధనాస్పత్రి ప్రైవేట్ వ్యక్తుల ఆజమాయిషీలోకి వెళ్లనున్నాయి. ప్రైవేట్ కళాశాలల తరహాలో ఎంబీబీఎస్ కోర్సుల ఫీజుల్లో పెరుగుదల చోటు చేసుకుంటుంది. ఇక బోధనాస్పత్రుల్లో నిర్దేశించిన చార్జీలు చెల్లిస్తేనే ప్రజలకు వైద్యం అందించే దుస్థితి దాపురించనుంది.

17 మెడికల్ కాలేజీలకు వైఎస్ జగన్ శ్రీకారం

2023-24 విద్యా సంవత్సరంలో ప్రారంభించిన మెడికల్ కాలేజీలు.. వాటికి కేటాయించిన నిధులు (రూ. కోట్లలో)

నిధులు	కాలేజీ
500	విజయనగరం
550	మచిలీపట్నం
475	రాజమహేంద్రవరం
525	ఏలూరు
475	నంద్యాల





తమిళనాడు మోడల్ కావాలి



ప్రభుత్వాన్ని దోచేసి ప్రైవేట్ వ్యక్తులకు మేలు చేయడం గుజరాత్ మోడల్. అది ప్రజలకు అవసరం లేదు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు మేలు చేసే తమిళనాడు తరహా 69 శాతం రిజర్వేషన్ మోడల్‌ను ఏపీలో అమలు చేయాలి. సామాన్యులకు వైద్య విద్యను అందుబాటులో లేకుండా చేయడమే చంద్రబాబు విధానం అనే విషయం గత చరిత్రను పరిశీలిస్తే స్పష్టం అవుతుంది. ధనికులకే వైద్య విద్య అందుబాటులో ఉండేలా ఫీజులను ఆయన పాలనలో అమాంతం పెంచారు. 2014–19 మధ్య రూ.2.5 లక్షలుగా ఉన్న ఎంబీబీఎస్ బీ కేటగిరి ఫీజును అమాంతం పెంచారు. రూ.5 లక్షలున్న మెడికల్ పీజీ బీ కేటగిరి ఫీజును రూ.25 లక్షలకు తీసుకుని వెళ్లారు. కొత్త వైద్య కళాశాలల్లో సెల్ఫ్‌ఫైనాన్స్ సీట్లకు సంబంధించిన 107, 108 జీవోలను రద్దు చేస్తామని చెప్పి మాట తప్పారు.

– డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు, గుంటూరు

ప్రభుత్వ పరిధిలోనే కొనసాగాలి



పీపీపీ విధానంలో గుజరాత్ తరహాలో కొత్త వైద్య కళాశాలలను నిర్వహిస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించడంతో ప్రజల్లో అనేక అనుమానాలు రేకెత్తుతున్నాయి. వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ప్రైవేట్ వ్యక్తుల ఆధీనంలో కళాశాలలు నడవాలన్నదే గుజరాత్ విధానం అయితే దాన్ని ఇక్కడ అమలు చేయకూడదు. గుజరాత్ తరహా ప్రైవేటీకరణ విధానాలను ఏపీ ప్రజలు ఆహ్వానించరు. ప్రభుత్వ పరిధిలోనే కళాశాలలను నిర్వహించాలి. అప్పుడే పేదలకు మేలు జరుగుతుంది.

– సీహెచ్. బాబూరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

పీపీపీ విధానంలోనే ఆస్పత్రులు

- నియోజకవర్గ స్థాయిలో ఏర్పాటు
- 2014-19 మధ్య చేపట్టిన కార్యక్రమాలను పునరుద్ధరణ
- వైద్య, ఆరోగ్య శాఖపై సమీక్షలో సీఎం చంద్రబాబు వెల్లడి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో నియోజకవర్గ స్థాయిలో పీపీపీ విధానంలో ఆస్పత్రులను ఏర్పాటు చేయనున్నట్లు సీఎం చంద్రబాబు చెప్పారు. ఆస్పత్రికి స్థలాన్ని ప్రభుత్వమే ఇస్తుందని తెలిపారు. ప్రభుత్వ, పీపీపీ ఆస్పత్రులను ఒకే గొడుగు కిందకు తెస్తామని చెప్పారు. వైద్య, ఆరోగ్య శాఖపై సోమవారం సచివాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైద్య, ఆరోగ్య శాఖలో 2014–19 మధ్య అమలు చేసిన కార్యక్రమాలు, పథకాలను పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ యాప్‌ను రూపొందించి హెల్త్ కార్డు ద్వారా ప్రైవేట్ ఆస్పత్రిలో చేరే వ్యక్తుల వివరాలు, అక్కడ రోగికి అందించే వైద్య సేవలు, పరికరాలు, మందుల వివరాలు కూడా ఉండాలన్నారు. దీని ద్వారా



వైద్య శాఖపై సమీక్షలో సీఎం చంద్రబాబు, మంత్రి సత్యకుమార్ యాదవ్, అధికారులు

ఆస్పత్రి పనితీరు తెలుస్తుందన్నారు. మండలాల వారీగా కిడ్నీ బాధితుల వివరాలు సేకరించాలని, సమస్యకు కారణాలు, వ్యాధి ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో నీటిపై అధ్యయనం చేయాలని చెప్పారు. ఉద్దానంలో పూర్తిస్థాయి అధ్యయనంతోనే సమస్యను గుర్తించగలిగామన్నారు. ఆసుపత్రులలో శిశువుల అపహరణ కేసులు అరికట్టాలని చెప్పారు. తల్లులకు మళ్లీ ఎన్టీఆర్ బేబీ కిట్స్ అందించాలన్నారు. సదరం నకిలీ ధ్రువపత్రాల జారీపై చర్యలు తీసుకోవాలన్నారు. ఏజెన్సీల్లో డోలీ మోతలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. ఏడాదికి రూ.10 వేల కోట్ల టర్నోవర్ అయ్యే మెడ్‌టెక్ జోన్ పట్ల గత పాలకులు నిర్లక్ష్యం వహించారని విమర్శించారు. సమీక్షలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, సీఎస్ నీరబ్‌కుమార్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

15 శాతం వృద్ధి రేటే లక్ష్యం

దేశంలోని టాప్–5 రాష్ట్రాలతో పోటీ పడేలా, 15 శాతం వృద్ధి రేటు సాధన లక్ష్యంగా నూతన పారిశ్రామిక విధానం ఉండాలని, ఇందులో నీతి ఆయోగ్ ఆలోచనలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సీఎం చంద్రబాబు చెప్పారు. నూతన పారిశ్రామికాభివృద్ధి విధానం 2024–29 ముసాయిదాను పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, అధికారులు సోమవారం రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబుకు వివరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ నూతన పాలసీలో పిపిపి, పి–4 విధానాలను పొందుపర్చాలని చెప్పారు. పరిశ్రమలకు అనుమతులు వేగంగా ఇవ్వాలన్నారు. ఈనెల 16న పారిశ్రామికవేత్తలతో సమావేశమవుతామని చెప్పారు. ఆ తర్వాత ఈనెల 23న మరోసారి సమావేశమై విధానంపై చర్చిద్దామని చెప్పారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ కార్యదర్శి డా.ఎస్.యువరాజ్, సీఎం అదనపు కార్యదర్శి కార్తికేయ మిశ్రా, పరిశ్రమల శాఖ కమిషనర్ సీహెచ్ శ్రీధర్, ఏపీఐఐసీ ఎండీ అభిషేక్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.





● తల్లితో...

స్ఫూర్తి

ఆ అమ్మాయి స్కూల్‌కు వచ్చినన్ని రోజులు ఎడమ చేతిని ఎవరూ చూళ్లేదు. దానిని స్కర్ట్ జేబులో పెట్టుకుని ఉంటే అదామె అలవాటనుకున్నారు. కాని అసలు రహస్యం ఏమిటంటే ఎడమ అర చెయ్యి లేకుండా పుట్టింది తనీషా. స్కూల్లో ఎగతాళి చేయకుండా ఉండడానికి మణికట్టుకు దుపట్టా చుట్టి జేబులో దాచేది. కాని ఇప్పుడు దాచడం లేదు. గత నెల బెంగళూరులో జరిగిన 13వ జాతీయ సబ్ జూనియర్ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 400 మీటర్ల పరుగు పందెంలో గెలిచిన రజత పతకం ఆమె చేతికి గౌరవాన్ని, ఆమెకు ఆత్మవిశ్వాసాన్ని తెచ్చిపెట్టింది.

జేబులో దాగిన స్థైర్యం

చెయ్యెత్తి జై కొట్టింది

ఆరావళి పర్వతాలు చుట్టుముట్టిన రాజస్థాన్‌లోని సికార్ జిల్లా కేంద్రానికి 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆగ్లోయి తనీషా సొంత గ్రామం. తన వైకల్యాన్ని చూసి ఇతర పిల్లలు ఆట పట్టించడంతో స్కూల్‌కు వెళ్ల కుండా తనీషా ఎక్కువగా ఇంట్లోనే ఉండిపోయేది. దీంతో ఆమెను గ్రామానికి దూరంగా ఉన్న వేరే పాఠశాలలో చేర్పించారు. అక్కడ కూడా వెక్కిరింపులు ఎదురు కాకుండా ఉండడానికి ఉపాధ్యాయులకు, తోటిపిల్లలకు తెలియకుండా తన అంగవైకల్యాన్ని జేబులో దాచిపెట్టింది. అంగవైకల్యాన్ని దాచి పెట్టడం అంటే... ఒంటరితననానికి దగ్గర కావడమే.

గెలుపుతో విముక్తి

'ఇప్పుడు నా ఎడమ చెయ్యిని దాచాల్సిన అవసరం లేదు' అంటోంది తనీషా. అద్భుతమైన బెంగళూరు విజయంతో ఆమె ఎడమ చేయి జేబు నుంచి బయటకు వచ్చింది. ఇప్పుడు అది అంగవైకల్యంలా అనిపించడం లేదు. ఆత్మవిశ్వాసానికి ప్రతీకలా ఉంది. ఒకప్పుడు తనీషాకు నలుగురితో కలవడం తెలియదు. నలుగురితో కలిసి నవ్వడం తెలియదు. ఇప్పుడు మాత్రం అలాంటి పరిస్థితి లేదు. స్వేచ్ఛా జీవితపు మాధుర్యాన్ని రుచి చూస్తోంది. 'ఇప్పుడు నన్ను ఎవరూ ఎగతాళిగా కామెంట్ చేయడం లేదు' చిరునవ్వుతో అంది తనీషా. గత ఏడాదిలో రాష్ట్ర, జాతీయ చాంపియన్‌షిప్‌లలో మూడు స్వర్ణాలు, ఒక రజతం, ఒక కాంస్యంతో సహా అయిదు పతకాలు సాధించింది. 'ఈ పతకాలు నా జీవితాన్ని మార్చేసాయి. ఆత్మవిశ్వాసాన్ని నింపాయి. నా ఆలోచనా ధోరణిలో చాలా మార్పు వచ్చింది' అంటుంది తనీషా.

నాన్న నిలబడ్డాడు

పుట్టినప్పుడు ఎడమ అర చెయ్యి లేకపోవడంతో తనీషాను తండ్రి ఇంద్రజ్ బాజియా ఓ డాక్టర్ దగ్గరికి తీసుకువెళ్లాడు. ఈ అమ్మాయి మీకు దేవుడు ఇచ్చిన వరం. ప్రేమగా చూసుకోండి... అన్నాడు ఆ డాక్టర్. ఆయన మాటలు తండ్రిలోని దిగులును మాయం చేశాయి. ఇక అప్పటి నుంచి ఎలాంటి వివక్షత చూపకుండా ఆమెను ఆటల్లో ప్రోత్సహించాడు తండ్రి. 'తనీషా బాగా పరుగెడుతుంది. ఇంకా ఎన్నో విజయాలు సాధించే సామర్థ్యం ఆమెలో ఉంది. తనీషాకు శిక్షణ ఇవ్వడానికి ప్రతివారం ఆమె గ్రామానికి వెళుతుంటాను' అంటుంది తనీషా కోచ్ సరితా బవేరియా. నేషనల్ లెవల్ ప్లేయర్ అయిన సరిత బవేరియా దివ్యాంగులైన పిల్లలకు ఆటల్లో శిక్షణ ఇస్తుంటుంది.



● తండ్రితో...

తొలిసారి పట్టుదల

'నాకు 1,500 మీటర్ల తొలి పరుగు పందెం గుర్తుంది. పోటీలో నన్ను చూసి ఇతర పోటీదారులు నవ్వుతున్నారు. దాంతో పోటీలో పాల్గొన డానికి అధికారులు అనుమతి ఇవ్వడం లేదు. మా నాన్నమాత్రం ఎలాగైనా సరే, పాల్గొనాల్సిందే అన్నాడు. దాంతో సర్వశక్తులు ఒడ్డి పరుగెత్తాను.

నాలుగోస్థానంలో నిలిచినప్పుడు అందరూ వచ్చి నాకు షేక్ హ్యాండ్ ఇచ్చారు. ఇక ఇప్పటినుంచి నేను కూడా ఏదైనా చేయగలను అనే నమ్మకం కలిగింది' అని ఆ రోజును గుర్తు చేసుకుంది తనీషా.

జూలైలో పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ కోసం బెంగళూరులోని శ్రీ కంఠీరవ స్టేడియానికి వెళ్లిన తనీషా వందలాది మంది ప్రేక్షకులను చూసి కంగారు పడింది. 'ఇప్పుడు సాధించకపోతే సంవత్సరం శ్రమ వృథా అయిపోతుంది' అనుకుంది మనసులో. అనుకోవడమే కాదు 400 మీటర్ల రేసును విజయవంతంగా పూర్తి చేసి రజత పతకం గెలుచుకుంది. 'ఇప్పుడు ఉన్నంత సంతోషంగా నా కూతురు ఎప్పుడూ లేదు. ఆటలు ఆమెను పూర్తిగా మార్చివేసాయి' అంటోంది తల్లి భన్వారీదేవి.

ఈ అందం వినిపిస్తోందా?





న్యూస్‌మేకర్

'సమాజం ఎడంగా ఉంచే దివ్యాంగులకు ఇదెంత ముఖ్యమైన గెలుపో నాకు తెలుసు. అనూహ్యమైన కలలు కని వాటిని సాధించవచ్చని ఇవాళ నేను నిరూపించాను. దివ్యాంగుల పట్ల ఈ భూగ్రహంలో ఉన్న ఆంక్షల సరిహద్దులను నేను బద్దలు కొట్టాను' అని హర్షధ్వానాల మధ్య అంది మియా లే రూ.

28 ఏళ్ల బధిర వనిత మియా లే 66 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన దక్షిణాఫ్రికా అందాల పోటీలో కిరీటం ధరించిన తొలి బధిర మహిళగా చరిత్ర సృష్టించింది. ఆమె ఈ పోటీలో గెలిచినందుకుగాను సంవత్సరం పాటు నివసించడానికి ఒక ఖరీదైన ఫ్లాటు, లగ్జరీ బెంజి కారు, సుమారు 50 లక్షల రూపాయల నగదు, ఇంకా అనేక బహుమతులు దక్కాయి. శనివారం (ఆగస్టు 10) రాత్రి దక్షిణాఫ్రికాలోని పాలనా రాజధాని ప్రిటోరియాలో జరిగిన ఫైనల్స్‌లో ఈ ఘనత సాధించింది.

పుట్టుకతో చెవుడు

ఫ్రెంచ్ మూలాలున్న మియా లే కుటుంబం తరాల ముందు వచ్చి సౌత్ ఆఫ్రికాలో స్థిరపడింది. మియా పుట్టాక సంవత్సరం తర్వాత ఆమెకు పూర్తిచెవుడు ఉన్నట్టు గ్రహించారు తల్లిదండ్రులు. కొన్నేళ్ల తర్వాత కాక్లియర్ ఇంప్లాంట్స్ వేసి రెండు సంవత్సరాల పాటు స్పీచ్‌థెరపీ ఇస్తే తప్ప ఆమె మొదటి మాట మాట్లాడలేదు. ఆ తర్వాత కూడా ఆమె మాట స్పష్టం కాలేదు. ఆమెకు ఇప్పటికీ వినపడదు. 'నా కాక్లియర్ ఇంప్లాంట్స్‌ను ఆధునిక సాఫ్ట్‌వేర్ ద్వారా అనుసంధానం చేసుకున్నాను. అందువల్ల పెదవుల కదలికను బట్టి కొద్దిగా వినపడే ధ్వనిని బట్టి ఎదుటివారి మాటలు అర్థం చేసుకుంటాను. గుంపులో ఉండి నాతో మాట్లాడితే నాకు ఏమీ అర్థం కాదు. అందరి శబ్దాలు కలిసి నాకు స్పష్టత ఉండదు' అంటుంది మియా లే. మోడల్‌గా, మార్కెటింగ్ రంగ నిపుణురాలిగా పని చేస్తున్న ఈమె అందాలపోటీలో విజేతగా నిలవాలని కలగని, సాధించింది.

నల్లరంగు-తెల్లరంగు

సౌత్ ఆఫ్రికా అందాల కిరీటం కోసం నల్ల అందగత్తె చిడిమ్మ అడెస్టినా పోటీ పడింది. ఆమెకు సౌత్ ఆఫ్రికాలో గొప్ప ఫాలోయింగ్ ఉంది. అయితే ఆమె పౌరసత్వం మీద వివాదం నెలకొంది. ఆమె నైజీరియా తండ్రికీ, మొజాంబిక్ తల్లికీ జన్మించిందని ట్రోల్స్ మొదలయ్యాయి. దాంతో విజయం అంచు వరకూ చేరిన చిడిమ్మ పోటీ నుంచి తప్పుకుంది. దాంతో మియా గెలుపు సులువు అయ్యింది. రంగును బట్టి మియా గురించి ఒకటి రెండు విమర్శలు వచ్చినా పోటీ నుంచి తప్పుకున్న చిడిమ్మ మనస్ఫూర్తిగా ఆమెను అభినందించింది. 'నువ్వు మా అందరి కలలకు ప్రతినిధిగా నిలిచావు' అని పోటీలో గెలిచిన మియాను చిడిమ్మ కొనియాడింది.

నేనొక వారధిని

'దివ్యాంగులు సమాజంలో భాగం కావాలంటే ప్రభుత్వాలు పూనుకోవాలి. నాకొచ్చిన ఈ అందాల కిరీటంతో నేను దివ్యాంగులకు ప్రభుత్వానికి ఒక వారధి కాదలిచాను. చిన్నవయసు నుంచి దివ్యాంగులు అసాధ్యమైన కలలు గనే స్థయిర్యాన్ని నేను ఇవ్వాలనుకుంటున్నాను' అంది మియా లే రూ.

ఆహారం

అపోహ | వాస్తవం

● ఇడ్లీ తిన్న తర్వాత పాలు తాగడం ఆరోగ్యానికి హానికరం అంటారు నిజమేనా? ఇప్పటి వరకు పిల్లలకు అలాగే తాగిస్తున్నాం మరి.

ఇడ్లీ తిన్న తర్వాత పాలు తాగడం మీద ఉన్న సందేహాలన్నీ కేవలం అపోహలే. ఇడ్లీ తిన్న తర్వాత పాలు తాగడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలుసుకుందాం.

● న్యూట్రలైజ్ స్పైసీనెస్ : పాలలో ఉండే కేసీన్ ప్రొటీన్స్‌క్యాప్సెసిన్ అనే లిపిడ్‌తో కలిసి ఆహారంలో తీసుకున్న మసాలాల గాఢతను తగ్గిస్తుంది. కడుపులో మంట రాకుండా నివారిస్తుంది.

● పాలలో లాక్టోజ్ అనే చక్కెర ఉంటుంది. ఇది జీర్ణప్రక్రియను సులువు చేస్తుంది. ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్ వంటి సమస్యలను నివారిస్తుంది.

● పాలలో ప్రొటీన్‌లు, క్యాల్షియం, విటమిన్ డీ, బీ12లు సమృద్ధిగా ఉంటాయి. ఇవన్నీ ఇడ్లీ ద్వారా దేహానికి అందే పోషకాలను దేహం సక్రమంగా గ్రహించడానికి దోహదం చేసి ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయి.

● బ్లోటింగ్ సమస్య ఉన్న వారికి పాలు, ఇడ్లీ కాంబినేషన్ కొంత ఇబ్బంది కలిగించవచ్చు. ఇది కూడా లాక్టోజ్ ఇన్‌టాలరెన్స్, మిల్క్ ప్రొటీన్ అబ్జార్షన్ అసౌకర్యం ఉన్న వారిలోనే జరుగుతుంది. ఒక్కమాటలో చెప్పాలంటే పాలను జీర్ణం చేసుకోలేని వాళ్లన్నమాట. అలాంటి పిల్లలు, పెద్దవాళ్లు ఇడ్లీ తిన్నాక పాలు తాగకూడదు.

● నిజానికి పాలలో జీర్ణప్రక్రియకు దోహదం చేసే బ్యాక్టీరియాను వృద్ధి చేసే చక్కెరలుంటాయి. కాబట్టి పాలను జీర్ణం చేసుకోగలిగిన వాళ్లు ఇడ్లీ తిన్న తర్వాత పాలు తాగడం పట్ల ఎటువంటి సందేహాలకూ లోనుకానక్కరలేదు.



సుజాత స్టీఫెన్ ఆర్.డి.
న్యూట్రిషనిస్ట్

బ్యూటిప్స్

ఫెయిర్‌నెస్‌కి ఆపిల్.. బొప్పాయి!



● ఆపిల్ ముక్కతో ముఖమంతా మృదువుగా రబ్ చేసి, పది నిమిషాల తర్వాత శుభ్రపరుచుకోవాలి. ముఖంలోని అదనపు జిడ్డు తొలగిపోవడంతో మొటిమలు తగ్గి చర్మం తాజాగా కనిపిస్తుంది ● బొప్పాయి గుజ్జును ముఖానికి పట్టించి ఇరవై నిమిషాలు ఆరనివ్వాలి. తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రపరచుకోవాలి. తరచూ ఇలా చేయడం వల్ల చర్మం కాంతిమంతం అవుతుంది.


సినిమా



● మిక్కీ జే మేయర్, భాగ్యశ్రీ బోర్సే, హరీష్ శంకర్, రవితేజ, టీజీ విశ్వప్రసాద్

తమ్ముళ్లూ... ఇరగదీయబోతున్నాం
- రవితేజ

రవితేజ, భాగ్యశ్రీ బోర్సే హీరో హీరోయిన్‌గా రూపొందిన చిత్రం 'మిస్టర్ బచ్చన్'. హరీష్ శంకర్ దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పై టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 15న విడుదల కానుంది. ఈ సందర్భంగా కర్నూలులో ప్రీ రిలీజ్ ఈవెంట్ జరిగింది. ఈ వేడుకలో రవితేజ మాట్లాడుతూ – ''ఈ సినిమాని మా డీవోపీ అయాంక చాలా కలర్‌ఫుల్‌గా, లడ్డూలా చూపించారు. 'మిస్టర్ బచ్చన్'లో నేను, భాగ్యశ్రీ చాలా అందంగా కనిపించడానికి కారణం ఆయనే. మా డ్యాన్స్ మాస్టర్ భాను రెండు పాటలను ఇరగదీశాడు. భాస్కరభట్ల నాకు ఎన్నో పాటలు రాశాడు. ఈ మధ్య నాకు కాసర్ల, సాహితీ కూడా రాస్తున్నారు. కొత్త యాక్షన్ కో–ఆర్డినేటర్ పృథ్వీ చాలా కామ్‌గా ఉంటాడు. నాలుగు ఫైట్స్‌లో ఒక్క ఫైట్ తప్ప మిగతా మూడూ తనే చేశాడు. ఫైట్స్ చాలా బాగా కొరియోగ్రఫీ చేశాడు. ఇంకా ఇతర టీమ్ సభ్యులు కూడా బాగా హార్డ్‌వర్క్ చేశారు. మిక్కీ జే మేయర్ నుంచి అసలు ఇలాంటి మ్యూజిక్ వస్తుందని ఊహించలేదు. ఫస్ట్ టైమ్ ట్యూన్స్ వినిపించినప్పుడు 'ఇది మిక్కీనా' అనిపించింది. అంత మంచి పాటలు ఇచ్చాడు. వివేక్‌గారు ఇలాంటి సినిమాలు మరెన్నో తీయాలి. విశ్వప్రసాద్‌గారూ... మీ ఫ్యాక్టరీ ఇలానే రన్ అవ్వాలి. పేరుతో పాటు డబ్బులు కూడా రావాలి. హరీష్ చాలా హార్డ్ వర్కర్. ఈ సినిమా పెద్ద బ్లాక్ బస్టర్ అయి, మా కాంబినేషన్‌లో నెక్ట్స్ సినిమా హ్యాట్రిక్‌కి నాంది కావాలి. తమ్ముళ్లూ (అభిమానులను ఉద్దేశించి) ఇరగదీయబోతున్నాం'' అన్నారు. ''ఒక్కసారి కాదు మళ్లీ మళ్లీ చూసే సినిమా ఇది'' అని హరీష్ శంకర్ పేర్కొన్నారు. ఈ వేడుకలో ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యులు టి.జి. వెంకటేశ్ అతిథులుగాపాల్గొన్నారు.



● నాగార్జున

మళ్లీ మాస్

నాగార్జున కెరీర్‌లో సూపర్ హిట్ మాస్ చిత్రాల్లో 'మాస్' ఒకటి. దాదాపు 20 ఏళ్ల క్రితం విడుదలైన ఈ సినిమాలో మమ్మమ్మాస్ అంటూ నాగార్జున తనదైన స్టైల్‌లో రెచ్చిపోయారు. ఈ నెల 29న నాగార్జున పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రం మళ్లీ విడుదల కానుంది. 28న 4కె ఫార్మాట్‌లో ఈ చిత్రం థియేటర్స్‌కి రానుంది. రాఘవ లారెన్స్ దర్శకత్వంలో అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై రూపొందిన ఈ చిత్రంలో జ్యోతిక, ఛార్మీ కౌర్, రఘువరన్, రాహుల్ దేవ్ తదితరులు నటించారు. ఈ యాక్షన్ ప్యాక్డ్ మూవీకి దేవిశ్రీ ప్రసాద్ స్వరాలందించగా మ్యూజికల్ హిట్‌గానూ నిలిచింది.

ఆయుధ పూజ ఆరంభం



● ఎన్టీఆర్

హీరో ఎన్టీఆర్ ఆయుధ పూజ చేస్తున్నారు. అయితే ఈ పూజ 'దేవర' కోసం. ఎన్టీఆర్, జాన్వీ కపూర్ జంటగా నటిస్తున్న చిత్రం 'దేవర'. కొరటాల శివ దర్శకత్వంలో నందమూరి కల్యాణ్‌రామ్ సమర్పణలో మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ .కె నిర్మిస్తున్న ఈ మూవీకి అనిరుధ్ సంగీతదర్శకుడు. కాగా ఈ సినిమాలో ఆయుధ పూజ నేపథ్యంలో సాగే ఓ పాట ఉందట. ప్రస్తుతం ఈ పాటని తెరకెక్కిస్తున్నారని సమాచారం. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించిన ఈ పాటని ఎన్టీఆర్, ఇతర తారాగణంపై రాత్రి వేళల్లో చిత్రీకరిస్తున్నారని టాక్. పతాక సన్నివేశాలకు ముందు ఈ పాట వస్తుందట. రెండు భాగాలుగా రూపొందుతోన్న 'దేవర' తొలి భాగం తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో సెప్టెంబర్ 27న రిలీజ్ కానుంది.

ధూం ధాం పాటలు బాగున్నాయి
- గోపీచంద్



● గోపీ మోహన్, శ్రీను వైట్ల, సాయికిశోర్, గోపీచంద్

''ధూం ధాం' టీజర్ ఆకట్టుకునేలా ఉంది.. పాటలు బాగున్నాయి. రామ్ కుమార్ మంచి నిర్మాత. డైరెక్టర్ సాయి అంకితభావం ఉన్న వ్యక్తి. ఈ సినిమాకు స్టోరీ, స్క్రీన్ ప్లే అందించిన గోపీ మోహన్ 'లౌక్యం' సినిమా నుంచి నాతో పని చేస్తున్నారు. ఈ చిత్రం విజయం సాధించాలి'' అని హీరో గోపీచంద్ అన్నారు. హెబ్బా పటేల్, చేతన్ కృష్ణ జంటగా సాయి కిశోర్ మచ్చ దర్శకత్వం వహించిన చిత్రం 'ధూం ధాం'. ఎంఎస్ రామ్ కుమార్ నిర్మించిన ఈ సినిమా సెప్టెంబర్ 13న రిలీజ్ అవుతోంది. ఈ చిత్రం టీజర్‌ను గోపీచంద్, డైరెక్టర్ శ్రీను వైట్ల విడుదల చేశారు. శ్రీను వైట్ల మాట్లాడుతూ– ''టీజర్ చాలా బాగుంది. 'దుబాయ్ శీను' నుంచి 'బాద్‌షా' వరకు నా దగ్గర డైరెక్షన్ డిపార్ట్‌మెంట్‌లో చేశాడు సాయికిశోర్. రామ్ కుమార్‌గారు సినిమా మీద ప్యాషన్‌తో విదేశాల నుంచి ఇండస్ట్రీకి వచ్చారు. ఈ సినిమా మంచి సక్సెస్ కావాలి'' అన్నారు. ''లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రమిది'' అని సాయికిశోర్ మచ్చా తెలిపారు. ''ఈ సినిమాని ప్రేక్షకులు సపోర్ట్ చేస్తారని ఆశిస్తున్నాం'' అని ఎంఎస్ రామ్ కుమార్ చెప్పారు.

మీ స్పందన కోసం ఎదురు చూస్తున్నా
- విక్రమ్



● మాళవికా మోహనన్, విక్రమ్

''నా 'అపరిచితుడు' సినిమా దేశంలోనే విజయవాడలో అత్యధిక రోజులు ఆడింది. బ్యూటిఫుల్ అడ్వెంచరస్‌గా రూపొందిన నా తాజా 'తంగలాన్' మూవీ ప్రేక్షకులను కొత్త ప్రపంచంలోకి తీసుకెళుతుంది. మా చిత్రాన్ని థియేటర్స్‌లోనే చూడండి'' అన్నారు హీరో విక్రమ్. పా. రంజిత్ దర్శకత్వంలో విక్రమ్, పార్వతీ తిరువోతు, మాళవికా మోహనన్ నటించిన చిత్రం 'తంగలాన్'. కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించిన ఈ సినిమా ఈ నెల 15న విడుదలవుతోంది. ఈ చిత్రాన్ని తెలుగులో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూషన్ రిలీజ్ చేస్తోంది. సోమవారం విజయవాడలో జరిగిన ప్రెస్‌మీట్‌లో విక్రమ్ మాట్లాడుతూ– ''తంగలాన్' మంచి సినిమా. మీరంతా (ప్రేక్షకులు) ఎప్పుడెప్పుడు ఈ సినిమాని చూసి మీ స్పందన తెలియజేస్తారా? అని వేచి చూస్తున్నా'' అని తెలిపారు.



యాభై వసంతాల వేడుక

● విజయకృష్ణ మందిర్.. ఘట్టమనేని ఇందిరాదేవి స్ఫూర్తి వనం ఏర్పాటు

నటుడిగా 50 ఏళ్లు పూర్తి చేసుకున్నారు నరేశ్ విజయకృష్ణ. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్‌లో విజయకృష్ణ మందిర్ –ఘట్టమనేని ఇందిరాదేవి స్ఫూర్తి వనాన్ని ప్రారంభించారు. ఈ వేడుకకి తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నంద ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడుతూ– ''ఈ పార్క్ గతం, భవిష్యత్ తరానికి మధ్య అద్భుతమైన వారధి'' అన్నారు. ''చిత్ర పరిశ్రమ కోసం కృషి చేసిన దిగ్గజాలందరికీ స్మారక చిహ్నంగా స్ఫూర్తి వనం రూపొందించాం'' అని నరేశ్ విజయకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా నరేశ్ విజయకృష్ణ, పవిత్రా లోకేశ్, జయసుధలను మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా) తరఫున మాదాల రవి, శివబాలాజీ, మహారాష్ట్ర సినీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పూనమ్ ధిల్లాన్, జాకీ ష్రాఫ్, సుహాసిని, ఖుష్బూ తదితరులు సత్కరించారు. న్యాయమూర్తి ఎస్. మాధవరావు, తెలంగాణ హైకోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సూరేపల్లి ప్రశాంత్, నటులు సాయి దుర్గా తేజ్, మనోజ్ మంచు, అలీ, దర్శకులు మారుతి, అనుదీప్, సతీష్ వేగేశ్న, సంగీత దర్శకుడు కోటి, నిర్మాతలు శరత్ మరార్, రాధామోహన్‌తో పాటు తెలుగు, హిందీ, తమిళ చిత్ర పరిశ్రమలకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



● బాబీ డియోల్, సూర్య

బానిసత్వం చెల్లదు

'మనం నివసించే ఈ దీవిలో ఎన్నో రహస్యాలు దాగున్నాయి.. వాటిన్నిటికన్నా మనది అంతు చిక్కని రహస్యం' అనే డైలాగ్స్‌తో 'కంగువ' సినిమా ట్రైలర్ ప్రారంభమైంది. సూర్య హీరోగా నటించిన చిత్రం 'కంగువ'. దిశా పటానీ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో బాబీ డియోల్ కీ రోల్ చేశారు. కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ నిర్మించిన ఈ చిత్రం అక్టోబర్ 10న విడుదల కానుంది. ఈ సినిమా ట్రైలర్‌ను సోమవారం విడుదల చేశారు. 'శిరం శరీరం వేరై భూమికి ఒరిగినా నుదురు నేల ఆనదు... మడమ మోకరిల్లదు.. బానిసత్వం చెల్లదు' అంటూ సూర్య చెప్పే పవర్‌ఫుల్ డైలాగ్స్‌తో పాటు బాబీ డియోల్ చెప్పే డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి. ఇదిలా ఉంటే 'కంగువ'ని నైజాం ఏరియాలో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ రిలీజ్ చేయనుంది.

భావోద్వేగాల ఉత్సవం



● రెజీనా, దిలీప్ ప్రకాశ్

లవ్, ఎమోషన్స్, కామెడీ నేపథ్యంలో రూపొందిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఉత్సవం'. దిలీప్ ప్రకాశ్, రెజీనా కసాండ్రా లీడ్ రోల్స్‌లో నటించారు. అర్జున్ సాయి దర్శకత్వంలో సురేష్ పాటిల్ ఈ చిత్రాన్ని నిర్మించారు. సెప్టెంబర్ 13న ఏపీ, తెలంగాణలో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ఈ చిత్రాన్ని విడుదల చేయనుంది. ''మా సినిమా ఓ ఉత్సవంలా ఉంటుంది. ఈ చిత్రంలోని భావోద్వేగాలు, ప్రేమ, వినోదం ప్రేక్షకులను ఆకట్టుకునే విధంగా ఉంటాయి. ఇప్పటివరకూ రిలీజ్ చేసిన టీజర్, పాటలకు మంచి స్పందన లభించింది'' అని చిత్రబృందం పేర్కొంది.

ఈ ప్రయాణం ఇంకా ప్రత్యేకం
- షారుక్ ఖాన్



● ఆర్యన్, షారుక్, అబ్రామ్

''డిస్నీతో నా అనుబంధం ప్రత్యేకమైనది. ఈసారి మరీ... ఎందుకంటే నా కుమారులు ఆర్యన్, అబ్రామ్ కూడా ఈ ప్రయాణంలో భాగం అయ్యారు'' అని సోషల్ మీడియా వేదికగా షారుక్ ఖాన్ పేర్కొన్నారు. వాల్ట్ డిస్నీ స్టూడియోస్ నిర్మించిన హాలీవుడ్ చిత్రం 'ముఫాసా: ది లయన్ కింగ్'. ఈ చిత్రం హిందీ వెర్షన్‌కి షారుక్ ఖాన్, ఆయన కుమారులు ఆర్యన్, అబ్రామ్ వాయిస్ ఓవర్ ఇచ్చారు. కింగ్ ముఫాసాకి షారుక్, యువ ముఫాసాకి అబ్రామ్, ముఫాసా కుమారుడు సింబాకి ఆర్యన్ వాయిస్ ఓవర్ ఇచ్చారు. జెంకిన్స్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం భారతదేశంలో డిసెంబర్ 20న ఇంగ్లిష్, హిందీ, తెలుగు, తమిళ భాషల్లో రిలీజ్ కానుంది.



● తేజస్

పట్నం పిల్ల...

'హుషారు' ఫేమ్ తేజస్ కంచర్ల హీరోగా నటించిన తాజా చిత్రం 'ఉరుకు పటేల'. వివేక్ రెడ్డి దర్శకత్వంలో లీడ్ ఎడ్జ్ పిక్చర్స్ బ్యానర్‌పై కంచర్ల బాల భాను నిర్మించిన ఈ సినిమా సెప్టెంబర్ 13న రిలీజ్ కానుంది. ప్రవీణ్ లక్కరాజు సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'పట్నం పిల్ల..' అంటూ సాగే పాటని రిలీజ్ చేశారు. కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించిన ఈ పాటని రాహుల్ సిప్లిగంజ్ ఆలపించారు. ''గ్రామీణ నేపథ్యంలో భావోద్వేగాల ప్రధానంగా సాగే చిత్రం 'ఉరుకు పటేల'. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి'' అని మేకర్స్ పేర్కొన్నారు.

వినేశ్ రజత పతకం అప్పీల్‌పై తీర్పు నేడు!

పారిస్: క్రీడాలోకమే కాదు... యావత్ దేశం ఎదురుచూపులకు నేడు తెరపడే అవకాశముంది. భారత మహిళా స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ అప్పీల్‌పై నేడు తీర్పు వెలువడనుంది. పారిస్ విశ్వక్రీడల్లో మహిళల 50 కేజీల కేటగిరీలో ఫైనల్లోకి ప్రవేశించిన ఆమె సరిగ్గా బౌట్‌కు ముందు కేవలం 100 గ్రాముల అధిక బరువు కారణంగా అనర్హతకు గురైంది. దీంతో ఫైనల్లో ఓడినా కనీసం ఖాయమనుకున్న రజతం చేజారడంతో పాటు... అమె పాల్గొన్న వెయిట్ కేటగిరీ జాబితాలో చివరి స్థానంలో నిలవడం భారతావనిని నిర్ఘాంత పరిచింది. తన అనర్హతపై సవాలుకు వెళ్లిన ఫొగాట్... సంయుక్త రజతం డిమాండ్ చేస్తూ కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్ (సీఏఎస్)లో అప్పీలు చేసింది. భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) నిష్ణాతులైన లాయర్లతో ఈ అప్పీలుపై వాదించింది. విచారణ పూర్తికావడంతో నేడు సీఏఎస్ తుది తీర్పు వెలువరించనుంది. కాగా ఐఓఏ అధ్యక్షురాలు పీటీ ఉష మాట్లాడుతూ... వినేశ్ బరువు పెరగడం, అనర్హతకు బాధ్యుడిని చేస్తూ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దిన్‌షా పర్దివాలాపై విమర్శలకు దిగడం సమంజసం కాదని చెప్పింది. సంబంధిత అథ్లెట్ల బరువు, ఈవెంట్ల నిబంధనలపై కోచ్, వ్యక్తిగత సిబ్బంది జాగ్రత్తగా ఉండాల్సిందని ఆమె అభిప్రాయపడింది.



2028లో మళ్లీ కలుద్దాం!

పారిస్‌లో విశ్వ క్రీడలకు వీడ్కోలు | ఘనంగా సాగిన వేడుకలు | బాణాసంచా వెలుగులతో జిగేల్ | లాస్‌ఏంజెలిస్‌లో 2028 ఒలింపిక్స్

హాలీవుడ్ స్టార్ టామ్ క్రూజ్

















పారిస్: ప్రపంచ సినిమా కలల ప్రపంచం హాలీవుడ్.. లాస్‌ఏంజెలిస్ నగర శివారులో వెలసిన వినోదనగరి... నాలుగేళ్ల తర్వాత ఆ సినీ అడ్డా వద్ద ప్రపంచ క్రీడా సంబరం నిర్వహణకు రంగం సిద్ధమైంది... మరి దాని గురించి ప్రపంచానికి చెప్పాలంటే మామూలు పద్ధతిలో చేస్తే ఏం బాగుంటుంది? అందుకే లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్ నిర్వాహకులు కొత్తగా ప్రయత్నించారు. అందుకోసం హాలీవుడ్ స్టార్ టామ్ క్రూజ్‌కంటే సరైన వ్యక్తి ఎవరుంటారు. పారిస్ నేషనల్ స్టేడియంలో ఆదివారం అర్ధరాత్రి తర్వాత జరిగిన ముగింపు ఉత్సవం మధ్యలో క్రూజ్ స్టేడియం పైభాగం నుంచి దూకి స్టేడియంలోకి వచ్చాడు. ఆ తర్వాత అమెరికా జిమ్నాస్ట్ సిమోన్ బైల్స్ నుంచి ఒలింపిక్ పతాకాన్ని అందుకున్నాడు. లాస్‌ఏంజెలిస్‌లో క్రీడలు జరిగే సమయంలో ప్రధానాకార్షణగా మారే అవకాశం ఉన్న టామ్ క్రూజ్‌ను ఇలా అందరి ముందు తీసుకొచ్చారు. మోటార్ సైకిల్, విమానం, పారాచూట్‌తో టామ్ క్రూజ్ ఒలింపిక్స్‌కు ప్రచారం చేస్తూ గతంలోనే రికార్డు చేసిన వీడియోను కూడా ఈ సందర్భంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంతో అధికారికంగా ఒలింపిక్స్ నిర్వహణ బాధ్యత పారిస్ నుంచి లాస్ ఏంజెలిస్‌కు మారింది. ఈ అమెరికా నగరంలో ఒలింపిక్స్ నిర్వహించడం ఇది మూడోసారి. గతంలో 1932, 1984లో లాస్ ఏంజెలిస్‌లో విశ్వ క్రీడలు జరిగాయి.

అలరించిన కార్యక్రమాలు...

సెన్ నదిపై ఘనంగా నిర్వహించిన ప్రారంభోత్సవ వేడుకల తరహాలోనే ఒలింపిక్స్ ముగింపు ఉత్సవం కూడా ఘనంగానే ముగిసింది. దాదాపు 70 వేల మంది ప్రేక్షకుల సమక్షంలో రెండున్నర గంటల పాటు ఈ కార్యక్రమం సాగింది. పారిస్ నగర ఘనతను చెబుతూ సాగిన సంగీత కార్యక్రమంతో ఇది మొదలు కాగా... అనంతరం 206 దేశాలకు చెందిన అథ్లెట్లు తమ జాతీయ పతాకాలతో పరేడ్‌లో పాల్గొన్నారు. 'రికార్డ్స్' పేరుతో సాగిన ఈ ఉత్సవం అందరినీ అలరించింది. వచ్చే ఒలింపిక్స్ అమెరికాలో ఉన్న నేపథ్యంలో ఆ దేశానికి చెందిన సంగీత కారులకు కూడా ఇందులో చోటు కల్పించారు. సంప్రదాయం ప్రకారం అన్నింటికంటే ముందుగా తొలి ఒలింపిక్స్ జరిగిన గ్రీస్ జాతీయ పతాకాన్ని, ఆ తర్వాత ఫ్రాన్స్ జాతీయ పతకాన్ని ప్రదర్శించారు. మెగా ఈవెంట్ విజయవంతం కావడంపై అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) చైర్మన్ థామస్ బాక్ తన సంతోషాన్ని వెలిబుచ్చారు. 'అథ్లెట్లు ఒక మ్యాజిక్‌ను ప్రదర్శించారు. కోట్లాది మంది క్రీడాభిమానుల తరఫున కృతజ్ఞతలు. మళ్లీ 2028లో కలుస్తాం. ఒలింపిక్స్ ఇంకా పైపైకి ఎదుగుతూనే ఉంటాయి. ప్రపంచంలో ఎన్నో సమస్యలు ఉన్నా 206 దేశాల నుంచి ఆటగాళ్లు ఇక్కడకు చేరారు. పతకాల కోసం హోరాహోరీగా పోరాడారు. ఒలింపిక్స్‌తో వెలుగుల నగరం మరింతగా శోభిల్లింది. అత్యుత్తమ క్రీడా ప్రదర్శనే కాదు, ఆటగాళ్లకు సంబంధించి ఇదే సంబరాల వేడుక' అని బాక్ వ్యాఖ్యానించారు. ఈ వేదికపై ఐఓసీ రెఫ్యూజీ ఒలింపిక్ టీమ్ మహిళా బాక్సర్ సిండీ ఎన్‌గాంబా, చైనా టేబుల్ టెన్నిస్ స్టార్ సన్ యింగ్‌షా, కెన్యా స్టార్ మారథాన్ రన్నర్ కిప్‌చోగే, క్యూబా దిగ్గజ రెజ్లర్ మిజైన్ లోపెజ్, ఫ్రాన్స్ జూడో స్టార్ టెడ్డీ రైనర్, ఆస్ట్రేలియా స్విమ్మర్ ఎమ్మా మెకీన్ కూడా ఉన్నారు. ఐదు ఖండాల దేశాలకు ప్రతినిధులుగా వీరు వ్యవహరించారు. అనంతరం పారిస్ నగర మేయర్ అన్నె హిడాల్గో ఒలింపిక్ పతాకాన్ని థామస్ బాక్‌కు అందజేశారు. ఆయన నుంచి తదుపరి విశ్వ క్రీడలు జరిగే లాస్ ఏంజెలిస్ నగరానికి మేయర్‌గా వ్యవహరిస్తున్న కరెన్ బాస్ ఈ పతాకాన్ని స్వీకరించారు. అనంతరం ఇదే వేదికపై ఉన్న అమెరికా స్టార్ జిమ్నాస్ట్ సిమోన్ బైల్స్‌కు కరెన్ బాస్ ఒలింపిక్ పతాకాన్ని అందించింది. పారిస్, లాస్‌ఏంజెలిస్ నగరాలకు అన్నె హిడాల్గో, కరెన్ బాస్ తొలి మహిళా మేయర్లు కావడం విశేషం. ఒలింపిక్ పతాకం స్వీకరించాక ఎమ్మీ, గ్రామీ, ఆస్కార్ అవార్డుల గ్రహీత, అమెరికా సింగర్ గాబ్రియేలా సారిమెంటో విల్సన్ అమెరికా జాతీయ గీతాన్ని ఆలపించింది. ఫ్రాన్స్ స్విమ్మర్ లియాన్ మర్చండ్ ఒలింపిక్ జ్యోతిని స్టేడియంలోకి తీసుకురాగా, ఆ తర్వాత దానిని ఆర్పేసి అధికారికంగా క్రీడలు ముగిసినట్లు ప్రకటించారు.



ప్రేక్షకులకు అభివాదం చేస్తున్న వలంటీర్లు

ఫ్లాగ్ బేరర్లుగా శ్రీజేశ్, మనూ...

ముగింపు వేడుకల పరేడ్‌లో భారత్ నుంచి షూటర్ మనూ భాకర్, హాకీ జట్టు గోల్‌కీపర్ పీఆర్ శ్రీజేశ్ ఫ్లాగ్ బేరర్లుగా వ్యవహరించారు. పారిస్ ఒలింపిక్స్‌లో మనూ భాకర్ రెండు కాంస్యాలు సాధించగా... కాంస్యం గెలిచిన భారత పురుషుల హాకీ జట్టులో సభ్యుడైన శ్రీజేశ్ ఈ పోటీల తర్వాత అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. ఆఖరి ఈవెంట్లలో పాల్గొన్న కొందరు ఆటగాళ్లు, సహాయక సిబ్బంది మాత్రమే పరిమిత సంఖ్యలో భారత్ నుంచి ఈ ఉత్సవంలో పాల్గొన్నారు. మనూ, ఆమె కోచ్ జస్పాల్ రాణా ముగింపు కార్యక్రమం కోసం ప్రత్యేకంగా భారత్ నుంచి తిరిగి వెళ్లారు. రెజ్లర్ వినేశ్ ఫొగాట్ అక్కడే ఉన్నా ఆమె క్రీడాగ్రామానికే పరిమితమైంది.





ఐఓసీ చైర్మన్ థామస్ బాక్‌తో లోపెజ్, కిప్‌చోగే, సిండీ, సన్ యింగ్‌షా, ఎమ్మా మెకీన్, టెడ్డీ రైనర్



ఒలింపిక్ పతాకంతో లాస్ ఏంజెలిస్ నగర మేయర్ కరెన్ బాస్





దులీప్ ట్రోఫీలో భారత స్టార్ క్రికెటర్లు

బెంగళూరు: భారత టెస్టు జట్టులో సుస్థిర స్థానం సాధించాలనుకుంటున్న యువ ఆటగాళ్లు దులీప్ ట్రోఫీ బరిలోకి దిగేందుకు సిద్ధమవుతున్నారు. జాతీయ జట్టుకు ఎంపికవ్వాలంటే దేశవాళీ టోర్నీల్లో ఆడాల్సిందే అని బీసీసీఐ స్పష్టం చేసిన నేపథ్యంలో.. వచ్చే నెల 5 నుంచి ప్రారంభం కానున్న దులీప్ ట్రోఫీలో పలువురు స్టార్ క్రికెటర్లు పాల్గొననున్నారు. కారు ప్రమాదం నుంచి కోలుకుని పరిమిత ఓవర్ల క్రికెట్‌లో సత్తా చాటుతున్న వికెట్ కీపర్ రిషభ్ పంత్, కేఎల్ రాహుల్, శుభ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, సర్ఫరాజ్ ఖాన్, సూర్యకుమార్ యాదవ్, రజత్ పటిదార్ తదితరులు దులీప్ ట్రోఫీలో ఆడనున్నారు. విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, జస్‌ప్రీత్ బుమ్రా, అశ్విన్ ఆడే విషయంలో ఇంకా స్పష్టత లేదు.



గిల్



రాహుల్

2023–25 ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌కు ముందు భారత జట్టు 10 టెస్టు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ఇందులో భాగంగా సెప్టెంబర్ 19 నుంచి భారత్, బంగ్లాదేశ్ మధ్య రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ జరగనుంది. దీంతో యువ ఆటగాళ్లు సత్తా చాటేందుకు దులీప్ ట్రోఫీ ఉపయోగపడనుంది. అనంతపురం వేదికగా నాలుగు జట్ల మధ్య ఈ టోర్నీ జరగనుండగా... ఒక మ్యాచ్‌ను బెంగళూరుకు తరలించారు. నేరుగా విమాన సౌకర్యం లేకపోవడంతో బీసీసీఐ ఈ వేదికలో మార్పులు చేసింది. 'దులీప్ ట్రోఫీలో పలువురు స్టార్ ప్లేయర్లు బరిలోకి దిగనున్నారు. అందుకే విమాన ప్రయాణాలకు అనుకూలంగా ఉంటుందని వేదికను అనంతపురం నుంచి బెంగళూరుకు మార్చాం' అని ఓ అధికారి తెలిపారు.

యూటీటీ సీజన్‌కు శ్రీజ దూరం



చెన్నై: భారత నంబర్‌వన్ టేబుల్ టెన్నిస్ (టీటీ) ప్లేయర్, తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ అల్టిమేట్ టేబుల్ టెన్నిస్ (యూటీటీ) సీజన్ నుంచి తప్పుకుంది. ఒత్తిడి కారణంగా ఈ నెల 22న ప్రారంభం కానున్న సీజన్‌కు తాను దూరం అవుతున్నట్లు ఆమె తెలిపింది. ఇటీవల పారిస్ ఒలింపిక్స్ టీటీ మహిళల సింగిల్స్‌లో ప్రిక్వార్టర్స్‌కు చేరి ఆకట్టుకున్న 26 ఏళ్ల శ్రీజ ఆరు వారాల పాటు విశ్రాంతి తీసుకోనున్నట్లు వెల్లడించింది. 'యూటీటీలో ఆడలేకపోవడం బాధగా ఉంది. విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించారు. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నా' అని రెండుసార్లు జాతీయ చాంపియన్ శ్రీజ పేర్కొంది. లీగ్‌లో శ్రీజ జైపూర్ జట్టుకు ప్రాతినిధ్యం వహించాల్సి ఉండగా ఆమె స్థానంలో ఫ్రాంచైజీ నిత్యశ్రీ మణిని ఎంపిక చేసుకుంది.

థోర్ప్ ఆత్మహత్య చేసుకున్నాడు

వెల్లడించిన భార్య అమండా

లండన్: ఇంగ్లండ్ మాజీ క్రికెటర్ గ్రాహమ్ థోర్ప్ ఈ నెల 5న కన్నుమూశాడు. అప్పట్లో అనారోగ్య కారణాలతో మృతి చెందినట్లు వార్తలొచ్చాయి. కానీ ఏ అనారోగ్యమనేది బయటికి రాలేదు. అయితే తాజాగా అతని భార్య అమండా తన భర్త మరణానికి గల కారణాన్ని మాజీ ఇంగ్లండ్ కెప్టెన్ మైకేల్ అథర్టన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించింది. అందరూ అనుకున్నట్లు అతనిది అనారోగ్య సంబంధిత సాధారణ మరణం కాదని, 55 ఏళ్ల థోర్ప్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని వెల్లడించింది. 'గత కొన్నేళ్లుగా అతను తీవ్రమైన అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నాడు. దీంతో మానసిక ఒత్తిడికి గురయ్యాడు. కంగారు, ఆందోళన అంతకంతకూ పెరిగిపోయాయి. ఇవి తట్టుకోలేక రెండేళ్ల క్రితం 2022 మేలో థోర్ప్ ఆత్మహత్యాయత్నం చేశాడు. దీనివల్ల ఆరోగ్య సమస్యలు పెరగడంతో దీర్ఘకాలికంగా ఐసీయూలో చికిత్స అందించాకే కాస్త కోలుకున్నాడు. కానీ మళ్లీ డిప్రెషన్‌లోకి వెళ్లిపోయాడు. దీంతో నేను ఇద్దరు పిల్లలతో కలిసి కుటుంబం మొత్తం అతన్ని మామూలు స్థితికి తీసుకొచ్చేందుకు ఎంతో ప్రయత్నించాం. మెరుగైన చికిత్స అందించినా దురదృష్టవశాత్తూ అతన్ని కాపాడుకోలేకపోయాం' అని అమెండా వాపోయింది. ఇంగ్లండ్ తరఫున 100 టెస్టులు ఆడిన థోర్ప్ ఆటకు వీడ్కోలు పలికాక కోచ్‌గా పని చేశాడు. థోర్ప్‌కు ఇద్దరు కుమార్తెలు కిట్టీ (22), ఎమ్మా (19) ఉన్నారు. 'కుటుంబాన్ని ఎంతగానో ప్రేమించే నాన్న ఇలా (ఆత్మహత్య) చేసుకోవడంతో మా గుండెలు బద్దలయ్యాయి' అని కిట్టీ బాధను వెళ్లగక్కింది.



దక్షిణాఫ్రికా, వెస్టిండీస్ తొలి టెస్టు 'డ్రా'



అథనాజ్

పోర్ట్ ఆఫ్ స్పెయిన్: దక్షిణాఫ్రికా, వెస్టిండీస్ మధ్య జరిగిన తొలి టెస్టు 'డ్రా'గా ముగిసింది. పలుమార్లు వర్షం అంతరాయం కలిగించిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 357 పరుగులు చేయగా... వెస్టిండీస్ 233 పరుగులు సాధించింది. రెండో ఇన్నింగ్స్‌లో వేగంగా ఆడిన సఫారీ జట్టు 173/3 వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. ట్రిస్టన్ స్టబ్స్ (50 బంతుల్లో 68; 6 ఫోర్లు, 2 సిక్సర్లు), టోనీ డి జోర్జీ (45), మార్క్‌రమ్ (38) రాణించారు. అనంతరం 298 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆతిథ్య వెస్టిండీస్ ఆట నిలిచే సమయానికి 5 వికెట్లు కోల్పోయి 201 పరుగులు చేసింది. అలిక్ అథనాజ్ (92) ధాటిగా ఆడాడు. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 8 వికెట్లు తీసిన కేశవ్ మహరాజ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. ఇరుజట్ల మధ్య గురువారం నుంచి రెండో టెస్టు ప్రారంభం కానుంది.

సాక్షి బిజినెస్
మంగళవారం
13-8-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▼	57	79,649
నిఫ్టీ ▼	20	24,347

విదేశీ సూచీలు (రాత్రి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	16,766	▲	21
డోజోన్స్	39,340	▼	188
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,210	▲	42
డాక్స్	177,26	▲	4
షాంఘై	2,858	▼	4
నికాయ్	35,025	▲	194

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	69,890
బంగారం (99.5 స్వచ్ఛత)	69,610
వెండి (కిలో)	81,124

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		83.55	84.57
£	బ్రిటన్ పౌండ్		105.98	108.53
€	యూరో		90.56	92.95
¥	జపాన్ ఎన్ (100)		56.56	57.83
AUS	ఆస్ట్రేలియా డాలర్		54.41	56.34
S$	సింగపూర్ డాలర్		61.09	65.74
SAR	సౌదీ రియాల్		21.50	23.05
UAE D	యూఏఈ దిర్హామ్		21.98	23.76
¥	చైనా యువాన్		10.83	12.65

దారికొచ్చిన ద్రవ్యోల్బణం

జూలైలో 3.54 శాతం ● ఐదేళ్ల కనిష్ట స్థాయి



న్యూఢిల్లీ: వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం జూలైలో పూర్తిగా అదుపులోకి వచ్చింది. ధరల స్పీడ్ 3.54 శాతంగా (గత ఏడాది ఇదే నెలతో పోల్చి) నమోదయ్యింది. గడచిన ఐదేళ్లలో (2019 సెప్టెంబర్ తరువాత) ఇంత తక్కువ స్థాయికి రిటైల్ ద్రవ్యోల్బణం పడిపోవడం ఇదే తొలిసారి. ఆహార ధరల దిగిరావడం దీనికి ప్రధాన కారణమని గణాంకాలు పేర్కొన్నాయి. ద్రవ్య పరపతి విధానానికి ప్రాతిపదిక అయిన రిటైల్ ద్రవ్యోల్బణం 2 శాతం అటుఇటుగా 4 శాతం వద్ద ఉండేలా చర్యలు ఉండాలని కేంద్రం ఆర్‌బీఐకి నిర్దేశిస్తోంది. ఈ స్థాయికి తీసుకురావడానికి గడచిన తొమ్మిది ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్షా సమావేశాల నుంచి ఆర్‌బీఐ బ్యాంకులకు ఇచ్చే రుణాలపై వసూలుచేసే రుణ రేటు– రెపో రేటును (ప్రస్తుతం 6.5 శాతం) యథాతథంగా కొనసాగిస్తోంది. ఈ నేపథ్యంలో రిటైల్ ద్రవ్యోల్బణం పూర్తిగా నిర్దేశిత స్థాయి దిగువకు రావడం గమనార్హం. అక్టోబర్ 7 నుంచి 9 వరకూ తదుపరి పాలసీ సమీక్షా సమావేశం జరగనుంది. అప్పటి వరకూ రిటైల్ ద్రవ్యోల్బణం ఇదే దిగువస్థాయిలో కొనసాగితే ఆర్‌బీఐ రెపో రేటును తగ్గించే అవకాశాలు ఉన్నాయన్నది నిపుణుల అంచనా.

➜ ఫుడ్ బాస్కెట్‌కు సంబంధించి ద్రవ్యోల్బణం జూలైలో 5.42 శాతంగా నమోదయ్యింది. జూన్‌లో ఈ స్పీడ్ 9.36%. గత ఏడాది ఇదే నెల్లో ఈ రేటు 11.51%. సమీక్షా నెలలో పాలు, పాల ఉత్పత్తుల ధరలు 2.99% పెరిగాయి. సుగంధ ద్రవ్యాల ధరలు 1.43 శాతం తగ్గాయి. అయితే పండ్ల ధరలు 3.84%, కూరగాయల ధరలు 6.83% పెరగ్గా, తృణ ధన్యాలు, ఉత్పత్తుల ధరలు 8.14 శాతం పెరిగాయి. రిటైల్ ధరల సూచీలో ఫుడ్ బాస్కెట్ వెయిటేజ్ దాదాపు 40%.

నెమ్మదించిన పరిశ్రమలు

జూన్‌లో ఐఐపీ 4.2% ● 5 నెలల కనిష్టం



న్యూఢిల్లీ: పారిశ్రామిక రంగం జూన్‌లో నెమ్మదించింది. ఐదు నెలల్లో ఎన్నడూ లేనంత తక్కువ స్థాయిలో పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపీ) 4.2 శాతంగా నమోదయ్యింది. ఐఐపీ సూచీలో మెజారిటీ వెయిటేజ్ కలిగిన తయారీ రంగం పనితీరు నిరుత్సాహ పరిచినప్పటికీ విద్యుత్, మైనింగ్ రంగాలు చక్కటి ఫలితాలను నమోదుచేశాయి. 2024 జనవరి, ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, మే నెలల్లో సూచీ వరుసగా 4.2%, 5.6%, 5.5%, 5.0%, 6.2 శాతం వృద్ధి రేట్లను (2023 ఇవే నెలలతో పోల్చి) నమోదుచేసుకుంది. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికం (ఏప్రిల్–జూన్)లో సూచీ 5.2 శాతంగా నమోదయ్యింది. గత ఏడాది ఇదే కాలంలో ఈ వృద్ధి రేటు 4.7 శాతం. గత ఏడాది జూన్‌లో ఐఐపీ వృద్ధి రేటు 4 శాతంగా నమోదయ్యింది. అంటే అప్పటి కన్నా తాజా సమీక్షా నెల జూన్‌లో (4.2 శాతం) కొంత మెరుగైన ఫలితం వెలువడ్డం గమనార్హం. 2023 అక్టోబర్లో రికార్డు స్థాయిలో 11.9 శాతం ఐఐపీ వృద్ధి నమోదైంది.

బ్యాంక్ షేర్ల ర్యాలీతో రికవరీ

- హిండెన్‌బర్గ్ ఎఫెక్ట్‌తో ఒడిదుడుకులు
- అదానీ గ్రూప్ షేర్లలో అమ్మకాలు
- సూచీలకు స్వల్ప నష్టాలు



ముంబై: రోజంతా తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతూ.., లాభ, నష్టాల మధ్య కదలాడిన స్టాక్ సూచీలు సోమవారం స్వల్ప నష్టాలతో ముగిశాయి. సెబీ చైర్‌పర్సన్, అదానీ గ్రూప్‌పై హిండెన్‌బర్గ్ ఆరోపణలతో ట్రేడింగ్ ప్రారంభంలోనే పతనమైన సూచీలను ప్రైవేటు రంగ బ్యాంకుల షేర్లు రాణించి ఆదుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూల సంకేతాలూ అండగా నిలిచాయి. ఇంట్రాడేలో 480 పాయింట్లు క్షీణించిన సెన్సెక్స్ చివరికి 57 పాయింట్లు స్వల్ప నష్టంతో 79,649 వద్ద ముగిసింది. కనిష్ట స్థాయి (79,226) నుంచి కోలుకుని ఏకంగా 880 పాయింట్లు ఎగసి 80,106 వద్ద గరిష్టాన్ని తాకింది. నిఫ్టీ 20 పాయింట్లు నష్టపోయి 24,347 వద్ద నిలిచింది. ఇంట్రాడేలో 24,212 – 24,473 పరిధిలో కదలాడింది. ప్రైవేట్ బ్యాంకులతో పాటు కన్జూమర్ డ్యూరబుల్స్, రియల్టీ, ఆయిల్‌అండ్‌గ్యాస్, మెటల్, ఐటీ షేర్లకూ కొనుగోళ్ల మద్దతు లభించింది. బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు 0.04%, 0.67శాతం చొప్పున రాణించాయి. ఎఫ్‌ఎంసీజీ, విద్యుత్, పీఎస్‌యూ బ్యాంక్, మీడియా రంగాల అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అమెరికాలో ఉపాధితో పెరగడంతో మాంద్య భయాలు తగ్గడంతో పాటు చైనాలో ద్రవ్యోల్బణ డేటా వినియోగం పెరుగుతున్నట్లు సంకేతాలు రావడంతో అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.

అదానీ షేర్లపై హిండెన్‌బర్గ్ ప్రభావం

హిండెన్‌బర్గ్ తాజా ఆరోపణల ప్రభావంతో ట్రేడింగ్ ప్రారంభంలో అదానీ గ్రూప్ షేర్లు భారీ పడి, తర్వాత కోలుకున్నాయి. మొత్తం పదింటికి గానూ తొమ్మిది కంపెనీల షేర్లు నష్టపోయాయి. ప్రధాన కంపెనీ అదానీ ఎంటర్ ప్రైజెస్ షేరు 1% నష్టపోయింది. అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ 4%, అదానీ విల్మార్ 4%, అదానీ టోటల్ గ్యాస్ 4%, ఎన్‌డీటీవీ 3%, అదానీ పోర్ట్స్ 2% చొప్పున క్షీణించాయి.



24.5% వాటా కొనుగోలు.. | **డీల్ విలువ రూ. 33,600 కోట్లు!**

బ్రిటీష్ టెలికంలో భారతి గ్లోబల్ పాగా

న్యూఢిల్లీ: దేశీ **దిగ్గజం భారతి ఎంటర్‌ప్రైజెస్** అంతర్జాతీయ పెట్టుబడుల విభాగం భారతి గ్లోబల్ తాజాగా బ్రిటన్ సంస్థ బీటీ (బ్రిటీష్ టెలికం) గ్రూప్‌లో 24.5 శాతం వాటా కొనుగోలు చేయనుంది. డీల్ విలువను నిర్దిష్టంగా ప్రకటించనప్పటికీ బీటీ వేల్యుయేషన్ సుమారు 15 బిలియన్ డాలర్లు ఉంటుందని, దాన్ని బట్టి చూస్తే ఒప్పంద విలువ దాదాపు 4 బిలియన్ డాలర్లు (సుమారు రూ. 33,600 కోట్లు) ఉండవచ్చని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. భారతి గ్లోబల్ ప్రకటన ప్రకారం కంపెనీ ముందుగా ఆల్టిస్ సంస్థ నుంచి బీటీ గ్రూప్‌లో 9.99 శాతం వాటాను తక్షణం కొనుగోలు చేస్తుంది. **నియంత్రణ సంస్థ అనుమతులు వచ్చాక మిగతా** వాటాను తీసుకుంటుంది. బీటీని పూర్తిగా దక్కించుకోవడంపై గానీ బోర్డులో స్థానం తీసుకోవడంపై గానీ ఆసక్తి లేదని భారతి గ్లోబల్ పేర్కొంది. బీటీ గ్రూప్ బ్రిటన్‌లో అతి పెద్ద బ్రాడ్‌బ్యాండ్, మొబైల్ కంపెనీగా కార్యకలాపాలు సాగిస్తోంది. దానికి గతంలో 1997 నుంచి 2001 వరకు భారతి ఎంటర్‌ప్రైజెస్ టెలికం విభాగమైన భారతి ఎయిర్‌టెల్‌లో 21 శాతం వాటాలు ఉండేవి. బీటీ గ్రూప్‌లో బిలియనీర్ ప్యాట్రిక్ డ్రాహీకి చెందిన పెట్టుబడి సంస్థ ఆల్టిస్ 2021లో ముందుగా 12 శాతం వాటాలు తీసుకుని తర్వాత దాన్ని **24.5 శాతానికి పెంచుకుంది. భారతి గ్లోబల్ పెట్టు**బడులు తమ గ్రూప్ భవిష్యత్ వృద్ధి అవకాశాలపై నమ్మకానికి నిదర్శనమని బీటీ సీఈవో అలిసన్ కిర్క్‌బీ పేర్కొన్నారు.



> భారతి, బీటీలకు రెండు దశాబ్దాల పైగా అనుబంధం ఉంది. దిగ్గజ బ్రిటన్ కంపెనీలో ఇన్వెస్ట్ చేయడం మాకు ఒక గొప్ప మైలురాయిలాంటిది
>
> – సునీల్ భారతి మిట్టల్, భారతి ఎంటర్‌ప్రైజెస్ చైర్మన్

టాటా, మహీంద్రాల సరసన భారతి..

➜ తాజా డీల్‌తో బ్రిటన్ కంపెనీలను కొనుగోలు చేసిన టాటా, మహీంద్రా, వెల్‌స్పన్, టీవీఎస్ వంటి దిగ్గజ సంస్థల సరసన భారతి ఎంటర్‌ప్రైజెస్ కూడా చోటు దక్కించుకోనుంది.

➜ టాటా గ్రూప్‌లో భాగమైన టాటా టీ 2000లో బ్రిటన్ సంస్థ టెట్లీ టీని కొనుగోలు 271 మిలియన్ పౌండ్లకు చేసింది. అప్పట్లో టెట్లీతో పోలిస్తే టాటా టీ పరిమాణం చాలా చిన్నది. అయినప్పటికీ 1995 నుంచి దాన్ని కొనుగోలు చేసేందుకు సుదీర్ఘంగా ప్రయత్నాలు చేసింది. టాటా గ్రూప్ చైర్మన్ రతన్ టాటా కూడా రంగంలోకి దిగారు. చివరికి 2000లో టాటా గ్రూప్ దాన్ని **సొంతం** చేసుకుని **అప్పట్లో** దేశీ కార్పొ**రేట్ చరి**త్రలోనే అతి పెద్ద కొను**గోలు డీ**ల్‌ను నమోదు చేసింది.

➜ **ఆ తర్వాత** ఆరేళ్లకు 2006 జూలైలో టెక్స్‌టైల్స్ **దిగ్గజం** వెల్‌స్పన్ ఇండియా, బ్రిటన్‌కి చెందిన టెర్రీ టవల్ బ్రాండ్ క్రిస్టీ మాతృ సంస్థ సీహెచ్‌టీ హోల్డింగ్స్‌లో 85 శాతం వాటా కొనుగోలు చేసింది. ఇందుకోసం రూ. 132 కోట్లు వెచ్చించింది.

➜ టాటా గ్రూప్ తన దూకుడును కొనసాగిస్తూ ఆ మరుసటి ఏడాది 2007లో ఆంగ్లో–డచ్ ఉక్కు దిగ్గజం కోరస్ గ్రూప్‌ను దక్కించుకుంది. ఇందుకోసం టాటా గ్రూప్‌లో భాగమైన టాటా స్టీల్ 12 బిలియన్ డాలర్లు వెచ్చించింది. దానికి కొనసాగింపుగా 2008లో టాటా మోటార్స్ 2.3 బిలియన్ డాలర్లతో జాగ్వార్ ల్యాండ్ రోవర్‌ను ఫోర్డ్ మోటర్ నుంచి దక్కించుకుంది.

➜ ఇక 2016 అక్టోబర్‌లో మహీంద్రా అండ్ మహీంద్రా బ్రిటన్‌కు చెందిన ద్విచక్ర వాహనాల సంస్థ బీఎస్‌ఏ కంపెనీని రూ. 28 కోట్లకు తీసుకుంది.

➜ 2020 ఏప్రిల్‌లో బైక్‌ల తయారీ సంస్థ నార్టన్ మోటార్‌సైకిల్స్‌ను టీవీఎస్ మోటర్ కంపెనీ 16 మిలియన్ పౌండ్లకు కొనుగోలు చేసింది.

ఒలెక్ట్రా లాభం 33 శాతం జూమ్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థ ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ జూన్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికర లాభం అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 33 శాతం అధికమై రూ.24 కోట్లకు ఎగసింది. ఎబిటా 22 శాతం పెరిగి రూ.50.5 కోట్లను తాకింది. టర్నోవర్ రూ.217 కోట్ల నుంచి రూ.317 కోట్లకు చేరింది. స్టాండలోన్ ఫలితాల్లో నికరలాభం రూ.18.7 కోట్ల నుంచి రూ.21 కోట్లు నమోదైంది. టర్నోవర్ రూ.207 కోట్ల నుంచి రూ.307 కోట్లుగా ఉంది. వెంకటేశ్వర ప్రదీప్ కారుమూరును తిరిగి కంపెనీ ఎండీగా నియమిస్తూ బోర్డు నిర్ణయం తీసుకుంది. మూడేళ్లపాటు ఆయన ఈ పదవిలో ఉంటారు. జూన్ 30 నాటికి కంపెనీ 1,902 ఎలక్ట్రిక్ బస్‌లను సరఫరా చేసింది. ప్రస్తుతం 10,818 ఈ–బస్‌లకు ఆర్డర్లు ఉన్నాయి.

ఒలెక్ట్రా షేరు ధర సోమవారం 1.19 శాతం క్షీణించి రూ.1,543.30 వద్ద స్థిరపడింది.

జోయాలుక్కాస్ ‘గిఫ్ట్స్ ఆఫ్ జోయ్’ ఆఫర్

హైదరాబాద్: జోయాలుక్కాస్ తన 68వ వార్షికోత్సవం, భారతదేశపు 78వ స్వాతంత్ర్య దినోత్సవాలను పురస్కరించుకొని ‘‘గిఫ్ట్స్ ఆఫ జోయ్’’ ఆఫర్ ప్రకటించింది. ఇందులో భాగంగా కస్టమర్లు రూ.75 వేలు, అంతకుమించి బంగారం కొనుగోలుపై 200 మిల్లీగ్రాముల బంగారు నాణాన్ని; లక్ష రూపాయిలు, అంతకుమించి వజ్రాభరణాల కొనుగోలుపై ఒక గ్రాము బంగారు నాణాన్ని ఉచితంగా పొందవచ్చు. ఈ ఆఫర్ ఆగస్టు 25 వరకు అందుబాటులో ఉంటుంది. ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కంపెనీ ఎండీ, చైర్మన్ జోయాలుక్కాస్ కస్టమర్లను కోరారు.

‘సాక్షి ప్లస్’ ఈ–పేపర్‌లో ..
తప్పు చేయలేదని నిరూపించుకోవాలి: హిండెన్‌బర్గ్
నాల్కో లాభం అప్

కేంద్ర విద్యా శాఖ మంత్రితో విజయసాయిరెడ్డి భేటీ



సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో వైఎస్సార్‌సీపీ రాజ్యసభా పక్ష నేత విజయసాయిరెడ్డి సోమవారం ఢిల్లీలో భేటీ అయ్యారు. విద్యా వ్యవస్థలో కీలక సంస్కరణలపై చర్చించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రికి తిరుమల శ్రీవారి శిల్పాన్ని సాయిరెడ్డి బహూకరించారు.

బంగ్లాదేశ్ ఘటనలపై ఐరాస జోక్యం చేసుకోవాలి

ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్



సాక్షి, అమరావతి: బంగ్లాదేశ్ పరిస్థితులపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ‘ఎక్స్’ వేదికగా స్పందించారు. అక్కడ జరిగిన ఘటనలకు సంబంధించిన వీడియోలు, చిత్రాలు హృదయ విదారకంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బంగ్లాదేశ్‌లో శాంతిని పునరుద్ధరించేందుకు ఐక్యరాజ్య సమితి జోక్యం చేసుకోవాలని కోరారు. అలాగే మానవ హక్కుల కమిషన్, మన దేశంలోని బంగ్లాదేశ్ హైకమిషన్ బంగ్లాదేశ్‌లో శాంతి స్థాపనకు తగిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అక్కడి హిందువుల కోసం తాను భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.

అమానుష ఘటనపై ఆగ్రహం

కోల్‌కతాలో హత్యాచార ఘటనకు నిరసనగా ఏపీ జూడా క్యాండిల్ మార్చ్

సాక్షి, అమరావతి: కోల్‌కతాలో పోస్ట్‌గ్రాడ్యుయేట్ రెసిడెంట్ వైద్యురాలిపై హత్యాచార ఘటన దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ అమానుష ఘటనకు పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలంటూ రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ డాక్టర్లు సోమవారం సాయంత్రం క్యాండిల్ మార్చ్ నిర్వహించారు. ఘటనపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలని ఏపీ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (జూడా) అధ్యక్షుడు డాక్టర్ పి. దీక్షిత్ డిమాండ్ చేశారు. వైద్యుల సంరక్షణ కోసం కేంద్ర రక్షణ చట్టాన్ని అత్యవసరంగా తీసుకురావాలన్నారు. ఈ బాధాకర ఘటనపై పోరాడుతున్న ఆర్‌జీకార్ కళాశాలలోని మిత్రులకు ఏపీ జూడా అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

కొట్టుకుపోయిన గేటు స్థానంలో అత్యవసర గేటు

ఏపీ, కర్ణాటక అధికారులు, నిపుణుల సూచనతో తుంగభద్ర బోర్డు నిర్ణయం



కొట్టుకుపోయిన గేటు నుంచి దిగువకు వెళ్తున్న జలాలు

- 20 అడుగుల ఎత్తు, 60 అడుగుల వెడల్పుతో గేటు తయారీ పనులు కాంట్రాక్టర్లకు అప్పగింత
- డ్యామ్‌లో నీటి మట్టం 1,613 అడుగులకు తగ్గించినప్పుడే ఏర్పాటుకు అవకాశం

సాక్షి, అమరావతి : ఆంధ్రప్రదేశ్, కర్ణాటక జల వనరుల శాఖ అధికారులు, నిపుణులతో చర్చించాక.. కొట్టుకుపోయిన తుంగభద్ర డ్యామ్ 19వ గేటు స్థానంలో అత్యవసర గేటు ఏర్పాటు చేయాలని తుంగభద్ర బోర్డు నిర్ణయించింది. సాధారణంగా ప్రాజెక్టులపై క్రస్ట్ గేటు.. స్టాప్ లాక్ గేటు దించడానికి వీలుగా రెండు గాడి(గ్రూవ్)లు పియర్స్ (సిమెంటు దిమ్మెలు)కు ఏర్పాటు చేస్తారు. కానీ.. తుంగభద్ర డ్యామ్ పాత డిజైన్ కావడంతో క్రస్ట్ గేటు ఏర్పాటుకు ఒకే గాడిని ఏర్పాటు చేశారు. దీని వల్ల స్టాప్ లాక్ గేటు ఏర్పాటు చేయలేని పరిస్థితి. దీనిపై సోమవారం తుంగభద్ర డ్యామ్ వద్ద బోర్డు కార్యదర్శి ఓఆర్కే రెడ్డి.. నిపుణులు, గేట్ల సలహాదారు కన్నయ్య నాయుడు, ఆంధ్రప్రదేశ్ జల వనరుల విభాగం సీఈ (హైడ్రాలజీ) రత్నకుమార్, కర్ణాటక జల వనవరుల శాఖ సలహాదారు మల్లికార్జున గుంబ్లీ తదితరులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో క్రస్ట్ గేటు గాడిలోనే అత్యవసర గేటును అమర్చాలని నిర్ణయించారు. అత్యవసర గేటు తయారీ పనులను హిందూస్థాన్ ఇంజినీరింగ్ వర్క్స్, నారాయణ ఇంజినీరింగ్ వర్క్స్‌కు అప్పగించారు. ఈ గేటును 20 అడుగుల ఎత్తు, 60 అడుగుల వెడల్పుతో ఏర్పాటు చేయనున్నారు. అత్యవసర గేటును 5 భాగాలు (ఎలిమెంట్లు)గా తయారు చేస్తారు. మొదటి ఎలిమెంట్‌ను 2 అడుగుల ఎత్తు, రెండో ఎలిమెంట్‌ను 4 అడుగులు, మూడో ఎలిమెంట్ 6 అడుగుల ఎత్తు.. నాలుగు, ఐదు ఎలిమెంట్లు 4 అడుగుల ఎత్తు, 60 మీటర్ల వెడల్పుతో తయారు చేస్తారు. ఆ ఎలిమెంట్లకు ఇరు వైపులా రోలర్లను అమర్చుతారు. ఆ తర్వాత 19వ గేటు ఉన్న 18, 19 పియర్లకు ఉన్న గాడి(గ్రూవ్)లో మొదటి ఎలిమెంటును దించుతారు. ఆ తర్వాత రెండు, మూడు, నాలుగు, ఐదు, ఆరు ఎలిమెంట్లను దించడం ద్వారా అత్యవసర గేటు ఏర్పాటు చేస్తారు. గేటు తయారీ ప్రక్రియకు ఐదారు రోజులు పడుతుందని.. రోలర్లు అందుబాటులో ఉంటే.. డ్యామ్‌లో ఎప్పుడు నీటి మట్టం 1,613 అడుగులు (కనీస నీటి మట్టం) స్థాయికి తగ్గినప్పుడు అత్యవసర గేటు అమర్చుతామని అధికారులు చెబుతున్నారు.

నీటి వృథాకు అడ్డుకట్ట వేసేందుకు..

తుంగభద్ర డ్యామ్ గరిష్ఠ నీటి మట్టం 1633 అడుగులు. పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 105.79 టీఎంసీలు. డ్యామ్ కనీస నీటి మట్టం 1613 అడుగులు. అదే స్థాయి నుంచి 1633 అడుగుల వరకు 20 అడుగుల ఎత్తు, 60 అడుగుల వెడల్పుతో స్పిల్ వేకు 33 గేట్లను బిగించారు. ఇప్పుడు అత్యవసర గేటు ఏర్పాటు చేయాలంటే 1613 అడుగుల స్థాయికి అంటే డ్యామ్‌లో నీటి నిల్వను 43.83 టీఎంసీలకు తగ్గించాలి. దాంతో శనివారం నుంచే డ్యామ్‌లో నీటిని ఖాళీ చేస్తున్నారు. సోమవారం నాటికి డ్యామ్‌లో 97.75 టీఎంసీలు ఉండగా.. డ్యామ్‌లోకి 25,571 క్యూసెక్కులు చేరుతుండగా.. 99,567 క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. డ్యామ్‌లో నీటి నిల్వను 1613 అడుగులకు తగ్గిస్తే సుమారు 61 టీఎంసీల మేర నీరు వృథా అవుతుంది. నీటి వృథాను అరికట్టడానికి నీటి మట్టం 1613 అడుగుల కంటే ఎగువన ఉన్నప్పటికీ అత్యవసర గేటును దించే ప్రయత్నం చేద్దామని నిపుణులు కన్నయ్య నాయుడు సూచించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. నిపుణుల సలహాల మేరకు గేటును అమర్చేందుకు ప్రయత్నిస్తామని అధికార వర్గాలు తెలిపాయి. కాగా, వేసవిలో పూర్తి స్థాయి క్రస్ట్ గేటును అమర్చాలని బోర్డు నిర్ణయించింది.

సక్రమంగా దించకపోవడం వల్లే..

గేట్ల నిర్వహణలో నిపుణులైన అధికారులు, సిబ్బంది అధిక శాతం పదవీ విరమణ చేశారు. వారి స్థానంలో కాంట్రాక్టు పద్ధతిలో సిబ్బందిని నియమించారు. వారికి గేట్ల నిర్వహణలో అనుభవం లేదు. స్పిల్ వే 19వ గేటును సక్రమంగా దించపోవడం వల్లే.. అంటే ఒక కొస దిగువకు దిగి, మరొక కొస ఎగువన ఉండటం వల్ల (ఎగుడు దిగుడు) వరద ఉధృతికి గేటు కొట్టుకుపోయిందని చైన్ తెగడం వల్ల గేటు కొట్టుకుపోయే అవకాశమే లేదని నిపుణులు తేల్చి చెబుతున్నారు.

మిగతా 32 గేట్లపై సీఈసీఆర్‌ఐతో అధ్యయనం

తుంగభద్ర డ్యామ్ నిర్మాణం పూర్తయి దాదాపుగా 71 ఏళ్లు పూర్తయింది. గేట్ల నిర్వహణ ప్రారంభమై 66 ఏళ్లు పూర్తయింది. ఈ 66 ఏళ్లలో 2.5 మిలియన్ సైకిల్ ద్వారా ఎత్తడం, దించడం చేశారు. ఇప్పుడు కొట్టుకుపోయిన గేటు కాకుండా, మిగతా 32 గేట్ల పనితీరు సవ్యంగా ఉన్నట్లు ఏపీ, కర్ణాటక అధికారులు, నిపుణులు కన్నయ్య నాయుడు సంతృప్తి వ్యక్తం చేశారు. వరద ఉధృతితో గేట్లపై ఒత్తిడి పడి, బలహీనపడే అవకాశం ఉంటుంది. అందుకే గేట్ల కాల పరిమితిని 45 ఏళ్లు, కాంక్రీట్ కట్టడాల కాల పరిమితి 100 ఏళ్లుగా సీడబ్ల్యూసీ నిర్దేశించింది. కానీ.. 66 ఏళ్లవుతున్నా గేట్లను ఎందుకు మార్చలేదని కన్నయ్య నాయుడు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. మిగతా 32 గేట్లు సవ్యంగా పని చేస్తున్నప్పటికీ.. వాటి సామర్థ్యంపై తమిళనాడులో కరైకుడిలోని సెంట్రల్ ఎలక్ట్రో కెమికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఈసీఆర్‌ఐ)తో అధ్యయనం చేయించాలని బోర్డుకు సూచించారు. సీఈసీఆర్‌ఐ నివేదిక ఆధారంగా గేట్లకు మరమ్మతులు లేదా కొత్త గేట్ల ఏర్పాటుపై నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించారు.

టీబీ డ్యాం సర్కారు నియంత్రణలో లేదు

కర్ణాటక డిప్యూటీ సీఎం శివకుమార్



సాక్షి, బళ్లారి: తుంగభద్ర జలాశయాన్ని కర్ణాటక ప్రభుత్వం నిర్వహించడం లేదని, అందుకు ప్రత్యేక బోర్డు ఉందని, అందులో తాము సభ్యులం మాత్రమేనని కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తెలిపారు. గేటు కొట్టుకుపోయిన నేపథ్యంలో సోమవారం ఆయన తుంగభద్ర డ్యాంను సందర్శించారు. అనంతరం బెంగళూరుకు వెళ్లి నీటి పారుదల నిపుణులతో సమావేశమైన అనంతరం విలేకరులతో మాట్లాడారు. ‘డ్యాంను పరిశీలించాను. గేట్ కొట్టుకుపోవడంపై సంబంధిత అధికారులతో, కాంట్రాక్టర్లతో చర్చించాను. నూతన క్రస్ట్ గేట్‌ను పునరుద్ధరించడానికి ఐదు రోజులు పట్టొచ్చు. ఖరీఫ్ పంటకు ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. మంగళవారం ముఖ్యమంత్రి సిద్దరామయ్య డ్యాంను సందర్శించి నిపుణులతో మాట్లాడతారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు’ అని చెప్పారు.

కర్ణాటకలో ప్రాజెక్టు గేటు కొట్టుకుపోతే జగన్‌పై దుష్ప్రచారమా?

- టీడీపీ, ఎల్లో మీడియాపై మాజీ మంత్రి అంబటి ధ్వజం
- ప్రతిదీ జగన్ ఖాతాలో వేయడం చంద్రబాబుకి తగదు
- మూడు రాష్ట్రాల పరిధిలోది తుంగభద్ర ప్రాజెక్ట్
- తుంగభద్ర బోర్డు పర్యవేక్షణలో ప్రాజెక్ట్ నిర్వహణ



నగరంపాలెం: తుంగభద్ర ప్రాజెక్ట్ 19వ గేటు కొట్టుకుపోతే వైఎస్ జగన్‌పై టీడీపీ, ఎల్లో మీడియా దుష్ప్రచారం చేయడం ఏమిటని మాజీ మంత్రి అంబటి రాంబాబు మండిపడ్డారు. గుంటూరులోని నివాసంలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. తుంగభద్ర ఉమ్మడి ప్రాజెక్ట్ అని, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో కొద్ది భాగంగా ఉందన్నారు. దీని నిర్వహణ బాధ్యతలను తుంగభద్ర బోర్డు పర్యవేక్షిస్తుందని తెలిపారు. ఇవన్నీ తెలిసినా ఓ గేటు ఊడిపోతే దానికి మాజీ సీఎం వైఎస్ జగన్ ఎఫెక్ట్ అని, జగన్ నిర్లక్ష్యం వల్లే కొట్టుకుపోయిందని దుష్ప్రచారం చేయడం దుర్మార్గమని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఏది జరిగినా మాజీ సీఎం వైఎస్ జగన్ ఖాతాలో వేసి తప్పుకోవడం టీడీపీకి, ఎల్లో మీడియాకు అలవాటుగా మారిందని మండిపడ్డారు. అన్నీ జగన్ ఖాతాలో వేయడం తగదని చంద్రబాబుకు హితవు పలికారు. తుంగభద్ర ప్రాజెక్ట్ సుమారు 70 ఏళ్ల క్రితం కట్టారని, ఆ ప్రాజెక్టుకు ఏవైనా మరమ్మతులు చేయాల్సి ఉంటే, ఏపీ నుంచి కూడా కొంత నిధులు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. కమీషన్లు వచ్చే పనులు చేసేందుకు చంద్రబాబు ముందు వరుసలో ఉంటాడని విమర్శించారు. గుండ్లకమ్మ గేట్లు కొట్టుకుపోయేందుకు చంద్రబాబు తన హయాంలో చేసిన అలసత్వమే కారణమని ఆరోపించారు.

వాగ్దానాలు ఇచ్చేటప్పుడు తెలియదా?

మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు, సూపర్ సిక్స్ అమలు చేయాలంటే భయంగా ఉందని మాట్లాడటం విడ్డూరంగా ఉందని అంబటి అన్నారు. అదేమని అడిగితే రాష్ట్ర ఖజానాలో డబ్బుల్లేవని చెబుతున్నారని, ఎన్నికల్లో వాగ్దానాలు చేసేటప్పుడు చంద్రబాబుకి తెలియదా అని ప్రశ్నించారు. గతంలో మే, జూన్ కల్లా అమ్మఒడి పేరుతో అందరి తల్లుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేవని చెప్పారు. ఇప్పుడు ఎందరో తల్లులను మోసం చేశారని ఆరోపించారు. సంపద సృష్టించడంలో ఆరితేరానని చెప్పే చంద్రబాబు ఈ విధంగా చేయడం శోచనీయమన్నారు. కూటమి ప్రభుత్వంలో అధికారంలోకి వచ్చిన రెండు మాసాలకే అందరిలో వ్యతిరేకత వచ్చిందని, కూటమికి ఎందుకు ఓటు వేశామా అని ప్రజలు పశ్చాతాపం పడుతున్నారని అన్నారు. సమావేశంలో మిర్చియార్డు మాజీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం, సాగర్ జలాశయాల గేట్లు మూసివేత



మూతపడ్డ శ్రీశైలం ప్రాజెక్ట్ గేట్లు

శ్రీశైలం ప్రాజెక్ట్/విజయపురిసౌత్: ఎగువ నుంచి వరద తగ్గిపోవడంతో శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల గేట్లను సోమవారం సాయంత్రం మూసివేశారు. కృష్ణా బేసిన్‌లో వర్షం తగ్గడంతో జూరాలలో గేట్లను మూసివేయడంతోపాటు విద్యుత్ ఉత్పాదనను కూడా నిలిపివేశారు. తుంగభద్ర డ్యాం 19వ గేటు కొట్టుకుపోవడంతో సుంకేసుల బ్యారేజీకి ఓవర్‌ఫ్లో ప్రవాహం పెరిగింది. సుంకేసుల నుంచి శ్రీశైలానికి 77,598 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వస్తోంది. ఈ ప్రవాహంతోపాటు దిగువకు విడుదలవుతున్న నీరు, డ్యాం గరిష్టస్థాయి నీటిమట్టాన్ని బేరీజు వేసుకుని ఇంజనీర్లు శ్రీశైలం గేట్లను మూసివేశారు. సోమవారం సాయంత్రం సమయానికి డ్యాం నీటిమట్టం 881.20 అడుగులు కాగా, 194.3069 టీఎంసీలు నీరు నిల్వ ఉంది. అదేవిధంగా నాగార్జునసాగర్ జలాశయంలో 588.80 అడుగులు నీటిమట్టంతో 308.4658 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. ఎగువ నుంచి నాగార్జునసాగర్ జలాశయానికి 47,035 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా, అంతే నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువ నుంచి వచ్చే వరదను బట్టి మళ్లీ సాగర్ రేడియల్ క్రస్ట్‌గేట్లను ఎత్తే అవకాశం ఉంటుంది.

‘తుంగభద్ర గేటుకు వెంటనే మరమ్మతులు చేయాలి’

సాక్షి, అమరావతి: తుంగభద్ర ప్రాజెక్టుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఏపీ రైతు సంఘం, కౌలు రైతు సంఘాలు, సీపీఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేశాయి. ఈ మేరకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, ఏపీ రైతు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.కృష్ణయ్య, కే ప్రభాకరరెడ్డి, కౌలు రైతు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.రాధాకృష్ణ, ఎం.హరిబాబు సోమవారం వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. ప్రాజెక్టు నుంచి నీరంతా వృథాగా పోతుండడంతో ఈ రెండు జిల్లాల్లోని ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు.

క్లుప్తంగా...

వెబ్‌ఆప్షన్‌ల నమోదుకు నేడు ఆఖరు

సాక్షి, అమరావతి: పీజీ డెంటల్ కోర్సుల్లో 2024–25 విద్యా సంవత్సరానికి కన్వీనర్, యాజమాన్య కోటా ప్రవేశాలకు రెండో దశ కౌన్సెలింగ్ కోసం వెబ్‌ఆప్షన్‌ల నమోదుకు మంగళవారం రాత్రి 7 గంటల వరకు గడువు విధించారు. సోమవారం రాత్రి 7 గంటల నుంచి వెబ్‌ఆప్షన్‌ల నమోదు ప్రక్రియను ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ ప్రారంభించింది.

వ్యవసాయ కళాశాలల్లో సీట్ల పెంపు

- 60 నుంచి 120 సీట్లకు పెంచుతూ ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న ఆరు వ్యవసాయ కళాశాలల్లో సీట్ల సంఖ్యను 60 నుంచి 120కి పెంచుతూ వ్యవసాయశాఖ స్పెషల్ సీఎస్ బి.రాజశేఖర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం జిల్లా తాడిపత్రిలోని జేసీ దివాకర్ ఎడ్యుకేషనల్ సొసైటీ, ప్రకాశం జిల్లా చంద్రశేఖరపురంలోని కదిరి బాబూరావు ఎడ్యుకేషనల్ సొసైటీ, వైఎస్సార్‌జిల్లా బద్వేల్‌లోని ఎస్‌బీవీఆర్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్, అనంతపురంలోని శ్రీ బాలాజీ ఎడ్యుకేషనల్ సొసైటీ, శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలోని వికాస్ ఎడ్యుకేషనల్ సొసైటీ, మార్కాపురంలోని ఎస్ఎస్ ఎడ్యుకేషనల్ సొసైటీలలో సీట్ల పెంపునకు అనుమతినిచ్చారు.

స్కిల్ కేసులో మరోసారి మధ్యంతర ఉత్తర్వుల పొడిగింపు

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణానికి సంబంధించి 2021లో సీఐడీ నమోదు చేసిన కేసులో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుపై ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దంటూ గతంలో ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు మరోసారి పొడిగించింది. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో వందల కోట్ల రూపాయల మేర ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డారంటూ 2021లో సీఐడీ కేసు నమోదు చేసింది. ఇందులో అప్పటి మంత్రి అచ్చెన్నాయుడును నిందితుడిగా చేర్చింది. ఈ నేపథ్యంలో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. సోమవారం ఈ వ్యాజ్యం మరోసారి విచారణకు రాగా, న్యాయస్థానం మరోసారి మధ్యంతర ఉత్తర్వులు పొడిగించింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

దేశంలో ఆన్‌లైన్ విద్యకు అంతకంతకూ డిమాండ్ పెరిగిపోతోంది. దీంతో పలు ఎడ్ టెక్ స్టార్టప్ కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నాయి. కరోనా-19 పరిణామాలతో విద్యార్థులు 'ఆన్‌లైన్' బాట పట్టారు. అమెరికా తర్వాత భారత్‌లోనే ఆ స్థాయిలో పెట్టుబడులు పెట్టేందుకు ఆయా కంపెనీలు ఆసక్తి చూపాయి. ఆ తర్వాత విద్యార్థులు, ఉపాధ్యాయులు తిరిగి సంప్రదాయ క్లాస్‌రూమ్ శిక్షణ వైపు మళ్లారు. దీంతో ఆయా కంపెనీలు సైతం 'ఆఫ్‌లైన్' సేవల్లోకి అడుగుపెట్టాయి.



ఎడ్‌టెక్ ఇండియా!

ప్రపంచ ఎడ్‌టెక్ రాజధానిగా భారత్



- అమెరికా తర్వాత ఇక్కడే ఎక్కువ పెట్టుబడులు
- కోవిడ్ తర్వాత పెరిగిన ఆన్‌లైన్ కోర్సులు
- గత రెండేళ్లలో దేశంలో దాదాపు 4,500 ఎడ్ టెక్ స్టార్టప్స్
- అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఓఆర్ఎఫ్) అధ్యయనంలో వెల్లడి

దేశంలో 2014 నుంచి 2020 వరకు ఎడ్ టెక్ రంగం విలువ 1.32 బిలియన్ డాలర్లుగా ఉండేది. అయితే కరోనా, లాక్‌డౌన్ పరిస్థితుల నేపథ్యంలో ఈ–లెర్నింగ్‌కు అనూహ్యంగా డిమాండ్ పెరిగింది. ఒక్క 2020లోనే ఈ రంగం 1.88 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించి గత ఐదేళ్ల రికార్డును తిరగరాసింది. 2020–21 మధ్య కరోనా విస్తరణతో దేశంలో లాక్‌డౌన్ విధించిన విషయం తెలిసిందే. ఈ రెండేళ్లల్లో దేశంలోని దాదాపు 320 మిలియన్ల మందికి పైగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇంటికే పరిమితమయ్యారు. ఆ సమయంలో ఆన్‌లైన్ తరగతులు, ఈ–లెర్నింగ్ సాఫ్ట్‌వేర్, వర్చువల్ ట్యుటోరియల్స్, డిజిటల్ లైబ్రరీలు వంటి రంగాలు విస్తరించి, ఈ–కంటెంట్ అభివృద్ధికి పెద్ద నగరాలు కేంద్రాలుగా మారాయి. 2020 చివరి నాటికి వ్యాపార ప్రాథమిక, ఆర్థిక విశ్లేషణ, వృత్తిపరమైన కమ్యూనికేషన్స్ కోర్సుల డిమాండ్ 606 శాతం పెరిగినట్టు ఓఆర్ఎఫ్ పేర్కొంది. 2021 నాటికి ఇండియా ఎడ్‌టెక్ బూమ్ తిరుగులేని ప్రగతిని నమోదు చేసిందని, ప్రపంచ దేశాల్లో అమెరికా తర్వాత రెండో అతిపెద్ద ఎడ్ టెక్ మార్కెట్‌గా నిలవడంతో పాటు స్టార్టప్ మార్కెట్ 2021లో 4.73 బిలియన్ డాలర్ల నిధులను సమీకరించడం ప్రపంచాన్నే ఆశ్చర్యపరిచింది. ఈ రెండేళ్లలో దేశంలో దాదాపు 4,500 ఎడ్‌టెక్ స్టార్టప్స్ పుట్టుకొచ్చాయని అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఓఆర్ఎఫ్) వెల్లడించింది. భారతీయ ఎడ్ టెక్ కంపెనీలైన బైజూస్, స్కేలర్ అకాడమీ, ఎమెరిటస్, సింప్లిలెర్న్ వంటి సంస్థలు అమెరికా, ఆగ్నేయాసియా, మిడిల్ ఈస్ట్, ఆఫ్రికా దేశాలకు విస్తరించాయి.

– సాక్షి, అమరావతి



మళ్లీ 'ఆఫ్‌లైన్'లోకి అడుగులు..

మన ఎడ్ టెక్ రంగం 2022 నుంచి ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటోందని ఓఆర్ఎఫ్ పేర్కొంది. పాఠశాలలు తిరిగి తెరవడం ఆన్‌లైన్ కోర్సులు నేర్చుకునే బదులు హైబ్రిడ్, సంప్రదాయ లెర్నింగ్ విధానాల వైపు ఆసక్తి పెరగడంతో ఆన్‌లైన్ రంగంలో కొంత తడబాటు నెలకొందని వెల్లడించింది. దీంతో ఎడ్‌టెక్ కంపెనీలు తమ మార్కెట్‌ను కాపాడుకునేందుకు పోటీ పడుతున్నాయని, ఈ క్రమంలో కోర్సుల ధరలు, మార్జిన్లను తగ్గించినట్టు ప్రకటించింది. దీంతో పెట్టుబడిదారులు ఈ రంగంలోకి దిగేందుకు వెనుకడుగు వేస్తున్నారు. దీంతో ఎడ్ టెక్ స్టార్టప్స్ నిధులు 2022లో 2.6 బిలియన్ డాలర్లు తగ్గిపోగా, 2023లో 0.297 బిలియన్ డాలర్లు తగ్గాయి. అంతేగాక 2022లో ఈ రంగంలో ఉన్న 14 వేల మంది తమ ఉద్యోగాలను కోల్పోయారు. మారిన పరిస్థితులు, పెరిగిన పోటీ రీత్యా భారత ఎడ్‌టెక్ సంస్థలు ఆన్‌లైన్ సేవల నుంచి ఆఫ్‌లైన్ సేవలు అందించడం మొదలెట్టాయి. ఈ కోవలోనే బైజూస్ 2021లో ఆకాష్ ఇనిస్టిట్యూట్ ట్యుటోరియల్ సెంటర్ చైన్‌ను కొనుగోలు చేసింది. ఫిజిక్స్ వాలా సంస్థ కూడా గతేడాది ఆఫ్‌లైన్ సేవల్లోకి వచ్చింది. 2024 చివరి నాటికి భారత్ అంతటా 60కి పైగా విద్యాపీఠ్‌లు, పాఠశాలలు పేరుతో తెరవనున్నట్టు ప్రకటించింది. వీటితో పాటు బ్రైట్ క్యాంపస్, అన్ అకాడమీ వంటి సంస్థలు కూడా ఆఫ్‌లైన్ సేవల్లోకి ప్రవేశించాయి. జాతీయ విద్యావిధానం–2020 అమలు చేసి నాలుగేళ్లు పూర్తవడంతో ఎడ్ టెక్ రంగాలకు ప్రోత్సాహం ఉంటుందని, ఎడ్‌టెక్–కేంద్రీకృత ప్రభుత్వ–ప్రైవేట్ భాగస్వామ్యానికి విస్తృతమైన అవకాశాలు ఉంటాయని ఓఆర్ఎఫ్ అంచనా వేసింది.

మార్కెట్‌లోకి మూడు కొత్త వంగడాలు

- ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీ శాస్త్రవేత్తల సృష్టి
- శనగలో నంద్యాల గ్రామ్, పెసరలో లాంపెసర
- వేరుశనగలో ఐసీఏఆర్ కోణార్క్ రకాలు
- దక్షిణాది రాష్ట్రాల్లో సాగుకు అనువైన వంగడాలు
- ప్రధానిచే ఢిల్లీలో విడుదల

సాక్షి, అమరావతి: మారుతున్న వాతావరణ పరిస్థితులను తట్టుకుంటూ, అధిక దిగుబడులను సాధించే మూడు కొత్త వంగడాలను ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం మార్కెట్‌లోకి తీసుకొచ్చింది. ప్రధాని నరేంద్ర మోదీ జాతీయ స్థాయిలో విడుదల చేసిన 109 వంగడాల్లో ఎన్జీ రంగా వర్సిటీ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన ఈ వంగడాలూ ఉన్నాయి. దేశీ శనగలో నంద్యాల గ్రామ్, పెసరలో లాం పెసర, వేరుశనగలో ఐసీఏఆర్ కోణార్క్ (టీసీజీఎస్ 1707) రకాలను వర్సిటీ అభివృద్ధి చేసింది. వీటి ప్రత్యేకతలను వర్సిటీ వైస్‌ఛాన్సలర్ డాక్టర్ ఆర్. శారదా జయలక్ష్మీదేవి సోమవారం మీడియాకు వివరించారు. ఈ వంగడాలను ప్రధాని మోదీ విడుదల చేయడం గర్వకారణంగా ఉందని చెప్పారు. ఆ వంగడాల విశిష్టతలివీ..

నంద్యాల గ్రామ్ (ఎన్‌బీఈజీ 1267): రబీ సీజన్‌కు అనుకూలమైన ఈ శనగ రకం పంట కాలం 90 నుంచి 95 రోజులు. దిగుబడి హెక్టార్‌కు 20.95 క్వింటాళ్లు. ఎండు తెగులును తట్టుకోగలదు. దేశీ శనగ రకం యంత్రంతో కోతకు అనుకూలం. 1, 2 రక్షిత నీటి పారుదలతో పండించుకోవచ్చు. 15.96 శాతం సీడ్ ప్రొటీన్ ఉంటుంది. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో రబీ సీజన్‌కు అనుకూలం.

ఐసీఏఆర్ కోణార్క్ (టీసీజీఎస్-1707): ఖరీఫ్ సీజన్‌కు అనుకూలమైన ఈ వేరుశనగ రకం పంట కాలం 110 నుంచి 115 రోజులు. దిగుబడి హెక్టార్‌కు 24.75 క్వింటాళ్లు వస్తుంది. రసం పీల్చే పురుగులను తట్టుకుంటుంది. ఆకుమచ్చ తెగులు, వేరుకుళ్లు, కాండంకుళ్లు, వేరు ఎండు తెగుళ్లను మధ్యస్థంగా తట్టుకుంటుంది. కాయ నుంచి పప్పు దిగుబడి 70 నుంచి 75 శాతం ఉంటుంది. నూనె 49 శాతం వస్తుంది. 100 గింజల బరువు 40 నుంచి 45 గ్రాములుంటుంది. ప్రొటీన్స్ 29 శాతం. అధిక నీటి వినియోగ సామర్థ్యం ఉంటుంది. గింజలు లేత గులాబీ రంగులో ఉంటాయి. కాయలన్నీ ఒకేసారి పక్వానికి వస్తాయి.

లాం పెసర (ఎల్‌జీజీ 610): రబీ సీజన్‌కు అనుకూలమైన ఈ పెసర రకం పంట కాలం 74 రోజులు. దిగుబడి హెక్టార్‌కు 11.17 క్వింటాళ్లు వస్తుంది. ఎల్లో మొజాయిక్ వైరస్‌ను తట్టుకుంటుంది. యంత్రంతో కోతకు అనుకూలం. రబీ సీజన్‌లో వరి మాగాణులకే కాదు.. మెట్ట ప్రాంతాల్లో సైతం సాగుకు అనుకూలం. వీటిలో ప్రొటీన్స్ 23.16 శాతం ఉంటాయి. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, ఒడిశాలలో రబీ సీజన్‌లో సాగుకు అనువైన రకమిది.

భూ సర్వే రాళ్లన్నీ తీసేయండి

- ప్రభుత్వ స్థలంలో గుడిసెలను తొలగించాలి
- మంత్రి అచ్చెన్నాయుడు



టెక్కలి: గత ప్రభుత్వం భూ సర్వే పేరుతో భూముల్లో వేసిన సర్వే రాళ్లన్నీ తొలగించాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. ఆయన సోమవారం శ్రీకాకుళం జిల్లా టెక్కలి తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ, హౌసింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో భూ సర్వే పేరుతో భూముల వివరాలను అస్తవ్యస్తం చేశారని, వైఎస్ జగన్ బొమ్మతో సర్వే రాళ్లు వేశారని అన్నారు. అలాంటి రాళ్లను తొలగించాలని ఆదేశించారు. టెక్కలి ఎన్టీఆర్ కాలనీ, మండాపాలం కాలనీలో కొత్తగా పట్టాలు పుట్టుకు వస్తున్నాయని, వాటిని సర్వే చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ స్థలాల్లో ఉన్న గుడిసెలను తొలగించాలన్నారు. అనంతరం రేషన్ డీలర్లు, ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగింపు, కొత్త వారి నియామకాలపై కార్యకర్తలతో మాట్లాడారు.

అమరావతి పేరుతో ఐపీఎల్ టీమ్

రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



సాక్షి, అమరావతి: అమరావతి పేరుతో ఐపీఎల్ క్రికెట్ జట్టును ప్రోత్సహిస్తామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి చెప్పారు. విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్)కార్యాలయంలో సోమవారం ఆయన ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ క్రీడలకు ప్రాధాన్యం కల్పించేలా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గంట పాటు ఆటల కోసం ప్రత్యేక సమయాన్ని కేటాయించేలా ఆదేశాలు ఇస్తామన్నారు. క్రీడా మైదానాలు లేని ప్రైవేటు పాఠశాలలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గత ప్రభుత్వం చివరి ఏడాదిలో ఆడుదాం ఆంధ్ర పేరుతో రూ.120 కోట్ల అవినీతికి పాల్పడిందని ఆరోపించారు.

రాజధానికి రాంప్రసాద్‌రెడ్డి రూ.3,01,116 విరాళం

రాజధాని అమరావతి నిర్మాణానికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి రూ.3,01,116 విరాళం ఇచ్చారు. ఈ మేరకు ఆయన సోమవారం సచివాలయంలో సీఎం చంద్రబాబుకు చెక్కును అందజేశారు.

రాష్ట్రవ్యాప్తంగా చేనేత ఎగ్జిబిషన్‌లు

రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత



సాక్షి, అమరావతి: చేనేత వస్త్రాల అమ్మకమే లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా చేనేత ఎగ్జిబిషన్‌లు ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత వెల్లడించారు. విజయవాడలోని మేరీస్ స్టెల్లా కాలేజీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను సోమవారం ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల ఏడో తేదీన చేనేత మేళా పేరుతో వస్త్ర ప్రదర్శనను సీఎం చంద్రబాబు ప్రారంభించారన్నారు. ఈ వస్త్ర ప్రదర్శనను మరో వారం రోజులపాటు పొడిగిస్తున్నట్లు తెలిపారు. నేతన్నలకు శిక్షణ ఇచ్చి ఈ కామర్స్‌లో చేనేత వస్త్రాలు విక్రయించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నేతన్నలకు 365 రోజులు పని కల్పించడమే ఎన్డీయే ప్రభుత్వ లక్ష్యమన్నారు. చేనేత జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి, ఆప్కో ఎండీ పవన్ మూర్తి, జేడీ కన్నబాబు పాల్గొన్నారు.

అటు జల సింగారం.. ఇటు 'పచ్చ' బంగారం!

వరుణుడి కరుణతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. చెరువులు జలకళను సంతరించుకున్నాయి. భూగర్భ నీటిమట్టాలు, బోరు బావులు కళకళలాడుతుండటంతో మాగాణి పొలాలు నిండుకుండలను తలపిస్తున్నాయి. వరి నాట్లు ఊపందుకున్నాయి. మహిళలు ఉత్సాహంగా పాటలు పాడుకుంటూ మాగాణి పొలాన వరి నాట్ల రూపంలో సాలుకో సొబగును కూర్చుతున్నారు. అనంతపురం జిల్లా సింగనమల నియోజకవర్గం గార్లె దిన్నె మండలంలో పంట పొలాలు ఇలా పచ్చదనాన్ని పరుచుని చూపరులకు ఆహ్లాదాన్నిస్తున్నాయి.

– సాక్షి ఫొటో గ్రాఫర్, అనంతపురం



సొగ'సిరి' మయూరి

తొలకరి జల్లులు కురుస్తున్న వేళ పుడమి తల్లి పులకరించింది. ఆహ్లాదకరమైన వాతావరణంలో మయూరం సొగ'సిరి' మరింత కనుల విందు చేసింది. ఈ అద్భుత దృశ్యం కర్ణాటకలోని చిక్కమగళూరు శివారులో సోమవారం సాయంత్రం జరిగింది.

– సాక్షి, చిక్‌మంగుళూరు



ఈ–క్రాప్‌పై నీలినీడలు

స్పష్టత ఇవ్వని కూటమి ప్రభుత్వం.. అమలు చేయకపోతే అన్నదాతలకు తీవ్ర నష్టం

కాకినాడ సిటీ: అన్నదాతకు అన్ని విధాలుగా ఉపయోగపడే ఈ–క్రాప్ పథకం అమలుపై నీలి నీడలు కమ్ముకుంటున్నాయి. జిల్లాలో ఖరీఫ్ పనులు చురుగ్గా సాగుతున్నా వ్యవసాయ విధి, విధానాలపై స్పష్టమైన వైఖరిని కూటమి ప్రభుత్వం ఇంకా ప్రకటించలేదు. దీనివల్ల ఖరీఫ్‌లో పంటలు సాగు చేసే రైతులకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. ఇప్పటికే రైతు భరోసా పథకం కింద పంట సాయం అందక ఆందోళన చెందుతున్న రైతులకు ప్రభుత్వ తీరు తీవ్ర ఆగ్రహాన్ని, ఆవేదనను కలిగిస్తోంది.

రైతులతో దాగుడుమూతలు..

గత ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అమలు చేసిన రైతు భరోసా, ఈ–క్రాప్, పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ వంటి పథకాలు అమలవుతాయో లేదో అని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. ఆయా పథకాలపై కూటమి ప్రభుత్వం దాగుడుమూతలు ఆడడం రైతన్నలు గమనిస్తున్నారు. జిల్లాలో గతేడాది ఖరీఫ్‌లో 2,53,905 ఎకరాలు సాగు చేయగా, 2,14,032.5 ఎకరాలు ఈ–క్రాప్ నమోదు చేశారు. రబీలో 2,11,075 ఎకరాల్లో పంట సాగు



లక్ష్యంగా వ్యవసాయశాఖ ప్రణాళిక సిద్ధం చేయగా ఇప్పటికి 2.06 లక్షల ఎకరాల్లో పలు పంటలు సాగు చేశారు. గింజ విత్తినప్పటి నుంచి కోత, అమ్మకం వరకు అండగా ఉండే ఈ–క్రాప్ విధానాన్ని అమలు చేయకపోతే భవిష్యత్తులో తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులు పండించే ప్రతి గింజకు గిట్టుబాటు ధర కల్పించేందుకు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు అండగా ఉండేందుకు, అర్హులైన రైతులకు అన్ని విధాలుగా మేలు చేసేందుకు ఈ–క్రాప్ విధానం చక్కగా తోడ్పాటు అందించేది. వరి సాగు చేపట్టే రైతులు, కౌలు రైతుల వివరాలు సర్వే నంబర్ల వివరాలు వ్యవసాయ శాఖ వద్ద సమగ్రంగా ఉండే అవకాశం లేదు. పంట సాగు వివరాలు తెలియకపోవడంతో సంబంధిత వ్యవసాయశాఖ అధికారులకు ఆ రైతులకు అవసరమైన వ్యవసాయ పరమైన సూచనలు, సలహాలు ఇవ్వడానికి ఆస్కారం లేకుండా పోతుంది. రాయితీపై విత్తనాలు, ఉచిత పంటల బీమా, సున్నావడ్డీ రాయితీలు పొందే హక్కు కోల్పోయే ప్రమాదముంది. వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ, గిట్టుబాటు ధరలను రైతులు కోల్పోయే అవకాశం ఉంది. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు దెబ్బతింటే పెట్టుబడి రాయితీ పొందే వీలు కోల్పోతారు. ఈ–క్రాప్ విధానంలో పంట నమోదు కాకపోవటం వల్ల అనర్హులకు ప్రభుత్వ రాయితీలు దక్కే ప్రమాదముంది. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు దెబ్బతింటే పెట్టుబడి రాయితీ పొందే వీలు కోల్పోతారు. ఈ–క్రాప్ విధానంలో పంట నమోదు కాకపోవటం వల్ల అనర్హులకు ప్రభుత్వ రాయితీలు దక్కే ప్రమాదముంది. పలు రకాల పంటలు సాగు చేసే రైతుల సమగ్ర వివరాలు గుర్తించే అవకాశం లేకుండా పోవటంతో పాటు అవినీతి జరిగే అవకాశం ఉంది.

గత ప్రభుత్వంలో ఇలా..

ప్రభుత్వం మంజూరు చేసే ప్రతి రూపాయి గ్రామస్థాయిలో రైతులకు అందజేయాలన్న ఆశయంతో 2019 రబీ సీజన్‌లో ప్రతిష్టాత్మకమైన ఈ–క్రాప్ విధానాన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చింది. రైతు భరోసా యూనిఫైడ్ డిజిటల్ ప్లాట్ ఫాం (ఆర్‌బీ అండ్ యూడీపీ) యాప్ ద్వారా వ్యవసాయ, ఉద్యాన, పట్టు, పశుగ్రాస పంటలతో పాటు సామాజిక వనాలను ఆర్‌బీకేల్లో నమోదు చేయటం ద్వారా పారదర్శకత ఉండేది. రెవెన్యూ వెబ్‌ల్యాండ్ డేటాను అనుసరించి క్షేత్రస్థాయిలో పరిశీలించిన అంశాల ఆధారంగా ఆర్‌బీకే వ్యవసాయ సహాయకులు ఈ–క్రాప్ విధానంలో పంట నమోదు చేసేవారు. ఈ–క్రాప్ విధానం అమలులో ఉండటం వల్ల రైతు సాగు చేసే పంట వివరాలు వ్యవసాయ శాఖలో నమోదయ్యేవి. ఈ–క్రాప్ నమోదు చేసుకున్న వెంటనే సంబంధిత రైతు వివరాలన్నీ ఆర్‌బీకేల్లో ఏర్పాటు చేసిన కియోస్క్ మెషీన్‌లో నిక్షిప్తమయ్యేవి. సమయానికి ఎరువులు, పురుగు మందులు, నాణ్యమైన విత్తనాలు రాయితీపై లభించే అవకాశం ఉంది. రైతులకు ప్రభుత్వమే బీమా సొమ్ము చెల్లించి ఉచితంగా పంటల బీమా చేయించడం ద్వారా రైతులు సాగు పట్ల ధీమా కలిగి ఉండేవారు. పండితే పంట లేకుంటే బీమా వస్తుండటంతో రైతన్నలు సాగు చేయటానికి ఎంతో సన్నద్ధంగా ఉండేవారు. ఈ–క్రాప్ విధానంలో నమోదైన భూమిని బట్టి ఇన్‌పుట్ సబ్సిడీని త్వరితగతిన మంజూరు చేసేందుకు ప్రభుత్వానికి వీలు కలిగేది. రైతులు పండించిన తమ పంట ఉత్పత్తులను ఎప్పుడైనా తనకు నచ్చిన రీతిలో గిట్టుబాటు ధరకు విక్రయించే అవకాశం లభించేది. రైతు భరోసా కేంద్రాల్లో కొనుగోలు చేసే ప్రతి ఉత్పత్తికి సంబంధించి రసీదులు అందజేయటం ద్వారా క్షేత్ర స్థాయి వ్యవసాయ సహాయకులు పారదర్శకత పాటించేవారు.

కా'లేజీ' నిర్మాణం

జిల్లాలో వైద్య కళాశాలకు గ్రహణం.. కొత్త ప్రభుత్వం రాకతో ఆగిన అభివృద్ధి

సాక్షి, అమలాపురం: కోనసీమ వాసుల చిరకాల స్వప్నం తీరే దారి కనబడడం లేదు.. అమలాపురం సమీపంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్మాణం ఇంచు కూడా కదలడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా మూడో దశలో ప్రారంభమైన ఈ కాలేజీల నిర్మాణాలకు నిధుల కొరత ఉండడంతో నిలిపివేయాలని సీఎం చంద్రబాబు సూచించడంతో పనులకు బ్రేక్ పడ్డాయని స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు చెబుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ వారంతా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్‌కు సోమవారం మొరపెట్టుకున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పార్లమెంట్ నియోజకవర్గానికి ఒక మెడికల్ కాలేజీ మంజూరు చేసింది. ఇందుకు రూ.500 కోట్లు కేటాయించింది. అమలాపురం రూరల్ సమనస, చిందాడగరువు పరిధిలో దీని నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా తొలి, రెండో దశలో నిర్మాణ పనులు మొదలు పెట్టిన పలు మెడికల్ కాలేజీలు పూర్తి కావడం, అక్కడ తరగతులు ప్రారంభం కావడం తెలిసిందే. మూడో దశలో అమలాపురంలో మెడికల్ కాలేజీ నిర్మాణం మొదలు పెట్టారు. దీనికి అనుబంధంగా



నిలిచిపోయిన కాలేజీ నిర్మాణ పనులు

అమలాపురం ఏరియా ఆసుపత్రిని బోధనాసుపత్రిగా గుర్తించారు. ఇది ప్రస్తుతం 100 పడకల ఆసుపత్రి కాగా, దీనిని వెయ్యి పడకల ఆసుపత్రిగా విస్తరించాలని నిర్ణయించారు. తొలి దశలో 650 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయడంతోపాటు రెండో దశలో 350 పడకలు చేయాలని నిర్ణయించారు.

అప్పుడు వేగం.. ఇప్పుడు జాప్యం..

గత ప్రభుత్వంలో ఆసుపత్రి నిర్మాణ పనులు వేగంగా జరిగాయి. పలు నిర్మాణాలు చురుగ్గా సాగాయి. కొన్ని భవనాలకు రెండు, నాలుగు అంతస్తులు నిర్మించారు. అయితే ఎన్నికల నాటి నుంచి నెమ్మదించిన పనులు కొత్త ప్రభుత్వంలో దాదాపు నిలిచిపోయే పరిస్థితికి వచ్చాయి. ఆసుపత్రి నిర్మాణ పనులు నిలిపివేయాలని ప్రభుత్వం నుంచి సూచనలు అందడంతో నిర్మాణ సంస్థ మేఘా ఇంజినీరింగ్ ఇక్కడ పనులు ఆపేసినట్లు తెలిసింది.

పనులు కొనసాగించండి..

మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు నిలిచిపోయాయని స్థానిక ప్రజాప్రతినిధులు, స్థానికులు కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై వారు వినతిపత్రంతో పాటు మెడికల్ కాలేజీ నిర్మాణ పనులకు వినియోగించిన సామగ్రి తరలిపోతున్న ఫొటోలను సైతం జత చేశారు. కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత మూడో దశలో మెడికల్ కళాశాలల పనులు నిలిపివేయాలని ఆదేశాలు వచ్చినట్లు గుత్తేదారు సంస్థ చెబుతోందని, నిర్మాణ సామగ్రితోపాటు ఐరన్, ఇసుక, సిమెంట్‌ను మెగా సంస్థ తరలించుకుపోతోందని చెప్పారు. కళాశాలను పూర్తి చేయాలని వారు కోరారు. జిల్లా వాసులు అత్యవసర వైద్యం కోసం కాకినాడ, రాజమహేంద్రవరం వెళ్లాల్సి వస్తోందని వాపోయారు.

ఆశలపై నీళ్లు..

గత ప్రభుత్వం మెడికల్ కాలేజీకి అనుమతి ఇవ్వడంతో పాటు 47 ఎకరాలు కొనుగోలు చేసి పనులు మొదలు పెట్టింది. ఈ పనులు వేగంగా జరగడం చూసి కొత్తగా ఏర్పడిన కోనసీమ జిల్లాలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ, బోధనాసుపత్రి లేని లోటు తీరుతోందని జిల్లా వాసులు సంబరపడ్డారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో కాకినాడ, రాజమహేంద్రవరాల్లో మాత్రమే ప్రభుత్వ జనరల్ ఆసుపత్రులు (జీజీహెచ్)లు ఉన్నాయి. కోనసీమలో కిమ్స్ ప్రైవేట్ మెడికల్ కాలేజీ, ఆసుపత్రి ఉన్నా రోగుల అవసరాలు పూర్తిగా తీర్చడం లేదు. అమలాపురం, రామచంద్రపురం మున్సిపాలిటీల్లో ఏరియా ఆసుపత్రులు ఉన్నాయి. జనరల్ ఆసుపత్రి లేని లోటు పట్టిపీడిస్తోంది. రామచంద్రపురం, మండపేటలకు కాకినాడ, రాజమహేంద్రవరం కొంత దగ్గర. కానీ అమలాపురం, కొత్తపేట, ముమ్మిడివరం, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాలకు దూరం అవుతోంది. ఇక్కడ జీజీహెచ్ నిర్మించాలని స్థానికులు దశాబ్దాలుగా కోరుతున్నా ఫలితం లేకుండా పోయింది. రూ.కోట్ల విలువైన చమురు, సహజ వాయువులను కొల్లగొట్టుకుపోతున్న చమురు సంస్థలు కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ (సీఎస్ఆర్) నిధులతో మెడికల్ కాలేజీ, జీజీహెచ్ నిర్మించాలని కోరినా ఫలితం లేకుండా పోయింది. నగరం గ్యాస్ లీకేజీ వంటి భారీ ప్రమాదాలలో తక్షణం మెరుగైన వైద్యం అందించలేకపోయారు. గత ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మెడికల్ కాలేజీ మంజూరు చేయడంతో ఆ లోటు తీరుతోందని, మెరుగైన వైద్యం అందుబాటులోకి వస్తోందని ఆశించినా ఇప్పుడు పనులు ఆగిపోవడం బాధాకరం. ప్రభుత్వం స్పందించి మెడికల్ కాలేజీ నిర్మాణం పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

కళాకారులకు న్యాయం చేకూర్చండి


ఏడీ నాగరాజ్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

బళ్లారిటౌన్‌: కన్నడ సాంస్కృతిక శాఖలో అసలైన కళాకారులకు న్యాయం చేకూర్చాలని కళాకారుల సంఘం డిమాండ్‌ చేసింది. సోమవారం సంఘం నేతలు గవియప్ప, సోమశేఖర్‌, ఈరణ్ణగౌడ, బీమ్‌ రెడ్డి తదితరులు సీనియర్‌ కళాకారుడు జగదీశ్‌ ఆధ్వర్యంలో కన్నడ సాంస్కృతిక శాఖ ఏడీ నాగరాజ్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్ణాటక రాజ్యోత్సవ 2021లో చేపట్టిన మాతాడు మాతాడు కన్నడ కీర్తికలో బళ్లారి, విజయనగర జిల్లాలో జరిగిన అవినీతిపై విచారణ చేయాలన్నారు. కార్యక్రమాల్లో కొంత మంది నకిలీ కళాకారులు తాము కళా ప్రదర్శనలు చేసినట్లు నకిలీ దాఖలాలు సృష్టించి కన్నడ సాంస్కృతిక శాఖ నుంచి నిధులు కాజేశారని, దీన్ని వల్ల అసలైన కళాకారులకు అన్యాయం జరిగిందన్నారు. దీనికి కారకులైన శాఖ అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు.

వీరభద్రదేవర వేడుకలకు ప్రధానిని ఆహ్వానిస్తాం

హుబ్లీ: ఈసారి భాద్రపద మాసం తొలి మంగళవారం ఢిల్లీలో ఆచరించే జాతీయ స్థాయి శ్రీ వీరభద్రదేవర జయంతి వేడుకల ప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీని ఆహ్వానిస్తామని కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి తెలిపారు. నగరంలో మంత్రి నివాసానికి వచ్చిన బెళగావి, ఉక్కేరి శ్రీ గురుశాంతేశ్వర మఠం చంద్రశేఖర శివాచార్య స్వామి, బాగొజి కొప్ప హిరేమఠం శివలింగ మురుగరాజేంద్ర శివాచార్య స్వాముల ద్వారా బెంగళూరు వీరశైవ లింగాయత్‌ సంఘం వేదిక జాతీయ అధ్యక్షుడు ప్రదీప్‌ కంకనవాడి ఆహ్వానపత్రాన్ని స్వీకరించాక ఆయన ఈ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జోషిని స్వామీజీలు ఆశీర్వదించారు. కార్యక్రమంలో వేదిక ప్రముఖులు సీఎం చిక్కమఠ, డీసీ పాటిల్‌, అజ్జయ్య హిరేమఠ, బసయ్య హిరేమఠ తదితరులు పాల్గొన్నారు.

నగరానికి రాజీవ్‌ జ్యోతి యాత్ర



రాయచూరు రూరల్‌: నగరంలో సోమవారం రాజీవ్‌ జ్యోతి యాత్రకు కాంగ్రెస్‌ నేతలు స్వాగతం పలికారు. బెంగళూరు కేపీసీసీ నుంచి బయల్దేరిన జ్యోతి యాత్రకు రాయచూరులో జిల్లాధ్యక్షుడు బసవరాజ పాటిల్‌ ఇటగి బసవేశ్వర సర్కిల్‌ వద్ద స్వాగతం పలికారు. 24న ఈ యాత్ర తమిళనాడు పెరంబందూరుకు చేరుకోనుంది. కార్యక్రమంలో నిర్మల, రుద్రప్ప, అరుణ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు భర్తీ చేయాలి


ఆందోళన చేస్తున్న నిరుద్యోగులు

రాయచూరు రూరల్‌: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని నిరుద్యోగుల పోరాట సమితి అధ్యక్షుడు చెన్నబసవ డిమాండ్‌ చేశారు. సోమవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనలో ఆయన మాట్లాడారు. సెంటర్‌ ఫర్‌ మానిటరింగ్‌ ఇండియా ఎకానమీ -2024 సమీక్ష ప్రకారం నిరుద్యోగం 9.2 శాతం పెరిగిందన్నారు. నిరుద్యోగులు ఉపాధి కోసం దేశం, రాష్ట్రాల విడిచి సుదూర ప్రాంతాలకు వెళ్తున్నారన్నారు. వెంటనే ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని స్థానిక అధికారికి వినతిపత్రం సమర్పించారు.

భూములకు పరిహారం ఇవ్వడంలో అన్యాయం

రాయచూరు రూరల్‌: బెళగావి-రాయచూరు భారత మాల పథకంలో భాగంగా భూములు కోల్పోయిన రైతులకు పెద్ద ఎత్తున పరిహారం ఇవ్వాలని రైతు పోరాట సమితి సంచాలకులు శరణప్ప డిమాండ్‌ చేశారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మార్కెట్‌ ధర కంటే ప్రాధికార అధికారులు తక్కువ ధరలకు భూములను బలవంతంగా స్వాధీనం చేసుకున్నారని ఆరోపించారు. ఈ విషయంలో కలెక్టర్‌, ఎమ్మెల్యే, ఎంపీలు జోక్యం చేసుకుని బాధిత రైతులకు న్యాయం చేయాలని కోరారు.

చైన్‌ స్నాచర్ల అరెస్టు

కోలారు: ఇద్దరు చైన్‌ స్నాచర్లను అరెస్ట్‌ చేసిన పోలీసులు వారి వద్ద నుంచి రూ. 3.7 లక్షల విలువైన బంగారు చైన్‌లను స్వాధీనం చేసుకున్నారు. బెంగుళూరు రూరల్‌ జిల్లా దేవనహళ్లి తాలూకా చన్నరాయపట్టణ గ్రామానికి చెందిన అరుణ్‌కుమార్‌, తమిళనాడు కృష్ణగిరి జిల్లా సూలగిరి తాలూకా సిబిం గ్రామానికి చెందిన ఎం దిలీప్‌లను పోలీసులు అరెస్ట్‌ చేశారు. వీరు నగర శివార్లలో చైన్‌ స్నాచింగ్‌లకు పాల్పడ్డారు.

ముమ్మాటికి నిర్లక్ష్యమే

- టీబీ డ్యామ్‌ను పరిశీలించిన బీజేపీ నేతలు బొమ్మై, విజయేంద్ర, అశోక్‌


మీడియాతో మాట్లాడుతున్న బసవరాజ్‌ బొమ్మై, చిత్రంలో విజయేంద్ర, అశోక్‌


డ్యామ్‌ నుంచి వెళ్లిపోతున్న నీరు

హొసపేటి: కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌, తెలంగాణ రాష్ట్రాలకు తాగు, సాగునీరు అందించే తుంగభద్ర గేట్‌ కొట్టుకుపోవడంతో రిజర్వాయర్‌ను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై.విజయేంద్ర, మాజీ సీఎం బసవరాజ్‌ బొమ్మై, ప్రతిపక్ష నాయకుడు ఆర్‌ అశోక్‌ సోమవారం సందర్శించి, తెగిపోయిన 19వ క్రస్ట్‌గేట్‌ను పరిశీలించారు. గేట్‌ చైన్‌ లింక్‌ ఊడిన విషయంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాజీ మంత్రి బసవరాజ్‌ బొమ్మై విలేకరులతో మాట్లాడుతూ... 19 గేట్‌ చైన్‌ లింక్‌ తెగి క్రస్ట్‌ గేట్‌ ఊడి పోవడంతో పెద్ద ఎత్తున నీరు వృథాగా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. అదే విధంగా తుంగభద్ర మండలి అధికారులు నిర్లక్ష్యమని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ గేట్‌ కొట్టుకుపోవడంపై అధికారులు, ప్రభుత్వం తప్పు ఏమీ లేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ ఘటనకు పూర్తి బాధ్యత ప్రభుత్వానిదన్నారు. దాదాపు 60 టీఎంసీలు నీరు వృథాగా పోతోందన్నారు. ఆయకట్టు కింద 12.50 లక్షల ఎకరాలలో రైతులకు ఇక నీరు లభించడం కష్టమన్నారు. ఆయకట్టు రైతులకు ఎకరాకు రూ. 50 వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. ఈ సందర్భంగా దొడ్డనగౌడ పాటిల్‌, ఎమ్మెల్సీ హేమలతా నాయక్‌, మాజీ మంత్రులు హాలప్ప ఆచార్‌, ఆనంద్‌ సింగ్‌, మాజీ ఎమ్మెల్యే పారణమునవళ్లి, కాడా మాజీ అధ్యక్షుడు తిప్పేరుద్రస్వామి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి శరణు తూచికేరి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నవీన్‌ గులగన్నవర్‌, జేడీఎస్‌ కోర్‌ కమిటీ సభ్యుడు సీవీ చంద్రశేఖర్‌, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్‌.బసవరాజ కావతార్‌ తదితరులు పాల్గొన్నారు.

హెక్టార్‌కు రూ. 50 వేల పరిహారం ఇవ్వాలి : బీవై విజయేంద్ర

టీబీ డ్యామ్‌ గేట్‌ ఊడిపోవడం లక్షల క్యూసెక్కుల నీరు వృథాగా పోవడానికి రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యమని కారణమని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బీవై విజయేంద్ర తెలిపారు. సోమవారం ఆయన డ్యామ్‌ను సందర్శించి విలేకరులతో మాట్లాడారు. తుంగభద్ర జలాశయం జీవనాడి అని, మూడు రాష్ట్రాల రైతులకు సాగునీరు అందుతోందన్నారు. ఈసారి వరుణుడి దయతో రిజర్వాయర్‌ నిండటంతో రైతుల్లో ఆనందం ఉన్న తరుణంలో ఇలా జరగడం ప్రభుత్వ నిర్లక్ష్యమేనన్నారు. డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌ డ్యామ్‌ను సందర్శించి డ్యామ్‌ గేట్‌ ఊడిపోవడం అధికారులు, ప్రభుత్వ బాధ్యత కాదని చెప్పడం సమంజసం కాదన్నారు. అయితే దీనికి బాధ్యులు ఎవరని విజయేంద్ర ప్రశ్నించారు. హెక్టార్‌కు రూ. 50 వేల పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేస్తామన్నారు. నిపుణులు ఇచ్చిన నివేదికను ఎందుకు పరిగణంలోకి తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రైతుల కష్టాలపై స్పందించడం ప్రభుత్వ కర్తవ్యమని, కానీ ఈ ప్రభుత్వ రైతులపై నిర్లక్ష్యం చూపడం మంచిది కాదని తెలిపారు. రైతులకు రెండవ పంటకు డ్యామ్‌ నీరు అందుతాయనేది ప్రశ్నార్థకమన్నారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష నాయకుడు ఆర్‌.అశోక్‌ తదితరులు పాల్గొన్నారు.

వందశాతం అక్షరాస్యత సాధించాలి



గౌరవ డాక్టరేట్‌ అందుకున్న ప్రముఖులతో గవర్నర్‌, వీసీ తదితరులు, బంగారు పతకాలతో విద్యార్థులు

- కలబుర్గి వర్సిటీ స్నాతకోత్సవంలో గవర్నర్‌ థావర్‌చంద్‌ గెహ్లాట్‌

రాయచూరు రూరల్‌: స్వాతంత్య్ర శతమానోత్సవ నాటికి వందశాతం అక్షరాస్యతను సాధించాలని రాష్ట్ర గవర్నర్‌ థావర్‌ చంద్‌ గెహ్లాట్‌ పిలుపునిచ్చారు. సోమవారం కలబుర్గి విశ్వ విద్యాలయం 42వ స్నాతకోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో 75 శాతం పురుషులు అక్షరాస్యతలో ముందున్నారని, మహిళలు వెనుకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నలంద, తక్షశిల ఉన్నత విద్యకు చరిత్ర వుందన్నారు. సమాన్యాయం కోసం, వసుదైక కుటుంబం వంటి అంశాలపై దృష్టి సారించాలన్నారు. ప్రపంచంలో ఆర్థిక రంగంలో భారత్‌ ఐదోస్థానంలో ఉందన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. అంతకు ముందు ఆయన పలువురు విద్యార్థులకు పట్టాలు అందజేశారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన వారికి బంగారు పతకాలు అందజేశారు. ఉన్నత విద్యా శాఖ మంత్రి సుధాకర్‌ మాట్లాడుతూ... రాష్ట్రంలోని విశ్వ విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తామన్నారు. కళ్యాణ కర్ణాటకలోని విశ్వ విద్యాలయాల అభివృద్ధికి, కళ్యాణ కర్ణాటక అభివృద్ధి మండలి నుంచి పది శాతం నిధులు కేటాయిస్తామన్నారు. అదే విధంగా ఇందిరా గాంధీ పిల్లల ఆస్పత్రికి పది ఎకరాలు భూమి, మల్టీ డిసిప్లనరీ కేంద్రానికి 25 ఎకరాలు భూమిని కలబుర్గి వర్సిటీ నుంచి కేటాయించడం జరుగుతుందన్నారు.

ముగ్గురికి గౌరవ డాక్టరేట్లు :

కలబుర్గి విశ్వ విద్యాలయం నుంచి వివిధ రంగాల్లో సేవలందించిన న్యాయవాది అర్చన ప్రదీప్‌ తివారి, సంఘ సేవకుడు లక్ష్మణ్‌ దస్తి, విద్యారంగంలో లింగరాజ్‌ బసవరాజ్‌ అప్పకు గౌరవ డాక్టరేట్లు అందజేశారు. కార్యక్రమంలో కలబుర్గి విశ్వ విద్యాలయం వైస్‌ చాన్స్‌లర్‌ దయానంద అగసర్‌ తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడి సమస్యలు అక్కడే


అధ్వాన స్థితిలో మురుగు కాల్వ


శిథిలావస్థలో పాఠశాల

- హమాలీ కాలనీలో మౌలిక సదుపాయాలు కరువు

రాయచూరు రూరల్‌: నగరంలోని ఏపీఎంసీ హమాలీ, కార్మికుల కాలనీలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. ఏళ్లు గడుస్తున్నప్పటికి రహదారులు లేవు. ఇక కాలనీలో అంతర్గత రహదారులు అధ్వాన్నంగా ఉన్నాయి. 2011లో అప్పటి ముఖ్యమంత్రి ఎస్‌ఎం కృష్ణ సమయంలో ఏపీఎంసీ హమాలీ, కార్మికులకు నూతన ఇళ్లను నిర్మించి వారికి అప్పగించారు. ఇంటి హక్కు పత్రాలు ఇచ్చారే తప్ప నగరసభలో నేటికి రిజిస్ట్రేషన్‌ చేయలేదు. ఇక కాలనీలో కనీస మౌలిక సదుపాయాలు కూడా లేవు. మురికి కాల్వలు, రోడ్లు అధ్వాన్న స్థితికి చేరుకున్నాయి. ఇక వర్షాకాలంలో అయితే కనీసం రోడ్డుపై నడవడానికి కూడా సాధ్యం కాదు. ప్రభుత్వ పాఠశాల కూడా శిథిలావస్థకు చేరుకుంది. పాఠశాలకు వెళ్లే రహదారిలో నిత్యం మురికినీరు నిలిచి ఉంటుంది. అధికారులు, పాలకులు కార్మికుల కాలనీ వైపు కన్నెత్తి చూడకపోవడంపై కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


కాలనీలో ఓ మురుగు కాల్వ దుస్థితి

ఆగస్టు 15న బ్లాక్‌ డేగా పాటిస్తాం

బళ్లారిటౌన్‌: విద్యాశాఖలో జరుగుతున్న అవినీతిని ఖండిస్తూ ఈనెల 15న స్వాతంత్ర దినోత్సవం రోజు బ్లాక్‌ డేగా పాటిస్తున్నట్లు బళ్లారి అన్‌ ఎయిడెడ్‌ పాఠశాల పాలన సమాఖ్య అధ్యక్షుడు ఎస్‌.పరశురాం రెడ్డి, కార్యదర్శి రియాజ్‌ పేర్కొన్నారు. సోమవారం నగరంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల నిర్వహణకు అనుమతి ఇవ్వాలన్న విద్యాశాఖతో పాటు ఇతర అగ్నిమాపక, పీడబ్ల్యూడీ, రెవెన్యూ, శిశు సంక్షేమ శాఖ, పోలీసు వంటి అనేక శాఖల నుండి అనుమతులు లభిస్తేనే విద్యాశాఖ నుంచి అనుమతి కల్పిస్తుందని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్ల తమకు అన్ని శాఖల్లో లంచాలు వెలువెత్తుతున్నాయని ఆరోపించారు. దీన్ని వల్ల తాము పాఠశాలలు నడపాలన్న తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు లేని ఈ నియమాలు ప్రైవేట్‌ పాఠశాలకు ఎందుకని ప్రశ్నించారు. తాము వీటిపై కోర్టులకు కూడా వెళ్లామని అయితే కోర్టు ఆదేశాలను కూడా రాష్ట్ర ప్రభుత్వాలు లెక్కచేయడం లేదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు చాల కాలంగా నడుపుతున్న పాఠశాలకు నియమాలు సడలింపు చేయాలని డిమాండ్‌ చేస్తున్నామన్నారు. దీన్ని ఖండిస్తూ తాము ఈ నెల 15న ఎస్‌సీసీ గ్రౌండ్‌లో బ్లాక్‌ డేగా నిరసనలు తెలిజేస్తామన్నారు. కార్యక్రమంలో సమాఖ్య నేతలు రంజన్‌ సాబ్‌, రంగస్వామి, మరిచెడు మల్లికార్జున, ఎస్‌.హనుమంతప్ప, పరమేశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో బ్లాక్‌ డే పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం


బెంగళూరులో రాత్రి భారీ వర్షం, ఉదయం ప్రజా సంఘాల ధర్నాల వల్ల శేషాద్రి రోడ్డులో స్తంభించిన వాహన సంచారం

భారీ వాహనాల పార్కింగ్‌తో అవస్థలు

- పాఠశాలకు రావడానికి విద్యార్థులు నానా తంటాలు

మాలూరు: తాలూకాలోని లక్కూరు గ్రామంలో ఉన్న ప్రభుత్వ జూనియర్‌ కళాశాల ముందే భారీ వాహనాలను నిలుపుతుండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లక్కూరు గ్రామ ప్రభుత్వ జూనియర్‌ కళాశాలకు సంబంధించిన కళాశాల, ఉన్నత పాఠశాలలో 300 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. గ్రామంలోని సీనియర్‌ సిటిజన్‌లు, మహిళలు, వృద్ధులు ఈ కళాశాల ప్రాంగణంలోనే వాయు విహారం చేస్తారు. అయితే కళాశాల ముందే టిప్పర్‌ లారీలు, జేసీబీలు, ట్రాక్టర్లు నిలుపుతుండడంతో వీరు కళాశాల ప్రాంగణంలోకి వెళ్లడానికి నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కళాశాల సిబ్బంది వాహనాలను నిలపకూడదని చెప్పినా వారు పట్టించుకోవడం లేదు. భారీ వాహనాలతో రహదారి గుంతలమయంగా మారింది.


కళాశాల ముందు నిలిపిన టిప్పర్‌ లారీ

హక్కు పత్రాల కోసం వినతి

కెజీఎఫ్‌: రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో ఉన్న ఎన్‌జి హుల్కూరు గ్రామ పంచాయతీకి చెందిన పంతనహళ్లి గ్రామంలో ప్రభుత్వ గోమాళం భూమిని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కొంతమంది తమదే అంటు గుడిసెలు వేసుకున్నారని, ఇదేమిటని ప్రశ్నిస్తే భూమి తమకే మంజూరైందని చెబుతున్నారని గ్రామస్తులు ఎమ్మెల్యేకు విన్నవించారు. తాము 15 సంవత్సరాలుగా ఇక్కడే నివాసంటున్నా తాలూకా యంత్రాంగం తమకు హక్కు పత్రాలను ఇవ్వలేదని ఆరోపించారు. తాలూకా యంత్రాంగంపై ఒత్తిడి తీసుకు వచ్చి తమకు హక్కు పత్రాలను ఇప్పించాలని డిమాండ్‌ చేశారు. లేని పక్షంలో తాను తహసీల్దార్‌ కార్యాలయం ముందు ఆందోళన చేపడతామని హెచ్చరించారు. వినతిపత్రం స్వీకరించిన ఎమ్మెల్యే రూపా శశిధర్‌ మాట్లాడుతూ... తహసీల్దార్‌తో చర్చించి రెండు రోజులలోగా హక్కు పత్రాలు అందేలా చేస్తామని హామీ ఇచ్చారు. వినతిపత్రం సమర్పించిన వారిలో జైభీం శ్రీనివాస్‌, రాజేష్‌, పంతనహళ్లి గ్రామస్తులు ఉన్నారు.


ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

మద్యం, గంజాయి అడ్డుకట్టపై అవగాహన

శ్రీనివాసపురం: గ్రామీణ ప్రాంతాలలో అక్రమంగా మద్యం, గంజాయి విక్రయాలు యథేచ్ఛగా జరుగుతున్నట్లు సమాచారం అందడంతో ఆబ్కారి పోలీస్‌ సూపరిన్‌టెన్‌డెంట్‌ శ్రీశైల్‌ నేతృత్వంలో పోలీసులు తాలూకాలోని బీరగానహళ్లి గ్రామానికి వెళ్లి గ్రామస్తులకు అవగాహన కలిగించారు. శ్రీనివాసపురం తాలూకా బీరగాన హళ్లి గ్రామంలో నకిలీ మద్యం సేవించడం వల్ల కలిగే అనర్థాల గురించి గ్రామస్తులకు వివరించారు. అక్రమ మద్యం విక్రయం, కొనుగోలు చేస్తే తీసుకునే చట్ట పరమైన చర్యలపై తెలిపారు. అక్రమ మద్యం విక్రయాలను అడ్డుకోవడంలో గ్రామస్తులు పోలీసులకు సహకరించాలన్నారు. ఈ సందర్భంగా అబ్కారి అధికారులు ఎంఆర్‌ సుమ, బిఎస్‌ రోహిత్‌, పుష్ప తదితరులు పాల్గొన్నారు.


గ్రామస్తులకు అవగాహన కలిగిస్తున్న పోలీసులు

కార్మిక నాయకుడు శ్యామణ్ణకు సన్మానం

కోలారు: కట్టడ కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని ఈ నెల 5న ఛలో ముఖ్యమంత్రి ఇంటి ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కృషి చేసిన కట్టడ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్యామణ్ణరెడ్డిని జిల్లా కట్టడ కార్మికుల సంఘం పదాధికారులు సోమవారం నగరంలోని కట్టడ కార్మికుల సంఘం కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా కట్టడ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హొన్నేనహళ్లి యల్లప్ప మాట్లాడుతూ కట్టడ కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లడంలో శ్యామణ్ణరెడ్డి ఎంతో శ్రమించారన్నారు. ఈయన కృషి వల్లనే ప్రభుత్వం దిగివచ్చి కట్టడ కార్మిక సంఘం సభ్యులతో చర్చలకు సిద్ధమైందన్నారు. ఈ సందర్భంగా కట్టడ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌, జిల్లా ప్రధాన కార్యదర్శి మురళీధర్‌, మాలా చలపతి తదితరులు పాల్గొన్నారు.


శ్యామణ్ణ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

క్రస్ట్‌ గేట్‌ను త్వరగా ఏర్పాటు చేయాలి

రాయచూరు రూరల్‌: కొట్టుకుపోయిన తుంగభద్ర డ్యామ్‌ క్రస్ట్‌గేట్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కేపీఆర్‌ఎస్‌ డిమాండ్‌ చేసింది. సోమవారం జిల్లా అధికారి కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టిన ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు వీరేశ్‌ మాట్లాడారు. డ్యాం అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల ఘోరం జరిగిందన్నారు. 60 టీఎంసీఈ నీరు వృథాగా పోతోందన్నారు. అనంతరం స్థానిక అధికారి ద్వారా నీటి పారుదల శాఖ మంత్రికి వినతిపత్రం అందజేశారు.

పాత్రికేయ వృతి పవిత్రమైంది

హుబ్లీ: పాత్రికేయ వృతి ఎంతో పవిత్రమైనదని, ఇలాంటి వృత్తికి ఎటువంటి కళంకం రాకుండా వాస్తవాలను చూపాలని హుబ్లీ స్వర్ణ గ్రూప్‌ సంస్థల అధినేత, తెలుగు ప్రముఖుడు డాక్టర్‌.చిగురుపాటి వీఎస్‌వీ ప్రసాద్‌ తెలిపారు. జిల్లాలోని కలఘటికిలో గూడ్‌న్యూస్‌ జూనియర్‌ కళాశాలలో ఏర్పాటు చేసిన తాలూకా వర్కింగ్‌ జర్నలిస్ట్‌ యూనియన్‌ ఆధ్వర్యంలో పత్రికా దినోత్సవం, పేపర్‌ ఏజెంట్లకు సన్మాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా కర్ణాటక విశ్వవిద్యాలయం, మీడియా కమ్యూనికేషన్‌ జర్నలిజం విభాగం ప్రాధ్యాపకులు జేఎం చందునవర మాట్లాడుతూ... గ్రామీణ విలేకరులు ఎదుర్కొంటున్న సవాళ్లపై మాట్లాడారు. ఎస్‌ఐ బసవరాజ, కాంగ్రెస్‌ నేత మంజునాథ, జిల్లా వర్కింగ్‌ జర్నలిస్ట్‌ యూనియన్‌ అధ్యక్షుడు హుగార తదితరులు మాట్లాడారు. జిల్లా ప్రశస్తి విజేత ప్రహ్లాద్‌గౌడ, వీరప్పనాయక్‌లను సన్మానించారు. సీనియర్‌ విలేకరి రవి బడిగేర, చిత్రకళా ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో కళ్లప్ప మిర్జి, సోమశేఖర్‌, న్యాయవాది అన్నప్ప, జర్నలిస్ట్‌ సుశిలేంద్రచార్య సుందరిగి, పరమానంద, ఆ కళాశాల పాలన అధికారి వర్గీశ్‌, ప్రిన్సిపల్‌ నవీన్‌ రడ్డేర తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్‌ తీరుపై కాంగ్రెస్‌ నిరసన ర్యాలీ

హుబ్లీ: మైసూరులో ముడా స్థలాలు అక్రమంగా పొందారని ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు గవర్నర్‌ నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ హుబ్లీ-ధార్వాడ నగర జిల్లా కాంగ్రెస్‌ నాయకులు, కార్యకర్తలు ధార్వాడలో సోమవారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఉదయం 11 గంటలకు ధార్వాడ కళా భవన్‌ నుంచి జిల్లాధికారి కార్యాలయం వరకు ఈ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం గవర్నర్‌ను డిస్మిస్‌ చేయాలని జిల్లా అధికారి ద్వారా రాష్ట్రపతికి రాసిన లేఖను అందజేశారు. హుబ్లీ ధార్వాడ పశ్చిమ కాంగ్రెస్‌ అభ్యర్థి దీపక్‌ సించోరే ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో మాజీ ఎంపీ సనది, చంద్రశేఖర్‌, ఆనంద, శివానంద, షారుఖ్‌, కాంగ్రెస్‌ కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

జూనియర్‌ వైద్యుల నిరవధిక సమ్మె షురూ

హుబ్లీ: విద్యార్థి వేతనం తదితర సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్‌ వైద్యులు సమ్మె చేపట్టారు. దీంతో నగరంలోని కిమ్స్‌ ఆస్పత్రిలో జూనియర్‌ వైద్యులు ఆందోళన చేపట్టడంతో ఓపీ సేవలు స్తంభించడంతో రోగులు ఇబ్బందులు పడ్డారు. జూనియర్‌ వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్‌.సుహాస్‌, కార్యదర్శి డాక్టర్‌.ఆదర్శ్‌, డాక్టర్‌.శషాంక్‌ మాట్లాడుతూ... తమ డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని చెప్పారు. బెంగళూరు ఫ్రీడం పార్క్‌లో కూడా జూనియర్‌ వైద్యులు ఆందోళన చేపట్టారన్నారు. వైద్యుల సమ్మె కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

రెండు ఇళ్లలో చోరీ

రాయచూరు రూరల్‌: రాయచూరు నగరంలో రెండు ఇళ్లలో చోరీ జరిగింది. ఆదివారం రాత్రి సుచిత్ర కాలనీ, శ్రీకృష్ణ దేవరాయ కాలనీ, ఆశీర్వాద్‌ కాలనీలలో దొంగలు పడ్డారు. ఓ ఇంటిలో రెండు తులాల బంగారు నగలు, రూ. 25 వేల నగదు, మరో ఇంటిలో నాలుగు తులాల బంగారు, రూ. 50 వేల నగదు దోచుకున్నారు. అదే విధంగా జాతీయ రహదారి కార్యాలయంలో కూడా దొంగలు పడ్డారు. నేతాజీ నగర పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

గనులు భూ విజ్ఞాన అధికారిని సస్పెండ్‌ చేయాలి


వినతిపత్రం సమర్పిస్తున్న సాజిద్‌

రాయచూరు రూరల్‌: రాయచూరు జిల్లాలో గనులు భూ విజ్ఞాన అధికారిని సస్పెండ్‌ చేయాలని అఖిల కర్ణాటక రైతర సంఘం అధ్యక్షుడు సాజిద్‌ కోరారు. సోమవారం జిల్లాధికారి కార్యాలయంలో కలెక్టర్‌ నితీశ్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. మాన్వి, దేవదుర్గలో అక్రమంగా ఇసుక రవాణా సాగుతున్న గనులు, భూ విజ్ఞాన అధికారి నిర్లక్ష్యంగా ఉన్నారని, ఆయనను వెంటనే సస్పెండ్‌ చేయాలన్నారు.

దేవదుర్గ సీఐ సస్పెండ్‌

రాయచూరు రూరల్‌: రాయచూరు జిల్లా దేవదుర్గ సీఐ అశోక్‌ను సస్పెండ్‌ చేస్తూ బళ్లారి ఐజీపీ ఆదేశాలు జారీ చేశారు. దేవదుర్గలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతున్నా చర్యలు తీసుకోలేదనే ఆరోపణలపై సీఐని సస్పెండ్‌ చేశారు.

పేదలకు భూములు కేటాయించాలి


మాట్లాడుతున్న మారెప్ప

రాయచూరు రూరల్‌: రాయచూరు జిల్లాలో పేదలకు భూములు, ఇళ్ల స్థలాలు కేటాయించాలని పోరాట సమితి అధ్యక్షుడు మారెప్ప డిమాండ్‌ చేశారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 70 ఏళ్లుగా గుడిసెల్లో ఉంటూ కూలి పనులు చేసుకుంటున్న పేదలకు ఇళ్లు, వ్యవసాయ భూమి కేటాయించాలన్నారు. స్వాతంత్ర సమర యోధుడు దొరస్వామి కలలను సాకారం చేయాలన్నారు.